భారతి

సాహిత్య మాసపత్రిక

సెప్టెంబరు 1983

ఎడాల సెన్స్

కవితా ప్రసాద్

నేనూ - నా వేణువు

సంపత్ కుమార్

అణోరణీయాన్...
సరుగుడుల్లోంచి...

రమేష్ బాబు

ద్రవ్యోల్బణము

బి. ఆర్. కె. రావు

చిత్రకావ్యములు

శేషాచార్యులు

డార్విన్ వాదం

కోనేటిరావు

ఇంకా ఒత్సల, కిశోరుబాబు - అశోకుబాబు, విజయదత్తాత్రేయశర్మ, దిలావర్
లక్ష్మీనరసింహారావు, విజయ్‌కుమార్ - ప్రభుదాసు, వీరభద్రయ్య,
శాస్త్రి ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

సెప్టెంబరు 1983

సంపుటము : 60 సంచిక : 9

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1983

రేపు!

అనాఘ్రాత పుష్పం!
అలూన కిసలయం!
అనావిద్ధ రత్నం!
అనాస్వాదిత మధురసం!

— అందుకే
ఎల్లరూ
దాని కోసం - ఆత్రతతో
నిరీక్షిస్తుంటారు!
ఇది అతిశయోక్తి కాదు
సత్యం!

పశ్చిమ బుద్ధులు!

"ఉత్తర", "దక్షిణ" లకే
ప్రాధాన్యత నిస్తున్న
అవివేకులు - అంధులు
క్రొంగ్రొత్త రశ్ముల్ని
మార్పుల్ని
వెదజల్లుతున్న
"తూర్పుని" గౌరవిస్తారా ?
దాన్ని
"అస్తమయ దిశగానే"
"పడమర" గానే
భావిస్తుంటారు గాని!!

శ్రీ కె. కిశోరు బాబు
శ్రీ కె. అశోకు బాబు

శ్రీ ఎ. విజయ దత్తాత్రేయ శర్మ

తూర్పు గోదావరి జిల్లా గ్రామ నామములు - ఒక పరిశీలన

(గత సంచిక తరువాయి)

కొప్పల వంశము[63]

కొప్పల సామంత నృపతులు గోదావరికి ఉత్తరమున అంధ్రి ఖండమండలమను పేరుతో తమ రాజ్యమును నెలకొల్పిరి. ఈ వంశ నామ సూచికముగా కొప్పులకోట (ఎ), కొప్పాక అగ్రహారం (తు) కొప్పవరం (కొ) గ్రామములు కానవచ్చుచున్నవి. క్రీ. శ. 1337 నాటి దోనెపూడి శాసన కర్తయగు నామయనాయకుని పేర నామవరం (రాజ) వెలసినది. నామయ దోనెపూడి గ్రామమును తన తండ్రిపేర ప్రోలవరమని ప్రతినామమిడి దానము చేసినట్లు తెలుస్తోంది.[64] ఈ ప్రోలయ ముసునూరి ప్రోలయనాయకునకు బాసటగా నిలిచినట్లును తెలియుచున్నది. కావున ఈ జిల్లాలోని ప్రోలవరములు కొన్ని ఈతని పేరున రూపెత్తియుండవచ్చును. అట్లే ప్రోలయ తండ్రి కాపయ పేరున 'కాపవరము' లును వెలియుటకు అస్కారము లేకపోలేదు. తుని తాలూకాలోని కొతాము కొప్పల వారి కొతాముగా ప్రసిద్ధి నొంది ఈ వంశము వారికి ముఖ్య పట్టణముగా నుండినది. కొతామే జనవ్యవహారమున కొట్టాము, కొండొకచో గొట్టాముగా కూడ వ్యవహృతమగుచున్నది. పూర్వము పరిపాలనకు కేంద్రస్థానము కోటయే. "ఈ కారణముననే యరవమున 'కొట్టె' మనిన పాలనా సౌకర్యార్థ మొనరించిన దేశవిభాగమను నర్థము కలిగినది. కావున కొట్టమనిన కోటయని యర్థము చేసికొనుట యుక్తమే."[65]

గజపతి

క్రీ. శ. 1448 నాటికి గజపతి స్థాపకుడైన కపిలేశ్వర గజపతి రాజమహేంద్ర ప్రాంతాన్ని జయించి తన సోదరుని కుమారుడు రఘుదేవనరేంద్ర మహాపాత్రుని ఆ సీమలపై అధికారిగా నియమించాడు.[66] కపిలేశ్వరపురము (అ) కపిలేశ్వరుని పేరునను, రఘుదేవపురము (రాజ) రఘుదేవుని పరంగాను వెలసినవిగా భావించవచ్చును. కపిలేంద్రుని కుమారుడు పురుషోత్తమదేవుడు (క్రీ. శ. 1468-1497) ప్రముఖుడు. పురుషోత్తపురం (రాజ) అతని వలన రూపెత్తినది కావచ్చును.

పెద్దాపురము

పెద్దాపురమునకు ఆ పేరు గజపతి సామంతుని వలన వచ్చినది. "గజపతి సామంతులలో నొకడగు పెద్దాపాత్రుడను వాడు కిమ్మూరు సీమకు సరదారుడై తమిరెయను గ్రామమున నొక కోట నిర్మించి, బురుజులు త్రిప్పించి, కోటకు దక్షిణమున తన పేరిట పెద్దాపురమను పేటను గట్టించి ప్రభుత్వము నెరపెను."[67] ఈ సందర్భంలో కిమ్మూరు సీమకు ఆ పేరెట్లు సంభవించినదో తెలుసుకొనుట అప్రస్తుతము కాదు. "పూర్వము ద్రాక్షారామమునకు నాలుగు క్రోసుల దూరంలో కిరాతనాయకుడైన కిమ్మీరుడను నాతడు తన పేర కిమ్మూరు (ఎ) అను గ్రామమును నిర్మించెను. ఈ గ్రామము చుట్టను పెద్దాపురము కట్టమూరు, కాట్రావుల పల్లి.... మున్నగు యేబదినాలుగు గ్రామములు గలవు. ఇవన్నియు కలిపి కిమ్మూరు సీమ అని వ్యవహరింపబడెను."[68]

సంస్థానములు - జమిందారీలు

పెద్దాపురం

ప్రాగాంధ్రమునందలి పురాతన సంస్థానములలో నొకటియైన పెద్దాపురం పాలకులకు 'జగపతి' యనునది కులక్రమానుగతమైన బిరుదు. ఆ బిరుదుసూచకంగా 'జగపతినగరం' (ప్ర) వెలసినది. పెద్దాపుర పాలకులలో 'తిమ్మ' పేరు ముందుండినవారు పలువురు కలరు. సంస్థాన సంపాదకుడైన చతుర్భుజ తిమ్మరాయ జగపతి (1555-1607) ఆనాటి సుబేదారు షేర్‌మహమ్మద్‌ఖాన్ ఒక కత్తిని బహూకరించేడట.[69] వాలు (కత్తి) తిమ్మపురం (పె), తిమ్మపురములు (ఎ & కా) పెద్దాపుర పాలకుల పరంగా ఏర్పడినవిగానే ఎంచవచ్చును. పై చతుర్భుజ తిమ్మ జగపతి తండ్రిపేర రాజుపేర నేర్పడినవి పేరవరములు (కొ & ప్ర) కావచ్చును. పెద్దాపురం ప్రభువులలోని రాయజగపతి (1607-1648), రాయజగ

పతి (1797-1804) గలరు. పెద్దరాయజగపతి 'పీఠికాపురి కిమ్మూరు, బిక్కవోలు, తునియుఁ గొత్తాము మొల్లేరు ఘనత నేలే' నని ఏనుగు లచ్చనకవి తుల్యామహాత్మ్యములో రుకపరుస్తోంది. పెద్దాపురం తాలూకాలోని పెదరాయవారం, రాయవరం, రాయభూపాలపట్నం ఈతని పేరున వెలసియుండును. సార్వభౌమ తిమ్మజగపతి (1618-1688) సోదరుడు బలభద్రజగపతి. బలభద్రపురములు (పె & రాజ) ఈతని పేరున రూపొందియుండు ననుకొనవచ్చును.

కళింగ విజయనగరం

రుస్తుంఖాన్ బెడదసందర్భమున రాయగజపతి (1749-1758)ని కొంపెల్ల లక్ష్మీ సోమిదేవమ్మ రక్షించినందులకు కృతజ్ఞతా పూర్వకంగా విజయనగరం పెదవిజయరామరాజు (1707-1757) ఆమెకు ఒక అగ్రహారమిచ్చి దానికి లక్ష్మీపురాగ్రహారమని పేరు పెట్టెను. "రాయజగపతిరాజుగారిని రక్షించినందుల కియ్యబడిన అగ్రహారము కనుక ఆ అగ్రహారమునకు రాయభూపాలపురాగ్రహారమనియు (పె) పేరు గలదు.70

కళింగ విజయనగర పాలకులకు, పెద్దాపురం ప్రభువులకు నెయ్యము, కయ్యములు రెండునూ వుండినవి. కనుకనే విజయనగరం జిల్లాలోని ప్రముఖములైన విజయనగరం, భోగాపురం గ్రామ నామములుగా పూర్వపెద్దాపుర సంస్థాన సీమలలోను కానవచ్చుచున్నవి.

రాజోలుకు ఆ పేరు అది మొగల్తుర్రు రాజులలో నొకనిచే నొక విజయనగర ప్రభువున కీయబడినందున వచ్చెనని అందురు.71

పిఠాపురం

'మహీపతి' బిరుదాంకితులైన పిఠాపురం సంస్థానాధిపతులలో పెదమాధవరాయలు (1656-1704), చినమాధవరాయ (1710-1755) లలో నెవరైనా మాధవవరం (పి), మాధవపట్నం (కా) గ్రామనామ కారకులా అనిపించును. ఈ గ్రామముల పిఠాపురమున ప్రసిద్ధిగాంచిన కుంతీమాధవస్వామి పేరున వెలసినవైన కావచ్చును. పెదమాధవరాయణింగారి సోదరుడు నరసింహరాయణింగారు (1659-1720) తులసీమపురమును, నరసింహరాయపురాగ్రహారముగా మార్చినట్లు గుర్తించడం జరిగింది.72 నరసింగపుర (పి) మను గ్రామము ఈతని పేరు దాల్చినదై యుండును. పిఠాపురం పాలకులలో నెన్నికగన్నవాడు రావు వెంకట కృష్ణారాయణింగారు క్రీ. శ. 1749-1755 సం॥ల మధ్యకాలంలో రాజమహేంద్రవరం నవాబుచేత తొమ్మిది సన్నదులు బడిసిన సమర్థుడు.73 వెంకట కృష్ణరాయపురం (కా) అతని పేర రూపొందియుండియుండును. సూర్యారావుపేట (కా) కు ఆ పేరిచ్చినది సూర్యారావు బహద్దర్ (1885-1964).

రామచంద్రపురం

కోట రామచంద్రపురపాలకుల పూర్వీకుడైన కాకర్లపూడి రామచంద్రరాజు పేరననే రామచంద్రపురం వెలసినదని తెలియుచున్నది.74

గోపాలపురం

గోపాలపురం సంస్థాన సంపాదకులైన ఉప్పలపాటి జోగి జగన్నాధ రాజుభార్య జానకయ్యమ్మ (19 శ॥) తనపేర జానకీపురా గ్రహారమును (పొడగట్లపల్లె గ్రామము) నిర్మించినట్లు తెలియుచున్నది.75 కాని నేడు కొత్తపేట తాలూకాలో పొడగట్లపల్లె అను గ్రామమే కానవచ్చుచున్నది.

ఇతరములు

రంపచోడవరం తాలూకాలోని జాపతిపాలెం 1835 సం॥లో మరణించిన ఆ ప్రాంత జమిందారు రామభూపతిదేవు పేరన వెలసినదిగా తలంపవచ్చును కాని బావభూపాలపట్నం (ప్ర), రాజవరం (కొ), రాజానగరం, రాజవోలు (రాజ), రాజారం, రాజవరం (ప్ర) భూపాలపట్నం (పె) రాజనగరం, రాజవరం, రాజవొమ్మంగి (ఎ) వంటి రాజ గ్రామములు ఏ రాజుల పేరున వెలసియుండునో తెలిసికొనుటకు మరింత పరిశోధన అవసరము.

ముస్లిం పాలనా ప్రభావం

కుతుబ్‌షాహి, మొఘల్, ఆసఫ్‌జాహీల పాలన వరుసగా అనుభవించిన ఈ జిల్లాలోని గ్రామనామములపై వారి పాలనా ప్రభావం ద్యోతకమయినది. ఉ॥దా॥ హుకుంపేట, తాహారుపాలెం (రాజ); హసన్‌బాదా (రామ); అమీన్‌బాదా, ఫకీరుద్దీన్‌పాలెం (ప్ర); మల్కిపురం, మల్కిపల్లి, సాహాపురం (రా); నవాబ్‌పేట (అ); అమీన్‌బాదా (ఎ).

అమలాపురం

"దీని పూర్వపుపేరు అమ్లికాపురం.... 16, 17 శతాబ్దములలో మహమ్మదీయులీ ప్రాంతమును పాలించిరి. చింతపండునకు ఇది ప్రసిద్ధి పొందుటచే దీనిని ఇమ్లిపురమనిరి. ఉర్దూభాషలో ఇమ్లి అనగా చింతపండు. కాలక్రమమున ఈ పేరు అమలాపురముగా మారినది.76

కం ద్ర కో ట (పె)

పెద్దాపురం జమీందారులలో నొకనిచే ఓడింపబడిన ఖాన్ అనే ముస్లిం సర్దారు ఒక కోట కట్టుకుని నివసించగా 'ఖాన్‌కోట' అని తొలుత పిలువబడిన గ్రామమే కాలక్రమమున అపభ్రంశ మొంది కంద్రకోట అయినదట.77

పిఠాపురం పాలకుడైన నరసింహనాయనింగారు (1659-1720) హుసేనుపురమును తనపేర 'నరసింహరాయ పురాగ్ర హారం' గా ( ) మార్చి దానము చేసెనని తెలియుటవలన ఏవేని మరికొన్ని ముస్లింగ్రామ నామములు మార్పుచెంది వుండవచ్చునని భావించవొచ్చును.

పాశ్చాత్య ప్రభావము

1825 సం॥ నాటికి ఈ జిల్లా ప్రాంతం ఆంగ్లేయుల వశ మైనది. కాని గ్రామనామములపై వారి ప్రభావము అంతగా నుండి నట్లు తోచదు. ఒక్క ఫ్లోక్సుపేట (రం) అందులకుదాహరణగా కానవచ్చుచున్నది. 1759 సం॥లో వెస్టుకాట్ అను ఆంగ్లేయ వర్తకుడు క్రొత్తకురంగి (కా) గ్రామమును నిర్మించినట్లు తెలుస్తోంది.78 కాని దానికి అతని పేరీయబడలేదు. పాశ్చాత్య ప్రభావమున 'కురంగి' 'కోరంగి' గాను 'రాజవోలు' 'రాజోలు' గాను మారుట వంటివి సంభవించినవి.

పౌ రా ణి క ము లు

జనసామాన్య విశ్వాసంలో కొన్ని గ్రామనామములు పౌరాణిక వ్యక్తులకు, గాథలకు సంబంధించినవిగా నున్నవి.

అం త ర్వే ది (రా)

"శ్రీ నరసింహస్వామి హిరణ్యకశిపుని సంహరించి అతని శరీరమును అంతర్వేధి (ఆకసము) లో వినరివై చెను. ఆ అంత ర్వేధియే కాలక్రమమున అంతర్వేదిగా మారినదని తెలియవచ్చు చున్నది."79

ఆ త్రే య పు రం (కొ)

"ఇచ్చట అత్రిమహర్షి తపస్సుచేయుటచేత దానికి ఆత్రేయ పురమని పేరు వచ్చెనట."80

అ న్న వ రం (ప్ర)

శ్రీ వీర వెంకట సత్యనారాయణ మూర్తి వేంచేసి యున్న "ఇచ్చట జమీందారులు ఎల్లప్పుడు యాత్రికులకు ఉచితాన్నవాస సౌకర్యము కలుగజేయుటచే ఈ గ్రామమునకు అన్నవరం అని పేరు వచ్చినదని అందురు."81

అయినాపురం (అ)

"ఇచటకు పూర్వకాలమున ఒక కన్నులులేని దేవదాసి వచ్చెననియు, ఆమెకు దృష్టివచ్చెననియు అందురు. ఆ కారణ ముచే గ్రామమునకు అయినాపురము అను పేరు వచ్చెనందురు."82

ఏ లే శ్వ రం (ప్ర)

ఏలేరునదీతటమున నున్న ఈ గ్రామమునందు ఏలమహర్షి తపస్సు చేసెను గావున నా గ్రామమున కాపేరు వచ్చెనను విశ్వాసం.83

కో టి ప ల్లి (రామ)

పూర్వనామం కోటిఫలి అని. అనగా ఈ ప్రదేశంలో చేసే పుణ్యకార్యం కోటి ఫల ప్రదాతయని నమ్మిక వలన గ్రామమున కాపేరు వచ్చినదని విశ్వాసం. అలా వుండగా దాని అసలు పేరు కోడిపల్లి (తమిళమున కోడి అనగా సరిహద్దు) అనగా సరిహద్దు గ్రామం అని వేరే యొక ఉత్పత్తి గలదు.84

కో రం గి (కా)

"నేటికిని అచ్చటివారు చెప్పుకొను స్థలపురాణమును బట్టి రావణ ప్రేరితుడును, మాయా కురంగ రూపధారియునగు మారీ చుని శ్రీరామచంద్రుడు ఇచట సంహరించెననియు, తత్సంహార జనిత పాతక నివారణార్థము అత డీశ్వర లింగమును ప్రతిష్ట చేయుటచేత అది కురంగేశ్వరాలయమైనదనియు, ఆ గుడి గల గ్రామము కురంగి, కోరింగ, కోరంగి యైనదనియు తెలియు చున్నది....అట్టి పురాణముల, ఇట్టి జనశృతులను ఎంతవరకు చరిత్ర అంగీకరింపవలెనన్నది విచార్యము."85

కే శ న కు ర్రు (ము)

"కేశనకుర్రుకు ఆ గ్రామవాస్తవ్యులైన పండిత ప్రకాం డులు యెంత చక్కని వ్యుత్పత్తిని కల్పించారో చూడండి. వ్యాసుల వారిని కాశీవిశ్వేశ్వరుడు కాశీ నుంచి లేవగొట్టిన పిమ్మట వ్యాసుడు కాశీ వియోగ దుఃఖాన్ని భరించలేక తుదకు గోదావరీ తీరంలో పరమోత్కృష్ట ప్రదేశాన్ని వెదికి కాశీగా విశ్వామిత్రుడు అపరస్వర్గ సృష్టి చేసినట్లు చేయడానికి వుపక్రమించేటప్పటికి పరమేశ్వరుడికి భయం (యిక కాశీముఖం ఎవరూ చూసేవారుండరని)

పుట్టి వ్యాసునికి ప్రత్యక్షమై 'కాశీంనకురు' అని తొందరగా అన్నాడనిన్నీ, ఆ వాక్యం క్రమంగా గ్రామీణుల నోటబడి కేశనకుర్రుగా పరిణమించినదనిన్నీ చెప్పుకోగా విన్నాను."86

గంగవరం (రామ)

గంగానది తన కల్మషాన్ని పోగొట్టుకోవడానికి కాకి రూపంలో వచ్చి ఇచ్చట గోదావరిలో స్నానంచేసి సుద్ధిపొంది హంసయై తిరిగి వెళ్ళిపోయేదని — ఆ విధంగా గంగ వరం సార్థక నామ మైనదని ఒక కథనం.87 ఈ జిల్లాలోగల హంసవరం (తు) గ్రామమున కాపేరు ఆ హంస మార్గాయాశం తీర్చుకోవడానికి ఆ చోట ఆగడం వలన వచ్చినదేమో తెలియదు।

గన్నవరం (రాజ)

గన్నవరమునకు గరుడాపురమని పూర్వము పేరుండెను. వైనతేయ నదీశాఖ యొడ్డునగల ఈ గ్రామ (పూర్వ) నామముకూడా వైనతేయునకు సంబంధించినదేయై వున్నది. "వశిష్ఠుడు గౌతమీ జలమును సముద్రగామిగా గొనిపోవుచు అనుష్ఠానము కొరకు కమండలము నేల నుంచగా, వైనతేయుడు (గరుత్మంతుడు) తన ముక్కుతో కమండల జలమును హరించి వైనతేయమను పేరున ప్రవహింపజేసెనట."88 వైనతేయ కొత్తపల్లి (కొ) గ్రామమునూ గలదు.

జుత్తిగపాడు (కొ)

పలివెల గ్రామంలో గల అగస్త్యేశ్వరస్వామి పేరు కాలక్రమమున కొప్పులింగేశ్వరుడుగా మారినట్లు ఒకకథ ప్రసిద్ధముగా వినవచ్చుచున్నది. లింగమునకు కొప్పు (జుత్తు) మొలిపించిన పూజారి భక్తి ప్రభావమును మెచ్చి ఒక రాజు అతనికి సర్వకర పరిగ్రహంగా పలివెల గ్రామానికి పడమటగా కొంత భూమి ఇచ్చాడట। ఈ భూమికి 'జుత్తిగపాడు' అను పేరు నాడును, నేడును గూడ ప్రసిద్ధమై యున్నది."89

ధవళేశ్వరం (రాజ) / తాపేశ్వరం (అ) / ఇప్పనపాడు (అ)

"ఇచ్చట నున్న ధవళగిరి అను కొండను బట్టి దానికాపేరు వచ్చినది. ధవళగిరి పాదముకడ అగస్త్యేశ్వరస్వామి ఆలయమున్నది. వాతాపిని, ఇల్వలుని హతమార్చిన అగస్త్యముని బ్రహ్మహత్యా దోష నివారణార్థము ఇచ్చట ఈశ్వర ప్రతిష్ఠకావించెనట। ధవళేశ్వరమునకు తూర్పుగా ఇంచుమించొక ఆమడ దూరములో తాపేశ్వరమను గ్రామములో వాతాపేశ్వరుడును, ఇప్పనపాడులో ఇల్వకేశ్వరుడును ప్రతిష్ఠితులై యున్నారు."9

ద్రాక్షారామం (రామ

ద్వాదశజ్యోతిర్లింగములలో, అష్టాదశ శక్తి పీఠములలో నొక దానికి తావై యుండి దక్షారామము, దాక్షారామము, ద్రాక్షారామము అని బరగిన ఈ గ్రామము అచ్చటి భీమేశ్వరాలయములోని శాసనములలో దకరేమి, డాకరేమి, పెదడాకరేమిగా పేర్కొనబడినది. "దక్షప్రజాపతి ఇచ్చట యజ్ఞము చేసెనట" 'దక్షుని సవనాగారము దాక్షారామంబు' అని భీమేశ్వర పురాణములో పేర్కొనిన శ్రీనాథుడు అందెచ్చటా ఇచ్చోట ద్రాక్షతోటలుండినట్లు వర్ణించలేదట.91

పిఠాపురం (పి)

"అష్టాదశ దేవీపీఠములలో నొకటైన పురుహూతికాదేవి పీఠముండిన"92 నిది ఆ కారణముచేత పీఠికాపురమని గూడ వ్యవహరింపబడినది.

మందపల్లి (కొ)

మందుడైన శనీశ్వరుని ఆలయమున్న ఈ గ్రామము నా కారణమున 'మందపల్లి' అని పేరు తెచ్చుకొనినదని భావించ వచ్చును.

ముక్తీశ్వరం (కొ)

"పూర్వము తుల్య అనే మహర్షి ఇక్కడ తపస్సు చేసి, శివాలయాన్ని కట్టించాడు. ఎవరైనాసరే ఇక్కడ స్నానం చేసి శివుణ్ణి దర్శిస్తే సమస్తపాపాలుపోయి, ముక్తిని పొందుతారని దీవించాడు. ముక్తిని ప్రసాదించే గ్రామము కనుక దీనికి ముక్తీశ్వరము అనే పేరు వచ్చింది."93

మునికొడవలి (రాజ)

"మునికొడవలి యిది గ్రామనామమే. కాని దీనిని పండితులు కూడలిగా సవరించి ఆయాచోట అప్పుడప్పుడు మునులు సభచేసి శాస్త్రార్థం విచారం చేసే వారనిన్నీ, ఆ కారణంచేత యీ ప్రదేశానికి యీ పేరు వచ్చినదనిన్నీ చెప్పగా విన్నాను."94

రామచంద్రాపురం (రామ)

వనవాస కాలంలో శ్రీరామచంద్రుడు ఈ ప్రాంతాన్ని ఆగటం చేత గ్రామానికి అతని పేరే వచ్చినదని జనవిశ్వాసం వున్నది.95

రామఘట్టాలు (రామ)

కోటిపల్లికి నాలుగుమైళ్ళ దూరంలో వున్న దేవాలయం రామ ప్రతిష్ఠయని స్థానికులు అక్కడ రామపాదముద్రలను కూడ చూపుతారు.96

ర్యాలి (కొ)

"...జగన్మోహినీ కేశవస్వామి విగ్రహమును ఒక రథముపై నుంచికొని దానిని ద్రోసికొని వచ్చుచుండగా, రథపుచీల రాలిపడెను. మరియొక చీల అతికి రథమును జరుపజూచినను రథము కదలలేదు. స్వప్న దర్శనాదులచే స్వామి సంకల్పము కూడ నచట నిలిచిపోవుటయేయని భక్తులెరిగి, ఆ విగ్రహమునచటనే ప్రతిష్ఠించిరి. రథము చీల రాలి, స్వామి యచట నెలకొనుటచే అచ్చట వారా గ్రామమునకుర్యాలి యని పేరిడిరట....జగన్మోహిని నుదిటినుండి స్వేదబిందువు రాలగా అటనొక పుష్కరిణి ఏర్పడెను. స్వేదబిందువు రాలుటచే ఏర్పడిన కొలనుగల గ్రామము గాన, రాలియని పేరొందెను."97

వాలమూరు (రం)

రామాయణమునకు సంబంధించిన 'వాలి' గ్రామమిది యని ఒక విశ్వాసం.98

వావపల్లి (కొ)

రామాయణ కాలమునాటి వానరములకు ఆలవాలమైన గ్రామమని నమ్మిక.99

సర్పవరం (కా)

మహాభారతమునకు సంబంధించిన పరీక్షిత్తు ఇచ్చటనే సర్పద్రష్టుడై మరణించినట్లు, జనమేజయుడు సర్పయాగం జరిపిన స్థలము కూడ నిదియేననియు జన విశ్వాసం.100

సామర్లకోట (రాజ)

"ఇట చాళుక్య భీముని కోట ధ్వంసమైపోగా బిమ్మట క్రీ. శ. 1400 ప్రాంతమున కాటయవేమారెడ్డి....పూర్వము కోట యుండిన స్థలమును త్రవ్వింపగా, మహిషాసుర మర్దని శక్తి విగ్రహము దొరికినది. దానికి శ్యామలాదేవియని పేరిడి, ఆలయము గట్టించి, యట గ్రామము నిర్మించి, దానికి శ్యామలాదుర్గమని పేరిడెను. అదే సామర్లకోట. ఇది సామర్లకోట కైఫియతునందు గలదు."101

శివకోడు (రా)

రావణసంహార ప్రాయశ్చిత్తంగా శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన కోటిశివలింగములలో నిది ఆఖరుదని, శివకోటి అపభ్రంశమొంది శివకోడు అయినదని నమ్మిక.102

ఈ క్రింది గ్రామనామములు కూడ దైవతా సంబంధములైనవే. రామేశ్వరం (రా); ఉత్తరకంచి, (ప్రి); దేవరాపల్లి (కొ) దేవరమడుగు (ఎ); కోవిలపాలెం (ఎ); దేవగుప్తం (అ); గుడిగల్లు, గుడిగల్లుభాగ (రామ); గుడివాడ (పె); దేవారం, దేవరాపల్లి (రం) పాండవుల పాలెం (ప్ర); భీముసుగెడ్డ, భీముడుపాకలు (ఎ); అర్జునలోవ (రం) వంటివి పాండవులకు సంబంధించినవిగా తోచును. అసలు నేటి అమలాపుర ప్రాంతం ద్రుపదుడేలిన పాంచాలదేశమని ఒక విశ్వాసం.103

నామాంతరములు

పేరూరు (అ) నకు బ్రహ్మపురి యను నామాంతర ముండిన 104దనియు; ర్యాలి (కొ) పూర్వము రత్నపురిగా వ్యవహృతమైనదనియు,105 ఒకప్పటి ఓంక్రియానగరమే నేడు ఓదూరు (రామ) గా మారినదనియు,106 అల్లవరం (అ) శివారున నున్న కోడూర్పాడు ఒకప్పుడు కోడూరనియు,107 ఇందుపల్లి (అ) తొలిపేరు ఇందుపలి అనియు,108 సర్పవరము (కా) నకు పురుషోత్తమ పట్టణమని మరియొక వ్యవహారనామ ముండెడిదనియు;109 విష్ణుకుండిన ఇంద్రభట్టారకవర్మ దానమిచ్చిన 'తూండి' యే నేడు 'తుని' యైన దనియు,110 'రంభ' యను శబ్దము వికృతి నొంది అంప (రం) యైనదనియు లేక 'రంప' యే 'రంభ' గా సంస్కృతీకరించ బడినదనియు111 ఇత్యాదిగా కొన్ని గ్రామముల నామములు పరిణామము నొందినటుల తెలియుచున్నది. అయీ మార్పు చేర్పు కూర్పులకు గల చారిత్రక భాషా కారణములు పరిశీలనీయములు. గ్రామనామములు పొందనగు మార్పును గుర్తించుటకు వాటిమూలమును సాధించుటకు చరిత్రకారులానరించు యత్నమునకు గుర్తుగా ఒక ఉదాహరణ ఈయబడుచున్నది. "పృధ్వీమూలుని కుమారుడు హరివర్మ వేయించిన 'కట్టచెరువు' తామ్రశాసనమున 'గుణపాసపురము' వారి రాజధానిగా చెప్పబడినది. శాసనసంపాదకులగు శ్రీ రమేశన్‌గారు గుణ 'పాశపుర' శబ్దము నిట్లు నిర్వచించిరి. పెక్కు సదుణ సంపత్తి అనే పాశముతో వలయీకృతుడైనవాడు హరివర్మ. అందువలన 'పాశపురము' తాడు+ఊరు=తాడూరు అయినది. అదియే రాజోలు తాలూకాలోని నేటి 'అదుర్రు' గా మారినదని చెప్పిరి. వీరి వాదమునకు ప్రబల నిదర్శనమును గలదు."112 ఈ వాదమిట్లుండగా, పురాతన కాలమున 'అదుర్రు' అసలు పేరు 'అదిఊరు' అని వేరొక అభిప్రాయమున్నది.113

దేశకాల పరిస్థితులందు సంభవించు పరిణామములను బట్టి గ్రామనామములు కూడ మారుననుటకు అత్యంత ఆధునికమైన ఉదాహరణ: లంజలూరు లేక గాంధీనగరం (రం).

[ఇంకా వుంది]

ఎ ద మె రు పు లు

1

మనిషి మనసుని మానవత్వం ఏలదు
కవిగారి ఆదర్శం ఆచరణపై వాలదు
ప్రసంగాల్లో బ్రూటస్, ఏంటనీల్లో
ఎవరు గొప్పో తేలదు
ఈగల్ని, లేగల్ని తినే ఈ వ్యవస్థ
ఇప్పట్లో కూలదు.

2

ఈ ప్రకృతి ! పురుషుణ్ణి
పురుషోత్తముడు కానియ్యదు
తన రాగభోగ ద్వేషానల
పరిష్వంగం నుండి పోనియ్యదు
సమతా మమతల సరస్తీరాన
నా జాతి - దివ్వెలభాతి
బస చెయ్యదు.

3

నిరుపేదల బతుకు తోటలో
పుంస్కోకిల కుయ్యదు
జాలీ, కరుణ జాలువారే గుండె
వాకిలి ముయ్యదు
ఈ లోకంపు తోడేలు
అమాయక మేషాల్ని బతకనియ్యదు
కష్టపడే నష్టజాతికి
కడుపునిండా మెతుకు పెయ్యదు.

న డు స్తు న్న చ రి త్ర

వెండీ బంగారాలు గంపలో
తెల్లాడు తర్లించు కెళ్ళిన నా
స్వాతంత్ర్యపు కొంపలో
వ్యాపారపు పెలుకలు
యింటో సంపదనంతా తింటున్నాయని
రాజకీయ మార్జాలాల్ని తెస్తే
ఎలకల్ని తినడం మానేసి అవి
ఇంటో పాలూ, పెరుగులు మరిగి
నున్నగా తయారయ్యాయి
అదిలిస్తే కరిచేంతవరకొచ్చాయి మీదబడి !

వ ర్ణ న

పందులు ప్రజాసేవ బస్‌డిపోలో
తిరుగుతున్నాయి
కుక్కలు వీధుల్లో పట్టపగ్గా ల్లేకుండా
మొరుగుతున్నాయి
స్వార్థం మనిషి నెత్తిని ఆడుతున్నది
ధరిత్రి విషాద గీతి పాడుతున్నది !

నర్సాపేట ఒత్సల

—✲—

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

జీవక్రియా పరిపోషణలో జన్యు ప్రభావం!

జన్యుభావన జీవశాస్త్రాలలో అద్భుతమైనది. జన్యు పదార్థమైన డి. యన్. ఏ. యొక్క సంపూర్ణ సమాచారం, జీవవ్యవస్థను అర్థం చేసుకోవడంలో ఎంతగానో ఉపకరించింది. ఈ డి. యన్. ఏ. జీవరహస్య కీలకమని జీవశాస్త్రజ్ఞుల అభిప్రాయం. అది చాల వరకు వాస్తవం కూడా! "జెనెటిక్ బ్లూ ప్రింట్"ల సృష్టికర్త డి. యన్. ఏ. యే అన్న విషయం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పైగా జీవచైతన్యానికి, జవసత్వానికి కూడా ఈ డి. యన్. ఏ. యే మూలమన్న విషయం చిత్రమైన అనుభూతిని కలిగిస్తుంది. జీవ క్రియలను పర్యవేక్షించి, జీవి యొక్క భద్రతకు తోడ్పడే ఈ జన్యుప్రభావం జీవశాస్త్రాధ్యయనంలో అత్యంత ఆసక్తిని రేకెత్తింపజేసిన సరికొత్త దృగ్విషయం. జన్యువులన్నింటిలోనూ డి. యన్. ఏ. యే జన్యుపదార్థంగా ఉన్నప్పటికీ, దానికున్న విలక్షణమైన నిర్మాణక్రమంవల్ల, జన్యువునుంచి జన్యువుకు స్పష్టమైన భేదం ఏర్పడి, విశేషమైన ప్రతిపత్తిని కలిగిఉండే విధంగా ప్రతి జన్యువూ మలచబడి ఉండి, ఒక నిర్దుష్టమైన జీవ క్రియాశీలతను ప్రోత్సహించేవిధంగా ప్రతిజన్యువూ రూపొంది ఉంటుంది. సృష్టిలో ఈ విధమైన అమరిక ఎంతో విశిష్టమైనది. మరెంతగానో కొనియాడదగినది. ఇలాగ ప్రాణదాతగా మాత్రమే కాక, ప్రాణి జీవనానికి అలవాలమైన క్రియాశీల జీవనచర్యల నన్నింటినీ పర్యవేక్షిస్తూ, ప్రత్యక్షంగా జీవి యొక్క సార్థకమైన యోగ్య జీవితానికి, పరోక్షంగా జీవజాతియొక్క అభ్యుదయానికి డి. యన్. ఏ. ఎంతగానో సహకరిస్తోంది. ప్రత్యుత్పత్తికి సంబంధించిన డి. యన్. ఏ. పాత్ర చైతన్యానికి హేతువుగా కొనియాడవలసిన ప్రాణం లేదా జీవానికి ఊపిరి పోసేది. జీవరహస్యం డి. యన్. ఏ. లో ఉందన్నమాట వాస్తవమేకాని, డి. యన్. ఏ. నే జీవ ప్రతిరూపమా? లేక జీవాన్ని అందించడంలో ఉపయోగపడే జీవధాతు సాధనమా? అనేది ఇంకా స్పష్టంగా నిర్ణయం కాలేదు. దాని సంగతి అలావదలిపెట్టి జీవక్రియా పరిపోషణలో డి. యన్. ఏ. వహించే సంక్లిష్టమైన ముఖ్యభూమికను గురించి ఆలోచిద్దాము. జన్యువుల్లో డి. యన్. ఏ. ఉన్నప్పటికీ జన్యువు నుంచి జన్యువుకు తారతమ్యముంటుందని ఇంతకుముందే తెలుసుకొన్నాముకదా! ఈ వ్యత్యాసమనేది నత్రజని క్షారాల పంపిణీవల్ల కావచ్చును. పంపిణీలోని ఈ మార్పువల్ల చైతన్య ప్రతిరూపాలైన "ఎంజైమ్"ల, "ప్రోటీన్"ల నిర్మాణాలకు మూలకారణాలైన "అమైనో ఆమ్లాలు" నిర్దేశించబడే సంకేతాలు మారిపోతాయి. ఈ మార్పువల్లే ప్రతి జన్యువుకూ ఒక విశిష్టత వచ్చింది. ఈ విశిష్టతవల్లే ప్రతి జన్యువూ ఇదమిత్థమని చెప్పదగిన వ్యక్తిత్వాన్ని కలిగి ఉండి, కేవలం ఒక "ఎంజైమ్"నో లేదా "ప్రోటీన్" అణువునో కాదంటే ఏదో ఒక "హార్మోన్"నో, లేదంటే ఒక "వైటమిన్"నో నిర్మించే ప్రయత్నం చేస్తుంది. (ఈ ప్రతిపాదన మీద ఈ నాటికీ ఎన్నో వాదోపవాదాలు చెలరేగుతున్నాయి. ఇంకా ఒక స్పష్టమైన అవగాహనకు ఎవరూ ఇంతవరకూ రాలేదు). అయితే ఈ జన్యువుదే సర్వాధిపత్యమని అనుకోడానికి వీలులేదు. ఎందుకంటే డి. యన్. ఏ. ను నిర్దేశించగలిగే "స్పెషల్ ఎంజైమ్"లు ఉన్నట్టు ఇటీవల కొందరు భావిస్తున్నారు. ఈ "ఎంజైమ్" లను గుర్తించడానికై పెద్దఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక జన్యువు కలుగజేసే ప్రభావం జీవక్రియా వ్యవస్థలో ఏ విధంగా ప్రతిబింబించ బడుతుందనేది ప్రస్తుతం చర్చిద్దాము.

జీవిలో నెలకొని ఉన్న పరిస్థితిని బట్టి డి. యన్. ఏ. క్రియాశీలత ఆధారపడి ఉంటుంది. విశ్లేషించబడని వ్యర్థ పదార్థాలను తొలగించవలసి వచ్చినప్పుడు, జీవగమనానికి అనుకూలంగా, సులభసాధ్యంగా జీవక్రియకు సహకరించే విధంగా నిలువలను సేకరించవలసి వచ్చినప్పుడు, పనిసామర్థ్యాన్ని పెంచవలసి వచ్చినప్పుడు - ఆ పరిస్థితి రాకుండా అజమాయిషీ వహించే జన్యువు ప్రభావం చూపడం ప్రారంభిస్తుంది. ఈ ప్రభావం డి. యన్. ఏ. నుంచి ఆర్ .యన్. ఏ. రూపొందడం ద్వారా ప్రస్ఫుటమౌతుంది. ఈ ఆర్. యన్. ఏ. అవసరమైన "ఎంజైమ్" ను తయారు చేస్తుంది. ఆర్. యన్. ఏ. ఏర్పడడం కాని, "ఎంజైమ్" రూపొందడం కాని చర్యావేగ స్థిరాంకం మీద ఆధారపడి ఉంటుంది. అంటే చర్యావేగమెంత ఎక్కువగా ఉంటే "ఎంజైమ్" గాఢత

అంత అధికంగా ఉంటుంది. అలాగా అనుకొన్న కార్యాన్ని సాధించిన పిమ్మట ఆర్. యన్. ఏ. కాని, "ఎంజైమ్" కాని అదృశ్యమైపోతుంది. ఈ విధంగా అంతర్ధానమై పోవడం కూడ చర్యావేగం పైనే ఆధారపడి ఉంటుంది. అయితే ఈ చర్యావేగం అదృశ్యమైపోయే ఆర్. యన్. ఏ. గాఢతకు కాని, "ఎంజైమ్" గాఢతకు కాని విలోమానుపాతంలో ఉండక సమ సంబంధ సామ్యాన్ని కలిగిఉంటుంది. మొత్తంమీద డి. యన్. ఏ. నుంచి ప్రారంభమయ్యే ఈ చర్యాపరంపరను ఒక సమీకరణంగా చూపవచ్చును.

ఉత్పన్నచర్యావేగస్థిరాంకము　　ఉత్పన్నచర్యావేగస్థిరాంకము
డి.యన్.ఏ. ——→ ఆర్.యన్.ఏ. ——→ 'ఎంజైమ్'
| ← వినియోగచర్యావేగ స్థిరాంకము → |
↓　　↓
తక్కువ మోతాదులో ఆర్. యన్. ఏ.　　తక్కువ మోతాదులో 'ఎంజైమ్'

ఉత్పన్నచర్యావేగానికి, వినియోగచర్యావేగానికి మధ్య ఒక సమతాస్థితి ఏర్పడి ఉంటుంది. ఇందులో ఏది ఎక్కువైనా లేక ఏది తక్కువైనా జీవస్థైతిక సమతుల్యత దెబ్బతింటుంది. ఈ విషయాన్ని రేఖామాత్రంగా సూచించవచ్చును.

ఉత్పన్న చర్యావేగము ⇄ వినియోగ చర్యావేగము
సమతాస్థితి
↓
విశృంఖలజీవక్రియ ← జీవస్థైతిక సమతుల్యత → నిస్తబ్దజడత్వము
↓
జీవి సహజ జీవక్రియ

జీవక్రియపై జన్యుప్రభావం ఏవిధంగా ఉంటుందో చెప్పడానికి ఎన్నో ఉదాహరణాలున్నాయి. కళ్లలోని సున్నితమైన నిర్మాణాలతో ముడిపడి ఉన్న "క్రిస్టలిన్", రక్తకణాలతో సంబంధాన్నికలిగిఉన్న "గ్లోబిన్", తెల్లసొనకు సంబంధించిన "ప్రోటీన్", పట్టునుసుపుకు ఉపకరించే "కర్కానేస్" అనే "ఎంజైమ్"లు ఏవిధంగా ఏర్పడుతున్నాయో స్పష్టంగా పరిశీలిస్తే జన్యుప్రభావం ఎంతో బాగా తెలిసొస్తుంది. రెండు "ఎంజైమ్"ల తయారీకి సంబంధించినంతవరకు జన్యుప్రభావాన్ని చర్చిస్తాను.

"టైరోసిస్ అమైనో ట్రాన్స్ఫరేజ్" (టై. అ.), "అలనిన్ అమైనో ట్రాన్స్ఫరేజ్" (అ. అ.) అనే రెండు "ఎంజైమ్"లు ఉన్నాయి. ఇవి రెండూ కూడా "అల్ఫా కీటో గ్లూటరేట్" అనబడే కర్బన పదార్థాన్ని, "గ్లూటమేట్" అనబడే "అమైనో ఆమ్లం"గా మార్చడమే కాకుండా, శక్తిని విడుదల చేయడానికి తగిన అవకాశమున్న పదార్థాలను ఏర్పరుస్తాయి. ఈ "ఎంజైమ్"ల చర్యలను క్రింది సమీకరణాలలో ప్రతిఫలించేటట్లు చూస్తాను.

"టైరోసిస్"+"అల్ఫాకీటో గ్లూటరేట్" ⇄ "హైడ్రాక్సీఫినైల్ పైరువేట్"
(టై. అ.) | +"గ్లూటమేట్"
↓
శక్తిజనకాల ఉత్పన్నము

'అలనిన్' + 'అల్ఫా కీటోగ్లూటరేట్' ⇄ 'పైరువేట్'
(అ. అ.) | +'గ్లూటమేట్'
↓
శక్తిజనకాల ఉత్పన్నము

జన్యుప్రభావం ప్రధానంగా టై. అ., అ. అ.ల పైనే ఉంటుంది. ఈ రెండింటిలోనూ స్వరూపాన్ని కలిగిన రెండు రకాల పదార్థాలుంటాయి. ఒకటి "కో ఎంజైమ్" అనేది. ఇది "ప్రోటీన్" భాగంగా చెలామణీ అవుతుంది. రెండవది "పైరిడాక్సల్ ఫాస్ఫేట్". రెండింటి తయారీకి జన్యుప్రకటన అవసరం. అంటే ఒక్కమాటలో "ఎంజైమ్"పై జన్యు ప్రకటన రెండు దశలలో ఉంటుందని చెప్పవచ్చు.

'ఎంజైమ్' క్రియాశీలత ← [→ 'కో ఎంజైమ్' ← ; → 'పైరిడాక్సల్ ఫాస్ఫేట్' ←] → జన్యు ప్రకటన

ఈ జన్యుప్రకటన అంతటితో పరిమితం కాదు. 'హార్మోన్' స్థాయిలో కూడాఉంటుంది. ఈ రెండు 'ఎంజైమ్'లకు సంబంధించి 'గ్లూకో కార్టికాయిడ్' రకానికి చెందిన 'స్టిరాయిడ్' అనబడే 'హార్మోన్'లు ఎక్కువగా స్రవించే విధంగా జన్యు ప్రకటన జరుగుతుంది. ఈ 'హార్మోన్'లు ఎంత ఎక్కువగా స్రవిస్తే, 'ఎంజైమ్'ల గాఢత అంత ఎక్కువగా పెరుగుతూ ఉంటుంది.


జన్యు ప్రభావం 'వైటమిన్'ల మీద, వర్ణకాలువంటి వివిధరకాల మధ్యస్థ పదార్థాలమీద ఉండవచ్చును. అన్నింటి సమిష్టి ప్రభావం జీవక్రియా వ్యవస్థపై ఉంటుంది. ఇది జీవి జీవితస్థాయిని నిర్దేశిస్తుంది. ఈ నిర్దేశనలో ప్రకృతి, సమకాలీన జంతువులు కూడా ప్రముఖపాత్ర వహిస్తాయి. అన్నింటి కలబోత సాకాల్యంగా ఉండే జీవజాతి సుగమ్యమైన పరిణామ వికాసంతో మనగలుగుతుంది. లేదా అంటే అంతరించిపోయే ప్రమాదముంది. అయితే ఈ చర్య ఒకటి రెండు రోజుల్లో కనిపించేదికాదు. అనంతమైన కాలప్రభావం దీనిపై ఎంతగానో ఉంటుంది. దీన్ని మరవకూడదు. జన్యుప్రభావం ఎలా ఉంటుందో, దాని పరిణామం జీవజాతిపై ఏ విధంగా ఉంటుందో రేఖామాత్రంగా వివరించాను.

(చిత్రాన్ని చూడండి।) →

మొత్తం పరిధిలో జన్యు పాత్రను సమీక్షిస్తే డి. యన్. ఏ. జీవరహస్య కీలకమేనని విస్పష్టంగా బోధపడుతుంది. అత్యల్ప పరిమాణమున్న జన్యువులో సంకేతాలలోని అణుమాత్రమైన మార్పులవల్ల ప్రబలమయ్యే ప్రభావకారకం జీవక్రియా వ్యవస్థలో, జీవి వ్యవస్థలో, జీవజాతి వ్యవస్థలో ఏవిధమైన పరిణామాన్ని తెస్తుందో ఆలోచించుకొంటే ఎంతో ఆశ్చర్యమనిపిస్తుంది।

ప్రకృతిపరమైన ఆ దివ్యశక్తికి నివాళి।

జన్యు ప్రభావం - రేఖా చిత్రం





నేనూ - నా వేణువు

శ్రీ మేడవరపు సంపత్‌కుమార్

వేణువు యొక్క ఊదేరంధ్రం
చెవికి ఆన్చి వింటే
అనంత రాగాల అవ్యక్తఘోష
ఒకే శృతిలో వినబడుతుంది.

తనను ఒక రాగయోషగా
మలచమని చేసే వేదనా నాదం అది.

దానికి
నా హృదయలయలు జతకలసిన క్షణం
మసృణ మధురభావాలు మనఃకోశానికి చేసిన ప్రదక్షిణం
నన్ను ప్రేరేపించి,
వేణువును నా పెదవికి చేరుస్తుంది.
అప్పుడు, గతాగత వినిర్ముక్త కాలంలో
ఆ ఘోషలో నా పెదవి నుంచి
వెలువడే ఊపిరి కలసి
స్వర తరంగాలను లేవదీస్తే
నా వ్రేళ్ళు వాటిని రాగశిల్పంగా
తీర్చిదిద్దుతాయి.
ఆ క్షణమే అది రసఘోషగా మారే స్థాయి
ఆ నాదం వెదజల్లే ఆనందం చిరస్థాయి.

~~~

ఎడాలసెన్స్

శ్రీ రాళ్ళబండి కవితాప్రసాద్

మానసిక నిశ్శబ్దం నిండిన ప్రణయాణువును నేను-
అప్సరస ప్రేరణలో ఆటోమేటిక్‌గా 'టెంప్ట్' అయి
ఆ తర్వాత పశ్చాత్తాప పడుతున్న విశ్వా'మిత్రుణ్ణే' నేను-
కానీ ప్రస్తుతానికి
రొమేంటిక్ పూలలో మకరందానికి బదులు
హాలాహలాన్ని 'సిప్' చేసి నాలక్కరచుకున్న
తుమ్మెదనునేను-

నా తెల్లని మనోనిశీథిలో
సెలఏరులా 'స్లోగా' నల్లని మెరుపు
నా గుండెల్లో స్వరలయ లోపించిన
కాలిగజ్జెల ఉరుము
రక్తనాళాల్లో ప్రణయ, ప్రళయ భావాల "నోడ్స్ అండ్
యాంటీనోడ్స్"
నా అంతశ్చర్మాల్లో బైటికగనిపించని "డైనమిజం"
ఋణావేశపు 'ఎలక్ట్రాన్' సంచలనాన్ని గుండెల్లో
దాచుకున్న
అణువులా నేను-

నన్ను 'డిస్టర్బ్' చెయ్యకండి-
స్తబ్దతతో నేను భావకవినయ్యానని-
జడత్వసముద్రంలో జలకాలాడుతున్నానని
నవ్వివోకండి-

కాలమిచ్చే తీర్పులో మీరే తెలుసుకుంటారు-
"జడంగా పడిఉన్న మీ అనుమాల పర్వతశక్తికన్నా-
ఆలోచనలతో ప్రేలనున్న నా అణుశక్తి మిన్న" అని.

—)(—
~~~

శ్రీమాన్ విక్రాల శేషాచార్యులు

చిత్రకావ్యములు

కావ్యము సకలవిధ శ్రేయస్సాధనమని సుధీలోకము సిద్ధాంతము చేసియున్నది. మమ్మటభట్టు కావ్యప్రకాశమునందు "శ్లో॥ కావ్యం యశసే ఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే । సద్యః పరనిర్వృతయే కాన్తాసమ్మితతయోపదేశయుజే" అని కావ్య ప్రయోజనములను తెలిపియున్నాడు. ఈ ప్రయోజనములలో ఎవ్వరెవ్వ రెద్దాని ననుభవించిరో నా విషయమును విడి విడిగ వేరు వేరుగ కవిసార్వభౌమ కవిగండభేరుండ బిరుదాభిరాములయిన శ్రీమాన్ వసుదుర్గం కృష్ణమాచార్యుల వారని పూర్వాశ్రమ నామ దేయము కల (సన్యాసాశ్రమములో) శ్రీకృష్ణబ్రహ్మ తంత్ర పరకాల యతీంద్రులవారు అలంకారమణిహార కావ్యోత్కర్షరక్షల యందును, శ్రీ వేంకటగిరి సంస్థాన పండితులైన శ్రీమాన్ తర్క భూషణం వేంకటాచార్యులవారు శృంగారకల్పవల్లి యందును, ఆణివిళ్ల వేంకటేశ్వరకవి యొనర్చిన శ్రీ నూజివీటి ప్రభువర శ్రీ నారసింహాప్పారాయ యశోవర్ణనపరమైన అప్పారాయ యశశ్చంద్రోదయమునందును, మఱికొన్ని లక్షణగ్రంథములయందును తెలుపఁ బడియున్నది. వీటిలో చివరఁ జేర్కొనఁబడిన గ్రంథము (1915వ సంవత్సర ముద్రితము.) 5వ పుటలో గ్రంథారంభ సమర్థనకళలో "శ్లో॥ విశ్వోల్లంఘన జాంఘికీం వితనుతే కీర్తిం, విధత్తే శ్రియం। హేలాధిక్కృత యక్షరాజవిభవాం, చిన్తాకరం హన్త్యఘమ్। దుగ్ధే స్వాదుతరా న్రసా, న్వికిరతి స్ఫారం కలాకౌశలం। కావ్యం నిర్వృతి మావహ త్యపి పరిస్పన్దావహం చేతసః॥ కృత్వా కావ్య మవాప విశ్వసహితాం కీర్తిం కవిగ్రామణీః। శ్రీహర్ష, శ్శ్రియ మద్భుతాం హరిహరో లోకే ఽర్జునక్ష్మాభుజః। స్వాభీష్టం సమ పాచకార మలయక్ష్మామండలాఖణ్డలా। త్తత్కిఞ్చిన్నవిలోక్యతే సకిల య త్కావ్యా త్సమున్మీలతి॥"

ఇట్లు శ్రేయస్సు చేకూరిన పిమ్మట వినోదమే అనుభావ్యము. విద్వాంసులు కూడా మానవలోక వాసులే కనుక వారు సామాన్య మానవులతోటి లౌకిక కార్యములను నిర్వహించుచున్నను తఱచుగ సారస్వతవినోదములతో కాలక్షేపము సలుపుట వారి కిష్టము. ఈ సారస్వత వినోదములు పెక్కు రకములుగ నున్నవి. శాస్త్రము లలో మొట్టమొదటిదియైన (మాయన్నగారు శ్రీమాన్ పండిత విక్రాల రాఘవాచార్యులవారు చెప్పిన) వేదమునుంచి యొక్క యుదాహరణము చూపెదను. "క్షీరం దుహ్రతే గావో అస్యశీర్ష్ణః" అని. ఈతనియొక్క గోవులు శిరస్సులనుంచి క్షీరమునుఁ బితుకు చున్నవి యని ఆ మంత్రమున కర్థము. లోకములో నెచ్చటనైనను ఎప్పుడైనను ఏ గోవునైనను క్షీరమును పొదుగుల నుంచి పితుకునే కాని శిరస్సులనుంచి పితుకవు. అందుచేత నిచ్చట క్షీరాదిశబ్దములకు పాలు మున్నగు అర్థములే కాక వేరైనయర్థము లూహించఁదగినవి. అందుకు నిఘంటువులలో క్షీరము (శబ్దము) నకు - పాలు నీరు, గోశబ్దమునకు - ఆవు కన్ను మొదలైన పలు అర్థములును, శిర శబ్దమునకు - తల అగ్రభాగము అర్థములుగ నున్నవి. కనుక నీ శబ్దములకు కోశోక్తములయిన యర్థములలో లోకానుభవసంగతము సమయోచితము నైన యర్థమును గ్రహించి చెప్పవలెను. కాఁగా, అస్య - సూర్యునియొక్క, గావః - కిరణములు, శీర్ష్ణః - అగ్రభాగమునుంచి, క్షీరం - నీరును, దుహ్రతే - పితుకుచున్నవి. "దుహ ప్రపూరణే" అను ధాతువునుంచి యేర్పడిన పదము కనుక దుహ్రతే - వెల్లడించుచున్నవి. చెఱువుల నని భావము. ఇచ్చట శీర్ష్ణః అనునది శిరశ్శబ్దము యొక్క (పంచమీ విభక్తియొక్క) ఛాన్దసరూపము. వేదభాష్యములున్ను ఈ మంత్రమున కీయర్థమునే తెలుపుచున్నవి.

సూర్యకిరణాగ్రములనుండి వర్షములు కురియు నని శాస్త్రకారులు నుడివియున్నారు. "శ్లో॥ వృష్టిం ఘృష్టిభి రారచయ్య జగత స్తుష్టిం సపృష్టియః...." అని (ఆత్రేయ వేంకటాధ్వరి విశ్వగుణాదర్శ చంపువు.) యాదవప్రకాశులు వైజయన్తీ నిఘంటువులో రెండవది అన్తరిక్ష కాణ్డములో తొలిదియగు జ్యోతిరధ్యాయములో సూర్యకిరణనామముల వద్ద "శ్లో॥ తాసాం శతాని చత్వారి (౪౦౦) రశ్మీనాం వృష్టిసర్జనే ॥౧౭॥ అని నుడివి వర్షప్రదములైన ఆ సూర్యకిరణముల పేళ్లను "శ్లో॥ అనన్దనాశ్చ మేధ్యాశ్చ" ౧౮ ఇత్యాదిగ నుడివెను.

ఇఁకను వాల్మీకిమహర్షి వేదాదిసకలశాస్త్రపారదృశ్వ కనుక ఆదికావ్యమైన తన శ్రీమద్రామాయణమునందు అట నట నిటువంటి విచిత్రముల (శబ్దచిత్రముల)ను రచించియున్నాఁడు. ఒక్క ఉదాహరణము - శ్రీమద్రామాయణే యుద్ధకాండే ౬౭ సర్గే.—

"శ్లో॥ కుమ్భకర్ణ శిరో భాతి కుణ్డలాలంకృతం మహత్ । ఆదిత్యే ఽభ్యుదితే రాత్రౌ మధ్యస్థఇవ చన్ద్రమాః." ॥౧౫౭॥ ఇది శ్రీరాముని బాణపు వ్రేటుచేత శరీరమునుండి తెగి పైకెగసిన మణి కుణ్డలమణ్డితమైన కుమ్భకర్ణుని తల యొక్క వర్ణనము. ఇచ్చట ఉత్తరార్ధములోని చమత్కారము తెలియునిమిత్తము తాత్పర్యమును వ్రాసెదను. తా॥ కుండలముచేత నలంకృతమైన గొప్పదియైన కుంభకర్ణునిశిరము రాత్రియం దాదిత్యోదయము కాఁగా నడుమ నుండు చంద్రునిచందమున నలరె నని. ఇచ్చట రాత్రియం దాదిత్యోదయము కాఁగా అన్న మాటలోని అన్తరార్థము నాలోచించి తెలిసికొన్నచో అస్పష్టమైనయర్థము బహిర్గతమగును. అది ఆదిత్య మనఁగా అదితిదేవతాకమైనది. అది పునర్వసూ నక్షత్రము. పునర్వసూ ద్వౌద్వౌ చైకమ్మనెడు జ్యోతిశ్శాస్త్ర సూత్రమునుఁ బట్టి రెండురెండుచుక్కలు. రాత్రిపూట రెండురెండుచుక్కలుగల అట్టి పునర్వసు నక్షత్ర ముదయించఁగా నారెండుచుక్కలనడుమ నుండు చందమామమాదిరి మణికుండలమండితమైన కుంభకర్ణుని శిరస్సు ప్రకాశించె నని తాత్పర్యము. దీనికి గోవిందరాజీయవ్యాఖ్యాన పంక్తులు— "కుంభకర్ణేతి॥ కర్తనవేగా దుద్గతం గగనేస్థితం రాత్రౌ ఆదిత్యే అదితిదేవతాకే పునర్వసూ నక్షత్రే తారకాద్వయాత్మకే అభ్యుదితే తన్మధ్యగత శ్చన్ద్రమాఇవ బభా విత్యర్థః." మహేశ్వ తీర్థవిరచిత శ్రీరామాయణతత్వదీపికా వ్యాఖ్యాన పంక్తులు— "కుంభకర్ణశిర ఇతి॥ కర్తనవేగా ద్గగనేస్థితం స త్కుంభ కర్ణశిరః ఆదిత్యే అదితిదేవతాకే పునర్వసూనక్షత్రే రాత్రౌ వభ్యుదితే తన్మధ్యగత శ్చన్ద్రమాఇవా భాతీ త్యర్థః. కుండలాలంకృతం కుండలాభ్యాం అలం నివారణం కృతమ్. కుండలరహితం సద్భాతి."

అత్ర దృష్టాన్తః – ఆదిత్యఇతి – ఆదిత్యే సూర్యే అభ్యుదితే సతి అభ్యుదితే రాత్రౌ విత్యత్ర అరాత్రౌ వితి చ్ఛేదః. అరాత్రౌ వహని మధ్యస్థః గగనమధ్యస్థః చంద్రమాఇవే త్యర్థః. అస్మిన్నపక్షే పూర్వశ్లోకే చల చారుకుండల మి త్యస్య చలే చలితే గతే చారుకుండలే యస్య త దిత్యర్థః తీర్థీయవ్యాఖ్యానంలో విశేషముగ నున్న పంక్తులయొక్క అర్థము. కర్ణాభరణములను ధరించు తావు గాక చెవియొక్క భాగములు సుగ్రీవునిచేత కొఱికి అపహరింపఁ బడినందున కుంభకర్ణుని శిరము కుండలాలంకృతమై యున్నది. లేక పెద్దదియైన కుంభకర్ణునితల కర్ణభూషణములు లేనిదియై పగలు సూర్యుఁడుదయించఁగా నాకాశమధ్యస్థుఁడైన చంద్రునివలె నున్నది యని యర్థము. అనఁగా కాంతి రహితమైనదియని యర్థము. ఈ తీర్థీయవ్యాఖ్యానములో "లేక" అనుమాట మొదలుకొనియున్న పంక్తులు శాస్త్రలోకానుగతములేయైనను చమత్కారమేమియులేదు. ముందటి యర్థములో శాస్త్ర-లోకానుగతి చమత్కారము నను నీ మూడు కలవు. ఈ శ్లోకమునకు సంస్కృతము నెఱుంగని తెలుఁగువారికిఁ దెలియుటకు తెలుఁగు రామాయణములనుంచి పద్యములనుదహరించెదను. గోపీనాథరామాయణము (౧౮౮౪ సం॥ర ముద్రితము) యుద్ధకాండము (౪౫౧ వ పుటలో) వ. "ఇట్లయ్యమోఘాస్త్రంబు రామబాహూదోదితంబై స్వతేజంబున దిశలు వెలింగింపుచు రయంబునం జని మహాపర్వతకూట సన్నిభంబును వివృత్తదంష్ట్రిచల చారుకుండలంబు నగు కుంభకర్ణుని శిరంబు ఖండించిన బర్వతశంకాశంబైన తచ్ఛిరంబు రామ బాణాభిహతంబై కర్తనవేగంబున మింటి కెగసి కుండలాలంకృతంబై రాత్రియందు పునర్వసు నక్షత్రంబు విదితం బగుచుండఁ దన్మధ్యగతుండైన శశాంకుండుఁ బోలె వెలుంగుచు...." ఆంధ్రవాల్మీకి రామాయణము యుద్ధకాండము ౬౭వసర్గ ౧౫౫ ౧౫౬ "శ్లో॥ భూరిమహీధరాగ్ర విభముం జలచారుసువర్ణకుండలం । బారవివృత్తదంష్ట్రమును నౌనసురాధిపమూర్ధమున్ మహా । ఘోరతఁద్రుంపఁ బిట్టెగసి కుండల రాజితతచ్ఛిరంబు పొల్పారెఁ బునర్వసుడు యుగళాంతరచంద్రుని న్నిశన్"॥ ౧౫౬॥

మందరవ్యాఖ్యానపంక్తులు – అర్థములు : చల– చలించుచున్న, చారు – మనోహరమైన, సువర్ణకుండలంబు – బంగారు చెవులపోఁగులుకలది,....మూర్ధమున్ – శిరస్సును, మహాఘోరతన్ – మిగుల భయంకరముగా, త్రుంపన్ – ఖండింపఁగా బిట్టెగసి– తటాలున నెగసి, కుండలరాజితతచ్ఛిరంబు – కుండలములతోఁ బ్రకాశించు ఆ తల, సుగ్రీవుఁడు తనకు తటాలున నచ్చినచెవుల పైభాగములను పెఱికెనే కాని మొదలంటఁ బెఱుకలేదు. కావున కుండలంబు లున్నవని చెప్పఁబడెను. పునర్వసూడుయుగళ=పునర్వసు రెండు నక్షత్రముల, అంతరచంద్రుని – నడుమ నున్న చంద్రుని, నిశన్ – రాత్రియందు, "యథా వాహా నిశాదిశా" యని యుండుటచే నిశన్ – అని చెప్పఁబడెను. "నిశా నిశీథి నీ రాత్రి" యని యమరము. తాత్పర్యము – పెద్దకొండశిఖరములతో సమానముగ కదలుచున్న మనోహరమైన కుండలములు కలది గుండ్రని కోరలు గలది యగు రాక్షసుని తలను మిగుల భయంకరముగా ద్రుంపఁగానది తటాలున పైకెగసి రాత్రివేళ నాకాశమందుఁ బునర్వసు రెండునక్షత్రములనడుమనున్న చంద్రునివలెనై

రెండునక్షత్రములు కుండలములు, నడుమముఖము చంద్రుఁ డని యుపమానము. వీటిలో ఆంధ్రవాల్మీకిగారి పద్యములలో

పునర్వసూడుయుగళాంతరచంద్రుఁబోలుచె న్నిశస్ అనుమాట రామాయణ రచయితయొక్క హృదయమునుఁ దెలుపుచున్నది.

ఇట్లే నారచించిన చిత్రబంధ శ్రీనివాస కావ్యములో—

"శ్లో॥ ఉదయా దుదయ న్హంసల్లపదాగ్రై ర్భువనౌఘసృట్ ।
యస్యవాసో గుహావాసస్సమే ఽస్తు శరణం ప్రభుః॥"

తా॥ఉదయమునుండి ఉదయించునది పాదాగ్రములతో లోకములను సృజించునది, గుహలలో నున్నహంస యెవనికి నునికియో ఆ పరమాత్మయైన నారాయణుఁడు నాకు రక్షకుం డగుం గాత యని ఆ శ్లోకపు తాత్పర్యము. అనుటలో నివ్విశేషణము లెవ్వియు నెప్పుడునే హంసముల కుండవు. కావున నీ విశేషణములకు తగిన యర్థముల నాలోచించి యసలైన యర్థము వచ్చును. అది - ఉదయమునుంచి -ఉదయపర్వతమునుంచి, ఉదయించుచున్నవాఁడు కిరణాగ్రములచేత "ని. పాదా రశ్మ్యంఘ్రి తుర్యాంశాః" అని యమరము నానార్థవర్గము. భువనౌఘ - నీళ్ల గుంపును, సృట్ పుట్టించువాఁడు. "ని. పయల్ల కీలాల మమృతం జీవనం భువనం వనం" అని జలపర్యాయములం దమరము వారివర్గము. "ని. ఓఘో బృన్దే ఽమ్బుసౌంరయే" అనియు నమరకోశము. సూర్యకిరణాగ్రముల నుంచి వాన కురియునని శాస్త్రజ్ఞుల నిర్ణయము. (ఆ విషయము తొలుతనే తెలిపినాఁడను.) అటువంటి, హంసః-సూర్యుఁడు, యస్య-ఎవనికి, వాసః-ఉనికియో, గుహా-జనుల హృదయము, యస్య-ఏ నారాయణునకు, వాసః-ఉనికియో, ప్రభుః-సర్వేశ్వరుఁడైన, సః - ఆ నారాయణుఁడు, మే-నాకు, శరణం-పాలకుఁడు అస్తు-అగుఁ గాఁత. సర్వేశ్వరుఁడైన ఆ పరమాత్మ నన్నేలుఁ గాఁత యని యర్థము. ఈ శ్లోకములోని యుదయాది శబ్దముల కిచ్చుటఁ జెప్పిన యర్థములు కడమయర్థములు నిఘంటువులలోఁ గాంచఁదగును.

ఇట్టిపట్టుల శబ్దములకు ప్రకృతోచితమైన ఒక్కవిధమైన యర్థమునే గ్రహించినచో చమత్కారము అసలునైన యర్థము నవగతమై యుల్లముల కుల్లాస మొనఁగూడును. కాని శబ్దముల కున్నయర్థములలో నొక్కొక్కమా రొక్కొక్క యర్థమును గ్రహించినచో మనస్సునకే భావము తెలియక గజిబిజిగ నుండును. ఇది యొకరకమైన శబ్దాలంకారము. వాల్మీకిమహాముని శ్రీ మద్రామాయణమునందు యిట్టివి మఱికొన్ని విధములైన అనుప్రాసాంత్య ప్రాసాద్య లంకార విశేషములనుఁ బ్రవేశపెట్టఁగా వ్యాసమహర్షి చంద్రుడు మఱియొక శబ్దాలంకారమును తన రచితమైన మహాభారత గ్రంథములో రచించియున్నాడు. మచ్చున కొక్కటి—"శ్లో॥ నదీజలంకేశవనారికేతుర్నగాహ్వయోనామ నగారి సూనుః। ఏషో ఽజ్గనావేషధరః ప్రమాధీ జిత్వా వయం నేష్యతి చాఽద్యగావః॥" అని. దీని యర్థము. (ఈ శ్లోకమునకు బొంబాయిలో నిర్ణయసాగర ప్రెస్సువా రచ్చువేసిన సుభాషితరత్న భాండాగారములో పాట శ్లోకములయం దఱువదినాల్గవది ౬౪ అం దకారాది శ్లోకానుక్రమణికలో నీ శ్లోకము బాలభారతస్య అని వ్రాయఁబడియున్నది. కాని యీ శ్లోకము మహాభారతము విరాటపర్వములో గోగ్రహణ ఘట్టమునం దున్నది.) మహాకవి కాళిదాసు తన విక్రమోర్వశీయ నాటకములో వాల్మీకి రామాయణము ఆరణ్యకాండము

"శ్లో॥ కచ్చిత్ క్షితి భృతాం నాథ దృష్టా సర్వాఙ్గసున్దరీ।
రామా రమ్యే వనోద్దేశే మయా విరహితా త్వయా॥"

అను శ్లోకము నంతయు నట్టులే వేసికొనినట్లు. "నదీజలం కేశవ నారికేతుః" అనెడి పై శ్లోకమునకు సదరు సుభాషితరత్న భాణ్డాగారమునందు అధో నివేదికలో (ఫుట్‌నోట్‌లో) నున్న వ్యాఖ్యాన పంక్తులు. "భో నదీజ — గంగాతనయ భీష్మ, ఏష — దృశ్యమానః, అజ్గనావేషధరః - స్త్రీరూపధారీ, లంకేశ వనారి కేతుః - రావణ వనభంజక హనూమద్ధ్వజః, నగాహ్వయో ఽర్జుననామా నగారిసూను - ఇన్ద్రపుత్రః, భోభో కౌరవాః, అయం ప్రమాధీ - హన్తా, అద్య - వో - యుష్మాన్, జిత్వా, గాశ్చ నేష్యతీ త్యర్థః. ఇత్యాది విధముగ పదములు తోఁచి సమ్యగ్విమర్శను సలుపఁగా పూర్వోక్తమైన, వ్యాసహృదయార్థము గోచరించును. ఇట్టి శ్లోకములు వ్యాసఘట్టము అనంబడును. మహాభారతమునం దిట్టి శ్లోకములు "శ్లో॥ అష్టౌ శ్లోకసహస్రాణి (౮౦౦౦) అష్టౌ శ్లోకశతానిచ (౮౦౦)। అహంవేద్మి శుకోవేత్తి సఞ్జయోవేత్తి వానవా॥" అని ఎనిమిది వేలా ఎనిమిది వందల శ్లోకములు కలవు. వ్యాసఘట్టములని పేరుకల యిట్టి శ్లోకము లన్నియు (ఎనిమిది వేలా ఎనిమిది వందలు) వ్యాఖ్యతోఁ గూడ చిరకాలమునాడు దేవనాగర లిపితో నచ్చైనవి. ముఖ పత్రము (టైటిల్ పేజి) పోయినందున ముద్రణ దేశకాలము తెలియంగరావు. ఇట్టి వాఁటికి కూట శ్లోకము లని పేరు. ఈ ఎనిమిది వేల ఎనిమిది వందల శ్లోకముల యర్థమును రచయితనుకనుక నే నెఱుంగుదును. నా కుమారుఁడు శుకుఁడు (నావద్ద చదివెఁ గావున) నాయనయు నెఱుంగును సంజయుఁ డెఱుంగునో యెఱుంగడో ? అని సందేహముగ నున్నదని నేల నుడివెను. ఇట్టివారు పెక్కుం డున్నారు కదా ? అని సందియము పొడమ "ని. వానవా గణపః ప్రోక్తః" అని వానవా అన గణపతి యని పెద్ద లనెదరు. (వ్యాసఘట్ట శ్లోకములు ౮౮౦౦కు వ్యాఖ్యకల గ్రంథము మహాభారతనిఘంటువు

మాతండ్రిగారు విద్యారణ్యపంచానన విద్యావాచస్పతి (కీ. శే.) శ్రీమాన్ వికాల రామచంద్రాచార్యులవారు స్థాపించిన మా సొంత పుస్తకభాండాగారములో నున్నది.) మహాభారతమును కర్తయగు వ్యాసమహర్షి నుడువుచుండ వినాయకుఁడు వ్రాసెనకదా?

ఇట్టిది అస్మత్కృతమైన చిత్రబంధశ్రీనివాస కావ్యములో నుంచి యొక్క శ్లోకము. "శ్లో॥ కుహరాన్తః నమస్తే ఽస్తు వారిభూధరమేనక। కేశపూజిత మాం త్రాహి నిత్యం భాయనగేనగ॥" దీనికి ముద్రిత వ్యాఖ్యానపంక్తులు— కు ర్భూమిః "ని గోత్రా కుః పృథివీ పృథ్వీ క్ష్మా ఽవని ర్మేదినీ మహీః"॥ అని భూమి పేళ్లలో నమరము. తాం హరతీ తి కుహరంః హిరణ్యాక్షః. తస్యా ఽన్తః మృత్యుః తాదృశః తస్య సమ్బుద్ధిః హే కుహరాన్తః, వారి భూధర। వారిణి జలే భవతి జాయత ఇతి వారిభూః శంఖః కౌస్తుభోవా. తయోర్ధరః వారిభూ ధరః కౌస్తుభధారీ శంఖ ధారీవా తస్య సంబుద్ధిః. హే వారిభూధర। మేనక - మాయాః - లక్ష్మ్యాః, "ని. ఇందిరా లోకమాతా మా రమా మంగళదేవతే"త్యమరకోశః. ఇన ఏవ ఇనకః స్వార్థేకప్. తస్య సమ్బుద్ధిః. హే మేనక। లక్ష్మీపతే. కేశపూజిత. కః - బ్రహ్మ, "ని. కో బ్రహ్మ ఽఽత్మా ఽనిలా ర్కాగ్ని చిత్త ధీ యమ కేకి ష్వితి కోశః." ఈశ-శ్శివః, తాభ్యాం పూజితః తస్య సంబుద్ధిః. హే కేశపూజిత. భా యనగే నగ। భానాం నక్షత్రాణా మయనం మార్గః 'ని. నక్షత్ర మృక్షం భం తారా తారకా ఽప్యుడు వాస్త్రియా' మిత్యమరంః. తారాపథ ఇతి యావత్. ఆకాశః. తత్ర గచ్ఛన్తీ తి భాయనగాః ఖగాః తేషాం ఖగానా మినః ప్రభుః భాయనగేనః గరుడః తేన గచ్ఛతీతి భాయనగేనగః గరుడవాహనః నారాయణః. తస్య సంబుద్ధిః. హే భాయనగేనగ గరుడవాహన నారాయణ తే నమః అస్తు. నిత్యం మాం త్రాహి రక్ష. త్రైజ్ పానే.

(ఇందలి కుహరాన్తాది శబ్దములకు ప్రసిద్ధమైన రంధ్రాద్యర్థములు కాక బాగుగ నాలోచించ యథార్థమైన యర్థము తెలిసి వినోద మగుట విచిత్రము.)

ఇంకను సంస్కృత శ్లోకములలో నొండె తెలుఁగు పద్యములలో నొండె యున్న సున్నను, రెండుసున్నలను, దీర్ఘమును, వ్యంజనము (పైన అకారాది స్వరములతోఁ గూడిన కకారాది స్పర్శములు) లో నేదేని యొక దానినిఁ అనఁగా అనుస్వారమునో, విసర్గములనో, మాత్రనో, వ్యంజనమునో, నేదేని యొక్కదానినిఁ దీసివేసి చదువఁగా శ్లోకమో పద్యమో చెడియో చెడకనో వేరొక యర్థము నిచ్చెడు మఱియొక చిత్రరచన మదుర్జ్ఞమైనది కలదు.

ఈ మూడు రకముల చిత్రకవితలలో నొక్కదాని కుదాహరణము నాచిత్రబంధ శ్రీనివాసకావ్యమునుండి వ్రాసెదను.

శ్లో॥ అగస్సంహననాభూష్ణు రంహో (ఽ) సన్నిధికృ త్సతామ్॥
శ్రీశ్చ శ్రీశశ్చ మాంపాతు ప్రసన్నాత్మా సదామయి॥ ౬౨॥

వ్యా॥ అగస్సంహననా భూష్ణుః (భగవత్పక్షే) అగసాం భక్తవిషయే దుర్జనకృతద్రోషా రూపాపరాధానాం సంహననే సమ్యగ్వినాశనే, అభూష్ణుః అవిద్యమానః (అ-ఉః సర్గః) (లక్ష్మీపక్షేతు) అగస్సంహనన ఇత్యత్ర సకారే బిందులోపః కార్యః, తదా అగస్సహన మితి భవతి. అగసాం భక్తాపరాధానాం సహనే క్షమాయాం. నా భూష్ణుః అభూష్ణు రవిద్యమానో నభవతీ త్యభూష్ణుః, న అభూష్ణుః నా ఽభూష్ణుః, వర్తమానై వేత్యర్థః ద్వౌ నఞౌ ప్రకృత మర్థం గమయతః. భక్తాపరాధసహనే విద్యమానే త్యర్థః సతాం- అంహో (ఽ) సన్నిధికృత్-(భగవత్పక్షే) అంహసాం పాపానాం అసన్నిధికృత్ అసన్నిధానకర్తా దూరీకర్తే త్యర్థః (లక్ష్మీపక్షేతు) అంహో ఇత్యత్ర బిన్దుచ్యుతిః కార్యా. తదా అహో ఇతి భవతి. అహో ఆశ్చర్యం యథా భవతి తథా, సన్నిధికృత్-సాధునిధికారిణీ, తాదృశీ శ్రీః తా దృశ శ్రీశశ్చ. మాం పాతు-రక్షతు.

కేవలము భగవద్విషయార్థకమైన బిందుచ్యుతకచిత్రము—

శ్లో॥ సుందర శ్శుభచక్రశ్చ శివసుత్రామసేవితః। సం
ధృతశ్రీ రురస్థానే పాతుమాం వేంకటేశ్వరః॥

వ్యా॥ సుందరః - కాంతః, బిందుచ్యుతౌ సుదరః - శోభన పాంచజన్యవాన్, శుభచక్రః - శుభకర సుదర్శనాయుధః, శివసుత్రామసేవితః,

ఇట్లే విసర్గ-మాత్రా-వ్యంజనాదుల లోప చిత్రమునందును రెండు రెండు శ్లోకములున్నవి. ఇఁకను మాత్ర అనఁగా దీర్ఘము నుంచి చదువ ననుష్టుప్‌శ్లోకమై శ్రీ వేంకటేశ్వరస్వామివారి స్తుతియు, దీర్ఘమునుఁ దీసి హ్రస్వముగఁ జేసి చదివిన సంస్కృత భాషతో ప్రమాణికా వృతమై శ్రీస్తుతియు నయ్యెడి చిత్రవిశేషము ముద్రితమైన సుమనో వినోదకావ్యమునుండి—

శ్లో॥ సరోజనేత్ర మే శంభో సుధామం దామవిష్ఫురన్।
జహి ద్విషోముదోరంహః ప్రశాంతం హ్యన్నతే హితే॥ ౬౯

వ్యా॥ శంభో-లయకరణాయ మహారుద్రాంతర్గత, జగత్సర్గాదీనాం భగవచ్ఛక్త్యేకసాధ్యత్వాత్. సుధామన్-సుతేజః, దామవిష్ఫురన్-పుష్పమాలోజ్జ్వల, సుధావన్+దామవిష్ఫుర న్నిత్యత్ర ధామశబ్ద పరభూతనకారస్య దకారే పరేసతి బిందువదేవ శ్రుతేః అత్రైవం ప్రయోగః ద్విషః శత్రోః. ముదః-సంతోషస్య, రంహః-వేగం, "ని. రంహస్తరసీతు రయస్స్యదః" ఇత్యమరః

జహి-సంహర, తే-తవ, హృత్-మనః, అహితే-శత్రౌ, నత్రప
కాంతంహి-హి ప్రసిద్ధౌ.

అస్య శ్లోకస్య బిన్దుచ్యుతౌ పాఠః

సరోజనేత్ర మే శ భో సుధామదామ విస్ఫురన్ ।
జహిద్విషో ముదోరహః ప్రశాతహృ న్నతే హితే ॥

వ్యా॥ మే శ-శ్రీపతే, సుధామదామవిస్ఫురన్ - శోభన కుసుమమాలావిద్యోదిత, నతే - నమస్కృతవతి, అహితే - రిపౌ, భక్తాహితేష్విత్యర్థః- జాత్యేకవచనం, అరహః-ప్రకాశే, ప్రశాతహృత్- అతికరకృశమనస్క, భక్తప్రహ్లాద బాధకహిరణ్యకశిపా విప. ద్విష-శ్శత్రూన్, జహి - మారయ,

పయోధికన్యకారామాః భక్తార్తిభఞ్జనక్షమాః। జయాభివృద్ధి సన్ధానాః స్వయోగాసందితాశ్రితా ॥౩॥ అయప్రసన్నఫాలాభాః హయే భాపూర్ణమన్దురాః। జయత్వ మాహరాయాతాః శయాస్వితాత్మ భాసురాః ॥౩॥

వ్యా॥ అయై- శ్శుభావహావిధిభిః. "వి. అయ శ్శుభావహో విధి" రి త్యమరః. ప్రసన్నఫాలాభా - అమాహరాయాతా - అమాయాః- అలక్ష్మ్యః, హరా-నాశయిత్ర్, ఆయాతం-ఆగమనం, స్వార్థేక్తః. యస్యాస్సా. దారిద్ర్య ప్రణాశక స్వాగతా. తాదృశీ, పయోధికన్యకా రమా - శ్రీ, ర్జయత్వతి.

ఇట్లు లక్ష్మీపక్షములో ప్రథమాదిభక్తులుగా నున్నపదములను, దూరాహ్వానప్లుతములుగఁ దలంచ భగవత్పరములుగనన్వయించునా. ఎట్లనిన? 1-3-5-7 సంబోధనపదములమీఁది దీర్ఘములను దీర్ఘములుగఁ గాక హ్రస్వములుగను, 2-4-6-9 పాదములలోని ప్రతి మూఁడవయక్షరముమీఁది దీర్ఘమును హ్రస్వముగను రెండు ప్రమాణికాశ్లోకము లగును.

ఈ రెండు ప్రమాణికలు తెనుఁగున నొక్క పంచచామర వృత్తమగును. అది సంస్కృతాంధ్రమయము. ఇది భగవత్పరమైనది. ఈ యర్థములో - జయ- త్వం- అమాహర-ఆయతా అని సభంగ పదవిభాగము. "జయ" అను సంస్కృత క్రియాపదమైనను తెలుఁగుబాసను వాడఁబడునది. అమాహర-దారిద్ర్యమును హరించునట్టి, ఆయతా- విస్తృతా:, త్వం-నీవు, జయ-సర్వోత్కర్షములతో నొప్పుము. దూరాహ్వానప్లుతాంత సంబోధనపదము లని చెప్పఁబడెనుగదా? తల్లక్షణము-


"శ్లో॥ గీత తర్కానుయోగేషు శోక సంశయభీతిషు। అని క్రియాన్తే ప్లవతే దూరా ద్ధూతే సమ స్స్వరః" అని అర్థము. పాట, అనుమానము, ప్రశ్నము, దుఃఖము, సంశయము, భయము, దూరమున నున్నవానిఁ బిలచుట అను నీయేడుతావుల యందును శబ్దాంతముల యందలి స్వరమంతయు ప్లుత మగునని యర్థము.

నా రెండు శ్లోకములకు క్రియాపదమొక్కటే కనుక యుగ్మ మనంబడును. యుగ్మలక్షణము- "శ్లో॥ ద్వాభ్యాం యుగ్మమితి ప్రోక్తం త్రిభి శ్శ్లోకై ర్విశేషకం। కాలాపకం చతుర్భి స్స్యా త్తదూర్ధ్వం కులకంస్మృతం" రెండుశ్లోకములకొక్కటియే క్రియాపదమున్న యుగ్మము. మూడుశ్లో॥ల కొక్క క్రియాదమున్న విశేషకము. నాలుగుశ్లో॥ల కొక్కటియే యయ్యేనేని కాలాపకము. అంతకు (ఐదుమొదలు) ఎక్కువ శ్లోకముల కొక్కటియే యుండిన నది కులక మనంబడు నని యర్థము.

తలకట్లతోనే యొక చిత్రరచన కలదు. దీనికి ఏకస్వరచిత్రం అని లక్ష్మీసహస్రము. నా వేంకటేశ్వర చిత్రరత్నాకరము ద్వితీయ భాగములో-

క॥ దరధర । భవభయహర । మం ।
దరధర । హరవంద్య । పరమదయ । ఘనతరకం
ధరభరసమ । ఖర శరహత ।
పరబల । స్మరజనక । వరద । పన్నగనగపా॥ ౨౪౩

పుష్పమాలికాబంధః



శ్రీ వేంకటేశ్వర చిత్రరత్నాకరము మూడు భాగములు కలసి బృహద్వేంకటేశ్వర చిత్రరత్నాకర మని చెప్పఁబడును-

చ॥ పరతర భూరమాధవ భవ స్తవపాత్ర సురాసురాసురా
ధరధర మారతాత దమదక్ష దయాకర వీరవారశే
ఖర వరషారవీర్య కనకప్రకటామ్బర క్రూరమారణా
దరధర సారసాక్ష దరదష్టదయాద్రవ సేవకావనా॥

పెదవులు కదలకను, త్రాకకునుఁ బలికెడువర్ణములతోఁ జేసెడు రచన నిరోష్ఠ్యమనఁబడును.

క॥ అరిదరకర ! కరిదరహర !
హరసన్నుతచరణ నళిన ! అహిదరశరణా !
అరి దరకర ! కరి దరహర !
హర ధరణీధర యశస్క ! అహిధరశరణా॥ ౨౪౪

ఇట్లే నాలుకయొక్క కదలిక లేని వర్ణములతోఁ జెప్పిన అచలజిహ్వ మనెడు రచనయు కలదు.

ఒక ఓష్ఠ్యవర్ణము, (హల్లులలో ప-ఫ-బ-భ-మ-వ అనునవియు, అచ్చులలో ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఒ, ఓ, ఔ, అనునవియు, వీఁటితోఁగూడిన కు-పు- మొదలయిన వర్ణములును,) దానిప్రక్కనే యొక నిరోష్ఠ్యవర్ణము (పూర్వోక్తములైన హల్లులు, పూర్వోక్తములైన అచ్చులు వీఁటితోఁగూడిన హల్లులును.) ఈ రచనపేరు ఓష్ఠ్య నిరోష్ఠ్య సంకరము. నా శ్రీ వేంకటేశ్వర చిత్ర రత్నాకరము రెండవభాగములో

ఆ॥ వేదవేద్య ! ధూతధీశమోహావేశ !
శూరవీరలోకసూర ! శౌరి !
వాసవాదివంద్య పాదపంకరుహాఢ్య !
భాసమాన ! దుగ్ధవార్ధివాస ! ॥

(ఇది చేరకనే గ్రంథ మచ్చైనది.)

భాషాభాసచిత్రము— ఇతర భాషా పదములుగఁ దోఁచి యాలోచించఁగా ప్రకృతభాషాపదములు వాఁటి యర్థములు తెలియులాఁగున నుండునది.

నాచిత్రబంధ శ్రీనివాసకావ్యము సుమనోవినోదకావ్యముల నుండి

శ్లో॥ ధ్యానైకలక్షరూపాయ శ్రీకోటి వరహారిణే ।
అసంఖ్య సవరక్షాయ మహాలక్ష్మీపతే నమః ॥

టీక॥ ధ్యానింపఁ దా నొక్కఁడే గుఱియైన (రూపము కలవాఁడు,) కోటిధనముసేయు (గొప్పవెలగలఁ శ్రేష్ఠములైన రతనాల దండలుకలవాఁడు, లెక్కలేనన్ని యజ్ఞములను పాలించినవాఁడు, మహాలక్ష్మి కలవాఁడైన శ్రీవేంకటేశ్వరుని కొరకు నమస్కారము అని యర్థము.

ఇందు లక్షరూపాయ కోటివరహా లెక్కింప శక్యముగాని సవర యనునవి తెనుఁగుపదములుగఁ దోఁచునే కాని తెలుఁగు పదములు కావు.

ఇట్టులే అశ్లీలాభాసము భోజ్యాసవ్యాభాసము మున్నుగాఁ గలవియు నారచనలలోను నాచార్య రచించిన శ్రీవేంకటేశ్వర చిత్రరత్నావళిలోనుఁ గాంచఁ దగును.

అశ్లీలాభాసమునకు నా చిత్రబంధ శ్రీనివాసమునుండి.—

ఆ॥ వె॥ లంజ రాగరసికుం జవరాల్ చేరి
ముద్దులాడి హార్దముగ్ధకేళి
శాలలోన బయల చంద్రకాంతులఁ గామ
విహృతి నెలుపు పెద్ద వేంకటపతి॥

టీక॥ వేంకటపతి - వేంకటేశ్వరుఁడు, సరస-ప్రేమచేత రసికురాలైన, లంజ-జారిణి, రాగ-రాఁగా, కుంజవరాల్-మంచి వొదరిండ్లను, చేరి- , ముద్దులాడి-ముద్దులుపెట్టుకొని, హార్ద.... శాలలోన = హార్ద-స్నేహముగలిగి, ముగ్ధ-సుందరములైన, కేళిశాలలోనన్-రతిగృహమునందును, బయలన్-వెలుపల, చంద్రకాంతులన్-వెన్నెలలయందును, కామవిహృతిన్-రతికేళిని, నెలుపు పెద్ద. అని తటాలున దోఁచు నర్థము. ఇక నంతరర్థము.

టీ॥ జవరాల్ - యువతియై, ముద్దులాడి-ముద్దుఁ గొలుపెడిదియైన, ర-ల యో రభేదః. రంజయతీతి రంజా (లంజ-లక్ష్మియు, జారిణియను నర్థములు చూ. పరవస్తు శ్రీనివాసాచార్యులవారి సర్వశబ్ద సంబోధిని.) రాగ-హార్ద .. శాలలోనన్- హార్ద-హృదయము లనెడు, ముగ్ధ-అందములైన, కేళిశాలలోనన్- విహారగృహము నందును, బయలన్- వెలుపలను, చంద్రకాంతులన్- ఆహ్లాదకర కాంతులతో, కామవిహృతిన్- స్వైరవిహారమును, నలుపు పెద్ద- "అన్తర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్స్థితః" అను శ్రుతి ననుసరించి చెప్పినది.

ఇట్లే పెక్కురకము లున్నవి. ఒకటి-రెండు-మూడు- అక్షరములతోను చేసెడి యమకములు కలవు. ఒక్కయక్షరము- సంధిలో నొక్కయక్షర మగులాఁగున మారుట. నా శ్రీవేంకటేశ్వర చిత్రరత్నాకరమునుంచి --

క॥ నిన్ను నిను నెన్న నీ నే
నెన్నిన నన్నన్న నన న నినసా నేనా ।
ని న్నూనినా ననూను
న్న న్నూ నన్నాను నే ననా నున్నానా ॥

టీ॥ అనిన- (నీకుఁ బైన) ప్రభువులు లేనివాఁడా!, నానా+ఇన-సర్వమునకీశ్వరుఁడవైనవాఁడా!, ఇనున్-సర్వేశ్వరుఁడవైన, నిన్నున్, ఎన్నన్-నుతించుటకొఱకు, ఈ నేను, ఎన్నినన్-ఆలోచించినచో, ననను-చిగురును. చిగురువలె అల్పుఁడ నని యర్థము. ఈ ప్రకారము స్వరములైనను, హల్లులైనను సంధిలో రచన కెన్నుకొనిన ఏకాక్షరము లగు విధమునఁ గూర్చిన నేకాక్షర చిత్రము. ఇట్లే రెం డక్షరములు, మూ డక్షరములయు చిత్రరచన లున్నవి. సంస్కృతములో ఏకాక్షరమ్- నాసుమనోవినోదము నుంచి ఒక్క ఉదాహరణము-

శ్లో॥ నానాననేన నో ఽనూనం నూనం నున్నం ననానునా।
నను నైనో ఽనోను న్నానే నేనాఽ నేనా ఽనునున్ననః॥"

వ్యాఖ్యానము నా చిత్రబంధ శ్రీనివాసము సుమనోవినోదముల యందుఁ చదువఁదగును.

ఒక్కరకమైన రెండురెండు వర్ణములు ప్రక్క ప్రక్కనే వచ్చునట్లు కూర్చినకూర్పు సజాతీయవర్ణ నిరంతరయమకము. నా సుమనోవినోద కావ్యము.

శ్లో॥ హే హేమ మహో ఽహో లల మే మేశ శయేఽయే
నానానన నో ఽనోదద శాశా తతభాభా
హహానననగాగా ఽవవశే శేహహ రేఽరే
రారాభభరారా సిసితాతా రర భోభో ॥ ౩౭

పదచ్ఛే॥ హే- హేమమహః- అహో- లల. మే- మేశ- శయే- అయే- నానానన- నః- అనోద- దశాశాతతభాభా- హహ ననగాగ-అవ-వశేశ. ఇహ- హరే- అరే- ఆరాభభరారాసిసితాతారర- భో భో. — వ్యా॥ అయే మేశ- హే శ్రీపతేః, మే- శయే- హృదయే, అనోద = శకటాసురభంజక, దశసు ఆశాసు-దిక్షు, అతత- వ్యాప్య వర్తమాన, భాయాః భూమేః, భా- అలంకారః, తథాభూతే, ఏ-అంఘ్రీ, ఇదం అం ఇతి నపుంసక లింగైకాక్షర శబ్దస్య ద్వివచరూపం. యస్యసః భా భా- తస్య సంబుద్ధిః భా-భా +అ ఇతి సంధిః భరారా సిసితాతార=అత్రపదాని. భర- అర- సిత- ఆతార- ర., భరః-అతిశయః, అరే ష్వంచ లేషు (చక్రాంచలేషు) యస్య సః భరారః, దండపాణ్యాదివ ద్వ్యధికరణ బహువ్రీహిః. అతిశయ సమృద్ధాంచల ఇతి యావత్. తాదృశేన అసినా, సితాః. అవసితాః, అతారాః- సర్వత్ర అధికాః రాః విరసాః శత్రవః యేననః భరారాసిసితా రరః.


పద పదార్థానులోమ ప్రతిలోమం- (పదము లన్నియును అర్థమును అనులోమ విలోమమునఁగల చిత్రము)

"శ్లో॥ మే శ- మే- లల- హే- గే హే- భద్రాభ-తత- భానుభా
మాస మాఽఽహహ యేనా ఽయే- యాశ- యా- న-
న- సాధు- సా ॥ ౪౩

ఉదా:- మేశమే.... ఇత్యాది. ఈ శ్లోకము కడనుండి చదివినను ఆ పదములే ఆ యర్థమే వచ్చును.

అనులోమ విలోమమున్ను యమకభేద మని సంప్రదాయము.

అనులోమ విలోమ మణిమాలికాబంధః



అనులోమపాఠే శ్రీరామవర్ణనం, ప్రతిలోమపాఠే శ్రీకృష్ణ వర్ణనంచ ప్రతిపాదయ దనులోమ విలోమచిత్రమ్.

శ్లో॥ 1రాజాధారా 2సారాకారా 3క్ష్మాజాతాఢ్యా 4లాజ్జేక్ర-ద్రిసా
5రామాఖ్యాభి 6స్వాలాపా 7ద్యో 8పాస్తా 9దుష్టా 10కృత్తారాతీ

టీ॥ 1 రాజాధారా - రాజుల కాధారమైనది. "శ్లో॥ రాజవంశా న్శతగుణాన్ స్థాపయామాస రాఘవః" అని రామాయణము. 3 క్ష్మాజాతాఢ్యా - సీతతోఁ గూడినవాఁడు. 4 లాజ్జేక్ర-ద్రిసా-లాజక్ర- (లంకైప లాంకా అని సమాసము స్వార్థిక కః) లాజ్జేద్రి- రావణుని, అస-ఎగురఁగొట్టినవాఁడు, ఉప-అస్తాత్_అగుఁగాఁత. అసు క్షేపణే లోట్. అభిస్వాలాపా-సుందరభాషణము కలవాడు. (అభి-స్వ- ఉపసర్గములు.) "శ్లో॥ స్మితపూర్వాభి భాషీచ పూర్వభాషీచ రాఘవః" అనియు రామాయణము.

అథ ప్రతిలోమపాఠ శ్రీకృష్ణపరః-

శ్లో॥ 1తీరాత్తా 2కృష్టా 3(ఽ)దుస్తాపా 4ద్యోపాలా 5స్వాభిఖ్యామారా
6సా ద్రిజ్జేక్ర-లాఢ్యా 7తాజాక్ష్మా 8రాకారాసా 9రాధాజారా"

టీ॥ 1తీర–మాహాత్మ్యమును, అత్తా–పొందినది, 3అదుస్తాపా= దుష్టతాపములు లేనిది, 5స్వాభిఖ్యామారా=స్వ - ధనమును, అభిఖ్యా-కాన్తిని, మా–శ్రీని, రా–పొందినది, 6సాంద్ర–చిక్కనిది యైన, అఙ్క–భుజాంతరమున, ఇలా–ఇల యను కన్యతోఁగూడి నది, 7తా–దయ యనెడు, జా–గంగకు–క్ష్మా–భూమియైన, ఉత్కృష్టా–కృష్ణుఁడు, అను దేవత (జయతు - జయించుఁగాత. ఇది అధ్యాహార్యము.)

అర్థశ్లోకప్రతిలోమము, అర్థ పాదానులోమప్రతిలోమము, పాదానులోమప్రతిలోమము మొదలగునవియుఁ గలవు. అన్నిఁటినిఁ లక్ష్మీసహస్ర, పాదుకాసహస్రాది ప్రాచీన కావ్యములయందును, నా చిత్రబంధ శ్రీనివాసకావ్యమునందునుఁ దెలుపఁబడియున్నవి.

పాదానులోమ ప్రతిలోమము. ఏ పాదమున కాపాదము చివరనుండి చదివినను అర్థము వచ్చుచు మఱొక పాదమేర్పడును. ఇదియే మొదటిపాదమును చివరనుంచి చదివినచో రెండవపాదము, మూడవ పాదమును కడనుండి చదువ నాలుగవ పాదమయ్యెడి చిత్రము. ఎట్లన ? శ్లో॥ రాధయా సరసాలాపా పాలా సారసయా ధరా। సా గతాహి రవిన్దేవం వన్దేవిరహితా గసా॥ నా చిత్రబంధ శ్రీనివాసము.

అపశబ్దాభాసము–శబ్దాలుగ తప్పుగఁ దోఁచి ఆలోచించ నసలైన యర్థము తెలిసి శబ్దసాధుత్వము తెలియు చిత్రము. నా చిత్రబంధ శ్రీనివాస కావ్యమునుంచి–

శ్లో॥ 1తిలేన కమలా దేవ్యాః 2పరా ఽ 3దీనోఽసి సర్వదా ।
భక్తాంశ్చ కురుషే త్వద్వ ద్విచిత్రం వేంకటేశ్వర ॥

టీ॥ పర–పరమాత్మా, కమలాదేవ్యాః– శ్రీదేవి యొక్క, 1లీలేన=లీలా–విలాసములకు, ఇన–నాయకా, (అందుచేతనే) అదీనోఽసి–బీదవాఁడవు కావు. (ఉత్తరార్థపు అర్థము సులభము) లీలయా–అని స్త్రీలింగ తృతీయైకవచనము. అట్లు ప్రయోగించఁ దగియుండ లీలేన అని ప్రయోగించుట తప్పు అని చివాలున తోఁచుటఁ బట్టి ఇట్టిది అపశబ్దాభాసము అని చెప్పఁబడును.

క్రియాపదము మున్నుఁగా గలవి తెలియరానివగిది కూర్చుట క్రియాగుప్తి మున్నగు పేళ్ళఁ జెప్పఁబడును. ఉదాహరణార్థము నా చిత్రబంధ శ్రీనివాసములో నుంచి యొక్క శ్లోకమును వ్రాసెదను.

శ్లో॥ ఘనప్రభా (ఽ) వాఽఽఢ్య లక్ష్మ్యామామేతం శరణాగతం ।
అనన్యగతికం భీత మనస్త క్లేశసన్తతేః... ॥

పదచ్ఛే॥ ఘనప్రభ–అవ–అఢ్య–లక్ష్మ్యా అని పదచ్ఛేదము. టీక॥ ఘనప్రభ–మేఘశ్యామా!, లక్ష్మ్యా–శ్రీచేత, అఢ్య–సంపన్నా! మాం–నన్ను, అవ–కాపాఁడుమా.

ఇందు అవ (కాఁచుము) అను క్రియాపదము ఘనప్రభావ అని ఒక్క పదముగఁ దోఁచి క్రియాపద మున్నసంగతి తెలియ శక్యము కానియట్లు కూర్పఁబడెను కాన క్రియాగుప్తి. ఇట్లే కర్తృగుప్తి, కర్మగుప్తి, కర్తృ కర్మ క్రియాగుప్తి మొదలగునవి యునుఁ గలవు.

పెదవులు రెండును త్రాకించి పలుకెడు వర్ణములులేని రచన నిరోష్ఠ్యము. అవి త్రాఁకెడు లేఁక కదలెడు వర్ణములు పద్య మంతయుఁ గలది సర్వోష్ఠ్యము. ముం దొక ఓష్ఠ్యవర్ణము (అచ్చులలో) ఉ–ఊ–ఋ–ౠ–ఌ–ౡ–ఒ–ఓ–ఔ–లున్ను వీఁటితోఁ గూడిన హల్లులున్ను) దాని పిమ్మటనే ఓష్ఠ్యముకాని వర్ణ మొకటియుఁ గూర్చుట ఓష్ఠ్యనిరోష్ఠ్య సంకరము. నాలుక కదలెడు వర్ణములు పద్యమంతయుఁ గలది చలజిహ్వము, నాలుక కదలని వర్ణములు కలది అచల జిహ్వము. సప్తవిభక్తులు పెట్టి చేసినది సార్వవిభక్తికము మొదలయిన పలు చిత్రరచన లున్నవి.

అన్నియు నా రచించిన చిత్రబంధ శ్రీనివాసము సుమనో వినోద కావ్యములందుఁ జూడఁదగును. మఱియు పాదగోపనాదులు చిత్రములే. మొదట వచ్చిన యక్షరమును రెండవమాఱు ఇట్లు పెక్కు సారులు మఱల మఱలా రానీకఁ జెప్పిన నది యపునరుక్తాక్షర మనఁబడును. శబ్దనానార్థోపయోగము–ప్రసిద్ధ నిఘంటువులలోనియు, వ్యుత్పత్తినిఁబట్టియు శబ్దముయొక్క అర్థములన్నియు గలుగులాగున పచించుట. నా చిత్రబంధ శ్రీనివాసకావ్యములోనిది. శబ్దనానార్థోపయోగః - "శ్లో॥ హరిర్మిత్రం, హరిస్తల్పం, హరిః ప్రాణో, హరిః ప్రియః। హరిశ్చేలం, హరీనేత్రే హరిస్త్వంచాఽస్యహో హరే॥" వ్యా॥ హేహరే, తవ హరిః కపిః సుగ్రీవః, మిత్రం సుహృత్, హరిః సర్పః శేషః తల్పం, హరి ర్వాయుః ప్రాణః "శ్లో॥ భూః పాదౌ యస్యనాభి ర్వియ దసు దనిల" ఇతి శాస్త్రాత్. హరి రిన్ద్రః ప్రియః ఇష్టః, చేలం వస్త్రం, హరిః కపిల వర్ణః కనకవర్ణః భగవతః పీతాంబరత్వాత్ హరీ - (ద్వివచనం) ద్వంద్వైకవద్భావః హరిశ్చ హరిశ్చ హరీ–సూర్యచంద్రౌ, నేత్రే. అహో విచిత్రం. త్వంచ హరి రసి. "ని. యమా నిలేన్ద్ర చన్ద్రార్క విష్ణు సింహాం శు వాజిషు। శుకా హి కపి భేకేషు హరి ర్నా కపిలే త్రిషు॥" ఇత్యమరః.

పూర్వార్థములో నొండె, ఉత్తరార్థములో నొండె అక్షరములు – తలకట్టు – దీర్ఘము – గుడి – మున్నగు

నవి వరుసగ వచ్చునట్లు చెప్పుట వర్ణ-స్వరక్రమ చిత్రమను పేరు కలది. నా చిత్రబంధ శ్రీనివాసము సుమనోవినోదము.

శ్లో॥ బభౌ మయా ఽరం లవశష్పా సహ త్రాతవా ఽఘిషు ।
న మామి శ్రీట్క-భూభృల్లు ద్దైప్తె స్తోత్రౌఘం పదమ్॥

ఇందు తొలి రెండు పాదములలో వరుసగ బ-భ-మ-య-ర-ల-వ-శ-ష-స-హ అను హల్లులు, తతిమ్మా రెండు గీట్లలో తలకట్టు ✓, దీర్ఘము ా, గుడి ి, గుడి దీర్ఘము ీ, కొమ్ము ు, కొమ్ము దీర్ఘము ూ, వట్రసుడి ృ, ౠ ఏత్తు, ఏత్వము ె, ఐత్వము ై, ఓత్వము ో, ఔత్వము ౌ, ం, ఇవియు వరుసగా నుండు చిత్రము. ఈ చివరవి రెండు చిత్రరచనలు (మఱికొన్నియు) మొదట నేనే కనిపెట్టి రచించినవి.

తెనుఁగులో తెనాలిరామకృష్ణ రచితముగా చెప్పఁబడెను

మ॥ గన నీహారగురామపద్మ ధళరంగత్కీర్తి ! చాణూరమ
ర్ధన శుక్రాక్షి కళేభరా ణ్మృగపతీ! త్రైలోక్యధామోదరా !
యనఘా శంఖ రవాంచితార్థద ! గదా ద్యస్త్రైకపాణీ! జనా
ర్ధనవానేకప వైరి విగ్రహా ! ముకుందా! మిత్రవిందా ధిపా !॥

ఇది యట్టిదే. టీ॥ గ - న. గ - గంధర్వులచేత "ని. శ్లో॥ గో గంధర్వగణేశయోః" నానార్థరత్నమాల. న-ప్రస్తుతుఁడా !, "ని. శ్లో॥ నః పుమా న్సుగతే బన్ధే ద్వీరండే ప్రస్తుతేఽపిచ...." మేదిని. నీహారగు - చంద్రునిమాదిరి, రామ-తెల్లనిదైన, పద్మ-కమలములవలె, ధళ- తళుక్కు మని, రంగత్-ప్రసరింపుచున్న, కీర్తి-యశస్సుకలవాఁడా !, చాణూరమత్-చాణూరుఁడు కల కంసుని, హన- చంపినవాఁడా!, శుక్ర-శుక్రగ్రహము యొక్క, అక్షికళ- నయన సౌందర్యమనెడు, ఇభరాట్- గజేంద్రునకు, మృగపతీ- సింహమా ! (శుక్రుని కన్నుఁ బొడిచినవాఁడా అని యర్థము.) త్రైలోక్య- ముల్లోకములకు, ధామ- స్థానమైన, ఉదరా- కడుపుగలవాఁడా!, శంఖ- సంకువుయొక్క, రవ-ధ్వనితో, అంచిత- కూడిన అర్థ ద- వరముల నిచ్చువాఁడా !, గదాద్యస్త్రైకపాణీ!, జనార్ధ- మానవులయొక్క సగము, నవ-క్రొత్తదియైన, అనేకప- ఏనుఁగులయొక్క, వైరి- పగదియైన సింగముయొక్క విగ్రహ- దేహముకలవాఁడా నరసింహా ! యని యర్థము. ముకుంద- మోక్షమునుఁ దాల్చియుండువాఁడా !. మిత్రవిందాధిపా- కృష్ణా !,

ఘన- పద్మదళ- చాణూరమర్దన- కళేబర- దామోదర- అనఘా- శంకర- వాంచితార్థద- జనార్దన శబ్దములు పద్యములో గన మున్నగువిధమునఁ దప్పులుగఁ బ్రియుక్తములని తోఁచుట యిందలి అపశబ్దాభాస చమత్కారము.


చ్యుతక చిత్రములలో చ్యుతక దత్తాక్షర మని యొక చిత్రకవిత కలదు. దాని లక్షణము ధర్మసూరి రచితమైన విదగ్ధ ముఖమండన గ్రంధములో చెప్పఁబడినది. అది — "శ్లో॥ స్ఫోట యిత్వా ఽక్షరం కించి త్పునరన్యస్య దానతః। యత్రా ఽపరో భవే దర్థ శ్చ్యుతదత్తాక్షరం హి తత్" అని. శ్లోకములో (తెనుఁగున నయ్యేనేని) పద్యములో నొక తావున నొక్క యక్షరమును తొలగించి వే రొక్కయక్కరమునుఁ బెట్టినచో వేరేయర్థము అగులాఁగున రచియించుట అందు దీని కుదాహరణముగ రెండనుష్టుప్ శ్లోకములు కలవు. కాని మఱియొక పూర్వకవికృత శ్లోకములో తొలగించిన యక్షరమునకు బదులుగఁ బెట్టవలసిన యక్షరమునుఁ దెలిపినది కలదు. విదగ్ధముఖమండనోదాహృత శ్లోకముల వెంటను నీ వసతి లేదు.

చ్యుతకదత్తాక్షర చిత్రము.

"శ్లో॥ కల్యాణాగ్రోత్తమాంగః కరజితవసుధ స్సర్వదా పూర్ణకామః
విఖ్యాతః కర్ణవృత్త్యావచసి నహి కటు శ్చిత్రపాకానుసేవీ।
కోశాపేక్షీ పరస్మా ద్విదిత బహుకథ స్తత్పరః పుణ్యలోకే
చిత్రం రాజాధిరాజ త్వమివ తవరిపు స్తత్ర కం-సం-ప్రతీమః

ఒక కవి నుడివిన చాటుశ్లోకము.

షోడశదళపద్మబంధః



రామ కామసమ శ్యామ శ్రీమ స్థిమ స్థమక్రమ
క్షేమనామ న్వామభీమ భూమధామ న్నమ న్సమ ॥

రాజు కల్యాణార్ద్రోత్తమాంగుఁడు, ఇందులో కం - పం- ప్రతీమః. అనుతావున కం - పం - అని వేరువేరుగ చేయవలెను. ఆ శ్లోకార్థ రాజస్తుతిలో కకారముతోనే చదివి రాజశత్రువు యర్థములో కకారమునుఁ దీసివేసి దానికి బదులు పకారమునుగఁ జదివిన రాజశత్రువు యొక్క అనుభూతి యర్థమగును. కాఁగా రాజు కల్యాణార్ద్రోత్తమాంగుఁడు. కవిపల్యాణ (గుబ్బపుజీను)కర్ద్రోత్త మాంగుఁడు. రాజు కరజితవసుధుఁడు, రాజశత్రువు. పరజితవసుధుఁడు. రాజు యెల్లకాలము పూర్ణకాముఁడు. నీ శత్రువు పూర్ణపాముఁడు (నిండిన తీఁట కలవాఁడు) రాజు కర్ణుని వృత్తితో దానములతో ప్రసిద్ధుఁడు. నీశత్రువు అఁకులు అలముతినుటతోఁ బ్రఖ్యాతుఁడు. రాజు మాటలలో కటుకుఁదనములేనివాఁడు. నీశత్రువు మాటలలో పటుత్వము లేనివాఁడు. రాజు చిత్రములైన వంటకములనుఁ దినువాఁడు. నీశత్రువు విచిత్రములైన పాపములను చేయువాఁడు. రాజు. ఒరునివలన ధనాగారమునుఁ గోయువాడు, నీశత్రువు ఒరునివలన పోషణమునుఁ గాంక్షించువాఁడు. (శ - సయోరభేదః) రాజు పలుకథ లెఱింగినవాఁడు, నీశత్రువు పలుతోవలఁ దెలిసిన వాఁడు, పుణ్యలోకమునందాసక్తుఁడు. పుణ్యలోపమున నాసక్తుఁడు. రాజరాజా! నీశత్రువు నీవంటివాఁడు. ఐతే నీయందు కకారమును, నీశత్రువునందు పకారమునుఁ దెలుసుకొనుచున్నాము.

మఱియొక చిత్రము —

శ్లో॥ సమరే హేమరేఖాంకం బాణం ముంచతి రాఘవే ।
స రావణో ౭పి ముముచే మధ్యే రీతిధరం శరమ్ ॥

తా॥ రాముఁడు రణమునందు హేమరేఖాంకితమైన బాణమును విడువఁగా నా రావణాసురుఁడును నడుమను విత్తదివిఁ దాల్చిన రీ యను వర్ణమునుఁ దాల్చిన శరమును అనఁగా శరీరమును విడచెనని యర్థము. ఇందులో "మధ్యే రీతి ధరం" అనఁగా నడుమను రీ ఇతి రీ తి అని పదములు. రీ యను నక్షరమునుఁ దాల్చిన శరమనని యసహైన యర్థము. కాఁగా శరీరము నని యర్థము. అనఁగా రాముఁడు బాణము నేయ రావణుఁడు చచ్చెనని యర్థము. ఇందులో నర్థము చేసుకొనవలసిన తీరుకూడా చెప్పఁబడి నది. ఈ శ్లోకము బొంబాయిలో నిర్ణయసాగర ప్రెస్సువారచ్చు వేసిన సుభాషిత రత్నభాండాగారమున కూటశ్లోకములలో నొకటి.

ఇటులఁగాఁక శ్లోకములో లేక పద్యములో ముందుఁగాని వెనుకఁగాని కొన్ని కొన్ని యక్షరములను విడువ వేరొక పద్యమో శ్లోకమో యగును. దీనినే తెనుఁగు బాసను గర్భకవిత్వ మనియు, సంస్కృతమున నక్షరచ్యుతక మనియు ననెదరు. ఈ రెండు పేళ్లీ రకపు కవితకుఁ దగినవి. ఆ శ్లోకము ఘూర్జర దేశీయుఁడనియు, 19 వ శతాబ్దియందు తెనుఁగువాఁడనియు విమర్శకులచేత నిర్ణీతుడైన కవికాల హేమచంద్రాచార్యుని కావ్యానుశాసనమునందు

వర్ణచ్యుతం యథా....

"శ్లో॥ సిత నృశిరః ప్రజారచితమౌళి శిరోమణి మౌక్తికైః స్తథా
శిఖరుచిరోర్ధ్వదృ క్పృథులలాటతటే తిలక క్రియాచ సా
స్ఫుట వికటాట్టహాస లలితం వదనం స్మితపేశలం చ తత్
అభినవ మీశ్వరో వహతి వేష మహో? తుహినాద్రిజార్ధయుక్॥"

(అత్ర గౌరీశ్వరవర్ణనే సిద్ధచ్ఛందసి ప్రతిపాదిత మాద్యాక్షర ద్వయపాతే అంత్యాక్షరసప్తకచ్యుతౌ చ ఈశ్వరరూప వర్ణనమేవ. ప్రమితాక్షరావృత్తేన. యదివా ఆద్యాక్షరసప్తకచ్యుతౌ అంత్యాక్షర ద్వయపాతేచ గౌరీ వర్ణనం ద్రుతవిలంబిత వృత్తేన.)

పై శ్లోకమున గర్భితములగు ప్రమితాక్షరా వృత్తమును (ఈశ్వరవర్ణనము), ద్రుతవిలంబిత వృత్తము (గౌరీవర్ణనము) ఈ క్రింద నుల్లేఖింపఁ బడుచున్నవి.

ఈశ్వరరూపవర్ణనము ప్రమితాక్షరావృత్తము.

శ్లో॥ నృశిరః ప్రజా రచితమౌళి శిరో
రుచిరోర్ధ్వదృ క్పృథులలాటతటే
వికటాట్టహాసలలితం వదనం
నవ మీశ్వరో వహతి రూప మహో?

గౌరీవర్ణనము ద్రుతవిలంబితమ్.

రచితమౌళి శిరోమణి మౌక్తికైః
పృథులలాటతటే తిలకక్రియా
సలలితం వదనం స్మితపేశలం
వహతివేష మహో? తుహినాద్రిజా॥

(మూల పద్యము సంస్కృతములో నతి విరళముగ బ్రయుక్తమైన చంపకమాల. ఈ వృత్తమునుఁగూర్చి మత్తేభ - చంపకో - త్పలమాలలు సంస్కృతభాషలో లేవు అని వ్రాసిన శ్రీ నిడుదవోలు వెంకటరావుగారి వ్యాసమునకు సమాధానముగ ఆ వృత్తములు సంస్కృతములోని వనియు, వాటిప్రయోగములను,

లక్షణ,వ్యాఖ్యానో దాహరణములను దెలుపుచు నారచించిన వ్యాసము తే 1975 ఏప్రిల్ నెల "భారతి" సంచికయందు (జేదువ(దగును.) మరియొకటి— నా శ్రీ వేంకటేశ్వర చిత్రరత్నాకరము రెండవ భాగములో నుత్సాహవృత్త గర్భతురుగవల్గనరగడ—

"దేవదేవ తత్త్వ మెన్న దిక్కుమాకు నీవెకా"దె।
కావు మయ్య కేలుమోడ్చు(గాంచి మించి ప్రీతి చే"సి।
భావుకమ్ము లిచ్చి మాప్రపత్తి మెచ్చి లెస్సగా"ను।
[1]భావజాయుతోపమాన భవ్య దివ్యశోభనా"గ్గ॥ ౧౬౬॥

[1]పదివేలమంది మదనులు ఉపమానముగా(గల శుభ దివ్య
ఱ సుందరాంగా"

ఇందు ప్రతిపాదములో "" నిట్టి గుర్తులవరకు-పద్యపాదము మొదలు కడవ యొక్క యక్షరమును విడచి పాదము నంతయు(జదువ నుత్సాహవృత్తమగును. నా శ్రీ వేంకటేశ్వర చిత్రరత్నాకరములో తొలిది గర్భకవిత్వప్రకరణ మంతయు సంస్కృత శ్రీస్తుతిశ్లోకగర్భ శ్రీనివాస స్తవము" అందు నానా విధములైన గర్భకవిత్వ చిత్రములు చూడ(దగినవి. ఇందు పెద్ద తెనుగు పద్యము వేంకటేశ్వరుని పరము. పద్యగర్భస్థ సంస్కృత శ్లోకము లక్ష్మీ పరము. ఇట్లిందు దంపతు లిరువురు ఇరు బాసలతోను స్తుతింప(బడిరి.

ఒకొక్కొక్క శాస్త్రములో నసదృశ వైదుషీ ప్రతిభలు గల కవి వరులు తమకు(బరిచితము లయిన శాస్త్రములలోని పరిభాషా పదములను తగిన పాత్రములుగ (వ్యక్తులుగ)(గల్పించి రచించిన రచనలు గలవు.

వాటిలో విషయచమత్కృతియ కాని కవితాచమత్కృతి లేదు. కావ వాటి విషయము నిట వ్రాయ(బనిలేదు. అట్టి గ్రంధములలో మొదట పీఠికలుగ చేర్చ(దగులాగున నారచియించిన "శాస్త్రశారదయొక్క సాహిత్యాది భూమికలు" అను విరివియైన గ్రంథమును విరచించి తద్విషయము నందు వివరించి యున్నాను. ఒక్క ఉదాహరణము(జూడుడు. "శ్లో॥ ద్వంద్వో ఒస్మి ద్విగు రస్మిచ మద్గేహే నిత్య మవ్యయీభావః। తత్పురుష కర్మధారయ యేనా ఒహం స్యాం బహువ్రీహిః"॥ ఈ శ్లోక మొకవ్యాకరణ విద్వాంసుడు రచించినది కావున నిందు వ్యాకరణశాస్త్ర ప్రతిపాదితములైన సమాసముల పేళ్లతో విషయ చమత్కృతి గుంభిత మైనది.


ఇక నొకయర్థములో నొకభాషయు మఱియొక యర్థములో మఱియొక భాషయు నయ్యెడి చిత్రమున్ను కలదు. జయదేవ విరచితమైన ప్రసన్నరాఘవ నాటకములో రెండుతావుల నా శ్లోకములు రెండు కలవు. అవి వరుసగ సమ సంస్కృత ప్రాకృతము అనియు, (పదచ్ఛేదభేదముచేత ఒక్కటే యర్థముకల సంస్కృత భాష, ఆయర్థమేకల ప్రాకృతభాషయు నయ్యెడు చిత్రము) భిన్న సంస్కృత ప్రాకృత మనియు, (పదచ్ఛేద విశేషముచేత వేరు వేరు అర్థములు కల సంస్కృతము ప్రాకృతము నయ్యెడు చిత్రము) ఇవి మద్రాస్‌లో శ్రీరంగవిలాస ముద్రణాలయ ముద్రిత గ్రంథములో ప్రాకృతమునకు చ్ఛాయతోడను ఉభయభాషలకు వ్యాఖ్యలతోడను నున్నవి. కాని బొంబాయి నిర్ణయసాగర ప్రెస్ ముద్రిత గ్రంథములో కానరాకుండుట చోద్యము. మాదిరి కొరకు పూర్వ శ్లోకమును వ్రాసెదను.

ఆంధ్ర గీర్వాణ శ్లోకము

"శ్లో॥ కస్మై దత్తే హరి ర్మోక్షం కి మాంధ్రాణా మతిప్రియం
ఆంధ్ర గీర్వాణభాషాభ్యా మేకమేవో త్తరం వద॥"

తా॥ మహావిష్ణువు వెవనికి మోక్ష మిచ్చును?. తెనుగు వారికి ఒక్కలి ప్రియమైనవస్తు వెయ్యది? ఈ రెండుప్రశ్నములకు సంస్కృతాంధ్రములతో నొక్కటేయుత్తర మివ్వవలెను. చింత

అష్టారచక్రబంధః



విష్ణో విప్లుత విశ్వగు ప్వనదక త్వా మర్దిత స్వర్ధిపం ద్యావా ద్యాజ్జక క్రాన్తలోక నతవీ ట్ప్రాంచంతి కాంతిస్రువా రక్షోవారక లబ్ధిశేష నను సజ్జా ద్రాక్షు యే శ్రుత్యన స్య క్షాః చక్ర దరానుషక్త నతత స్త్వైర్యదభ్యో తేతి న॥

ఉద్ధారః - ౧ వలయే - విద్యారణ్య పంచానన
౨ ,, విద్యావాచస్పతి శ్రుతేః
౬ ,, విక్రాల రామచంద్రార్య
౮ ,, గురో శ్శేషకవీ ట్స్తుతః

కాయ అని జవాబు. చింతయతీ తి చింతకః తస్మై చింతకాయ. ధ్యానించువానికి. రెండవ ప్రశ్నకు నుత్తర పదియే. చింతకాయ తింత్రిణీశలాటువు. నిత్య మొకసారియో కొన్నిసారులో పారాయణ మొనర్పఁదగునట్లుగ సంస్కృతాంధ్రబాషా శ్లేష "లక్ష్మీనారాయణ స్తవము" అనెడు గ్రంథము నేను రచించినాడను. అందునుండి యొకటి—

శ్రీకాంతా సురయోగి పూజితపదా శీతాంశుబింబాననా।
లోకేశాభ్యుదయ ప్రదాయక దయాలోకాంచలా మంగళా।
స్తోకా నోజ్జ్వల సత్పయోధర తనూశోభా స్వ నిశ్శ్రేయస।
శ్రీ కామోత్తృషితా (౭) ప్రపాతు లసితా స్విష్టస్తవా కావుమా॥౧

వ్యా॥ ఇది తెనుఁగు పద్యము సంస్కృత శ్లోకము నగును. తెనుఁగుపద్య మయ్యేనేని నాభాష సంప్రదాయము ననుసరించి ప్రాసలు యత్యక్షరమైత్రులు పెట్టఁబడినవి. అవి సంస్కృత శ్లోకములలోఁ బెట్ట ననవసరమైనను అలంకారముగఁ బ్రయుక్తములు. శ్రీవేంకటేశ్వరుఁడు తెనుఁగువాఁడు కనుక అసలు తెనుఁగుభాష వైష్ణవ మగుటచేతను తెనుఁగు పద్యములై ఆయనస్తుతియు దేవతలభాష సంస్కృతము కావున సంస్కృతశ్లోకములై శ్రీలక్ష్మి స్తుతియు నగును. ఆయర్థములు. ముందు తెనుఁగుబాసతో నయ్యెడు శ్రీవేంకటేశ్వరుని స్తోత్రము. ప॥ చ్ఛే॥ శ్రీకాంతా.... అప్ప్రిపాతుల - సితా.... వా, కావుమా - అని పదవిభాగము. అర్థము - సుర.... పదా = సుర - దేవతలచేతను.... యోగి - మునులచేతను, పూజిత - పూజింపఁబడిన, పదా - పాదములుకలవాఁడా!, స్వ.... అప్ప్రిపాతుల = స్వ - తమకొఱకు, నిశ్శ్రేయస - మోక్షమును, శ్రీ - ఐశ్వర్యమును, ఉత్తృషిత - కోరెడువారికి, అప్ - నీటితోఁ గూడిన, ప్రపా - చలివేంద్రయే, తుల - సాటిగాఁగలవాఁడా!, సితా ... స్తవా = సితా - చక్కెరయట్లు, సు + ఇష్ట - మిక్కిలి ప్రియమైన, స్తవా - (నీ) స్తోత్రములుకలవాఁడా!, కావుమా - రక్షింపుము. అని శ్రీవేంకటేశ్వరపరముగ ఆంధ్రభాషతో నైన యర్థము. ఇఁకను లక్ష్మీస్తుతిపక్షముగ సంస్కృత భాషతో నైన యర్థము. ఇట్లు భగవత్పరములో సంబోధన ప్రథమావిభక్తులుగ నున్న తత్సమాంధ్రపదములను ప్రథమా విభక్తులుగఁ దలంచినచో లక్ష్మీస్తుతిపరమైన ఆకారాన్త స్త్రీలింగ సంస్కృత పదము లగును.

ఇఱువురియందు గుణము లొక్కవిధమే కనుక సర్వమిఱువురియందును తుల్యమే. నాలగవ పాదమునం దర్థములో నుభయభాషలకు సభంగ శ్లేషంబు. అది— భగవత్పక్షములో శ్రీకామోత్తృషిత - అప్ - ప్రపా - తుల అని శబ్దములుగల సమాసమున్ను, కావుమా అను క్రియాపదమును, స్తోకాన్వ.... శోభా = స్తోకాన్వ - పెద్దదియై, ఉజ్వల - వెలుఁగుచున్న, సత్ప యోధర - మంచి మబ్బులవంటి, తనూశోభా - శ్రీస్తుతి పరముగ నర్థము సలిపిన "శ్రీకామోత్తృషితా - ప్రపాతు - లసితా - స్విష్టస్తవా - కౌ - ఉ - మా - అని పదవిభాగము. అర్థము - సుర.... పదా = మొదలు మంగళా వరకుఁగల శబ్దముల యర్థము ముందటియట్లే. స్తోకాన్య... తనూశోభా= స్తోకాన్య - గొప్పవియై, ఉజ్జ్వల - శృంగారముకల, సత్పయోధర - మంచి చన్నులుగల, తనూశోభా - దేహకాంతిగలదియు, స్వ.... కామోత్తృషితా = స్వ - దనమందును, నిశ్శ్రేయస - సుఖమందును, శ్రీ - అధికారమందును, కామ - కోరికగలవాంచేత, ఉత్తృషితా = కోరఁబడినదియైన, శ్రీకాంతా-లక్ష్మి యను సుందరి, ఉ-దయతో, కౌ పుడమి యందు, లసితా-భాసించినదియై, మా-నన్ను, ప్రపాతు-కాచుఁగాఁత. (ప్ర-ఉపసర్గము.)

ఇట్లే విలోమమునందు (శ్లోకమును చివరివర్ణమును మొదలిడి ముందుకుఁ జదువ) తెనుఁగుపద్య మయ్యెడు చిత్రము నేను కనిపెట్టి మొదట చేసినదియు గలదు. అది—

5రుచావహా ౭౭యచ్ఛ 2సదర్థకాచయా।
8మనో 9రరాజ 1స్వకలస్థ సారసా
3స్వతర్థి వక్త వ్యసువర్ణతారభా।
4సదా రసా12రక్ష 10నతస్తుతా 7రమా॥

టీక॥ 1స్వకలస్థసారసా=తన చేతులయందుఁగల కమలములు కలదియు, ర- ల- ల కభేదశాస్త్రముచేత కర-కలగా ప్రయుక్తము. 2స దర్థకాచ-మంచిధనము కలదియు, స్వతః-స్వయం జాతమైన, బుద్ధి-సంపదయు, వక్తవ్య-చెప్పఁ (వర్ణింపఁ) దగిన, సువర్ణ-బంగారును, తార-గొప్పదియైన, భా-కాంతియుఁ గ-ది, 4సదా-ఎల్లప్పుడు, రసా- (నీ యందు ప్రేమ మా యందు వాత్సల్యముఁ) గలది, 5రుచా వహా-శోభనుఁ గలిగించునదియు నైన, యా-ఏ, 7రమా-లక్ష్మి, 8మనోః-నారాయణునివలన, 9రరాజ-ఒప్పెనో, సాచ-ఆ లక్ష్మియు, 10నతస్తుతా-ప్రణతయై నుతింపఁబడినది. అయచ్ఛ-ఈ నుతినిఁ గైకొనుము. 12రక్ష-ఏలుము.

ఈ శ్లోకమును కడయక్కరమును మొదలిడి వరుసగ పైకిఁ జదువ తెనుఁగు గీతపద్యమగును. అది—

గీ॥ 1మా రతా 2స్తుత 3నక్షర 4సారదాస
5భారతాజ్ఞప సువ్యక్త 6వర్థతస్వ

7సారసాస్థలకస్వజ 8రార 9నోమ
10యాచకార్థద 11సచ్ఛయ 12హావహారు॥

టీ॥ 6 అంకెలవరకుఁ గల పదముల యర్థము సులభము. సారసా....స్వజ=సారసా-శ్రీకి, స్థలక-నివాసమైన, స్వజ-స్వయం జాతుఁడా!, (స్వార్థిక కప్రత్యయము.) 11సచ్ఛయ-మంచి చేతులు కలఁవాడా!, 12హావ-విలాసములలో, చారు-సుందరా! 9నోమన్-రక్షణార్థము. 8రార-రమ్ము.

బంధములు- పద్మాది చిత్తరువులలో వ్రాయఁదగుటచేత నివి చిత్రము లని కొందఱ సంప్రదాయము. అందుచేతనే అయ్యలూరి కందాళయాచార్య విరచితమైన అలంకార శిరోభూషణ మను పది (౧౦) ఉల్లాసములు కల పెద్ద అలంకార శాస్త్రగ్రంథములో ఏడవది (౭) శబ్దాలంకార ప్రకరణము నందు "అథ చిత్రం" అని మొదలు పెట్టి

"శ్లో॥ పద్మాద్యాకారహేతుత్వా ద్యథా నే వర్ణ సంహతేః। చిత్రం కవే శ్శక్తిమత్త్వద్యోతకం త దనేకథా॥ అత్ర ప్రథమేనా ఒదిశబ్దేన నాగ చక్ర మురజ గోమూత్రికా గుచ్ఛ కంకణ సర్వతో భద్రాదయో గృహ్యంతే. ద్వితీయేన నిరోష్ఠ్యా చలజిహ్వా (౭) పునరుక్తాక్షర పాదభ్రమకాదయః" అని నుడివెను.

పదునాఱు ఱేఁకులు గల తామరపువ్వు మాదిరి పువ్వుఁగీచి యందు శ్లోకము వ్రాయుట షోడశదళ పద్మబంధము. నా చిత్రబంధ శ్రీనివాస కావ్యములో నొకటి-

(22వ పుటలోని చిత్రము చూడఁ దగును.)

శ్లో॥ రామ కామసమ శ్యామ శ్రీమ స్త్రీమ స్తమ క్రమ।
క్షేమనామ న్వామభీమ భూమధామ న్నమస్సమ॥

దీనినే ద్విచతుష్క చక్రబంధములోను గోమూత్రికా బంధములోను వ్రాయవచ్చును. ఆయాబంధలక్షణముల నెఱింగి వ్రాయుచో నొక్క శ్లోకమును లేక యొక్క పద్యమును పెక్కు బంధములలో వ్రాయవచ్చును.


చక్రబంధము-చక్రము మాదిరి బొమ్మవేసి వ్రాయుట-ఇందు మహాచక్రబంధ మని అష్టార చక్రబంధమనియు రెండు భేదములు కలవు. తొలిబంధములో కవి వంశనామ గ్రంథ విషయము శ్లోకముగ నుండవలెను. మహాచక్రబంధములో కవిపేరు గ్రంథనామము (పర్యాయపదముగ నేని) యున్నఁ జాలును. పూలదండ మాదిరి బొమ్మను గీచి యందు పద్యమునో శ్లోకమునో వ్రాయుట పుష్పమాలికాబంధము. తెనుఁగుననైనచో చంపకమాలను, సంస్కృతముననైనచో స్రగ్ధరా వృత్తమును వ్రాసెదరు. మాలికాబంధమును ప్రాచీన కవివరులు పలువురు వ్రాసినవి యనుష్టుప్ శ్లోకముతో నెడమ వైపునుండి చదివిననే సరిపడును. నేనట్లుకాక మాల (పూదండ రత్నహారము) యేవైపునుండి చూచినను చూడఁదగినట్లు అనులోమముగను (ఎడమనుండి కుడివైపుకు) విలోమముగను (కుడినుండి ఎడమవైపుకును) చదవఁదగులాఁగున నొకటి వ్రాసితిని చిత్రబంధ శ్రీనివాస కావ్యములో. గుర్తు కొఱకు నేను మణిమాలా బంధమని యంటిని. నా చిత్రబంధ శ్రీనివాస కావ్యములో మణిమాలా బంధము.

శ్లో॥ జయ భో యక్షయ భన శ్రీనమాన ఘనాఘనా।
నా ఘనా ఘనమాన శ్రీ నభయక్షయ భో యజ॥

వ్యాఖ్యానము అందే చదువఁదగును.

ఎనిమిది (౮) ఱేఁకుల పద్మమును వ్రాసి యందు శ్లోకము వ్రాయ నది యష్టదళ పద్మబంధము. కడియము మాదిరి గుండుగ నొక సున్నఁ జుట్టి దాని చుట్టు పాదవిభజనము (౪) పాదములుగ విద్యున్మాలావృత్తము నొక్కదానిని వ్రాసి యే యక్షరమును మొదలికి చదివినను, ముందు విడిచిన కత్తిమాదిరి గీట్లు గీచి యందు

మహాచక్రబంధః



ఉద్ధారము-పైనుండి 3వ వలయములో విక్రాల శేషార్య } అని కవి
6వ ,, కవివర కృతా } నామము

శా॥ విద్యావిశ్రుత కర్ణసుందరదృశా వీరవ్రజాశేఖరా
సద్యశ్శక్రా న్తకి విశ్వ భూధరధరా సంకృత్తదోషాచరా
హృద్యాలజ్కృత వర్ధితామరగణా హృత్తాపకార్యన్తకా
కా ద్యాళీ వినుతా సదా సహృదయా రామా విరాధాన్తకా॥

శ్లో॥ ను కాని పద్యమును గాని వ్రాయుట అది ఖడ్గబంధము. బాణమును మాదిరి బొమ్మ వేసి వ్రాయుట శరబంధము. ఇది సంస్కృతమున నే కనుపించును. ఇట్లే నాగబంధాదులునుఁ గలవు. నాగబంధమునకు ముందు కుండలి శబ్దము నుంచుట అనవసర మని నా యభిప్రాయము. కుండలి యనినను నాగ మనినను నొక్కయర్థమేగదా! "వి. శ్లో॥ కుండలీ గూఢపా చ్చక్షుశ్శ్రవాః కాకోదరః ఫణీ" అనియు, "నాగాః కాద్రవేయా స్తదీశ్వరః...." అనియు పాములపేళ్ళలో నమరకోశము పెద్దల యభిప్రాయము నాగబంధ మనియే యున్నది. అప్పకవి మున్నగు వారు కుండలి నాగబంధ మని వాఁడి యున్నారు. ఈ నాగబంధములో ఏకనాగబంధము అష్టనాగబంధము ద్విసప్తతి (౭౨) నాగబంధములు ఉన్నవి. ఏకనాగబంధములో సంస్కృతమున స్రగ్ధరావృత్తము, తెలుఁగున చంపకమాలా వృత్తముతో పలువురు వ్రాసినవి నేను చదివి యున్నాను. అష్టనాగబంధము సంస్కృతమున కవికంఠీరవ బిరుదాంకితులయిన మా విక్రాల శేషాచార్యులవారు రచియించిన "శ్రీవేంకటేశగుణరత్నశేవధి" గ్రంథములో ఒక్క వంశస్థ వృత్తమును వ్రాసియున్నారు. కొన్ని యక్షరములపై గుర్తుగ యంకెలు వేసి యున్నవి. తెనుఁగులో నైజాము రాజ్యమున ఆత్మకూరు సంస్థాన వాసులైన శ్రీమాన్ బుక్కపట్టణ.... ఆచార్యులవారు ఒక్క కందపద్యము అష్ట (౮) నాగములలో వ్రాసి క్రింద ఆ కంద పద్యమున్ను ఆత్మకూరు వద్ద కురుమూర్తి కొండపై వేంచేసియుండు శ్రీ వేంకటేశ్వరస్తుతిగ వ్రాసినది మా యింట నుండినది. ఇప్పుడదృశ్యమై పోయినది. ద్విసప్తతి (౭౨) నాగబంధము శ్రీ తిరునారాయణకవి గోదాస్తవపరమైన దండకముగ రచించినది నా వద్ద యున్నది. ఆ దండకము కడన

ద్విసప్త త్యహిబద్ధస్య తిరునారాయణః కవిః
నా ఽన్యోఽస్తి భువనే తుల్యో యద్య స్తిపరిమృగ్యతామ్॥

అని కవి చెప్పిన మాట సత్యము. మఱి యే కవియు నింతటి బంధమును రచించియుండలేదు. సేతువువద్ద దర్భశయనములో శ్రీరామ దేవాలయపు వాఁకిటి గోడపై ఒక పెద్ద నాగబంధము అరవలిపితో వ్రాసియుండినది. ఖడ్గబంధములో పూర్వులు కంద పద్యమును వ్రాయ, పుష్పమాలికా బంధములో చంపకమాలను వ్రాయఁగా దోమకొండ సంస్థానాధిపతులు రాజా మల్లారెడ్డిగారు [illegible]ములో ఉత్సాహవృత్తమును వ్రాసిరి. కావున నిట్టి చిత్రరచనలు బుద్ధిమంతులయిన కవి వర్యులు కనుఁగొని కల్పించినవి కావున అనంతములుగ కలవు. వాల్మీకి-వ్యాస ప్రభృతులు పూర్వోదితములైన కొన్ని శబ్దాలంకారములనే వాఁడి యుండుట ఇందుకు నిదర్శనము.

కడియము మాదిరి గుండుగ నొక సున్నఁ జుట్టి దానిచుట్టు నొక విద్యున్మాలావృత్త శ్లోకమును వ్రాసి యొక యక్షరమును మొదలిడి చదివి ముందు వదలిన వర్ణముల నంటించి చదివినచో ౩౨ ముప్పదిరెండు విద్యున్మాలా వృత్తములు కల కంకణబంధ మొకటి యగును. ఈ లక్షణముతో నొక ఆచార్యులవారు, నొక శాస్త్రులవారును వేరువేరుగ రచియించిన రెండు కంకణబంధ రామాయణములు ముద్రితములు. నేను చూచినవి కలవు.

విద్యున్మాలావృత్తలక్షణము కాళిదాసు శ్రుతబోధ గ్రంథము లోనిది సుఖముగ నున్నందున దానిని వ్రాసెదను.

"శ్లో॥ సర్వే వర్ణా దీర్ఘా యస్యాం ।
విశ్రామ స్స్యా ద్వేదై ర్వేదైః ।
విద్వద్భృన్దై ర్వీణా వాణీ
వ్యాఖ్యాతా సా విద్యున్మాలా॥" అని.

నాలుగు పాదములలో ప్రతిపాదమునం దెనిమిది గురువులు. ప్రతినాలుగక్షరములయందు యతులు. కనుక ౮ ౪ ౩౨ అక్షరములు ఒక విద్యున్మాలా వృత్తమగును.

అప్పకవీయము చతుర్థా(౪)శ్వాసములో నొక కంకణబంధ మున్నది. అది వ్యాఖ్యానము లేక దుర్బోధ మైనందున శ్రీమాన్ అయలూరి కందాళయాచార్యులవారి అలంకారశిరోభూషణమునం దేడవది (౭) యైన శబ్దాలంకార ప్రకరణమునుండి యెత్తి యుదహరించు చున్నాను. ఇందన్ని శ్లోకములును వాటివాటి క్రింద వాఁటి వ్యాఖ్యయు ముద్రితములు. కావున నర్థము సులభముగ నున్నది.

కంకణబంధో యథా—

"శ్లో॥ రంగేశం వందే వందే వం। తం యాతాయం సా
యాఽమారా।
మా యా సాదాసావాసారా। గేయా నేనా బాలాభాసా॥ ౧

గేశం వందే వందే వంతం। యాతా యంసాఽయా మారామా।
యా సా దాసావాసారాగే। యానే నావా ఽఽలాభాసారం॥ ౨

శం వందేవం దేవంతం యా। తా యం సా యా మాఽరా
మాయా।
సాదా సావా సారా గేయా। నేనా బాలా భాసా రంగే॥ ౩

వందే వందే వం తం యాతా। యం సా యామాఽ రామా
యాసా।
దాసా వాసా రాగే యానే। నావాలాభా సారం గేశం॥ ౪

దేవం దేవం తం యాతా యం। సాయా మారామాయాసాదా।
సావా సారా గేయా నేనా। బాలా భాసా రంగే శం వం॥ ౫

వందే వంతం యాతా యం సా। యా మా రామా
యాఽసాదాసా।
వా సా రాగే యానే నావా। లాభా సారం గేశం వన్దే॥ ౬

దేవం తం యాతా యం సాఽ। యా మా రామా యాఽ
సాదాఽసావా।
సారా గేయా నేనా వారా। భాసా రంగేశం వందేఽవం॥ ౭

వంతం యాతా యం సాయామా। మాయాసాదా సావాసా।
రాగేయా నేనా బాలాభా। సారంగేశం వందే వందే॥ ౮॥

తం యాతా యంసా యామా రా। మా యాసా దాసా
వాసారా।
గేయా నేనా బాలా భాసా। రంగేశం వం దేవందేవం॥ ౯

కడమవి ఇట్లే ఊహ్యములు. ప్రతి శ్లోకమునకు వ్యాఖ్య వాటి క్రిందనే ముద్రితము.

చిత్రకవితల యుదాహరణములం జదివిన యంత వాటిలో విశేషముగ పరిశ్రమించినవారిని యెరుంగఁ గౌతుకము కలవారి తెలుంగునిమిత్తము వారువారు సలిపిన గ్రంథముల పేళ్లతోఁడ వారిపేళ్లు వ్రాయఁబడుచున్నవి.

౧.	గణపవరపు వేంకటకవి.	ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము.	తె. ముద్రితము
౨.	కాణాద పెద్దనసోమయాజి	ముకుందవిలాసము (భద్రాపరిణయము)	తె. ,,
౩.	చిత్రకవి విక్రాల రామాచార్యులు	రఘునందన విలాసము.	తె. వ్రాఁతది.
౪.	కవిసింహ విక్రాల వేంకటవీరరాఘవాచార్యులు	సంపత్కుమారీయము.	తె. ,,
౫.	మహాకవి విక్రాల శేషాచార్యులు (ఈ వ్యాసకర్త-నేను)	శ్రీవేంకటేశ్వర చిత్రరత్నాకరము, చిత్రబంధ శ్రీనివాసము, సుమనోవినోదము.	సం. తె.
౬.	కవయిత్రీరత్న, కవయిత్రీతిలక విక్రాల శ్రీదేవమ్మ (పై శేషాచార్యుల భార్య)	శ్రీవేంకటేశ్వర చిత్రరత్నావళి, వాసవదత్తాపరిణయము.	తె. ముద్రితములు.
౭.	చిత్రకవి పర్ణశాల సింగరాచార్యులు	నృసింహ చిత్రార్ణవము.	తె. వ్రాఁతది.
౮.	బోడి వాసుదేవరావుగారు	చిత్రమంజరి.	తె. ముద్రితము.
౯.	జంజనం భాస్కరరావుగారు	విష్ణుస్తోత్రమంజరి, గర్భకవిత్వము, కొన్ని బంధములును	తె. ,,
౧౦.	నాదెళ్ల పురుషోత్తమశాస్త్రిలు	చిత్రకందరత్నాకరము.	తె. ,,
౧౧.	నాదెళ్ల మేధాదక్షిణామూర్తిశాస్త్రిలుగారు	యాదవాద్రిశోపాఖ్యానము మొ॥.	తె. ,,
౧౨.	కొండూరు వేంకటేశ్వరకవీశ్వరులు	చిత్రబంధ లక్షణసారము	తె. వ్రాఁతది.
౧౩.	మండపాక పార్వతీశ్వరకవి	ప్రబంధసంబంధబంధనిబంధన గ్రంథము.	తె. ముద్రితము.
౧౪.	కుందుర్తి వేంకటాచలకవి	మిత్రవిందాపరిణయము.	తె. ,,
౧౫.	రాజామల్లారెడ్డిగారు, దోమకొండసంస్థానాధిపతి	షట్చక్రవర్తిచరిత్రము.	తె. ,,

౧౬.	బుక్కపట్టణం.... ఆచార్యులు	కురుమూర్తి వేంకటేశ్వరుని స్తోత్రములు.	తె. వ్రాఁతవి.
౧౭.	కవితాకోవిద రావిపాటి లక్ష్మీనారాయణ	భారతగర్భరామాయణము.	తె. ముద్రితము.
౧౮.	భమిడిపాటి వేంకట సుబ్రహ్మణ్యశర్మ	కృష్ణాపుష్కరమాహాత్మ్యము.	తె. ,,
౧౯.	ముక్తినూతలపాటి సీతారామామాత్య విద్వత్కవి	వేణుగోపాలశతకము.	తె. ,,
౨౦.	ఆంధ్రకవితా చతుర్ముఖ గాదె పాపరాజకవి	అష్టముఖీరామాయణము.	తె. ,,
౨౧.	అబ్బరాజు హనుమంతరాయశర్మ పాకయాజి	శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య దాశరథి చరిత్ర	తె. ,,
౨౨	సత్యవోలు సోమసుందరకవి	గోపాలశతకము (గర్భకవిత్వము)	తె. ,,
౨౩.	గండరగండడు తంగెడ గంగనామాత్యుఁడు	శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్గద్య హరిశ్చంద్రనలోపాఖ్యానము.	తె. ,,
౨౪.	ముక్తినూతలపాటి గోపాలకృష్ణశాస్త్రి, పై సీతారామామాత్య విద్వత్కవి మనుమఁడు, శ్రీమాన్ మా తండ్రిగారి శిష్యులు.	కొన్నిబంధములు, గర్భకవితలు.	తె. ,,
౨౫.	చింతలపల్లి ఛాయాపతి	రాఘవాభ్యుదయము.	తె. ,,
౨౬.	నాదెళ్ల పురుషోత్తమకవి	చతుర్ముఖీకందపద్య రామాయణము.	తె. ,,
౨౭.	బుజ్జా కమలాదేవి	ఛందోహంసి.	
౨౮.	అల్లమరాజు రంగశాయికవి	ఆంధ్ర చంపూరామాయణము.	
౨౯.	ఆంధ్రవాల్మీకి శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు	శ్రీ కుమారాభ్యుదయము మొ॥	తె. ,,
౩౦.	పరశురామపంతుల లింగమూర్తి	సీతారామాంజనేయ సంవాదము	తె. ,,
౩౧.	అపరకాళిదాసు, పూడిపెద్ది లింగమూర్తిపండితుఁడు	సువర్చలాపరిణయము.	తె. ,,
౩౨.	ధరణిదేవుల రామయ్య	దశావతారచరిత్రము.	తె. ,,
౩౩.	పింగళి సూరనార్యుఁడు	రాఘవపాండవీయ, కళాపూర్ణోదయాదులు.	తె. ,,
౩౪.	ఆంధ్ర కవితా చతుర్ముఖ, నేత్రావధాని గాదె పాపరాజకవి	చతుర్ముఖరామాయణము.	తె. ,,
౩౫.	ఆకిలి శ్రీరామశర్మ	గురుదేవాద్వైతస్తుతి, సం.	తె. ,,
౩౬.	వికాల శ్రీనివాసాచార్యులు	సౌగంధిక పారిజాతీయము, ద్వ్యర్థి.	వ్రాఁతది.
౩౭.	ముక్కుతిమ్మన	పారిజాతాపహరణము.	
౩౮.	ఓగిరాల జగన్నాథము	సుమనోమనోభిరంజనము	
౩౯.	డాక్టర్ అమనుమల్లి నారాయణరావుగారు	నారాయణీయము.	తె. ముద్రితములని తెలియుచున్నది.
౪౦.	కవికులభూషణ అల్లమరాజు రామకృష్ణకవి	శంతనువిలాసము	తె. ,,
౪౧.	వింజమూరి వీరరాఘవాచార్యులు	కృష్ణలీలావిలాసము.	తె. ,,
౪౨.	అద్దంకి తిరుమలై లక్ష్మీనృసింహకుమార తిరువేంగడ తాత దేశికాచార్యులయ్యవారలుగారు	శ్రీనృసింహనవరత్నమాలికాస్తోత్రము.	తె. ,,
౪౩.	అభినవపండితరాజ మాడభూషి విద్వాన్ వేంకటాచార్యులు ,, నరసింహాచార్యులు	భరతాభ్యుదయము.	తె. ,,
౪౪.	తూ. గో. జిల్లా, పిఠాపురములో సంస్థాన దివానుగ నుండిన శ్రీ రామకృష్ణారావుగారు	బంధములతో నొకగ్రంథమును రచించిరని మిత్రులవలనఁ దెలియుచున్నది.	

శ్రీ కాజ లక్ష్మీనరసింహారావు

ఉదంకుని కథ

నన్నయ్యగారి ఋషిప్రాత్మ

మహాభారతమునందలి ఋషుల కథలు, రాజుల కథలు, రాజర్షుల కథలు, మఱియు నితరములయిన కొన్ని యుపాఖ్యానములు తద్భారత ప్రధాన కథా పరమార్థమున కుపష్టంభకములు. ఋషుల కథలలో ఉదంకుని కథ, పరాశరుని కథ, రురుని కథ యిట్టివి. మఱి కొన్ని కథలు ప్రధాన కథతో (కౌరవ పాండవ) ముడివడి యున్నవి. వ్యాస భగవానుఁడు ఋషి యగుటచేత ఆయా కథల కంతటి వైశిష్ట్యము కలిగినది. ఋషి వంటి నన్నయ్యయు ఆయా ఋషుల కథల కంతటి వైశిష్ట్యమును గల్గించెను. భారతము నందలి ఋషుల కథ లసంఖ్యాకములు ఒకదానితో నొకటి పోలిక లేని యట్లుండును. వారి యాత్మ యెంత స్వచ్ఛమును బ్రసన్నము నయి యుండునో, వారి కథలు, వారి జీవిత విధానము, వారి చేష్టలు పరస్పర భిన్నములై కన్పట్టును.

పరాశరుని కథ యున్నది. అతఁడు మహా తపస్విశాలి. కామ క్రోధాదు లెంతయు నాయనకు సరిపడవు. అతఁడొక సారి తీర్థ యాత్రకు వెళ్ళెను. మధ్యలోఁ దారసిల్లిన సత్యవతి యను దాశరాజు కూఁతును వ్యామోహపరవశుఁడై కామించి, యామెను వశపరచుకొని యామె యందొక పుత్త్రినిఁ గన్నాఁడు. అతఁడు ఋషి కదా! ఇది యేమి పని? అతఁడు చేసిన యీ పని వలన ఆయన తపస్సు నశింపవలదా? నశింపలేదు. అతని ఋషిత్వము పోలేదు. పైగాఁ బరాశరుఁడు చేసిన యీ కాముక ప్రవృత్తివలన వ్యాస భగవానుఁడవతరించెను. ఋషుల కథ లిట్లుండును. ఆ ఋషుల యాత్మలక్షణమును మరల ఋషియే యావిష్కరింపఁ గలఁడు. వ్యాసుఁడట్లు చేసెను. ఋషి వంటి నన్నయ్యయు నట్లే చేసెను.

ఉదంకుని కథ యున్నది. ఉదంకుఁడు ఋషి. పైలుని శిష్యుఁడు. పైలుఁడు వ్యాస మహర్షికి శిష్యుఁడు. ఇది ఋషి పరంపర.

"గురుపత్నీ నియోగంబున" పౌష్యుఁడను రాజు దేవి కుండలంబులను గొని తెచ్చి యిచ్చుటకుఁ బోగా, మార్గమధ్యమున తక్షకుఁడను సర్పరాజు ఉదంకుని వంచించెను. వంచితుఁడైన యుదంకుఁడు సర్పజాతి యంతటిపైఁ గక్ష సాధించెను. ఉదంకుఁడు ఋషి. కోప తాపములుండరాదని వాఁడు. ఆయనకుఁ గోపము వచ్చుటేమి? కక్ష సాధించుట యేమి? ఉదంకుఁడు చేయుచున్న యీ కోపపుఁ బనులను గురువు, ఋషి యగు పైలుఁడు హర్షించుట యేమి? మన్నించుట యేమి? ఇంత చేసియు వారి దయిన ఋషిత్వమునకు భంగము రాకుండుట యేమి? ఇతర కార్యముల నెన్నింటిని జేసినను ఋషిత్వమును స్థాపించు నొక రహస్యమగు లక్షణము ఉదంకుని యందున్నది. ఐతిహాసిక దృష్టితో వ్యాసులవా రుదంకుని కథను వ్రాసిరి. రస ప్రధాన మగు దృష్టితో నన్నయ్యగా రుదంకుని కథనుఁ వ్రాసిరి. ఈ భేదము కథాకథనము నందున్నదే గాని యుదంకుని కథా సూక్ష్మాంశ వివరణ యందు వ్యాసునకు నన్నయ్యకు భేదము లేదు.

కం॥ "పంకజభవ సన్నిభుఁ డఘ
పంక క్షాళన మహాతపస్విలిఁ దనా
తంకమతి పైల శిష్యుఁ డు
దంకుండను ముని వరుండు తద్దయు భక్తిన్

కం॥ గురుకులమునందు గురులకుఁ
బరిచర్య లొనర్చి తా నపరిమిత నిష్ఠా
పరుఁడై జ్ఞానము వడసెను
గురుదయ నణిమాదికాష్టగుణముల తోడన్."

(ఆది పర్వము)

ఉదంకుని కథ యంతయు నీ రెండు పద్యముల మీఁద నిర్మితమై యున్నది. ఉదంకుని గుణములన్నియు నీ రెండు పద్యముల యందు నిక్షిప్తమైనవి. ఈ పద్యములందుఁగల విశేషణము లన్నియు నన్నయ్యగారి యుపజ్ఞామూలకములే. ఉదంకుని కథలో అత్యంతాశ్చర్యకర సంఘటనలు జరుగును. "కథాకథనదక్షుఁ" డగు నన్నయ్య యీ రెండు పద్యములను గథా ప్రారంభమున వ్రాసెను.

నన్నయ్యగారి భారతమునకు వ్యాసభారతము మాతృక యగుట చేత నుదంకుని కథ సంస్కృత భారతమున గూడ నుండును. వ్యాసుఁడు చెప్పిన కథా విషయములను నన్నయ్య తెలిఁగింపనిచో, వ్యాసుని భారతము చదివి ఆయా విషయములను దెలియవచ్చును. ఇది ఇట్లుంచి వ్యాసుఁడు చెప్పని విషయములను నన్నయ్యగారు చెప్పుదురు. అప్పుడేమన వలయును? "లో నారసి మేలన" వలయును. "ప్రసన్న కథాకలితార్థయుక్తి" యని యేగుణ విశేషమును నన్నయ్య చెప్పెనో దానిని గ్రహింపవలయును.

గురుకులము నందు ఉదంకుఁడను శిష్యుఁడొకఁడు గలఁడని మాత్రము వ్యాసుని కథనము.

"అథోదంకః శుశ్రూషుర్గురు నియోగ మనుతిష్ఠమానో గురుకులే వసతిస్మ" పౌష్యపర్వకథ. ఇంతకు మించి యుదంకుని గూర్చిన వివరములు తెలియవు. పయి రెండు పద్యములు నన్నయ్యగారి స్వోపజ్ఞకములగుటచేత అవి కథ కెట్లుపకరించునో విచారింప వలయును.

"పంకజ భవ సన్నిభుఁడు" ఇది యుదంకుని గూర్చిన తొలి విశేషణము. బ్రహ్మదేవునితో సమానుఁడని యర్థము. బ్రహ్మ యను నర్థమును బోధించు శబ్దములనేకములున్నవి. బ్రహ్మ, ధాత, పరమేష్ఠి ప్రభృతి శబ్దము లుండఁగా - పంకజ భవ యనియే నన్నయ్య ప్రయోగించెను. పంకమనఁగా "పంచతి సంపర్కా ద్విస్తార మాపద్యతే" సంబంధము వలన విస్తరించున దని యర్థము-బురద యని యర్థము. ఈ పంక శబ్దమునకును, దరువాత ప్రయోగింపఁబడిన-"పంక" (పంకక్షాళన) శబ్దమున కును సంబంధ మున్నది. "అఘపంకక్షాళన మహాతపస్సలిలుఁడు" ఇది రెండవ విశేషణము. పాపమనెడి బురదను కడుగుటకు గొప్పదయిన తపస్సనెడి జలముగలవాఁడని యర్థము. "అనాతంక వతి" యన్నది మూఁడవ విశేషణము. శంక జంకు లేని బుద్ధిగలవాఁడని యర్థము. మన్యతే అనయా ఇతి మతిః. ఈ విశే షణము లిట్లుండఁగా నుదంకుఁడు "మునివరుండు" అని చివరకుఁ జెప్పఁబడెను. అతఁడు గురులకుఁ బరిచర్య లొనర్చి జ్ఞానము వడసెను. గురుసేవ చేసి జ్ఞానము పొందెనని వ్యాస భారతమున నున్నది.

"జ్ఞానము వడసెను గురుదయ నణిమాదికాష్ట గుణముల తోడన్." అణిమాదికాష్ట గుణములతో జ్ఞానము పొందెనని నన్నయ్య గారి కల్పనము. ఈ గుణములుదంకునియందు లేకున్నచోఁ గథయే లేదు. కథాకథన శిల్పము లేదు. అణిమ యనఁగా మిక్కిలి సూక్ష్మమయిన రూపము. "ఐశ్వర్యము" నందు అణిమ యొక భాగము. లౌకికమయిన యీ విద్యనుమహర్షియగు నుదంకుఁడు నేర్చుకొన్నాఁడు. ఏ విద్య యెప్పటికవసరమో!

పంకజ భవ సన్నిభుఁడు అని చెప్పఁబడిన యుదంకుఁడు, అఘపంకక్షాళన తపస్సలిలుఁడనబడెను. అతఁడు పాపము చేయునా? ఆ పాపముయొక్క స్వరూప మెట్టిది? శంకయు, జంకును విడిచి యుదంకుఁడుచేయు సాహసకృత్యములేవి? పాపముచేయుట, దానిని బోగొట్టుకొనుట సాహసకృత్యములుచేయుట యనునవి యుదంకుని లక్షణములయినచో అతనిని "ముని వరుండు" అని నన్నయ్య యేల చెప్పెను? మహాకవులయు, మహాఋషులయు జీవితములు, మనో వాగ్వ్యాపారములు అంతర్బహిర్భిన్న ప్రకృతికములై యుండును. స్వచ్ఛత, ప్రసన్నత కలిగి యుండును. ఉదంకుఁడు పాపముచేసినను, సాహసములు చేసినను వాని దయిన ముని లక్షణము నశింపదు. ఇది యెట్లు?

"అయ్యుదంకుండు గురుహిత కార్యదురంధరుండై గురు పత్నీనియోగంబున బౌష్యుండను రాజు దేవి కుండలంబులం బ్రతిగ్రహించి తేరంబూని వనంబులో నొక్కరుండ చనువాఁడు నెదుర నొక్క మహోక్షంబు నెక్కి చనుదెంచువాని నొక్క దివ్య పురుషుంగని వాని పన్నిన వృషభగోమయ భక్షణంబు సేసి.... "

ఉదంకుని విద్యాభ్యాసము పూర్తియయినది. గురుదక్షిణ యీయవలయును. గురుదక్షిణయిచ్చుటకై యతఁడు గురువును సమీపించెను. గురువు తన భార్య నడుగు మనియెను. వ్యాసుఁడు చెప్పిన యీ భావమును నన్నయ్య కొలఁది మార్పుతో వ్రాసెను. "గురుపత్నీనియోగంబున గురుహిత కార్యదురంధరుండై" యను నది నన్నయ్య తెలుఁగుసేఁత. ఉదంకునకు గురు, గురుపత్నుల విషయమున అభేద ప్రతిపత్తియని నన్నయ్య రచన వలన దెలియును. గురుపత్నీనియోగము చేయుట గురువుచెప్పిన పని చేయుటయేనని యిందలి యభిప్రాయము. ఉదంకుఁడు "వనంబులో నొక్కరుండ చనువాఁడు." ఒక్కరుండ యనుమాట నిర్జనము మృగాకీర్ణమగు అరణ్యములో ఏకాకిగా, సాహసిగా బోఁగల ధైర్యముకల వాఁడన్న యుదంకుని శీలమునకు వ్యంజకము. "అనాతంకమతి" యని మున్దు చెప్పఁబడిన విశేషణమునకు "ఒక్కరుండ చనువాఁడనునది నిదర్శనము. సాహసవంతుఁడగు నుదంకుఁ డొంటరిగా పోవుచుండఁగా ఎదుట "ఒక్క దివ్యపురు షుఁడు" వృషభగోమయమును పన్నెను. ఉదంకుఁడు దివ్యపురుషుని జూచెను. వాని పన్నిన వృషభగోమయమును భక్షించెను. ఇక్కడ

కూడా నుదంకుని యనాతంకమతి స్ఫుటమగుచున్నది. ఆ వచ్చిన దివ్యపురుషుఁడు ఉదంకుని పరీక్షింపఁ దలఁచెను. ఈ విషయములను నన్నయ్యగారు వాచ్యము చేయలేదు. ఉదంకుఁడు "వాని (దివ్యపురుషుని) పన్నిన వృషభగోమయమును భక్షించెను" దివ్య పురుషుఁడు ఉదంకునిచేత పాపముచేయింపఁ దలఁచెను. తలఁచెనని మనకెట్లు తెలియును ?

ఆ దివ్యపురుషుఁడు గోమయమును పన్నెను వలపన్నుట, మాయలుపన్నుట- యిట్టి సందర్భములలో వాడబడిన "పన్ను" అను క్రియ తత్కర్తృమనోగత దుష్టభావ వ్యంజకముగా నుండును. ఇట్టి క్రియను ప్రయోగించి యా దివ్యపురుషుని కౌటిల్యమును పాఠకుని యూహకు నన్నయ్యగారు అందించిరి. పన్ను అనఁగా యుక్తిగాఁగల్పించుట యని యర్థము. ఈ పన్నుగడను ఉదంకుఁ డవలీలగా జయించెను. అతఁడా గోమయమును" భక్షించెను". గోమయమును భక్షించుట యేమి ? దివ్యపురుషుఁడు గోమయమును గల్పించుట యేమి ? ఉదంకుఁడు చేసిన పనికి దివ్యపురుషుఁ డనుగ్రహించి వెళ్ళిపోయెను. గోమయమును తినుమని దివ్యపురుషుఁ డుదంకుని గోరలేదు. ఉదంకుఁడే సాహసము చేసెను. ఇది నన్నయ్యగారి కథనము. ఉదంకునిచేత గోమయము తినిపించుటకై దివ్యపురుషుఁడెంతయుఁ బ్రయత్నించెనని వ్యాసుని కథనము. "ఓయీ, నీ గురువుకూడ పూర్వమీ గోమయమును భక్షించెను, నీవేల విచారింతువు" అని దివ్యపురుషుఁడు ఉదంకునితోఁ బలికెనని వ్యాసుని కథనము. "మా విచారయస్వ, ఉపాధ్యాయేనాపి తే భక్షితం పూర్వమితి" దివ్యపురుషుని యుపదేశమున ప్రబోధితుఁడై యుదంకుఁడు గోమయము భక్షించెనని తాత్పర్యము.

దివ్యపురుషుని కుటిలత్వమును వ్యాసుఁడు వాచ్యము చేయఁగా నన్నయ్య వ్యంగ్యము చేసెను.

వృషభ గోమయమనునది యొక చమత్కారమగు సమాసము. గోమయ మనఁగా ఆవుపేడ. వృషభ గోమయమనఁగా నేమి ? మొత్తము సమాసమునకుఁ బేడ యనియే యర్థము-అప్పుడు గోమయ శబ్దమునకు పేడ యని చెప్పవలయును. ఇట్టి సమాసగత వైలక్షణ్యము నన్నయ్యగారి రచనలో నాలుగయిదు సందర్భముల యందుఁ గానవచ్చుచున్నది. నా మిగిలిన వ్యాసములందు వానిని గూర్చి వ్రాయుదును. వృషభ గోమయ భక్షణ సందర్భమున వ్యాసుని రచనము వేఱుగా నున్నది. దివ్యపురుషుఁడు పెట్టిన గోమయమును భక్షించుటయా మానుటయా యను విషయమును ఉదంకుఁ డాలోచించుచుండఁగా దివ్యపురుషుఁడు వానికిట్లు పలికెను. వాని మాటలు విని యుదంకుఁడా గోమయము భక్షించెను. ఉదంకుఁడు తనంతటానే గోమయము భక్షించినాఁడని నన్నయ్య వ్రాసెను. స్వభావ సిద్ధముగా నుదంకుఁడొకరికి లొంగువాఁడు కాడని యిందుఁ దెలియదగు నుదంకుని లక్షణము. మఱియు నుదంకుని సాహసప్రవృత్తికి నిది తార్కాణము. ఈ సాహసమే యనంతర కథా గమనమునకు ప్రాముఖ్యమును దెచ్చినది.

ఇంత వరకు నడచిన విమర్శలో "లో నారసి" చెప్పిన "ప్రసన్న కథా కలితార్థయుక్తి" గాని ఋష్యాత్మ యొక్క యావిష్కరణము గాని యేమియు లేదు ఇచ్చట నుండి చూడ వలయును.

దివ్యపురుషుఁ డాశీర్వదింపఁగా ఉదంకుఁడు పౌష్యుఁడను రాజు వద్దకు వెళ్లెను. పౌష్యాభిముఖుఁడై యుదంకుఁ డిట్లనియెను.

"ఏను గుర్వర్థమర్థినై మానవేశ !
కడఁగి వచ్చితి నిపుడు నీ కడకు వేడ్క,
దండితారాతి ! నీ దేవి కుండలమ్ము
లిమ్ము నా పూన్కి యిది సఫలమ్ముకాగ"

ఉదంకుఁడు రాజును జూచి మానవేశ, దండితారాతి అని సంబోదించినాఁడు. పౌష్యుఁడు రాజు గావున మానవేశ యని సంబోధించినాఁడన వచ్చును. శత్రువులను దండించువాఁడా యని సంబోధించుట కిచ్చట నేమి సందర్భమున్నది ? నిజముగా నివి రాజునుగూర్చిన సంబోధనలు గావు. ఉదంకుని జీవగతమగు స్వభావము సంబోధనల యందున్నది. మానవేశుఁడనఁగా ఆధిపత్యము నెఱపువాఁడు. ఇతరులకు లోబడియుండనివాఁడు. దండితారాతి యనఁగా ఇతరుఁడెవఁడేని తన్నవమానించినచో, వారిని శిక్షించి గాని వదలని వాఁడు. తనలో నిగూఢముగా నున్న లక్షణమునే యుదంకుఁడు సంబోధనాత్మకముగా బహిర్గతము చేసెను.

ఉదంకుని ప్రార్థనను మన్నించి పౌష్యుఁడుదంకునితో నిట్లన్నాఁడు.

"అయ్యా ! మదీయ ధర్మపత్ని యక్కుండలంబులు తొడఁగ నవసరంబై యున్నయది. మద్వచనంబున వాని నిప్పించు కొమ్మనిన నుదంకుం డంతఃపురంబునకుం జని పౌష్యమహాదేవింగానక క్రమ్మఱి పౌష్యుపాలికి వచ్చి, నీ దేవి నెందునుంగాన నీవ యక్కుండలంబులు దెప్పించి యిమ్ము" ఈ వచనమున కథ చాలా దూరముపోయి చాల విషయములను చెప్పినది. ఉదంకునికి పౌష్యుని భార్య కనబడలేదు. కుండలములు లభింపలేదు. కుండలములను పౌష్యుని రాణి యెల్లవేళలయందు ధరింపదు. ఆ కుండల ధారణ కొక నిర్ణీతకాలమున్నది. అవి అసాధారణ కుండలములు.

వానిని దాల్చుటకొక పవిత్రత యుండవలయును. వాని ధారణ వలన నొక మహత్తర ప్రయోజన మున్నది. అంత ప్రాశస్త్యము గల యా కుండలముల మాహాత్మ్యము లోకమున బలువురకుఁ దెలిసియే యున్నది. వానిపైఁ బెక్కుమంది మోజుపడి యున్నారు. అట్టి వారిలో పైలుని భార్య యొకతె. మఱి యొకఁడున్నాఁడు. వాఁడు తక్షకుఁడు. ఈ తక్షకుఁ డా కుండలముల నపహరింపఁ దలఁచి నాఁడని రాజెఱుఁగును. పౌష్యుని రాణి యీ కుండలములను భద్రముగా దాచియుంచినది. ఉదంకుఁడు యోగ్యుఁడు మరియు బ్రాహ్మణుఁడు. వాని కా కుండలము లీయవచ్చును. తానై కబురంపినచో రాణి యా కుండలములను తప్పక యుదంకున కిచ్చునని పౌష్యుఁ డెఱుఁగును.

"మదీయ ధర్మపత్ని యకుండలంబులు తొడుగ నవసరంబై" యున్నదని రాజన్నాఁడు. ఈ వాక్యమున "తొడుగు, అవసరము" అను రెండు మాటలు ముఖ్యమయినవి. తొడుగు అనఁగా ధరించుట, ఆభరణము అని రెండర్థములు. కుండలములను ఆభరణముగా ధరించుట యని యర్థము. తొడుగు అనునది తెలుఁగు మాట. అవసర మనునది సంస్కృతము. సంస్కృతమున అవసరమను మాట కర్థము వేఱు. అవసర మనగా సమయ మని యా భాషలో దాని కర్థము. ఈ సంస్కృత పదమునే స్వీకరించి, తెలుఁగు వారు, అవసరమను ఆ మాటకు అత్యంత ముఖ్యమను నర్థములో వాడుదురు. సంస్కృతమున 'దిక్కు' అనఁగా దిశ యని యర్థము. తెలుఁగులో రక్షణ యను నర్థము కూడ గలదు. ఈ విషయ మిట్లుంచి–తన భార్య యా కుండలములను "తొడుగ నవసరంబై" యున్నదని రాజు వలుకుటలో రెండర్థము లున్నవి. ఆ కుండలములను దన భార్య ధరించు సమయమయ్యెనని యొక యర్థము, తన భార్యకా కుండలములు మిక్కిలి ముఖ్యమయిన వని వేఱొక యర్థము పుట్టుచున్నది. సరే. రాజుమాట విని యుదంకుఁడు పౌష్యుని రాణివాసమునకు వెళ్లెను. "పౌష్య మహాదేవిం గానక క్రిమ్మఱి పౌష్య పాలి౦ జని నీ దేవి నెందునుం గాన నీవ యకుండలంబులు దెచ్చి యిమ్ము" అని చెప్పెను.

గురుదక్షిణ చెల్లించుటకు గురువును సమీపింపఁగా తన భార్యనడుగుమని గురువు ఉదంకునితోఁ జెప్పెను. కుండలముల నిమ్మని యుదంకుఁడు కోరగా, తనభార్యను అడుగుమని రాజు చెప్పెను. ఇచ్చట నొక చమత్కారమున్నది. "కుండవత్ వృత్తత్వాత్ కుండలమ్" కుండవలె గుండ్రముగా నుండు కర్ణభూషలను కుండలములందురు. వీనిని స్త్రీపురుషులందఱు ధరించుదురు. కుండల శబ్ద సారూప్యముగల కుండలియను వేఱొక శబ్దమున్నది. ఈ రెండు శబ్దములును ఏకధాతునిష్పన్నములు. కుండలములను అపహరింపదలంచిన కుండలి యొకఁడు తక్షకుఁడున్నాఁడు. రాజు చెప్పినట్లుగా ఉదంకుఁడు దేవియుండు రాణివాసమునకు వెళ్లెను. ఆమె యంతఃపురమున లేదు. దేవి యంతఃపురమున నేల లేదు? రాజు అసత్యము పలికెనా? ఉదంకునకు కుండలములనీయ రాదన్న యుద్దేశముతో రాణి వానికి కన్పడలేదా? రాణి నుండి కుండలముల దెచ్చి రాజే తనకేల యీయలేదు? కుండలము లిచ్చుట రాజున కిష్టము కాదా? ఇట్టి యాలోచనలు ఉదంకునకుఁ గలిగెను. అంతఃపురమున రాణి లేకుండుటయే యిందుకుఁగారణము. అతఁడనాతంకమతి. అంతఃపురమంతయును గాలించెను. రాణి యుండు ననుకొన్న ప్రాంతముల నన్నింటిని వెదకెను. తనభార్య యంతఃపురములో నుండునని రాజు చెప్పగా ఉదంకుఁడామెను–"ఎందునుం" గానక తిరిగి రాజు వద్దకు వచ్చెను. రాణి యా కుండలములను ధరించి యే తోఁటకో వెళ్లియుండవచ్చునని రాజనగలఁడని యుదంకుఁడు తానే అన్ని ప్రాంతములు చూచెను. ఆమె ఎక్కడను గానరాలేదు.

ఉదంకునకు రాజుపై అవమానము. రాజునకు ఉదంకునిపై అనుమానము. తన దేవి యంతఃపురము విడిచి వెళ్లదని రాజునకు దెలియును. తన రాణిమహిమలు రాజునకు దెలియును. ఉదంకుని వైశిష్ట్యము కూడ రాజునకుఁ దెలియును. తన భార్య యుదంకునకేల కన్పడలేదు. ఇది రాజు సంప్రశ్నము. రాజు నూహలు రాజువి. ఉదంకుఁడు గడుసరి. "ఓయి రాజా, నీభార్య యచ్చట లేదు, నేను వెదికితిని. నీవు కుండలముల దెచ్చియిమ్ము" అన్నాఁడు. కుండలముల నిచ్చునో, యీయడో, యీ బాధ్యత రాజుపై నున్నది. ఇపుడు మాట్లాడవలసినది పౌష్యుఁడే. తన దేవి యుదంకునికి గానరాని కారణమును పౌష్యుఁడు చెప్పెనా అది యుదంకున కవమానము. తన రాణి పవిత్రురాలని, యశుచులకుఁ గానరాదని పౌష్యుఁడు చెప్పినచో తన రాణి గొప్పతనము తెల్లమగుట యట్లుంచి యుదంకుఁడు అపవిత్రుఁడని యశుచి యనియుఁ జెప్పకయే చెప్పినట్లగును. మరి పౌష్యుఁడే విషయమును దాఁచినచో ఉదంకుఁడు రాజు నపార్థము చేసి కొనును, శపించును. రాజునకు సంకట స్థితి యేర్పడినది. విషయమేమో తెలియవలయును. ఉదంకుఁడు కోపగింపరాదు. ఇది యెట్లు? లోకజ్ఞుఁడు కదా, నన్నయ్యగారు,

కం॥ "భూవినుత! నిన్ను ద్రిభువన
పావను నశుచివని యెట్లు పలుకగ నగు న
ద్దేవి పవిత్ర పతివ్రత
కావున నశుచులకు గాన కాదనవద్యా!"

పౌష్యుఁడుదంకునితో నిట్లనెను.

పద్యమంతయు నుదంకుని గూర్చి ప్రశంసయే. "భూవినుత, త్రిభువన పావన, అనవద్యా, నీవు మూఁడు లోకములలో పవిత్రుఁడవు. నిన్ను పవిత్రుఁడని యెల్లందును. నా భార్య పవిత్ర పతివ్రత. అశుచులకుఁగానరాదు. నీవు అనవద్యుడవు" అశుచివని నిన్ననలేనుగాని నా భార్య యశుచులకుఁగానరాదు అని రాజన్నాఁడు. ఇది సంభాషణ లోని చాతుర్యము. గడుసుతనము, పొగడ్త యున్నది, నింద యున్నది. అశుచివని నిన్నెట్లనగలను అని రాజు పలుకుటలో నుదంకుఁడశుచియే నన్న యర్థము వ్యంగ్య భూతమయినది. ఈ వ్యంగ్యమును ఉదంకుఁడు వెంటనే గ్రహించెను. పౌష్యుఁడు తనను ప్రశంసించుచు ఆ ప్రశంసల మధ్య తనలోని పాపమును గూర్చి మర్యాదగా ఆ రాజు సూచించెనని యుదంకుఁడు గ్రహించెను. వృషభ గోమయ భక్షణ జనితమగు పాపము తనను వెంటాడి వచ్చినది. సంపర్కముచేత విస్తరించు పాపమునకు పంకమని పేరు.

"అనిన విని యుదంకుండు అప్పుడ తలంచి యా వృషభ గోమయ భక్షణంబున నైన యశుచి భావంబు గాకేమి" యని గ్రహించినాఁడు. తానేపాపము చేసెనో యుదంకునకు వెంటనే స్ఫురించెను. ఆ పాపము వృషభ గోమయ భక్షణము. ఈ పాపము పోగొట్టుకొనిన గదా యా దేవి కన్పించుట! ఈ శక్తి యుదంకున కున్నదా! ఉన్నది. ఉదంకుఁడు "అఘపంకక్షాళన మహాతపస్సలిలుఁ" డని "పంకజ భవసన్నిభుఁడ" ని కథా ప్రారంభమున నన్నయ్యగారు వ్రాసిరి. ఇది యొక రచనా శిల్ప రహస్యము. అతఁడు బ్రహ్మ (పంకజభవ) తో సమానుఁడు గావున బ్రాహ్మ్యమగు దృష్టితోఁ దాను జేసిన యశుచికార్యమును (గోమయ భక్షణము) గ్రహింపఁగలిగెను. ఆ పాపమును బోగొట్టుకొనజాలిన శక్తియుఁ దనకున్నది. పాపపు బురదను తపస్సు అను నీటితోఁ గడిగి వేయఁగలఁడు. (అఘపంకక్షాళన మహాతపస్సలిలుఁడు) వెంటనే యుదంకుఁడు "పూర్వాభిముఖుండై ప్రక్షాళిత పాణిపాదవదనుండై"నాఁడు పాపమునుండి విముక్తుఁడయినాఁడు. ఇంతకు మించి యుదంకుఁడు చేసిన పాపమేదియు లేదు. తనకుఁ గల "యఘపంక క్షాళన తపస్సలిలము" చేత "ప్రక్షాళిత పాణిపాద వదనుఁడై" నాఁడు. క్షాళన, క్షాళిత యను రెండు మాటలు గుర్తింప వలసి యున్నవి.

అసలు నన్నయ్యగారు "అవిరళ జపహోమ తత్పరుఁడగు" టచే ఋషుల కథలు వ్రాయుచున్నపుడు తానొక ఋషియై యుందురు.

వ్యాసుని కథనమును గూడఁబరిశీలించెదము. దివ్య పురుషుఁడు గోమయమును భక్షింపుమనఁగా నుదంకుఁడట్లే చేసెను. వెంటనే పాణి పాదప్రక్షాళన కార్యము చేసెను. అట్లయినచో నుదంకుని యందుఁ బాపముండదు గదా!

"తద్ వృషభస్య మూత్రం పురీషంచ భక్షయిత్వా ఉదంక స్సంభ్రమాదుత్థిత ఏవాప ఉపస్పృశ్య ప్రతస్థే" పౌష్యుని రాణి కన్పింపకుండుటకు ఉదంకుని యశుచిభావము కారణమయినచో ఆ యశుచిత్వము జలస్పర్శచే పోయినది. కాని యామె యుదంకునకు గానరాలేదు. ఈ క్లిష్టతను నన్నయ్యగారు తొలఁగించిరి. పాణి పాద ప్రక్షాళనమును పౌష్యుని కడ చేసెనని చెప్పుటచేత, రాణి యుదంకునకు గన్పడక పోవుటలోని యౌచిత్యమును గాపాడిరి. తన పాపము నుండి వెంటనే నివృత్తి బొందఁగలిగెను గావున నుదంకుఁడు "పంకజభవ సన్నిభుఁడుఁ"

ఇచ్చట రూఢ్యర్థము తీసికొన్నచో బురదనుండి పుట్టిన (తామర) దాని నుండి పుట్టిన వానితో (బ్రహ్మ) తో సమానుఁడని యర్థము వచ్చును. బురదనుండి పుట్టినను తామరయొక్క వాసనకు తరుగు లేదు. అట్లే బురదనుండి పుట్టిన, తామరనుండి పుట్టిన బ్రహ్మ మహిమయుఁ దరుగదు. పాపమను బురద తన కంటినను ఉదంకుని మహిమయుఁదరుగలేదు. బ్రహ్మకును, ఉదంకునకును గల యీ సామ్య మింతటిది. బ్రహ్మ యనటకు బదులు "పంకజభవుఁడని" ఉదంకుని గూర్చి "పంకక్షాళన తపస్సలిలుఁడని" రెండింట పంక శబ్దమునే వాడుట నన్నయ్యగారి సార మతిని నిరూపించుచున్నది.

ఉదంకుఁడిపుడు పవిత్రుఁడు. ఇంత వరకు పౌష్యుని రాణి తన కేల కానరాలేదో తత్కారణమును దెలిసినవాఁడు. రాజుపై నితఃపూర్వము పెంచుకొన్న యసమానము తొలఁగించుకొన్నవాఁడు. "నీవయకుండలంబులు తెచ్చియిమ్మని" యడుగువాఁడు కాదు. ఆత్మస్థైర్యము గలవాఁడు మరలఁ బౌష్యానుమతితో "అద్దేవి యొద్దకుఁ జని" నాడు. ఇపుడామె కన్పించునో, కన్పింపదో యన్న శంక, జంకులు లేనివాడు. అతఁడంతఃపురమేగగా

"అదియును (పౌష్యునిరాణి) నమ్మహామునికి నమస్కరించి కుండలమ్ములిచ్చి యిట్లనియె" కుండలములు కావలెనని యుదంకుడు దేవిని అడుగలేదు. అసలామెతో మాట్లాడనేలేదు. ఉదంకుని యభిప్రాయము దేవి కెట్లు తెలియును? ఉదంకుఁడు మౌనముగా నున్నాఁడు. "అమ్మహామునికి" రాణి నమస్కరించెనని చెప్పుటచేత నాయన మాట్లాడుటలేదని తెలియుచున్నది. పౌష్యుని భార్య "పవిత్ర పతివ్రత" త్రికాలజ్ఞురాలు. సర్వ విషయములు తెలిసినది. పూర్వము తన్ను చూడ వచ్చిన యుదంకున కామె కన్పడలేదు గాని యామె నుదంకుఁడు

కన్పడుచునే యున్నాఁడు. ఆ యుదంకుఁడు తన్ను కుండలముల నడుగుటకై వచ్చుట, అంతఃపురము ప్రవేశించుట, ఉద్యానవనములు, సౌధములు, మఱియుఁ దానెచ్చట నుండుట కవకాశ ముండునో యాయా ప్రదేశములన్నింట నుదంకుఁడు తన నన్వేషించుట - యివి యన్నియు నామె పరిశీలించుచునే యున్నది. కాని యతఁడశుచి. వాని మనోఽభిప్రాయము గూడ నామె యెఱుఁగును. ఇపుడు శుచియై వచ్చెను. అతని ప్రార్థన మన్నించి కుండలముల నిచ్చుటయే గాని, అతఁడేల వచ్చెనో యడుగ నవసరమామెకు లేదు. అందుకే యామె యుదంకునకు వెంటనే కుండలముల నిచ్చినదని నన్నయ్యగారు వ్రాసిరి.

ఇచ్చట వ్యాసుని కథనము వేఱుగా నున్నది. ఆ యదార్థ కథన దృష్టి వేఱు. శుచియయిన యుదంకుఁడు తనను జూచుటకు రాగా వారిరువురి మధ్య యిట్లు సంభాషణ జరిగినది.

"స్వాగతం తే భగవన్ ఆజ్ఞాపయ కిం కరవాణీతి; సతాము వాచ ఏతే కుండలే గుర్వర్థ మేభిక్షితే దాతు మర్హ సీతి॥" ఓయి, నీకు స్వాగతము. నీకు నేనేమి చేయుదునో ఆజ్ఞాపింపుము అని రాణి యనఁగా గుర్వర్థము కుండలములిమ్మని యుదంకుఁడడిగినాఁడు.

ఇప్పటున నన్నయ్యగా రుదంకుని చేత మాట్లాడించనేలేదు. కుండలముల నిచ్చిన రాణి

కం॥ తక్షకుఁడీ కుండలము ల
పేక్షించుచు నుండువాఁ డభేద్యుఁడు, మాయా
దక్షుండు వాని వలన సు
రక్షితముగ జేసి చనుము రవినిభతేజా!"

అని యుదంకుని హెచ్చరించినది. తక్షకుఁడను సర్పరాజును బ్రస్తావించినది. వాఁడు పాతాళవాసి. వానికి మాయలు తెలియును. ఉదంకుఁడు "రవినిభతేజుఁడు" ఆ కుండలములను సురక్షితముగాఁ దీసికొని వెళ్లవలయును. రవినిభ తేజా అను సంబుద్ధి యీ పద్యమున కాయువుపట్టు. రవి యనఁగా స్తుతింపఁబడువాఁడు. త్రిమూర్త్యాత్మక స్వరూపుడు. ఉదంకుని యందు సృష్టిస్థితిలయ కారకులగు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల తేజస్సు రాశీభూతమై యేకత్ర సమావిష్టమై యున్నది. ఉన్నదని పౌష్యుని రాణికిఁ దెలియును. ఆమె తక్షకుని దురాగతమును గూర్చి హెచ్చరింపఁగా నుదంకుఁడు "అట్లు చేయుదు" నన్నాఁడు.

పాతాళము తమోమయ లోకము. అచ్చట సూర్యుఁడుండఁడు, తక్షకాదులు పాతాళవాసులు. వారికి నుదంకుఁడు సూర్యోదయము వంటి వాఁడగుచున్నాడు. ఉదంకుని తేజము ముందుఁ దక్షకాదులు డీలుపడిపోవుదురు. ఇది యంతయు నుదంకుని తపస్సాధిత శక్తి. నన్నయ్య దంతయు ధ్వన్యాత్మకరచన.

కుండలములు తీసికొని యుదంకుఁడు పౌష్యుని వద్దకు వచ్చెను. "స ఏవ ముక్తాఃతాం క్షత్రియాం ఆమంత్ర్య పౌష్య సకాశ మాగచ్ఛత్" పౌష్యుఁ డుదంకునితో నిట్లుపలికెను "భగవన్ చిరేణ పాత్ర మాసాద్యతే, భవాంశ్చ గుణవానతిథిః తదిచ్ఛేత్ శ్రాద్ధం కర్తుమ్.... క్రియతాంక్షణ ఇతి" తన యింట విందారగించి పొమ్మని రాజుదంకుని బ్రార్థించెను.

సంస్కృత పదములనే స్వతంత్రమయిన క్రొత్తయర్థములతోఁ దెలుఁగువారు వాడుకోగలరు. అవసర, దిక్కు వంటి శబ్దముల నింతకు మునుపు పేర్కొంటిని. "తదిచ్ఛేత్ శ్రాద్ధం కర్తుమ్" మా యింట భోజనము చేయుమను సందర్భమున "శ్రాద్ధ" మను మాట వాడబడినది. పైతృకమగు కార్యమున శ్రాద్ధ మను మాటను దెలుఁగువారు వాడుదురు. ఇట్లే తద్దినమను మాట యున్నది. భుజించుట యను నర్థమున శ్రాద్ధమని వాడుటను తెలుఁగునాట సమంజసముగా నుండదు. "నీవు మా యింటఁ గృతభోజనుండవై పొమ్ము" అని నన్నయ్యగారు తెలుఁగు చేసిరి. సంస్కృతము నందలి శ్రాద్ధము తెలుఁగులో భోజనమయినది.

ఇక్కడ వ్యాసభారత మిట్లున్నది: "అథోదంక స్సకేశం శీతమన్నం దృష్ట్వా - అశుచ్యేతదితి మత్వా తం పౌష్యమువాచ.... .... యస్మాన్మేఽశుచ్యన్నం దదాసి తస్మా దంధో భవిష్య సీతి." పౌష్యన కుదంకుఁ డతిథి కదా! శీతాన్న (చద్ది యన్నము) మెట్లు పెట్టును? రాజు నింట నింతవరకు చద్దియన్న మెట్లున్నది? పై సంస్కృత వాక్యములనుబట్టి యిట్టి ప్రశ్న లుదయించుచున్నవి. అతిథి కెవరయినను చద్ది వంటకము పెట్టుదురా?

నన్నయ్యగారీ ఘట్టమును గొంతమార్చి యౌచిత్యమును సంపాదించిరి. పౌష్యుఁడుదంకునకు అన్నము పెట్టెను. అప్పుడు "కేశదుష్టంబైన రోసికరం బలిగి యిట్ల పరీక్షితంబయిన యశుద్ధాన్నంబు పెట్టినాఁడవు అందుండవగుమని శాపం" బు విచ్చినాఁడు. అన్నము కేశదుష్టమగుటకుఁ గారణము పౌష్యుఁడే. పౌష్యుఁడీ నేరమును దెలిసిచేయలేదు. పయిగా తనకుఁ గుండలముల నిప్పించి యుపకారమే చేసినాఁడు. అయినను ఉదంకుఁడు రాజును శపించెను.

ఉదంకుఁడు యత్నించి దపరాధము జరిగినను సహింపఁడని, ఆ యపరాధము నెవఁడు చేసినను సహింపఁడని, ఆ ముని కింత

యాగ్రిహము, పట్టుదల యున్నవని యీ శాపవృత్తాంతమువలన దెలియుచున్నది. ఇది అగామి పాతళలోక ప్రవేశకాల జనిత తీవ్ర కోపస్ఫూర్తిని ధ్వన్యమానము చేయుచున్నది.

పౌష్యుఁడు కూడ నుదంకుని శపించెను. పరస్పరము శపించుకొనిరి. లోకస్వభావ మిట్లుండును. కోపము, ద్వేషము, కక్ష వచ్చినపుడు తాముచేయుచున్న పనుల వలన గలుగు పర్యవసానమును ఎవ్వరు నాలోచింపరు. ఇరువురు నాశన మగుదురు. పశ్చాత్తాప పడుదురు. అప్పటి కన్నియుఁ జేతులు దాటిపోవును. నాశనమగుటయేగాని బాగుపడుట యుండదు. లోకస్వభావమును నన్నయ్య యిట్లు చిత్రించెను. కాని యుదంకుని విషయము వేఱు. ఆయన శాపానుగ్రహ సమర్థుఁడు. తా నిచ్చిన శాపమును ఉదంకుఁడు మరల్ప గలఁడు. పౌష్యుఁడు మరల్పలేఁడు. పౌష్యుఁడుదంకుని వేడుకొనెను.

"నిండు మనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము, జగన్నుత విప్రుల యందు, నిక్కమీ
రెండును రాజులందు విపరీతముగావున విప్రుఁ డోపు, నో
పం డతిశాంతుఁడయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మరింపగన్"

బ్రాహ్మణ క్షత్రియులకుఁ గల తారతమ్యమీ పద్యమున వర్ణింపఁబడినది. తనకుదంకుఁడిచ్చిన శాపము పోవలయును. ఉదంకుఁడిచ్చిన శాపమును అతఁడే మరల్పగలఁడు. రాజుదంకునికిఁగల శాపానుగ్రహ సామర్థ్యమును బ్రశంసించుచున్నాఁడు. "విప్రుల యందు నిక్కము, కావున విప్రుఁడోపు" అని యన్నాఁడు. పయి పద్యము నందు విప్రశబ్దము రెండు మారులు ప్రయోగింపఁబడినది. బ్రాహ్మణ, ద్విజ, అగ్రజన్మ భూసురాది శబ్దములను విడిచి రాజు చేత విప్రశబ్దమును సాభిప్రాయముగాఁ బ్రయోగింపఁ జేసెను. విప్రుఁడనఁగా నెవ్వరు? "విశేషేణపాపేభ్యః ఆత్మానం పరంచ పాతీతి విప్రః" తనను పరుని విశేషముగాఁ బాపము నుండి రక్షించువాఁడు విప్రుఁడని యర్థము. ఉదంకుఁడు తానురాజునకిచ్చిన శాపమును బోగొట్టగలఁడు. తనకు రాజిచ్చిన శాపమును బోగొట్టగలఁడు. రాజు శపింపఁగలఁడుగాని, శాపమునుదొలఁగింపఁ జాలఁడు. ఋషి యయిన యుదంకుని మహిమ యిట్లు విప్రశబ్ద ప్రయోగముచేత నిరూపింపఁబడినది. "యథా నవనీతం హృదయం బ్రాహ్మణస్య, వాచిక్షురో నిశిత స్తీక్ష్ణ ధారః తదుభయ మేతద్విపరీతమ్. క్షత్రియస్య వాఙ్నవనీతం హృదయం తీక్ష్ణధారః...." బ్రాహ్మణ శబ్దమును విప్రశబ్దముగా మార్పఁబడినది.

ఇది యిట్లుండగా "నిండుమనంబు" వంటి పద్యమునకు "నిండుమనంబు" పద్యమే సాటియని తిక్కన్నగారు ప్రశంసించి రని యొక కీర్తి పై పద్యమునకున్నది. నన్నయ్యగారి గొప్ప తిక్కన్నకుఁ దెలియును.

పౌష్యునకు శాపము తీరినది. ఉదంకుని శాపము తీరలేదు. సంతానము లేకుండెడుమని పౌష్యుఁడు ఋషియగు నుదంకుని శపించెను. ఆ శాపమును ఉదంకుఁడు మరల్చుకొనఁడేమి? బ్రహ్మ యంతివాఁడు కదా! కావుననే మరల్చుకొనలేదు. పౌష్యుఁడు తనను శపించి నట్లుండెనుగాని తనకు సంతానయోగ్యత యెట్లును లేదన్న విషయము నుదంకుఁడెఱుఁగును. ఇది కర్మానుభవము యొక్క స్థితి. శాపములయొక్క యంతరార్థము.

ఉదంకుఁడు "పౌష్యున కనుగ్రహించి మగుడి పోవునెడ గురుపత్నికిఁ గుండలంబు లీఁగంటినని మనంబున సంతోషించి చనువాఁడెదుర నొక్క జలాశయంబు గని శుచిప్రదేశంబున దనచేతి కుండలంబులు పెట్టి యాచమించు చున్నంతఁదనతోడన వచ్చి తక్షకుండు నగ్నవేషధరుండై యక్కుండలంబులుగొని పాఱిన ...."

ఇది యంతయు నొక్క యసంపూర్ణవాక్యము. హృదయము నందిమిడ్చు కోలేని యన్ని యాలోచనలున్నవి. లోనారసి మేలవదగు నంశములున్నవి. ఇట నన్నయ్య ప్రసన్నకథా కలితార్థయుక్తిఁ దెలియుటకు ముందు సంస్కృత భారతమును గూడఁ జదువ వలయును. అది యిట్లున్నది.

"ఉదంకః తే కుండలే గృహీత్వా, సోఽపశ్య దథపథి నగ్నం క్షపణక మాగచ్ఛంతం ముహుర్ము - హుర్దృశ్యమాన మదృశ్య మానంచ-అథోదంక స్తే కుండలే సన్యస్య భూమావుదకార్థం ప్రచక్రమే, ఏత స్మిన్నంతరే స క్షపణకః త్వరమాణ ఉపసృత్య తే కుండలే ప్రాద్రవత్॥"

సంస్కృత భారతమున యదార్థ సంఘటనలు వ్రాయబడినవి గావున సర్వత్ర శిల్పమును వెదుకరాదు. నన్నయ్య భారతము సర్వశిల్పాభి రామము.

కుండలములను దీసికొని గృహాభిముఖుఁడై యుదంకుఁడు వచ్చుచుండఁగా దారిలో నగ్నరూపధారి యయిన తక్షకుఁడు వచ్చుటను ఉదంకుఁడు చూచెనని వ్యాస భారతమున గలదు. ఆ తక్షకుఁడొకసారి కన్పించి యొకసారి కన్పింపకున్నాఁడు. తన వెనుక వచ్చుచున్న దృశ్యాదృశ్య స్వరూపుడగు తక్షకుని జూచుచున్న యుదంకుఁడు, కుండలములను భూమిమీఁద విడిచి వెళ్ళుట యజాగ్రత్త కాదా! పౌష్యుని రాణి తనను హెచ్చరించెనుగదా!

ఉదంకుఁడు తక్షకుని విషయమై యలసుఁడై యుండుట యేమి? ఇట్టి ప్రశ్నలు సంస్కృత భారత కథనము వలనఁ బుట్టుచున్నవి.

వ్యాసుని భావమును నన్నయ్యగా రుపలక్షించిరి. ముని ప్రణీత పరమార్థమును దెల్లము జేసిరి. తక్షకుఁడు తనకుఁ గన్పించుచు, మాయమగుచు, తనను వెంటాడుచు వచ్చుచున్నాఁడని తెలిసియు ఉదంకుఁడి కుండలములను భూమిపైఁబెట్టుటను నన్నయ్య సమర్థించెను. తెలిసి తెలిసి కుండలములను విడుచుటకుఁ దగిన హేతువును గల్పించిరి.

"గురుపత్నికిఁ గుండలంబు లీఁగంటినని మనంబున సంతోషించి ...." నాఁ డుదంకుఁడు సాధించిన మహత్కార్యము వలన కలిగిన సంతోషము ఉదంకుని మనస్సు నావరించి యున్నదని నన్నయ్యగారి కల్పన. గురుకార్య నిరతుఁడైన ప్రతి శిష్యునకు నిట్టి సంతోషము మనస్సు నావరించియుండుట సహజము. ఇన్నాళ్లు తను శ్రమపడి గురుకుల క్లిష్టుఁడై సాధించిన విద్యకుఁ బరిపూర్ణత యేర్పడు చున్నది. ఏతాదృగానంద భావపరంపర యందుండి యుదంకుఁడు ఇతర విషయములను మరచెను. పౌష్యుని రాణి హెచ్చరిక గాని, తక్షకుడు తనను అనుసరించి వచ్చుటను గాని యుదంకుఁడు గుర్తింప లేదు. ఆ తక్షకుఁడు నన్నయ్యగారి భారతములో "నగ్న వేషధరుఁడై" వచ్చెను. కాబట్టి యుదంకుఁడు వానిని జూచుట కవకాశము లేదు. కుండలములను శుచి ప్రదేశమున నుంచి యాచమనార్థము వెళ్లెను. ఇట్టి నిత్య కర్మానుష్ఠానముల విషయమున మరపు రాకుండుట సామాన్య విషయము.

కుండలములనపహరించి పాఱిపోవుచున్న తక్షకుని ఉదంకుఁడు చూచెను. వెంటాడెను. ఈ సందర్భమును వ్యాసుఁడిట్లు వ్రాసెను. "తముదంకః అభిసృత్య కృతోదక కార్యశ్శుచిః" తక్షకుఁడు కుండలములను అపహరించుకొని పోవుచుండఁగా వెంటనే పరుగెత్తి పట్టుకొనవలయును గాని చేయుచున్న ఆచమనము పూర్తిచేయు వరకుఁ దక్షకుఁ డుండఁడు గదా!

ఆచమనము పూర్తిచేసిన తరువాత నుదంకుఁడు వెళ్లినట్లు వ్యాసభారతమున వర్ణింపఁబడినది. తెలుగు భారతమున వేఱుగా నున్నది.

"శుచి ప్రదేశంబున తన చేతి కుండలంబులు పెట్టి యాచమించుచున్నంత" లో కుండలాపహరణము జరిగినది. ఉదంకుఁడు "వాని పిఱుందన పాఱి" నాఁడు. తక్షకుఁడు దొంగతనము చేసెనని గ్రహించినంతనే యుదంకుఁడు తాను చేయుచున్న ఆచమన కార్యమును విడిచి వెంటపడి పరుగెత్తెను. ఇట్లు చేయుట యుదంకుని గురుహిత కార్యధురంధరత్వమే. ఆచమనమును మధ్యలో విడిచినందువలన వచ్చిన పాపము సంగతి యట్లుంచి కుండలములను తిరిగి స్వాధీనము చేసికొనుట ప్రధాన విషయము. తనకు అఘపంక క్షాళన మహాతపస్సలిలమున్నది గావున పాపమును బోగొట్టు గొననగును. చిక్కులేదు.

తక్షకుఁ డెవరు? వాఁ డెట్లుండును? వాఁడొక సర్పరాజు. మాయావి. కద్రూకశ్యపుల సంతానము. నగ్నరూపము ధరించి యుండువాఁడు. నగ్నత యనఁగా దిగంబరత్వము. సిగ్గులేని తనము. వాఁడొక వేషమును ధరించియుండును. ఉండఁడు. అది యితరులకుఁ గానరాదు. వాఁడు కృశింపఁగలఁడు. సార్థకమయిన పేరున్నవాఁడు.

ఇక్కడ నొక విషయమును చర్చింపవలయును. సంస్కృత క్రియల కెంత భావ, బోధకశక్తి యున్నదో తెలుఁగు క్రియలకును అంతే శక్తి యున్నది. తక్షకుఁడు కుండలముల గొని "ప్రాద్రవత్" అని సంస్కృతము. తక్షకుండు కుండలంబుల గొని "పాఱిన" అని తెలుఁగు భారతము. ప్రాద్రవత్, పాఱుటయను రెండు క్రియలు భావ స్ఫోటయందు సమానమగు శక్తిమంతలే. ప్రాద్రవత్ అనినను, పాఱుట యనినను నీరు వలె జారిపోవుట యను నర్థము నిచ్చును. తక్షకుఁడు పరుగెత్తుటయందలి వేగాతిశయమును సూచించును.

ఉదంకుఁడు వాని (తక్షకుని) పిఱుందన పాఱి పట్టుకొనుఁడు.

కం॥ విడిచి దిగంబర వేషము
విడువక మణి కుండలములు విష ధర పతి యే
ర్పడ నిజరూపముతో న
ప్పుడ యహిలోకమున కరిగె భూవివరమునన్॥"

ఈ పద్యమునందు "విడిచి" యను క్రియను రెండు విధముల నన్వయింప వచ్చును. ఉదంకుఁడు తనను (తక్షకుని) పట్టుకొనుఁడు వానిని "విడిచె" నాఁడని యొకటి, దిగంబర వేషమును విడిచి నాఁడని రెండవది. ఇట్టి క్రియాన్వయగత చమత్కారము వలన రచన కొక సొగసు వచ్చినది.

తక్షకుఁడు విషధరపతిగా పునస్స్వస్వరూపముతో (పాము) బిలముద్వారా నాగలోకమునకుఁ బాఱిపోయెను. వాఁడు సర్పము గావున తన శరీరమును కృశింపఁజేయఁగలఁడు. సూక్ష్మమయిన

శరీరముతోఁ బాతాళమును జేరఁగలఁడు. ఉదంకుఁడెట్లు చేయఁగలఁడు? ఆయన శరీరము స్థూలమయినది గదా!

"తక్షకుండును వాని తోడన తగిలి యవ్వివరంబున నురగలోకంబున కరిగి" నాఁడు. అతి సూక్ష్మ శరీరముగల తక్షకుఁడు మాత్రమే ప్రవేశింపఁగల రంధ్ర మార్గముననే యుదంకుఁడు పాతాళలోకము నెట్లు చేరఁగల్గినాఁడు? అట్లు చేరఁగల శక్తి యుదంకున కున్నదా? ఉన్నది. ఉన్నదని యెట్లు తెలిసినది? నన్నయ్యగారు చెప్పిరి. వ్యాసుఁడు చెప్పలేదు. ఉదంకుఁడు

"గురుకులము నందు గురునకుఁ
బరిచర్య లొనర్చి తానపరిమిత నిష్ఠా
పరుఁడై జ్ఞానము వడసెను
గురుదయ నణిమాదికాష్ట గుణముల తోడన్."

అణిమాది (శరీరమును సూక్ష్మముగాఁ జేయగల శక్తి) సిద్ధులను ఉదంకుఁడు ఏనాఁడో నేర్చికొని యున్నాఁడని యుదంకుని కథాప్రారంభమున నన్నయ్య వ్రాసిరి. అణిమాది సిద్ధులుదంకునికిఁ దెలియునన్న విషయమును వ్యాసుఁడు చెప్పలేదు.

తక్షకుఁడు జారిపోవుచున్నాఁడు. వాని "తోడన తగిలి" యుదంకుఁడును జారిపోవుచున్నాఁడు. తగిలి యను క్రియ బహు విలక్షణ మయిన యర్థములో వాడఁబడినది. తగులు అనఁగా చిక్కు, పట్టు, తాకు, అను మూఁడర్థములున్నవి. ఈ మూఁడర్థములను అన్వయింపవచ్చును. ఉదంకునకు తక్షకుఁడు చిక్కెను. నునుపుదేలిన శరీరము గల తక్షకుని జారకుండ పట్టుట చాల కష్టము. కాని యుదంకుఁడు వానిని విడువక పట్టుకొనెను. వెలుపలే ఎ బుద్ధిగల యుదంకుఁడు పాతాళమును బ్రవేశించు విషయము నాలోచింపలేదు. ఆలోచించుచుఁ గూర్చున్నచోఁ దక్షకుఁడు జారిపోగలఁడు. అనాతంకమతియగు నుదంకుఁడు అణిమ యను విద్య నుపయోగించి బిలప్రవేశము చేసెను.

ఉదంకుఁడు స్వశక్తి యుక్తులతోఁ బాతాళము ప్రవేశించినట్లు నన్నయ్య వర్ణించిరి. వ్యాసుని కథనము భిన్నముగా నున్నది. "అథ ఉదంకః తస్యాః క్షత్రియాయాః వచః స్మృత్వా తం తక్షకమన్వగచ్ఛత్, స తద్బిలం దండకాష్ఠేన చఖాన, న చా శకత్ తం క్లిశ్యమాన మింద్రోఽపశ్యత్, స వజ్రం ప్రేషయా మాస, గచ్ఛ అద్య బ్రాహ్మణస్య సాహాయ్యం కురుష్వ ఇతి.... .. అథ వజ్రం దండకాష్ఠమను ప్రవిశ్య తద్బిల మదారయత్........" పౌష్యుని రాణి తనకుఁ జేసిన హెచ్చరికను తలఁచుకొనుట, ఉదంకుఁడు కఱ్ఱతో బిలము త్రవ్వపని కష్టముగానుండుట, ఇంద్రుఁడు సాహాయ్యమునకై తన వజ్రమును బంపుట, ఆ వజ్రము దండ కాష్ఠమున బ్రవేశించి బిలమును జేసి యుదంకునకుఁ దోడ్పడుట,-యీ పనులన్నియు జరుగుటకుఁ గాలవిలంబన మెంతయో జరుగును. ఉదంకునకుఁ దక్షకుఁడు చేజారిపోవును. బిలము త్రవ్వి యుదంకుఁడు ప్రవేశించుట యనఁగాఁ దక్షకుఁడు అందడని చెప్పుటయే.

ఒక చిన్న విషయమును జెప్పి పయి సందేహముల నన్నింటిని నన్నయ్యగారు అద్భుతముగా పటాపంచలు చేసిరి. ఉదంకుఁడు బిలము త్రవ్వలేదు. తక్షకుఁడు రంధ్ర ప్రవేశము చేసినంతటనే యుదంకుఁడు తన నేర్చిన విద్యయొక్క సద్యస్స్ఫురణ చేత తానును సూక్ష్మశరీరుఁడయినాఁడు. ఇది యణిమయను విద్య. ఈ విద్య గురుకులమున చిన్ననాడే యుదంకుఁడు నేర్చెనని నన్నయ్య చెప్పిరి.

ఉదంకుఁడు నాగలోకము ప్రవేశించెను. అతఁడు చేసిన సర్పస్తోత్రము వేదము నందలి ఋక్కుల వలె భాసించుచున్నది. అనంతుఁడు, వాసుకి, ఐరావతము, తక్షకాదులు ప్రశంసింపఁబడిరి. నాగలోకము తనకుఁ గ్రొత్తది. ఎవరెట్టివారో తెలియదు. సర్పముల క్రౌర్యము ఉదంకునకుఁ దెలియనిదికాదు. వారిలోని గుణములనే పెద్దవి చేసి వర్ణించుట యుదంకుని గడుసుదనము మరియు లోకజ్ఞత.

చం॥ "బహువన పాదపాబ్ధి కుల పర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహా మహీభర మజస్ర సహస్ర ఫణాళిఁదాల్చి దు
స్సహతర మూర్తికిన్ జలధి శాయికిఁ బాయక శయ్యయైనయ
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెఁడున్"

చం॥ .... అద్రినందనే
శ్వరునకు భూషణంబయిన వాసుకి మాకుఁ బ్రసన్నుఁడయ్యెఁడున్

చం॥ .... మహానుభావులై
రావతకోటి ఘోరఫణి రాజులు మాకుఁ బ్రసన్నులయ్యెఁడున్.

ఉ॥ .... ఈక్షణ
శ్రోత్రవిభుండు తక్షకుఁడుశూరుఁడు మాకుఁ బ్రసన్నుఁడయ్యెఁడున్

ఈ ప్రశంసలన్నియుఁ గార్య సాధనకుఁ జేయఁబడినవేగాని మనసార భక్తితోఁ జేసినవిగావు. ఉదంకుని మనస్సులో సర్పములపై నాగ్రహము పొంగిపోవుచుండఁగా వారినిఁ గీర్తించునా? నాగ

లోకము తనకుఁ గొత్తదియగుటచేత నుదంకుఁడిట్లు ప్రవర్తింప వలసి వచ్చినది. అవకాశము వచ్చెనా పాముల యంతు తేల్పఁ గలఁడు. ఇంతలో నొకానొక దివ్యపురుషుఁడు కన్పడి వరము వేడుకొమ్మని చెప్పఁగా నుదంకుఁ డేమిచేసెను? తానింతవరకు ఏ నాగకులమును ప్రశంసించెనో ఆ "ఇన్నాగకులం బెల్ల నాకు వశంబగునట్లుగా అనుగ్రహింపుము" అని యడిగి యాపైని "నాగలోకంబున కెల్ల మహాక్షోభంబు గావించి" నాఁడు.

లోకజ్ఞత యిట్లుండును. సమయోచిత ప్రవర్తన కార్య సాధకుల లక్షణము. అనంతుఁడు విష్ణువును భరించుచున్నాఁడని, వాసుకి శివుని కంఠాభరణమని, ఐరావతాదులు శత్రుసంహార క్రియా నిపుణులని యుదంకుఁడు చేసిన ప్రశంసలు యదార్థములే. తక్షకుని గూడ నుదంకుఁడు ప్రశంసించెను. ప్రశంసింపలేదు.

ఉ॥ గోత్ర మహామహీధర నికుంజములన్, విపినంబులన్ గురు
క్షేత్రమునన్ బ్రకామగతి ఖేలన నొప్పి సహాశ్వసేనుఁడై
ధాత్రిఁ బరిభ్రమించు బల దర్పపరాక్రమ దక్షుఁ డీక్షణ
శ్రోత్రవిభుండుతక్షకుఁడుశూరుఁడుమాకుఁబ్రసన్నుఁడయ్యెఁడున్.

పర్వతములపై, అరణ్యములలో నిష్టము వచ్చినట్లు తిరుగును. భూమిమీఁదఁ బరిభ్రమించుచుండును. ఇతనికి చూచునట్టి కన్నులే చెవులు. ఇటువంటి తక్షకుఁడు శూరుఁడు. తనను మోసగించి కుండలములను దొంగిలించిన తక్షకుని శూరుఁడని యనుట వాఁడు పిరికివాఁడని చెప్పుటయే. తక్షకుఁడు అవయవ సంపూర్తిలేనివాఁడు. వానికిఁగన్నులే చెవులు. అనంతుఁడు, వాసుకి మొదలగు వారికి నిట్లే యుండును. కాని వారినిగూర్చి యుదంకుఁ డేమాటలు చెప్ప లేదు. వారిపై నుదంకునకుఁ గోపములేదు.

వెదకినప్పటికిని దక్షకుఁడు కానరాలేదు. ఇంతలో "అర్వురు కుమారులు, ఇద్దఱు స్త్రీలు" మరియు "అతి ప్రమాణ తురంగంబు నెక్కినవాని మహాతేజస్వి నొక్క దివ్యపురుషుంగని విపులార్థ వంతంబులైన మంత్రంబుల నతిభక్తి యుక్తుండై స్తుతియించినం బ్రసన్నుండై యద్దివ్యపురుషుం డయ్యుదంకున కిట్లనియె."

నన్నయ్య మంత్రశాస్త్రవేత్త మరియు మంత్రోపాసకుఁడు. అయీ లక్షణమును దివ్యపురుషుని వృత్తాంతమున దర్శింపవచ్చును. అతి ప్రమాణ తురంగంబు నెక్కిన దివ్యపురుషుఁడే ఇంద్రుఁడు. ఇంద్రుఁడు దేవతల కధిపతి. దేవతలు తేజశ్శరీరులు. వారు తమ తేజస్సును తమ యిచ్చ వచ్చిన రూపముల యందుఁ బ్రదర్శింపఁ గలరు. ఆ రూపములన్నియుఁ దేజోమయములు. ఒకొక్క దేవత యొకొక్క మంత్రమున కధిష్ఠానమూర్తి. ఆ మంత్రమును దెలిసి యుపాసన చేయుట ద్వారా ఆ యుపాసకుఁడు ఆయా దేవతలను ప్రత్యక్షము చేసికొనఁగలఁడు. ఉదంకునకు దివ్య పురుషుఁడు ప్రత్యక్షమయ్యెను. కరచరణాద్యవయవములతోఁగాక దివ్యమగు తేజోరాశిగా బ్రత్యక్షమయ్యెను. ఆ తేజోమయ స్వరూపమును మూర్తిమంతము గావింప వలయును. ఉదంకుఁడు "విపులార్థవంతంబులైన మంత్రములతో" ఆరాధించెను. ఉపాసించెను. ఈ యుపాసనాశక్తిచేత నా దివ్యతేజ మింద్రాకృతి యయ్యెను. ప్రసన్నమగుట యనఁగా నిట్లుండును. ఆ దివ్య పురుషుఁ డింద్రునకుఁ "బ్రసన్నుఁ" డయ్యెనని నన్నయ్య వ్రాయుటలోని రహస్యమింతటిది. ప్రసన్నత యనఁగా నిర్మలముగా ప్రకృష్టముగా మనస్సును బొందుట యని యర్థము. క్లిష్టముగా, జటిలముగా, అస్పష్టముగా నున్న యేదేని విషయము మనకుఁ దెలిసినప్పుడు అది ప్రసన్నమయినదని యందుము. తనకుఁ గొంత దూరముగా తేజమయముగా వెలిఁగిపోవుచున్న యా రూపము ఉదంకుని మంత్రశక్తిచేత నొక నిర్మలాకృతి యయినది. ఇదమిత్థమని నిర్ణయింప రాని జాజ్వల్యమానమగు తేజస్సునకు రూపము గల్పించి నిల్పుకొనుటయే ప్రసన్నము చేసికొనుట. ఉదంకుఁ డీపని చేసెను. నన్నయ్యగారి కవిత్వమును గూడ యిట్లే ప్రసన్నము చేసికొనవలయును.

ఇది యిట్లుంచి దివ్యపురుషుఁ డుదంకునకు బ్రత్యక్షమయ్యెను. ఇక్కడ మరల చిక్కువచ్చినది. పూర్వము తనచేత వృషభ గోమయమును భక్షింపఁజేసిన వాఁడే యీ దివ్యపురుషుఁడు. అసలే నాగులపై ఆగ్రహము నొందిన యుదంకుఁడు, దివ్య పురుషునిపై విఱుచుక పడవలయును. దివ్యపురుషునికి నుదంకుని స్వభావము తెలియును. ఉదంకుని కంటె ముందే దివ్యపురుషుఁడు మాట్లాడుచున్నాఁడు.

"మితవచన నీ యదార్థ
స్తుతుల కతి ప్రీతమానసుఁడనైతి ననిం
దిత చరిత నీకు నభివాం
ఛిత మెయ్యది దానిఁ జెపుము చేయుదు ననినన్."

ఉదంకునకు దివ్య పురుషునిపైఁ గోపము చల్లారినది. సామాన్యుఁడయినచోఁ దనకుఁ గుండలములు తెప్పియిమ్మని యడిగియుండెడివాఁడు. ఉదంకుఁడిట్లు అడుగలేదు. భవిష్యద్భారత కథాబీజముగా మాట్లాడెను. తనకు

"నాగకులంబెల్ల వశంబగు నట్లనుగ్రహింపుము" అని దివ్యపురుషుని వేడెను. తక్షకుఁడు చేసిన యపకారమునకు నాగ

కులము నెల్ల దహింప వలయునని యుదంకుని పట్టుదల. ఇందుకు దివ్యపురుషుఁ డంగీకరించెను. తానెక్కి వచ్చిన "అశ్వ కర్ణ రంధ్రాధ్మానము" చేయుమని యుదంకునకు సూచించెను. ఉదంకుఁడా గుఱ్ఱము చెవిలో నూదెను. చెవిలో నూదుట యనఁగా రహస్యముగా చెప్పుట యనియుఁ జెప్పవచ్చును. ఉదంకుఁడు గుఱ్ఱము చెవిలో నూదగా పాతాళలోక మల్లకల్లోలమయ్యెను.

"పాతాళైక నికేతనాంతరమునన్ బర్వెన్ దదశ్వాఖిల
స్రోతోమార్గ వినిర్గతోగ్ర దహనార్చుల్ పన్నగవ్రాతముల్
భీతిల్లెన్ భుజగాధి నాథుమనమున్ భేదిల్లెఁ గల్పాంత సం
జాతప్రోత్థిత బాడబానల శిఖా శంకాదికాతంకయై"

ఆగామి జనమేజయ సర్పయాగ కథాప్రపంచమున కిది బీజము. గుఱ్ఱమునుండి పుట్టిన యగ్ని కల్పాంతవేళ సముద్రమున బుట్టిన బాడబాగ్నివలె దహించు చుండఁగా తక్షకుని గుండె పగిలినది. ఆ గుఱ్ఱమునుండి యీ యగ్నిజ్వాల నెవరు పుట్టించిరి? బాడబ మనఁగా నేమి? సముద్రమున బుట్టిన నగ్నిని బాడబ మందురు. ఇది యశ్వముఖాకారమై యుండును. మఱియు బాడబుఁ డనఁగా బ్రాహ్మణుఁడు. ఇది బాడబాగ్ని. గుఱ్ఱము నుండి పుట్టిన యగ్ని. ఆ యగ్నిని బాడబుఁడు (బ్రాహ్మణుఁడైన యుదంకుఁడు) పుట్టించెను. "బాడబాగ్ని రివాత్ర్యప్తో బాడబః"

శబ్దశాసనుఁడైన నన్నయ్య ప్రయోగము లిట్లుండును. తాను చూచుచున్న యగ్నికిఁ గారణ ముదంకుఁడేనని, ఆయన యాగ్రహమేనని గుర్తించెను. భయపడెను. బాడబాగ్ని యనుట చేత బ్రాహ్మణునివల్ల పుట్టిన కోపమని భావము.

"శంకర నిభుఁడగు విప్రు భ
యంకర కోపాగ్ని యొక్కొ యనుచును జాతా
తంకుండయి కుండలము లు
దంకునకును దెచ్చియిచ్చెఁ దక్షకుఁడంతన్."

శంకరుఁ డనఁగా సుఖముగల్గించువాఁడు. శివుఁడు. ఉదంకుఁ డిట్టివాఁడు. ఆగ్రహించినచో శివుఁడు కంటినుండి మంటలు పుట్టింపఁ గలఁడు. అనుగ్రహించినచో శుభములు కల్గింపఁ జేయను గలఁడు.

తక్షకుఁడు కుండలములను తిరిగియిచ్చెను. దివ్యపురుషుని అనుగ్రహముతో నుదంకుఁడు అతి వేగముగా గురువు నింటికి వచ్చెను. తన గురుపత్ని "తదానీత రత్నకుండల భూషితయై బ్రాహ్మణులం బూజించినది." ఈ సందర్భమున గురుపత్ని యుదంకునితోఁ బలికిన మాటలను వ్యాసుఁడిట్లు వ్రాసెను.

"అనాగతోఽసి యది ముహూర్తం మయాశప్తోభవిష్యసి" (సమయమునకు నీవు రాకుండినచో నేను నిన్ను శపించి యుండెడి దానను). దగ్గరలో నున్న పౌష్యునింటికి వెళ్ళి తిరిగి వచ్చుట కింత యాలస్యమేల జరిగినదో తెలిసికొనకుండ, గురుపత్ని యుదంకునిపై నాగ్రహించుట చిత్రముగా నున్నది. గురువుగారయిన పైలుఁ డేమియును మాట్లాడలేదు. అణిమాది సిద్ధులు తెలిసిన యుదంకుఁడు ఆలస్యమేల చేసినో గురువునకుఁగూడ సందేహముగానే యున్నది. కుండలములను దెచ్చినప్పటినుండి యుదంకుని ముఖమునందు గోపము గూఢముగా నుండుటను గూడ గురువు గుర్తించెను. ఒకనాఁ డుదంకునితో నిట్లనెను.

కం॥ ఈ యున్న పౌష్యుప్రోలికిఁ
బోయి కడుం బెద్ద దవ్వు పోయిన యట్ల
త్యాయత విమల తపోమహి
మా! యిన్ని దినంబు లేల మసలితి చెపుమా.

ఉదంకుని గురువయిన పైలుఁడు గొప్ప యూహశాలి. తన శిష్యునికిఁ గోపం వచ్చెనని పైలుఁడు గ్రహించెను. తనకుఁ గోపము వచ్చిన విషయము గురువునకుఁ దెలిసినదని యుదంకుఁడు గ్రహించెను. గురువు శిష్యునితో నిట్లనియెను.

"ఇన్ని దినంబు లేల మసలితి చెపుమా" మసలుట యనఁగా ఆలస్యము చేయుట యని యొక యర్థము. మసలుట యనఁగా సలసల క్రాఁగుట యని మరియొక యర్థము. ఉదంకుఁడు కుండలములను దెచ్చుటలో ఆలస్యము చేయుటను, ఆనాటినుండి యతని మొగములో ఏదో సల సల క్రాఁగుచున్న వైఖరిని గురువు గమనించెను. ఇన్నాళ్లేల యాలసించితివని పైకి అర్థము వచ్చునట్లు, ఇన్నాళ్లనుండి యాగ్రహించుచున్నావేమని, గూఢముగా నర్థము వచ్చునట్లు ప్రశ్నించెను. మసలు అను క్రియ యింత విపులార్థమును పుట్టించినది. గురువు ప్రశ్నకుఁదగినట్లే యుదంకుఁడు సమాధానము నిచ్చెను. మీ యానతిచ్చినట్లు మసల వలవదు, తక్షకుండను దుష్టోరగంబు చేసిన విఘ్నంబున నింత మసల వలసె" ఉదంకుఁడు కూడ గురువు వలెనే మసలు అను క్రియను వాడెను.

మీ యానతిచ్చినట్లు మసల (అలసింప) వలవదు. తక్షకుండను దుష్టోరగంబు సేసిన విఘ్నంబున నింత మసల (ఆగ్రహింప) వలసె.

ఉదంకుడు ఋషి. ఆయనకు సర్పజాతిపైఁ గోపము వచ్చెను. కోపము వచ్చినట్లు కన్పడెను. సర్ప ప్రళయమునకు దానై పూనుకోవలయును. ఆయీ విషయమునెల్ల ద్రష్టయగు నుదంకుఁడు తెలిసికొని యున్నాఁడు. పైలుఁడు కూడా తెలిసికొని యున్నాఁడు. శిష్యుఁడు పొందిన ఆగ్రహము నందలి యౌచితిని గురువు మన్నించెను. లేనిచో ఏ గురువు శిష్యుని ఆగ్రహము నంగీకరించును ?

"కర మిష్టము సేసితి మా
కరిసూదన ! దీన నీకు నగు సత్ఫలముల్
గురుకార్య నిరతులగు సత్
పురుషుల కగుటరుదె యధిక పుణ్యఫలంబుల్."

పైలుఁడుదంకునిఁ జూచి "అరిసూదన" (శత్రువులను సంహరించువాఁడా) యని సంబోధించెను. ఇది కేవల సంబోధన కాదు. శత్రుసంహారము చేయుమని పురికొల్పుటయే. ఈ విధముగా గుర్వాజ్ఞయయినది. ఉదంకుఁడు మునివరుఁడుకాకపోలేదు. గురు ఋణవిముక్తుఁడయిన యుదంకుఁడు "అనేక కాలంబు తపంబు సేసె" మఱియు "తక్షకు చేసిన యపకారంబునకుం బ్రతీకారంబు సేయందలంచి జనమేజయు పాలికిం బోయి"నాఁడు. తపము చేయుట ముని లక్షణము. శత్రుకృతావమానమునకుఁ బ్రతీకారము చేయుట వీరుని లక్షణము. మునివరునకి వీరత్వమెందుకు ? గురువు కూడా దీనిని అంగీకరించుట యేమి ?

ఇది ఋషి చరిత్ర. ఈ సృష్టికర్మానుభవమునకై యేర్పడినది. ఏ జీవుఁడు ఏ కర్మనాచరించుటకు, ఏ కాలమున పుట్టునో ఋషు లెఱుఁగుదురు. వారు బ్రహ్మజ్ఞానులు. వారికిఁ గోప తాపములుండవు. కోపాగ్రహముల నభినయింతురు. వారు ప్రతి విషయమును "లోనారసి" చూచుచుందురు. వారికి సృష్టియొక్క పరమార్థము ప్రసన్నమగును. సర్పయాగము జరుగునని యుదంకునకు దెలియును. తానందుఁ బ్రముఖ పాత్రధారి కావలయును. పాములను అకాండతాండము చేయవలయును. పాములు తనకేమి యపకారము చేసెను ? కుండలములను దెచ్చునపుడు తక్షకుఁడు తనను మోసగించెను. ఈ యపకారము నిమిత్త మాత్రము. నాగకులమునెల్ల అగ్నిలో వేయుట కుదంకుఁడు సంకల్పించెను. భగవంతుని యొక్క సృష్టిలో దను నిర్వర్తింప వలసిన పనిని ఋషియగు నుదంకుఁడు నిర్వహించు చున్నాఁడు. జనమేజయునికి సర్పయాగబుద్ధి పుట్టించినను ఉదంకుఁడు 'మునివరుఁడే'. పంకజ భవసన్నిభుఁడే, శంకరనిభుఁడే. నారాయణ స్వరూపుఁడగు వ్యాసుని శిష్యుఁడగు పైలుని శిష్యుఁడగుటచే విష్ణుస్వరూపుడే. త్రిమూర్త్యాత్మక మయిన వాఁడు. అందుకే పౌష్యునిరాణి యుదంకుని "రవి నిభతేజా" అని ప్రశంసించినది.

వ్యాసముని ప్రణీత పరమార్థమును, అజ్ఞాసన కల్పుఁడగు ఋషివంటి నన్నయ్య యీ విధముగా ఉదంకుని ఋష్యాత్మను ఆవిష్కరించిరి.

ఇతి శివమ్



డా॥ ముదిగొండ వీరభద్రయ్య

ఆధ్యాత్మిక - భౌతిక వాదాల సమన్వయసిద్ధాంతం-శ్రీగోపీచంద్

ఉత్తమ తాత్త్వికుడు గోపీచంద్ 1955 లో 'పోస్టు చెయ్యని ఉత్తరాలు' [ఆధ్యాత్మికవాద-భౌతికవాద సమన్వయము] అన్న ఒక గొప్ప పుస్తకాన్ని అచ్చుచేశారు. కథలూ, నవలలూ, లేఖలూ, నాటికలు, సినిమా స్క్రిప్టులూ రాసిన గోపీచంద్, తాను చదివి జీర్ణించుకొన్న తాత్త్విక సిద్ధాంతాలనూ, వాటి కర్తల జీవిత విశేషాలనూ, కూడా తెలుగు ప్రజలకు అందించారు. గోపీచంద్ తాత్త్వికుడే కాకుంటే ఆయన నవలలూ, తక్కిన సాహిత్యమూ వ్యర్థమే అవుతాయి. ఆయన తాత్త్వికతే ఆయన సృజనా సాహిత్యానికి ప్రాణం.

గోపీచంద్ తాత్త్వికత ప్రస్ఫుటంగా కన్పించే గ్రంథం 'పోస్టు చెయ్యని ఉత్తరాలు'. సాధారణంగా మనిషి తానొక సిద్ధాంత నిబద్ధుణ్ని అని పేరు పొందాక, తన మనస్సులో తాను నమ్మిన సిద్ధాంతానికి కొంతకాలం తర్వాత విముఖుడైనా, ఆ విషయాన్ని చెప్పడానికి ఎందుకోగాని జంకుతాడు. కాని గోపీచంద్ అలాంటి వాడు కాదని ఈ 'పోస్టు చెయ్యని ఉత్తరాలు' నిరూపిస్తాయి. ఈ పుస్తకంలోని ప్రత్యక్షరం ఆయన నిజాయితీని నిరూపించేదే. అదొక్కటే ఈ పుస్తకం యొక్క గొప్పతనం కాదు. ఈ పుస్తకంలో గోపీచంద్ అటు ఆధ్యాత్మికవాదం యొక్క గొప్పతనాన్నీ, ఇటు భౌతికవాదం యొక్క గొప్పతనాన్నీ ఎత్తిచూపుతూ, రెండింటిలోని పనికిరాని అంశాలను తెల్పుతూ, ఇవేళ ఈ రెండు వాదాలూ ఎలా సమన్వయం కావాల్సిన దశ వచ్చిందో వివరించారు. ఈ ప్రయత్నంలోనే భౌతికవాద మౌలికాంశాలను తెల్పుతూ, దాని లోపాలను స్పష్టంగా ఈ గ్రంథంలో గోపీచంద్ ఎత్తి చూపారు.

గోపీచంద్ ఈ పుస్తకంలో 'భౌతికవాదం' అని పదేపదే అన్నప్పటికీ, ఆయన మార్క్సిజాన్ని (శాస్త్రీయ భౌతికవాదమని మార్క్సిస్టులంటారు దీన్ని) ఉద్దేశించాడని ఈ పుస్తకంలోని కొన్ని అంశాల వల్ల తేలుతుంది. గోపీచంద్ స్పృశించిన ఆ అంశాలివి:

1. ఆర్థిక పరిస్థితే మానవుని స్వభావాన్ని నిర్ధారణ చేస్తుంది.
2. మనస్సు ఎల్లప్పుడూ శరీరాన్ని విడిచి ఉండలేదు. అది కూడా ఒక శారీరక ఉత్పత్తే. పరిస్థితులు మారితే ఆలోచనలు మారుతవి.
3. ఈ ప్రపంచానికి అతీతంగా కాని, విడిగా కాని మరేదీలేదు.
4. ప్రతిదీ ఉత్పత్తి సాధనాలకు అనుగుణంగా ఏర్పడ్తుంది.
5. పదార్థం సృష్టింపబడలేదు. అది అనాది.

ఈ ఐదు మౌలికాంశాలే కాక అభావాన్ని అభావం చేయడమన్న విషయాన్ని [నెగేషన్ ఆఫ్ నెగేషన్] సూచనగా ఒకటి రెండు చోట్ల పరామర్శించారు గోపీచంద్. ఈ అన్ని అంశాలు గోపీచంద్ దృష్టి మార్క్సిజమ్ మీదనే అని తెల్పుతున్నవి.

ఈ పుస్తకంలో గోపీచంద్ ప్రధానంగా ఉద్దేశించింది భౌతిక వాదుల ఆధునిక మౌఢ్యాన్ని ఖండించడం. దీన్ని లక్ష్యంగా పెట్టుకొని వారు "మనం భౌతిక వాదం కంటేనూ, భౌతిక సుఖాల కంటేనూ ఏమీ లేదని చెప్పే పరిస్థితికి చెందిన వాళ్లం. కాబట్టి మనం పడవలసిన 'జాగ్రత్త' వున్న ఆధారాన్ని బట్టి కొంచెం ముందుకు ఊహించటం కాని, ఊహించటం పట్ల నిరసనను తెలపటం కాదు" [పుట-128] అని రాశారు. అంతే కాకుండా ఈ రచనలో గోపీచంద్ "ఆధ్యాత్మిక వాదాన్నుంచి గానీ మన పూర్వగ్రంథాలనుంచి గానీ, మనం నేర్చుకోవలసింది ఏమీ లేదని అనుకోవటం గానీ, ఉన్నది అంతా 'రియాక్షనరీ' యే అనుకోవటం గానీ, కేవలం పొరపాటు" [పు-33] అని కూడా అంటారు.

భౌతిక, ఆధ్యాత్మిక వాదాల్లోని సత్యాంశాలను ఏరి రెంటినీ సమన్వయిస్తూ మనజ్ఞాన భాండారాన్ని అభివృద్ధి చేయడమే గోపీచంద్ పెట్టుకొన్న ఉత్కృష్ట లక్ష్యం. అసలీ 'జ్ఞానం' అన్నది ఎలాంటిది? అని వివేచిస్తూ గోపీచంద్ — మనస్సుకి శక్తిఉంది. ఆ శక్తి పదార్థ పరిణామంలోంచే వచ్చింది. 'చేతన శక్తీ, మానసిక శక్తీ పదార్థం యొక్క చేష్టలు, మానసిక శక్తికి భౌతిక ప్రపంచాన్ని గురించి ఆలోచించే శక్తి వుండడం వల్లే రెంటికీ సంబంధం వున్నట్లు బోధపడ్తుంది.' మనస్సుకూడా ప్రకృతికి సంబంధించిదే. తెలుసుకోవడం అనేది మనస్సు స్వభావం. జ్ఞానం మాత్రం సంపాదన. జ్ఞానాన్ని సంపాదించే శక్తిఉన్నా ప్రతిమనస్సూ దాన్ని సంపాదించనూవచ్చు — సంపాదించకుండానూ ఉండవచ్చును. బైటి ప్రపంచంతో సంబంధం పెట్టుకొనే మనస్సు జ్ఞానార్జన చేస్తుంది తప్ప అది దాన్ని తనంతట తాను తయారుచేయదు. 'తెలుసుకొనే వారికీ తెలుసుకొనే వస్తువుకీ వున్న సంబంధం యొక్క ఫలితమే జ్ఞానం .... కాని జ్ఞానం తన పుటకకి ఈ రెంటిమీదా ఆధారపడినా, పుట్టిం తర్వాత దానికి అస్తిత్వం ఏర్పడ్తుంది.' జ్ఞానాన్ని సంపాదించినవాడు మరణించినప్పటికీ వాడు సంపాదించిన జ్ఞానం మాత్రం ఎన్నటికీ నశించదు [చూడు 10, 11, 12 పుటలు] అని జ్ఞానాన్ని గూర్చి స్పష్టీకరిస్తారు. వారీఘట్టంలో భౌతిక ఆధ్యాత్మిక ఉభయ వాదాల్లోనూ చేసిన సమన్వయం ఏమిటంటే — జ్ఞానాన్ని సృజించిన మనస్సు భౌతికమైనదే. అది మనస్సుయొక్క ఉత్పత్తికావడమే కాకుండా, ఆ మనస్సు భౌతిక ప్రపంచంతో పెట్టుకొన్న సంబంధం వల్లనే జ్ఞానాన్ని సంపాదించింది. ఐతే ఒకసారి జ్ఞానం సంపాదింపబడ్డాక దానికి వేరే 'ఉనికి' [లేక 'అస్తిత్వం'] శాశ్వతంగా ఏర్పడుతోంది. 'జ్ఞానం' అన్నది చాలా శక్తివంతమైనది. ఆధ్యాత్మిక వాదులకు 'జ్ఞానం' పునాది పదార్థంలో ఉన్నదనటం, భౌతికవాదులకు 'జ్ఞానా'నికి వేరే అస్తిత్వమున్నదని చెప్పటం, రెంటింటినీ కలపడమే. ఇంతేకాకుండా గోపీచంద్ ఇక్కడ పరిస్థితులు మారితేనే ఆలోచనలు మారుతవని — తాను కేవల భౌతిక వాదిగా ఉన్నప్పుడను కొన్న సిద్ధాంతాన్ని వదలి ఈ గ్రంథంలో దాన్ని పాక్షికసత్యంగా మాత్రమే అంగీకరించాడు [చూ. పు. 3]. 'జ్ఞానం' ఉత్పత్తి కావడానికి ముందు పరిస్థితులే మానవునిపై ఎక్కువ ప్రభావాన్ని వేసినా, జ్ఞానావిష్కరణ జరిగేక మానవుని పరిణామంలో జ్ఞానం యొక్క ప్రభావానికున్న ఆధిక్యం పరిస్థితుల ప్రభావానికి లేదని వారు నిర్ధారించాడు. "మేధావుల విషయంలో జ్ఞానానికి వున్న ప్రాధాన్యత పరిస్థితులకు లేదు. అతని సంస్కారం తన పరిస్థితులకు భిన్నంగా వున్నప్పుడు, అతను పరిస్థితులకు అతీతంగా ప్రవర్తించ గలడు. మనం ముందు సంఘం ఏ విధంగా వుంటే బాగుంటుందో వూహించు కొంటాం, ఆ వూహను ప్రచారం చేస్తాం, దానికి అనుకూలంగా పరిస్థితులు మార్చు కుంటాం" [పు-3] అని గోపీచంద్ అంటారు.

అర్థిక పరిస్థితులే మానవ స్వభావాన్ని నిర్ణయిస్తవన్న మార్క్సిస్టు మౌలిక సిద్ధాంతాన్ని మొదటగా తన అనుభవం వల్ల గోపీచంద్ తిరస్కరించారు. తర్వాత కారల్ మాన్ హీమ్ కూర్చిన 'సోషాలిజీ' ఆధారంగా వారు తిరస్కరించారు. అనేకులైన ధనవంతులు బీదలకు సాయం చేస్తున్నారు. ఆస్తిపరులు వాటిని అనుభవించకుండా సంఘసేవ చేస్తున్నారు. "మానవ మనస్తత్వాన్ని ఆర్థిక పరిస్థితే నిర్ణయిస్తే వీరి చర్యలను ఏ విధంగా అర్థం చేసుకోవాలి?" [పు-iii] అని ప్రశ్నిస్తూ మనపై మొత్తంగా ఉన్నది ఆర్థిక పరిస్థితుల ప్రభావం మాత్రమే కాదని గోపీచంద్ తేలుస్తూ కారల్ మాన్ హీమ్ గ్రంథం అధారంగా ఆర్థికశక్తితో పాటుగా హెరిడిటీ, సమిష్టి జీవితం, సంస్కారం, వీటి పరస్పర సంఘర్షణవల్ల మానవ స్వభావం ఏర్పడుతుందని విశ్వసించాడు. ముఖ్యంగా మేధావుల మీద ఆర్థికశక్తి ప్రభావం తక్కువగా ఉంటుందనీ, లెనిన్ ప్రోలెటేరియన్ విప్లవానికి నాయకత్వం వహించగల్గింది 'భావ బలం'[1] వల్లనే అని చెప్తూ "అజ్ఞానుల విషయంలో 'ఆర్థిక పరిస్థితీ', జ్ఞానుల విషయంలో 'భావం' తీవ్రంగా పనిచేస్తాయని" తేలుస్తారు గోపీచంద్.[2] ఆర్థిక స్థితి కన్నా తక్కున అంశాలకు ముఖ్యంగా జ్ఞానానికీ, భావానికీ ఎక్కువ శక్తి ఉన్నదంటూ గోపీచంద్ "భావా" నికి ఈ శక్తి ఎక్కడ నుంచి వచ్చిందన్న విషయంలో ఆధ్యాత్మిక వాదులెక్కువ కృషి చేశారన్నారు. ప్రతిదాన్నీ విభజించి చూడడం వల్ల పూర్ణసత్యం ఎన్నడూ ఆవిష్కారం కాదు. శ్రీ అరవిందులు "మనస్సు విభజించికాని చూడలేదు. అందువల్ల ఏదో ముక్కని పట్టుకొని అదే సంపూర్ణం అనుకొని భ్రమ పడుతున్నది. మనస్సు యొక్క శక్తి ఇంత వరకే. మనస్సుకి కనబడే ఇవి ద్వంద్వాలుగా కాక వొకే వస్తువు యొక్క రెండు గుణాలు" అని చెప్పిన దాన్తో గోపీచంద్ సంతృప్తిపడి సమన్వయం వైపు అడుగు వేశాడు. దాన్తో వర్గ కలహం, వర్గసామరస్యం; పదార్థం ముందా? చైతన్యం ముందా? మొదలైన ద్వంద్వాలన్నీ అర్థ సత్యాలే అయినవి. ఇవన్నీ ఒకే విషయం యొక్క రెండు గుణాలుగా శ్రీ అరవిందులు తేల్చడంతో గోపీచంద్‌కు భౌతికాధ్యాత్మిక వాదాల మధ్యన ఒక సమన్వయం స్ఫురించింది. ఇది ఇంకా వివరంగా ఆలోచించాల్సిన విషయం—

—మార్క్సిజం ఈనాటి వరకున్న సమాజాలను వర్గాలుగా విభజించింది. ఆదిమ మానవ సంఘం, వారు ముందెప్పుడో

వస్తుందని చెప్తున్న కమ్యూనిస్ట్ సమాజాల్లో మాత్రమే వర్గాలు లేవు—ఉండవు. ఇక అన్ని చారిత్రక దశల్లోనూ బానిస, యజమాని; కర్షకుడూ, భూస్వామీ; అర్థబానిసా, యజమానీ; కార్మికుడూ, పెట్టుబడిదారూ అన్న వర్గాలుండేవి—ఉన్నవి; దాని ప్రకారం ఏ వర్గానికి ఆ వర్గ స్వభావం ఉంటుంది. ఈ అన్ని చారిత్రిక వర్గాల్లోనూ ఒక వర్గం పీడిత వర్గం, మరొకటి పీడిక వర్గం. పీడక వర్గం తన స్వభావాన్ని బట్టి ఎల్లవేళలా పీడిత వర్గం యొక్క శ్రమ శక్తినీ, వారి ఉత్పాదననూ దోస్తుంది. అది వారి వర్గ స్వభావం.[3]

చరిత్రలో పై విషయం సత్యమేనని నిరూపించే ఉదాహరణలు కొన్ని దొరుకుతవి. కాని కొందరు మేధావులు ఈ వర్గ విభజన చారిత్రికంగా సత్యం కాదనీ, అసలు గతితార్కిక సూత్రాలు చరిత్రకు అన్వయం కాగలిగిన హేతుబద్ధత చరిత్ర గమనానికి లేదనీ అన్నారు. బెర్‌ట్రాండ్ రస్సెల్ గతితార్కిక భౌతిక వాదంపై రాస్తూ "మార్క్స్ హెగెల్ నుంచి తీసికొన్న గతితార్కిక భౌతిక వాద అంశాల వల్ల ఆయన చరిత్రను దానిలో ఉన్నదానికంటే హేతుబద్ధమైందిగా భావించాడు. అన్ని మార్పులూ అభివృద్ధికరమైనవి గానే ఆయన భావించాడు. 'భవిష్యత్తు' నికరమైనదిగా, ఏ శాస్త్రీయాధారం లేకుండానే, ఆయన నిర్ణయించాడు." [పు- 197 లెజిటిమసీ వెర్సస్ ఇండస్ట్రియలిజమ్. స్వేచ్ఛానువాదం] అని అన్నాడు. కాస్త ఆలోచిస్తే చరిత్రలో జరిగిన అనేక సంఘటనల మార్క్స్ చెప్పినట్లుగా ఒక సిద్ధాంతం క్రిందికి ఒదిగించడం తప్పనీ, సాహసమనీ జిజ్ఞాసువుకి తెలియకపోదు. భౌతిక రసాయన జీవశాస్త్రాదుల్లో చేసినట్లుగా ప్రయోగశాలల్లోని ప్రయోగాలాధారంగా కొన్ని మౌలికమైన సిద్ధాంతాలను, సామాజిక రంగంలో—అంటే మానవుడు బ్రతుకుతున్న సమాజాన్ని గురించి—చేయడం వల్ల పూర్ణసత్యం ఎన్నడూ ఆవిష్కారం కాదు. అంతే కాకుండా భారతదేశచరిత్రకు మార్క్స్ చేసిన అన్వయం సరికాదని విమర్శిస్తూ, ఆ చరిత్రలో వర్గసామరస్యాన్ని పట్టి చూపుతూ రావిపూడి వెంకటాద్రిగారు "ఒకప్పుడు సింధూ లోయలో ఉన్నతమైన నాగరకత వర్ధిల్లినట్లు పురాతత్త్వ శాస్త్రం స్పష్టం చేస్తున్నది. అతి స్వల్పంగా ఆధునిక యూరపు చరిత్రకు తప్ప యితర ప్రపంచ చరిత్రకూ, నాగరికతకూ మార్క్స్ చారిత్రిక వ్యాఖ్యానాన్ని అన్వయించడానికి వీలేలేదు. భారతదేశాన్ని తీసుకొంటే యిక్కడి అతి ప్రాచీనమైన సింధూనాగరికతకే కాక తర్వాత వచ్చిన వైదిక, ఔపనిషదిక, పౌరాణిక యుగాలలోని సామాజిక వ్యవస్థలకు కూడా మార్క్సిస్టు అన్వయం కుదరదు. భారత దేశంలో కనిపించే వర్గ సౌమనస్యం మార్క్సిస్టు సిద్ధాంత దృష్ట్యా అసంభవం. మరి అవి యిక్కడ యెలా సంభవమైనాయి అనేదే సమస్య" [పు-31, 32 మార్క్సిస్టు భౌతికవాదం-1963 ప్రచురణ] అని అంటారు. వర్గస్వభావం ఆధారంగా పీడితపీడకుల సంఘర్షణ వల్ల చరిత్ర నడిచింది. అన్న మార్క్స్ చరిత్రను గూర్చి చేసిన విశ్లేషణ ఎంత అహేతుకమైనదీ పై ఇద్దరూ తేల్చారు.

పీడక వర్గంలోని వారే పీడిత వర్గానికి తమ సర్వస్వమూ త్యాగం చేయడమూ చరిత్రలో కన్పిస్తుంది. అసలు వర్గదృష్టితో సమాజాన్ని దర్శించి శ్రామికులకు మేలు చేయడం కోసం తన సర్వ మేధాశక్తిని వాడిన మార్క్స్‌ది ఏ వర్గం? ఆయనను అనుసరించిన లెనిన్‌ది ఏ వర్గం? రాజైన అశోకుని సంగతేమిటి? రాజ కుమారుడైన బుద్ధుడేయే 'వర్గాలకు' మేలుచేశాడు?

—మరి ఇక్కడ వీరి వర్గ స్వభావం ఏమైంది?

—వర్గ స్వార్థం ఉన్న ఉదాహరణలు కొన్నీ, వర్గాతీతంగా ప్రజావళికి మేలు చేసిన మహా మనీషుల ఉదాహరణలు కొన్నీ గోపీచంద్‌గారికి కన్పించాయి.

ఇక్కడ నుంచి గోపీచంద్ ఆలోచన 'జ్ఞానాన్ని' ఒక అడుగు ముందుకు వేయించింది. పిడివాదపు సిద్ధాంతాల్లో ఉండేది పాక్షిక సత్యమే. ఆ సిద్ధాంతాల్లోంచి అసలైనదాన్ని తీసికొని సమన్వయం చేసికోవాలే తప్ప అసంపూర్ణ సత్యాలతో, అపరిపక్వ బుద్ధితో సమాజాన్ని నాశనం చేసికోగూడదు. 'ఎప్పటికప్పుడు పాతని కలుపుకుంటూ పరిణామానికి అనుక్షణం దోహదం' చేయాలి అన్నది గోపీచంద్ గారి ఆకాంక్ష.

ఆధ్యాత్మిక వాదులపై భౌతిక వాదులను ప్రిజుడిస్ కావద్దని గోపీచంద్ కోర్తారు. ఆధ్యాత్మిక వాదులు అడవుల్లోకి, ఏకాంతంలోకి పోవడం పలాయనవాదం కాదనీ, బుద్ధాదులు అలా అరణ్యవాసంలోకి, ఏకాంతం లోకి వెళ్ళి జ్ఞానోదయం కలిగాక మళ్ళీ ప్రజల్లోకి వచ్చి వారి శ్రేయస్సుకోసం పాటు పడడమే కాకుండా, తమ ఉపదేశాల కనుగుణంగా జీవించారనీ, భౌతిక వాదులు బయటి ప్రకృతికి ప్రాధాన్యాన్నిస్తే వారు లోపలి ప్రకృతికి ప్రాధాన్యాన్నిచ్చారనీ, వీరు పనికి ప్రాధాన్యాన్నిస్తే వారు ఆలోచనకు ప్రాధాన్యాన్నిచ్చారనీ— "ఈ రెండూ అవసరమేననీ, ఒక దాని మీద ఒకటి ఆధారపడి వుంటవనీ" గోపీచంద్ అన్నారు. ఆధ్యాత్మిక, భౌతిక వాదాలు రెంటిలోనూ ఉన్న మంచి విషయాలను ఉభయులూ శత్రుభావంతో భ్రష్టు పట్టించకుండా గోపీచంద్ గారి లాంటి సమన్వయవాదులు జ్ఞాన భాండాగారాన్ని సమృద్ధిచేశారు.

పదార్థాన్ని అనాది అయిందానిగా భౌతికవాదులు చెప్పుతుంటారు. పదార్థాన్ని సృష్టింపబడిన విషయంగా అధ్యాత్మిక వాదులు భావిస్తారనీ, శూన్యం నుంచి పదార్థం రావడం అసాధ్యమనీ భౌతిక వాదులు చెప్తారు.4 ఈ విషయంలో గోపీచంద్ భారతీయ మేధావులు ఎంతటి భావ స్వాతంత్ర్యాన్ని ఆ రోజుల్లో అనుభవించారో ప్రశంసిస్తూ, వేదాంతులూ, సాంఖ్యులూ, బౌద్ధులూ, వైశేషికులూ పూర్వోత్తర మీమాంసకులూ, ఎలా ఆలోచించారో సూక్ష్మంగా చెప్తారు. ఈ వివేచనకు మకుటాయమానంగా ఉండే ఈ క్రింది మాటల్లో గోపీచంద్ సమన్వయ దృక్పథం అవగతమవుతుంది.

"మన తత్వశాస్త్ర చరిత్రను పరిశీలిస్తే అధ్యాత్మిక వాదాన్నుంచి భౌతిక వాదులు నేర్చుకోవలసింది ఎంత ఉందో, భౌతిక వాదాన్నుంచి అధ్యాత్మిక వాదులు ఎంత నేర్చుకోవలసి ఉంటుందో తేలిగ్గా తెలుస్తుంది. పైకి ఎంత విరుద్ధంగా కన్పించినా ఈ రెండు సిద్ధాంతాలూ ఒకదానివల్ల ఒకటి ఎంత మారింది కూడా స్పష్టపడింది. ఈ రెండూ కలుసుకునే స్థానం కూడా కనుచూపు మేరలో ఉన్నట్టు కనుపిస్తుంది." [పు. 34]

అనుబంధం

1. " అయితే గతితర్కం ప్రకారం రష్యాలో లెనిన్ లాంటి వ్యక్తి కనుగొనబడవలసిన చారిత్రకావశ్యకత యేమి వచ్చింది? వాస్తవానికి రష్యా విప్లవం మార్క్సు చారిత్రక నిర్ణయ వాదానికి అందేది కాదు. ఆ విప్లవాన్ని నిర్ణయించిన పరిస్థితులలో లెనిన్ వ్యక్తిత్వం యొక్క ప్రాధాన్యతను త్రోసివేయడం వివేకం లేని పని" [పు - 34 - మార్క్సిస్టు భౌతికవాదం / రావిపూడి వెంకటాద్రి — ప్రచురణ 1963లో].

2. [గోపీచంద్ అభిమాని, గోపీచంద్ ఈ లేఖలు పత్రికల్లో అచ్చుచేస్తున్న కాలంలోనే అంటే 1948–49 లలో తెలంగాణా సాయుధపోరాటంలో రేగిన హింసాకాండవల్ల కలత చెందిన సామాన్య ప్రజానీకాన్ని, వారి కష్టాలను చూసి అప్పటి తెలుగు స్వతంత్రలో 'భూదేవీయుడు' అన్న పేరుతో కె. ఎల్. నర్సింహారావు (రేపాల) గారు 27 లేఖలు రాశారు. అవే తర్వాత 'తెలంగాణా తీరు తెన్నులు' అన్న పుస్తకంగా 1951 లో అచ్చయినవి. అందులోనుంచి]—

"అసలు, ఆచరణకు ముందు ఆలోచన చాలా అవసరమనే వారిలో నేనొకణ్ని. అందులో సంఘసేవ చేయదలుచుకోవడం లాంటి మహత్తర విషయమైనప్పుడు మరీ దూరం ఆలోచించాలంటాను. ఏమంటే మన స్వంతయింటి ఒకరిద్దరికి సంబంధించిన వ్యవహారమైతే ఎన్ని తికమకలుపడి, తొందరపడ్డా ఫరవాలేదు. ఎలాగో సవరించుకోవచ్చు. కాని సంఘాన్ని బాగుచేయడమంటే కోట్ల ప్రజల బాధ్యత తీసుకోవడం. వారికష్టసుఖాలన్నీ ఏదో వొలక బెట్టడానికి నాయకత్వం వహిస్తున్న మన సిద్ధాంతాల ఆచరణ మీదే ఆధారపడి వుంటాయి. అలాంటప్పుడు ఒక పంథా ననుసరించే ముందు, అదెంతవరకు సమంజసమైందో బహు జాగ్రత్తగా, శాంతంగా స్థిరచిత్తంతో తప్పకుండా ఆలోచించాల్సి వుంటుందనేది నీ విక యిప్పుడు వొప్పుకుంటా వనుకుంటాను." [పు. 7.]

3. "మానవబలానికి (హ్యూమన్ ఫాక్టర్) ప్రాధాన్యత నివ్వ వలసిన చోట—వర్గాలకూ, వర్గ స్వభావాలకూ గతి తర్కాన్ని ముడి పెట్టడం సమంజసం కాదు. ఎందుకంటే చైనాలో ఏనాడో పెట్టుబడిదారీ వర్గం వుంది కదా! అచ్చు యంత్రాలు, తుపాకి మందు, నౌకాయానానికి దిక్సూచి యంత్రాలు వున్నవికదా! అయినప్పటికి చైనా పెట్టుబడిదారులు జమిందారీ విధానాన్ని నాశనం చేసి జమిందారీ సంకెళ్ల నుంచి వ్యుత్పత్తి శక్తుల్ని విడుదల చేయడానికి ప్రయత్నమైనా చేయలేదే—కారణమేమిటి? చివరకు వేల సంవత్సరాల తర్వాత మారు మార్గాలతో సైన్యంతో దండెత్తి అధికారం హస్తగతం చేసుకోవలసి వచ్చిందే మావో! అదెలా సంభవించింది?" [పు-37. మార్క్సిస్టు భౌతిక వాదం]

ఈ ఉదాహరణ మరో పార్శ్వానికి సంబంధించింది. వర్గాలు సత్యమే అవుతే వేల సంవత్సరాలు జమీందారీ విధానాన్ని ఎందుకు ఉంచుకొన్నారు చైనీయులు?

4. అసలు అధ్యాత్మిక వాదులు (భారతీయులు) కూడా పదార్థం యొక్క 'అనాది' నైజాన్ని గుర్తించే ఉన్నారు. వారున్నూ పదార్థాన్ని కాని, ప్రకృతిని కానీ శూన్యం నుంచి పుట్టించిన విషయంగా భావించ లేదనడానికి సనాతన ధర్మ ప్రతినిధీ, ప్రబోధకుడూ అయిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబాగారి ఈ క్రింది వాక్యాలు మంచి ఉదాహరణ.

"జీవాత్మయును, జగత్తును శూన్యము నుండి పుట్టింపబడెననియు భారతీయులు అంగీకరించరు. ప్రకృతి ఆద్యంత రహితమైనది." ['భారతీయ పరమార్థవాహిని' వ్యాసం 'సత్యసాయి వాహిని' లోని 29 వ పుట.]

—()—

డాక్టర్ ఆర్. ఎల్. ఎస్. శాస్త్రి

యాంత్రిక అనువాదం

మనం ఇప్పుడు వైజ్ఞానిక - సాంకేతిక యుగంలో జీవిస్తున్నాము. ప్రపంచంలో జరుగుతున్న సాంకేతిక పరిణామాలను గురించి తెలుసుకోకుండా ఏ దేశానికైనా ప్రగతి సాధ్యంకాదు. ముఖ్యంగా అభివృద్ధిచెందుతున్న దేశాలు, అభివృద్ధిచెందిన దేశాలలో జరుగుతున్న ప్రగతి గురించి తెలుసుకోకపోతే వారు ఏ నాటికీ పురోగమించలేరు. మానవాభ్యుదయానికి విజ్ఞానశాస్త్ర ప్రాముఖ్యాన్ని ఇప్పుడు అన్ని దేశాలవారు గుర్తించారు. ఈ సందర్భంలో వివిధ దేశాలవారు వారికి అందుబాటులో ఉన్న విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ఎంతైనా అవసరం. అయితే ఈ సమాచారం వివిధ భాషలలో ఉండడంవల్ల భాషా సంబంధమైన అవరోధాలు ఎదురవుతున్నాయి. ఒక్క భాష మాత్రమే తెలిసి ఉంటే ఈ సమాచారం అంతా వినియోగించుకోవడం వీలుపడదు. ఒకే దేశంలో భిన్న భాషలు వాడుకలో ఉన్నప్పుడు పరిస్థితి ఇంకా క్లిష్టతరమవుతుంది.

అత్యధిక సంఖ్యాకమైన ప్రజలకు ఒక్క భాష మాత్రమే వచ్చి ఉంటుంది. కనుక భాషావరోధాన్ని అధిగమించడానికి అనువాదాలే శరణ్యం. ప్రత్యేక వైజ్ఞానిక రంగాలలో ప్రత్యేక అవసరాలను బట్టి విభిన్న రూపాలున్న భాషలు తయారయ్యాయి. ఈ ప్రత్యేకీకరణ ఎంతవరకు వెళ్లిందంటే ఏ సాంకేతికరంగంలోనైనా జరిగిన ప్రగతిని పూర్తిగా అవగాహన చేసుకుందుకు ఏ ఒక్క అనువాదకునికి సాధ్యంకాదు. అందువల్ల అనువాదానికి యంత్రాల సహాయం తీసుకోవడం అనివార్యం అయింది

పారిశ్రామిక సంస్థలు అంతకంతకు ఎక్కువగా అనువాద సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ రోజున ఈ పనికి పాక్షికంగా యంత్ర సహాయంతో చేయవచ్చు. సాహిత్యానికి సంబంధించిన పాఠ్యాంశాలలో యాంత్రిక అనువాదానికి చోటులేదు. ఎందుకంటే వాటిలో ఒకే వాక్యానికి అనేక అర్థాలుండవచ్చు. కాబట్టి యాంత్రిక అనువాదరంగం కేవలం టెక్నాలజీ, విజ్ఞాన శాస్త్రాలకు పరిమితం చేయాలి.

యాంత్రిక అనువాదానికున్న సామర్థ్యం దానికున్న వేగమే. ఇందులో గంటకి 3,00,000 పదాలు లేదా 1000 పేజీలు అనువదించవచ్చు. విదేశాలలో ఒక పేజీ యాంత్రిక అనువాదం ఖర్చు మూడు నుంచి అయిదు డాలర్ల వరకు అవుతుంది.

యాంత్రిక అనువాదం - చరిత్ర

కంప్యూటర్ల సహాయంతో అనువాదం చెయ్యడం అనే ఊహ 1947 లోనే మొదలయింది. ఈ సందర్భంలో మొట్టమొదటి ప్రయోగం న్యూయార్క్‌లో జరిగింది. అప్పటినుంచి అమెరికాలోను, యూరోప్‌లోను యంత్ర సహాయంతో అనువాదం చెయ్యడంలోని సమస్యలను అధ్యయనం చెయ్యడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. అయితే ఈ సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవడంలో చాలా ప్రగతి సాధించినప్పటికీ మొదటి దశలో కంప్యూటర్ అనువాదాలు అంత సంతృప్తికరంగా లేవు. 1975 నుంచే కొంచెం మంచి ఫలితాలు కనబడడం ప్రారంభమయింది. అప్పటినుంచి యూరోప్, అమెరికా, రష్యా దేశాలలో ఈ రంగంలో ఇతోధికమైన కృషి జరుగుతోంది. ఇంతవరకు సాధించిన ప్రగతిని బట్టి సాంకేతిక, వైజ్ఞానిక శాస్త్రాలలో యంత్ర సహాయంతో అనువాదం చెయ్యడం సాధ్యమనే సంగతి రూఢయింది. యంత్ర సహాయంతో అనువాదం చెయ్యడానికి కావలసిన సౌకర్యాలు ఈనాడు రూపొందించిన కంప్యూటర్లలో లభ్యమవుతున్నాయి.

ప్రస్తుతం ప్రపంచంలో వివిధదేశాలలో దాదాపు 50 సంస్థలు యాంత్రిక అనువాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో అధిక సంఖ్యాకమైనవి అమెరికాలో ఉన్నాయి. తక్కినవి జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, కెనడా, గ్రేట్‌బ్రిటన్, హాంకాంగ్, స్విట్జర్లాండ్, రష్యా, జెకొస్లొవేకియా మొదలైన దేశాలలో ఉన్నాయి.

ఇప్పుడు అమెరికాలో వాడుకలో ఉన్న వ్యవస్థలలో రెండు ముఖ్యమైనవి: 1. గాట్ (జార్జిటవున్ ఆటోమాటిక్ ట్రాన్స్‌లేషన్). దీనిని జార్జిటవున్ యూనివర్సిటీవారు అభివృద్ధి చేశారు. 2. సిస్ట్రాన్ (సిస్టమ్ ట్రాన్స్‌లేషన్, కాలిఫోర్నియా). ఈ రెండు వ్యవస్థలలోను రష్యన్ నుంచి ఇంగ్లీషు లోకి, ఇంగ్లీషు నుంచి రష్యన్ లోకి అనువాదాలు చేస్తారు. న్యూయార్క్‌లోని లోగోస్ వ్యవస్థవారు 1971-73 మధ్యకాలంలో ఇంగ్లీష్ నుంచి వియట్నామీస్‌లోకి అనువాదాలు చేశారు. కొంత కాలంగా హాంకాంగ్ యూనివర్సిటీ వారు చైనీస్ వార్తాపత్రికలు ఇంగ్లీష్‌లోకి కంప్యూటర్ సహాయంతో అనువదిస్తున్నారు.

పారిస్‌లోని ఫ్రెంచ్ టెక్స్‌టైల్స్ ఇన్‌స్టిట్యూట్‌వారు టైటస్ అనే పేరుతో సరళమైన వాక్యాలను జర్మన్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, స్పానిష్ భాషల మధ్య యాంత్రిక అనువాదాలు జరుపుతున్నారు.

తొలిరోజుల్లో మాటకి—మాట అనువాదాలు చేసేవారు కాని ఇప్పుడు వాక్యస్థాయిలో అనువాదాలు జరుగుతున్నాయి. ఇవి వాక్య నిర్మాణం, అర్థంమీద ఆధారపడి ఉంటాయి.

యాంత్రిక అనువాద వ్యవస్థలో భాగాలు

యాంత్రిక అనువాదంలో ఇమిడిఉన్న ప్రక్రియ అన్నింటినీ కలిపి ఒక వ్యవస్థగా భావించవచ్చు. ఈ వ్యవస్థలోని ముఖ్య భాగాలివి :

1. ఇన్‌పుట్ లేదా యంత్రానికి సరఫరా చేసే అంశాలు.
2. నిఘంటువు.
3. వ్యాకరణం.
4. అల్గోరిమ్.
5. అవుట్‌పుట్ లేదా యంత్రం వెలువరించే అంశాలు.

వ్యాకరణ విభాగంలో మూల భాషకు, లక్ష్య భాషకు సంబంధించిన నియమాలుంటాయి. అంతేకాకుండా మూలభాష నుంచి లక్ష్యభాషలోకి అనువదించే విధానానికి సంబంధించిన కొన్ని నియమాలు కూడా ఇందులో ఉంటాయి. నిఘంటు విభాగంలో అనువాద ప్రక్రియలో ఉపయోగించే పదాల అర్థాలుంటాయి. అల్గోరిమ్ కార్యక్రమంలో విశ్లేషణ, బదిలీ, సంశ్లేషణ అనే ప్రక్రియలుంటాయి. ఇన్‌పుట్ అంటే మూలభాషలో అనువదించ వలసిన పాఠ్యాంశము. అవుట్‌పుట్ అంటే లక్ష్యభాషలోకి అనువదించిన పాఠ్యాంశము. ఇది సరాసరి మనం ఉపయోగించు కోవచ్చు. లేదా కొన్ని సందర్భాలలో దీనిని కొద్దిగా సవరించు కోవలసిన అవసరం ఉండవచ్చు. ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే ఇందులోని వివిధ భాగాలమధ్య సమన్వయం చక్కగా ఉండాలి. అంతే కాకుండా ఇవన్నీ కంప్యూటర్‌లో వాడుకుందుకు అనువైన రూపంలో ఉండాలి.

యాంత్రిక అనువాదంలో ముఖ్య దశలు

ఈ అనువాద ప్రక్రియలో ప్రధానంగా నాలుగు దశలను గుర్తించవచ్చు. ఇవి ఏ రెండు భాషలకైనా వర్తిస్తాయి. మొదటి దశలో మూల భాషలోని పాఠ్యాంశాన్ని విశ్లేషించడం జరుగుతుంది. రెండోదశలో ఈ విశ్లేషణా ఫలితాలను లక్ష్యభాషలోకి రూపాంతరం చెందించడం చేస్తారు. మూడోదశ చాలా ముఖ్యమైనది. ఇందులో విశ్లేషించిన పాఠ్యభాగానికి అర్థాలు కనుక్కోవడం, లక్ష్యభాషలోని వాక్య నిర్మాణానికి అనుగుణంగా తగిన సందర్భాన్ని సమకూర్చడం జరుగుతాయి. ఆఖరి దశలో పై మూడు దశలలో వచ్చిన ఫలితాలను సంశ్లేషించి, కూర్చి, లక్ష్య భాషలో అర్థవంతమైన పాఠ్యాంశం తయారు చేస్తారు. ఈ దశనే పోస్ట్ ఎడిటింగ్ అంటారు.

అయితే ఒక సంగతి ఇక్కడ చెప్పుకోవాలి. ప్రస్తుతం మనకున్న పరిజ్ఞానం దృష్ట్యా మాటకి—మాట అనువాదం చేసి కొంతవరకు వాక్యనిర్మాణాన్ని, అర్థాన్ని విశ్లేషించి మూల భాషను లక్ష్యభాషలోకి ఒకమాదిరిగా కంప్యూటర్ సహాయంతో అనువదించడం మాత్రమే సాధ్యమవుతోంది. ఇంకా సంపూర్ణంగా స్వరూపాత్మక విశ్లేషణ, అర్థవిశ్లేషణ, వాక్య విశ్లేషణ చేసి కృత్రిమ మేధస్సును ఉపయోగించి పరిపూర్ణమైన అనువాదం చేయడం ఇప్పుడు పాక్షికంగానే సాధ్యమవుతోంది. భవిష్యత్ పరిశోధనలు ఈ రంగంలో ఇంకా ప్రగతిని సాధిస్తాయని ఆశించవచ్చు. అయితే సాహిత్య సంబంధమైన పాఠ్యాంశాలవలె కాక శాస్త్ర సాంకేతిక పాఠ్యాంశాల అనువాదానికి యాంత్రిక అనువాదం చాలా మటుకు సంతృప్తికరంగానే ఉందని చెప్పవచ్చు.

ఇటీవల జపాన్‌లో జేబులో పెట్టుకునేటంత చిన్న కంప్యూటర్‌లు తయారు చేసారు. వీటి సహాయంతో విదేశ పర్యాటకులు వారి అవసరాలకు కావలసినంత మేరకు చిన్న చిన్న వాక్యాలు అనువదించుకుని దైనందిన కార్య కలాపాలు జరుపుకోవచ్చు.

యాంత్రిక అనువాదానికి సంబంధించిన ప్రధాన సమస్యలు

యాంత్రిక అనువాదంలో భాషకు సంబంధించిన సమస్యలు అనేకం ఎదురవుతాయి. వీటిలో ముఖ్యమైనవి సాంకేతిక పద జాలానికి సంబంధించినవి.

సాంకేతిక పదావళి

అనేక రకాల సాంకేతిక పదావళులు కావాలి. వీటిలో ఏక భాషకు, బహుభాషలకు సంబంధించినవి ఉండాలి. నిఘంటువులు తయారు చేయాలి.

విశ్లేషణ

యాంత్రిక అనువాదంలో ఒక ముఖ్యమైన సమస్య విశ్లేషణకు సంబంధించినది. విశ్లేషణ ఎంత సమర్థవంతంగా జరిగితే యాంత్రిక అనువాదం అంత బాగుంటుంది. మనం అనువదించవలసిన పాఠ్యభాగంలో ప్రతివాక్యానికి అర్థవంతమైన రూపకల్పన

చేయడమే ఇందులో కేంద్ర సమస్య. దీంట్లో చాలా ఇబ్బందులున్నాయి. ఏ భాషలోనైనా నిఘంటు ప్రమాణాలు ఎన్ని ఉంటాయనే విషయం నిర్ధరించడం కష్టం. సమగ్రమైన విశ్లేషణాత్మక నిఘంటువులు అందుబాటులో ఉన్నప్పటికీ ఒకొక్కప్పుడు సమస్యలు తలెత్తుతాయి. ఎందుకంటే కొన్ని నిఘంటు ప్రమాణాలు ఈ నిఘంటువులలో దొరకకపోవచ్చు. విశ్లేషణలో ఇంకో సమస్య ఏమిటంటే ఏ భాషలోనైనా కొన్ని సందిగ్ధతలు ఉంటాయి. పాఠ్యాంశాన్ని ముందుగా కొంత సవరించుకుంటే వీటిని కొంత వరకు చక్కదిద్దుకోవచ్చు. ఈ సందిగ్ధతలను ఎంతవరకు సవరించాలనేది రెండింటిమీద ఆధారపడి ఉంటుంది. ఖచ్చితమైన అనువాదానికి వీటిని ఎంతవరకు తొలగించాలి అనేది ఒకటి. రెండోది లక్ష్యభాష స్వభావం.

యాంత్రిక అనువాద ప్రక్రియ

మామూలుగా అనువదించవలసిన అంశాన్ని చేతితో పంచ్ కార్డుల మీదకుగాని, కాగితపు చుట్టమీదకు గాని, మాగ్నెటిక్ టేప్‌ల మీదకుగాని బదిలీచేస్తారు. ఇలా చేసేటప్పుడు అది ఏ లిపిలో ఉన్నా రోమన్ లిపిలోకి మారుస్తారు. అదే సమయంలో కంప్యూటర్‌లో వున్న సాంకేతిక పదజాలాలలో దేనిని పరిగణనలోకి తీసుకోవాలో సూచించాలి.

ఈ అనువాద ప్రక్రియలో అతి క్లిష్టతరమైన భాగమేమిటంటే అనువదించవలసిన పాఠ్యాంశాన్ని ముక్కల కింద విడగొట్టడం. దానిలో ఉండే వేరు వేరు పదాలకు కంప్యూటర్‌లో క్రమానుసార సంఖ్య లివ్వడం జరుగుతుంది. ఆ తర్వాత వాటిని విశ్లేషణ నిఘంటువులో ఉన్న వాటితో పోలుస్తారు. ప్రతిమాటను లక్ష్య భాషలో దానికి అనురూపమైన పదం సంఖ్యతో జతకలుపుతారు. ఇప్పుడు వాక్య నిర్మాణ విశ్లేషణ జరుగుతుంది. ఇందుకోసం అనేక సార్లు ఇలా తయారయిన అనువాదాన్ని సరిచూడడం జరుగుతుంది. ఈ చర్యలన్నింటి ఫలితంగా మొదట వేరువేరు పదసముదాయాలు ఆ తర్వాత ప్రధాన వాక్య భాగాలు, అప్రధాన వాక్య భాగాలు అనువదించబడతాయి.

కంప్యూటర్‌తో అనువాదం చేసేటప్పుడు కొన్నిసమస్యలు ఎదురవుతాయి. వాక్యంలో పరస్పర సంబంధమున్న పదాలు ఒకే చోట ఉండక పోవచ్చు. సర్వనామాల అన్వయంలో సందిగ్ధతలుండవచ్చు ఒకే మాటకు భిన్నార్థాలుండవచ్చు. ఒకొక్కప్పుడు ఫుల్‌స్టాప్ కూడా సమస్యగా పరిణమించవచ్చు. ఇది వాక్యాంతంలో ఉండవచ్చు. లేదా హ్రస్వరూపాల చివర ఉండవచ్చు. ఇటువంటి పరిస్థితిలో కంప్యూటర్ ఏంచేస్తుంది? సందిగ్ధత ఉన్న ప్రాంతంలో ఉన్నపదాల లింగం, వచనం, విభక్తి మొదలైన వ్యాకరణ లక్షణాలను పోల్చిచూస్తుంది. ఈ విధంగా విశ్లేషణ చేసిన తరవాత తగిన విధంగా అనువాదం చేస్తుంది. ఈ ప్రక్రియలో పదాల రూపాలు మారతాయి. వాక్య నిర్మాణం మారుతుంది. ఈ దశలో లక్ష్య భాషలో అనురూపమైన రూపాలను ఎన్నుకోవడం జరుగుతుంది.

చివరగా సంశ్లేషణ నిఘంటువు సహాయంతో లక్ష్యభాషలోకి పాఠ్యాంశాన్ని పునర్నిర్మించడం జరుగుతుంది. ఈ సమయంలో పదాల సరిఅయిన క్రమం నిర్ణయించడం, కొన్ని పదాలు విసర్జించడం లేదా కొన్ని కొత్తపదాలు చేర్చడం వంటివి జరుగుతాయి. ఈ విధంగా తయారయిన అనువాదాన్ని చిన్న తెరమీద ప్రదర్శించడం కూడా సాధ్యమవుతుంది.

సిస్‌ట్రాన్ వ్యవస్థ

సిస్‌ట్రాన్ అనువాద వ్యవస్థను గురించి లోగడ క్లుప్తంగా పేర్కొనడం జరిగింది. ఇప్పుడు మరికొన్ని వివరాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది. ఈ వ్యవస్థకు సంబంధించిన పనిని 1964 లో ప్రారంభించారు. 1969 నుంచి అనువాదాలు చేయడం ప్రారంభించారు. రష్యన్ నుంచి ఇంగ్లీష్‌లోకి అనువదించడమే కాకుండా చైనీస్, జర్మన్, ఫ్రెంచ్ భాషలనుంచి ఇంగ్లీషులోకి, ఇంగ్లీషునుంచి రష్యన్, ఫ్రెంచ్ భాషలలోకి అనువదించడానికి ప్రయోగాత్మక కార్యక్రమాలు, నిఘంటువులు కూడా తయారు చేసారు. విశ్లేషణ, అనువాదం, సంశ్లేషణలకు ఒకే ఒక నిఘంటువును వాడతారు. ఈ నిఘంటువులో పదరూపాలను ఏర్పరచడం, వాక్య నిర్మాణం, అర్థ ప్రత్యేకతలు మొదలైనవి కూడా ఉంటాయి. అంతే కాకుండా లక్ష్యభాషలో అనురూపాలు, వ్యాకరణ విశేషాలు కూడా చేర్చారు. రష్యన్ విశ్లేషణ నిఘంటువులో 1,50,000 మూల రూపాలు, 1,60,000 సాంకేతిక పదాలు, పదబంధాలు, 3,500 జాత్యాలు, 4,00,000 ఇంగ్లీష్ అర్థాలు ఉంటాయి. అంతరిక్ష యానం, ఏరోనాటిక్స్, భౌతిక, రసాయన శాస్త్రాలు, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జి, మెటల్‌ప్రోసెసింగ్, భూవిజ్ఞాన శాస్త్రాలు, వాతావరణశాస్త్రం, గణితశాస్త్రం, వైద్యశాస్త్రం, జీవశాస్త్రం, సైబర్నెటిక్స్, మిలటరీ శాస్త్రాలు వంటి ప్రత్యేక శాస్త్రవిభాగాలకు సంబంధించిన సాంకేతిక పదాల సూచికలు కూడా ఉంటాయి. ఒక పాఠ్యాంశంలో ఒకసారికన్న ఎక్కువసార్లు వచ్చే పదాలకు ఒక్కసారి అర్థం చూస్తే సరిపోతుంది ఎందుకంటే అనువాద ప్రక్రియ ప్రారంభంలోనే పదాలన్నింటినీ అకారాది క్రమంలో అమర్చి విశ్లేషించడం జరుగుతుంది. మౌలికమైన పదాల సూచికలో సమాచారం లభించకపోతేనే ప్రధాన నిఘంటువును సంప్రదించవలసి ఉంటుంది. మూల భాషలోని వాక్య విశ్లేషణ కోసం నాలుగైదు సార్లు ఎడమనుంచి కుడివైపుకు, ఒకసారి కుడివైపు నుంచి ఎడమవైపుకు తిరగవేయవలసి ఉంటుంది.

భారతదేశంలో యాంత్రిక అనువాద కృషి

విజ్ఞానశాస్త్ర సాహిత్యాన్ని ఇంగ్లీష్ నుంచి భారతీయభాషల లోకి అనువదించటంలో చాలా సమస్యలున్నాయి. వీటిలో ముఖ్యమైనవి : 1. ఆధునిక సాంకేతిక నిఘంటువులు, పారిభాషిక పద కోశాలు భారతీయ భాషలలో తగినంతగా లేకపోవటం, 2. భారతీయ భాషలలో ప్రామాణీకరించిన సాంకేతిక పదజాలం సరిపోయినంత లేకపోవడం.

భారతదేశానికి సంబంధించినంత వరకు యాంత్రిక అనువాదం రెండురకాలుగా ఉంటుంది :

1. విదేశీభాష నుంచి భారతీయ భాషలలోకి అనువదించడం.
2. ఒక భారతీయభాషనుంచి ఇంకోదానిలోకి అనువదించడం.

ఇందులో మొదటి దానిలో చాలా సమస్య లెదురవుతాయి. రెండోది కొంచెం సులువుగా కనిపిస్తుంది ఎందుకంటే వివిధ భారతీయ భాషలలో అక్షరక్రమం, వ్యాకరణ నిర్మాణం కొంచెం ఇంచుమించుగా ఒకే రకంగా ఉంటాయి. అంతే కాకుండా భారతీయ భాషలలో చాలాపదాలు ప్రాథమికంగా సంస్కృతంనుంచి ఉద్భవించడం వల్ల వాటి ఐక్య పోలికలు ఎక్కువగా ఉంటాయి. అయితే ఇంగ్లీష్ కాని భాషల విషయంలో యాంత్రిక అనువాదంలో కొన్ని ప్రత్యేక సమస్యలున్నాయి. ముఖ్యంగా ఇవి లిపికి సంబంధించినవి. కంప్యూటర్‌లో రోమన్ లిపి వాడుకోవచ్చు. రోమన్ లిపి వాడకపోతే ఇంగ్లీష్‌కాని భాషలలో చాలా వ్యత్యాసాలుంటాయి. ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, పోరు గీస్, స్పానిష్ వంటి రోమన్ ఆధార భూతమైన భాషలకు కూడా ఇంగ్లీష్‌లో వాడే 26 అక్షరాలు, 10 అంకెలు చాలవు. అందువల్ల కొన్ని డయాక్రిటికల్ గుర్తులు వాడవలసి వస్తుంది. అటువంటప్పుడు భారతీయ భాషలను రోమన్ లిపిలోకి మార్చడంలో ఎన్ని ఇబ్బందు లెదురవుతాయో ఊహించవచ్చు.

ఒక భాషను ఏ దిశలో వ్రాస్తారు, చదువుతారు అనేవి కూడా యాంత్రిక అనువాదంలో ప్రాముఖ్యం వహిస్తాయి. ఇంగ్లీష్ వలెనే చాలా భారతీయ భాషలు ఎడమనుంచి కుడివైపుకు వ్రాయడం, చదవడం అలవాటు. అరబిక్ హిబ్రూ, ఉర్దూవంటి భాషలు ఇందుకు వ్యతిరేకం. వీటిలో కుడినుంచి ఎడమకు చదవటం, వ్రాయటం, జరుగుతాయి. చైనీస్ భాషను పైనుంచి కిందకు చదవడం, వ్రాయడం చేస్తారు. ఫ్రెంచ్ రష్యన్, జపనీస్, జర్మన్, హిబ్రూ, చైనీస్ మొదలైన భాషలవారు ఆయా భాషలకు అనుగుణంగా కంప్యూటర్ టెక్నాలజీ అభివృద్ధి చేసుకున్నారు. కాని మనం కంప్యూటర్ వాడకంలో ఇంకా ఇంగ్లీష్‌నే ఆధారంగా తీసుకుంటున్నాము.

భారతీయ భాషలలో యాంత్రిక అనువాదం అభివృద్ధి చేయాలంటే కింది రంగాలలో ప్రగతి సాధించవలసి ఉంటుంది.

1. లిపి ప్రమాణం చెయ్యటం.
2. టైప్ రైటర్‌లకు, టెలిప్రింటర్‌లకు ఆధునిక బోర్డులు తయారు చేయడం.
3. కంప్యూటర్‌కి పనికి వచ్చే కీ బోర్డు తయారు చేయడం.
4. ముద్రణలో అత్యధునాతనమైన సాంకేతిక విధానాలను రూపొందించడం.

ఈ రంగాలలో ప్రస్తుతం మన దేశంలో కింది కేంద్రాలలో కొంత కృషి జరుగుతోంది: ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, గ్రాఫిక్ ఆర్ట్స్ రిసెర్చి సొసైటీ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ టెలిప్రింటర్స్ లిమిటెడ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగుళూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కాన్పూరు, మద్రాసు, జాదల్‌పూర్ యూనివర్సిటీ, మద్రాస్ క్రిస్టియన్ కాలేజి, తాతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చి, బొంబాయి. కొన్ని రంగాలలో కొంత ప్రగతి సాధించారు. ఇంకా చేయవలసింది చాలా ఉంది. ఇందుకు ప్రభుత్వ సహకారం, మద్దతు ఎంతైనా అవసరం.

మన దేశంలో 1965 నుంచి అక్కడక్కడ కొందరు వ్యక్తులు యాంత్రిక అనువాదం గురించి పరిశోధనలు జరుపుతూ వచ్చారు. కాని కొన్ని కేంద్రాలలో సామూహిక కృషి ఇటీవలనే ప్రారంభమయిందని చెప్పవచ్చు. కొత్తఢిల్లీలోని ఇండియన్ నేషనల్ సైంటిఫిక్ డాక్యుమెంటేషన్ సెంటర్ (ఇన్‌స్డాక్) లో ఒక బృందంవారు హిందీ—బెంగాలి యాంత్రిక అనువాదంలో కొంత ప్రగతి సాధించారు. వీరు రోమన్ లిపిని వాడారు. ఇది ఇంకా ప్రారంభ దశలోనే ఉంది.

ఆధార రచనలు

ఇటీవలి రచనలు మాత్రమే ఇక్కడ పేర్కొన్నాము:

1. హెర్బర్ట్ ఇ. బ్రూడర్. 3,00,000 వర్డ్స్ పర్ అవర్: ఆటోమేటిక్ ట్రాన్స్‌లేషన్ ఆఫ్ లాంగ్వేజెస్ : సిస్టమ్స్ ఫంక్షన్ ఎండ్ స్ఫియర్స్ ఆఫ్ ఇట్స్ ఎప్లికేషన్. జర్నల్ ఆఫ్ ఇండియన్ సయిన్స్ ట్రాన్స్‌లేటర్స్ ఎసోసియేషన్ 8 : 1-7, 1979.
2. ఎ. ఆర్. చక్రవర్తి, ఎ. ఎస్. రాయిజాదా, ఆర్. సత్యనారాయణ. ది డెవలప్‌మెంట్ ఆఫ్ మెషీన్ ట్రాన్స్‌లేషన్ రిసెర్చి ఇన్ ఇండియా. పేపర్ ప్రెసెంటెడ్ ఎట్ ది నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్రాబ్లెమ్స్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ ఇన్‌టు ఇండియన్ లాంగ్వేజెస్. న్యూ ఢిల్లీ, 1979.
3. పయి సమావేశంలోనే పయి ముగ్గురూ సమర్పించిన మరో వ్యాసం : సమ్ ఎప్రోచెస్ టు రీసెంట్ సర్వీస్ ఓరియంటెడ్ మెషీన్ ట్రాన్స్‌లేషన్ రిసెర్చ్ ఎబ్రాడ్.
4. ఓమ్ వికాస్. మెషీన్ ట్రాన్స్‌లేషన్ ఇన్ ఇండియన్ కాన్‌టెక్స్ట్ — అదే —

శ్రీ దిలావర్

బుచ్చిబాబు వచన కావ్యం చివరకు మిగిలేది

రొమాంటిక్ కవిత్వం రాజ్యమేలుతున్న రోజులు. దాని ప్రభావం నుండి మిగతా సాహితీ ప్రక్రియలు కూడా తప్పించుకోలేక పోయాయి. కథల్లో, నవలల్లో భావకవితా ఛాయలు పరచుకోడం యుగ ధర్మంగా సరిపెట్టుకోవచ్చు.

విశ్వనాథ, అడవి బాపిరాజుల నవలల్లో భావకవిత్వం చోటు చేసుకోడంలో ఆశ్చర్యం లేదు.

కాని భావకవులను వీలున్నప్పుడల్లా హేళన చేసిన చలం కూడా తన నవలలను భావకవిత్వంతో శోభాయమానంగా తీర్చి దిద్దడం విశేషం! బుచ్చిబాబు కూడా ఆ బాటలో నడిచినవాడే!

అందమైన భావాలను కవితాస్థాయికి ఎదిగిన వాక్యాలలో పలికించగల ప్రతిభావంతులైన రచయితలలో చలం అద్యుడు. బుచ్చిబాబు అద్వితీయుడు.

"గద్యం కవీనాం నికషం వదన్తి" అని వామనుడు ఏనా డన్నాడో కాని యిప్పటికీ ఆ సూక్తి గద్యాన్ని వెలకట్టే గీటురాయి గానే నిలిచిపోయింది.

ఓజోవంతమైన జలపాతాల్లాంటి వాక్యాలే కవిహృదయానికి నిజమైన నికషం!

టన్నుల కొద్దీ ఉత్పత్తి అవుతున్న గద్యమంతా రాశిపోయ డానికి తప్ప వాసి ఎంచుకొంమటు పనికిరాదన్నది జగమెరిగిన సత్యం. సహజంగా పుపొంగే శక్తిమంతమైన భావాలు రమణీయార్థ ప్రతిపాదకమైన శబ్దాల్లో ఆవిష్కరింపబడ్డప్పుడే ఉత్తమ సాహిత్యం సృజింపబడుతుంది.

గొప్ప కవులు మాత్రమే గొప్ప వచనం రాయగల్గుతార న్నది అన్ని సమయాల్లో నిజం కాకపోయినా, గొప్ప రచయితలు వచనంలో గొప్ప కవిత్వం చెబుతారనేందుకు బుచ్చిబాబే గొప్ప నిదర్శనం.

నన్ను గురించి కథ రాయవూ, తనను గురించిన నిజం, దేశం నా కిచ్చిన సందేశం, చైతన్య స్రవంతి, అడవి గాచిన వెన్నెల మొదలైన బుచ్చిబాబు కథలు వేటిని పరిశీలించినా ఇది యథార్థం అని స్పష్టమవుతుంది.

ఇక 'చివరకు మిగిలేది' అయితే అన్ని విధాలా రసార్ద్రమైన వచన కావ్యమే!

మతం, రాజకీయాలు, సాంఘిక సమస్యలు, ప్రేమ, తాత్త్విక చింతన–వేటిని స్పృశించినా శుష్క సిద్ధాంత చర్చలు చేయకుండా కళాత్మకంగా, రసాత్మకంగా చెప్పాడు బుచ్చిబాబు. అంతరంగిక, బాహ్యసంఘర్షణలను మధించి పఠితలకు అమృతోపమానమైన భావుకతను పంచాడు. సాహితీ విలువలు కుంటువడకుండా జీవితాన్వేషణ సాగించాడు. శారీరకాకర్షణలనుండి ఆధ్యాత్మికతవరకూ సాగే మహా ప్రస్థానానికి రసరమ్యమైన పూలబాటలు వేశాడు.

ఈ నవల కావ్యత్వం సిద్ధించుకుందుకు సంతరించుకున్న అర్హతల్లో అధ్యాయాల శీర్షికలు కూడా ఒకటి. ఎంత భావస్ఫోరకంగా ఉన్నాయి ఆ శీర్షికలు!

గడ్డిపోచ విలువెంత? ఏమో? ఖరీదు కట్టే షరాబు ఎవరు? దయానిధి జేబులో వుంటే ఒక విలువ. కోమలి కొప్పులో వుంటే ఒక విలువ. అడ్డమైన వాని నోట్లో పెడితే ఒక విలువ. అనుభవానికి హద్దులు ఏముంటాయి? ఆకాశానికి ఎల్లలేమిటి? అనుభవాల రాపిడిలో ఏ విలువలు సాధింపబడతాయో! యవ్వన సామ్రాజ్యానికి శారీరకాకర్షణ ఒక్కటే పరమావధి కాదేమో! స్వాతంత్ర్య సమరంలో చప్పుడు చెయ్యని సంకెళ్లను ఛేదించుకోడం కన్నా విముక్తికి మార్గమే ముంటుంది? శారీరకాకర్షణ నధిగమించి ఆధ్యాత్మికత వేపుకు పయనించే దారిలో సౌందర్య రాహిత్యం గాక మరేముంటుంది? చీకటి సమస్యకు కూడా అమృత హృదయాలంబన ఒక్కటే పరిష్కారం కదా! రాలిన ఆకుల్లో

ఏ వసంతాల జ్ఞాపకాలు నిక్షిప్తం చేయబడ్డాయో ఎవరికి తెలుసు? రాజీ పడటం కన్నా జీవితంలో చివరకు మిగిలేదేమిటి?

ఇక యీ నవలను వచన కావ్యం అని పిలవడానికి గల ప్రధాన హేతువు: ఇందులోని రసాత్మక వాక్యాలే. రక్తమాంసాలతో పుష్టిగా వుండి, అయస్కాంతాల్లా ఆకర్షించే వాక్యాల గుంపులు యీ నవలలో కోకొల్లలుగా దర్శన మిస్తాయి.

రసయోగం తెలిసిన పరుసవేది చేతిలో పాషాణం పసిడిగా మారినట్టు – యవ్వనం, ప్రేమ, శారీరకాకర్షణ, ప్రకృతి, పరిసరాలు, కళ్ళు, కన్నీరు, తత్త్వం..........ఏ అంశం తన చేతిలో పడ్డా దాన్నొక అద్భుత కళాకృతిగా తీర్చి దిద్దుతాడు బుచ్చిబాబు.

యవ్వనం ఎంత రమణీయంగా నిర్వచింపబడ్డదో చూడండి:

"యవ్వనం వొక ప్రాచీన శక్తి. తరతరాల వ్యక్తులను కాల్చి మట్టి చేసిన బలంతో సృష్టినే భేదించిన ఆ మహత్తర శక్తికి, సంస్కారం, వన్నె చిన్నెలు, నగిషీలు, వంకర తిరిగి తిరిగి బైల్దేరిన స్థానానికి తెచ్చే మానసిక మెట్లు— వీట్లతో ఏం సంబంధం?"

యవ్వనం లోని కాంతి దాగుడుమూత లాడుతూ యీ వాక్యాల్లో దర్శన మివ్వడం లేదూ?

ఇట్లాంటి వాక్యాలకు ఎంతకాలమైనా వార్ధక్యం వొస్తుందా?

మనసును శరీరం జయించినప్పుడు యవ్వనం కోరేది సౌఖ్యజ్వాలే కదా! దయానిధి కోమలిని మొదటిసారి ముట్టుకున్నప్పుడు "సముద్ర కెరటాలపై నురుగు మంటలుగా లేచి ఆకాశాన్ని ఆవరించుకుంటే మళ్ళా— ఆ జ్వాలని ఆర్పేటందుకు ఆమె శరీరాన్నే తాకాలేమో అనిపించింద" ట!

ఎంత రసవత్తర భావచిత్రీకరణ!

దయానిధి యవ్వనం కాని, చక్కదనం కాని, హోదాకాని— ఏదీ కోమలిని ఆకర్షించలేదు.

"అసలట్లా ఆకర్షింపబడేందుకు తగినంతగా ఆమెశరీరం పక్వానికి రాలేదేమో! అదొక మందుగుండుసామగ్రి వేసిన పెట్టె: ఎవరో దానికి నిప్పు ముట్టించాలి. అప్పుడుకాని అది బ్రద్దలై బైటపడదు."

దయానిధి ఆకర్షింపబడకపోవడానికి కారణం ఎంత చక్కని కవిత్వంలో చెప్పబడింది!

స్థాయీ భావంతో దట్టింపబడివున్న పాఠకుని హృదయం యీ వాక్యాలతో ముట్టింపబడి బ్రద్దలై రసానందం బైటపడుతుంది.

"పరిమళం బరువుకి రంగువత్తిడికి తట్టుకోలేక వాడిపోయిన అడవిపువ్వు: పర్వతశిఖరాన్నుంచి జారి విడిపోయిన మంచుముద్దలోని నిర్మలత్వం: నిశీధిలో సృష్టివేసుగున్న మంటలో: దీన జ్వాల. అర్ధరాత్రి జీవులు కన్న స్వప్నంలోని మూగ బాధ.... . "

నిద్రపోతున్న కోమలిని మన కళ్ళకు కట్టించిన మాటలివి. సౌందర్యం తన యాత్ర ముగించుకొని పవ్వళిస్తున్నదట!

హృదయ పర్వత శిఖరాన్నుంచి జలపాతంలా జారిన కవిత్వంలోని నిర్మలత్వం: కవిత్వపు జ్వాలలో హృదయం పొందే తపన ఈ వాక్యాల్లో పొదగ బడ్డాయి. సౌందర్యం తన యాత్ర ముగించుకొని బుచ్చిబాబు చేతిలో అక్షరాకృతి దాల్చి నట్టుంది.

"ఉప్పెనలా గాలి గదంతా కమ్మేసింది. కడసారినృత్యం ముగించి దీపం మూర్ఛపోయింది. అతని కళ్ళు అమృతం వొళ్ళో తెరుచుకున్నాయి. అతని నుదుటిని చలిమంటలా కాల్చింది అమృతం కడుపు....భరింపరాని సౌందర్యం వెలుగులో అతనికి స్పృహ తప్పింది. జడంతా అతన్ని కప్పేసింది— శిథిలా కన్నీటి చుక్కలచే చీర తడిసి, అమృతం తొడలు చలితో వేడెక్కుతున్నాయి. ఆకాశం తన ఒక్కడిమీద నిశ్చింతగా వర్షిస్తానన్నట్టు అతని మెడ వెనకభాగంమీద, కన్నీరు వునికి వున్న ఇంద్రధనుస్సులా ఆవరించింది....విశ్వరహస్యానికి ప్రాణంపోశారు. ఆలోచనా, విమర్శనా, తర్కం, చైతన్యం, అన్నీ ఉద్రేకాల ప్రవాహంలో కెరటంపై నురుగులా కొట్టుకుపోతున్నాయి. దేని కోసమో రెండు ప్రాణులు సృష్టి శక్తులను కేంద్రీకరించి పెనుగులాడుతున్నాయి. రక్తం పట్టుతప్పి నిప్పు ద్రావకంలా పొర్లి శరీరాన్ని కడిగి పవిత్రం చేస్తోంది.........."

జీవనోత్సాహంతో, యవ్వనవేగంతో సాగిన యీ భావప్రవాహంలో మనంకూడా కొట్టుకుపోతాం. రక్తంపట్టుతప్పుతుంది. హృదయం ద్రావకంలా కరగుతుంది. మనసు ఉదాత్తమైన అనుభూతుల్లో తేలిపోతుంది. సూర్యుడిలోని వేడిమికి కరగిన మంచు కణంలా సోలిపోతుంది. నిప్పులో కాలిన మల్లెపూల పరిమళమంటే ఏమిటో తెలుస్తుంది. అతర్వాతగానీ ప్రాణం స్థిమితపడదు.

ప్రకృతిని వర్ణించేటప్పుడయితే బుచ్చిబాబులో కవితావేశం పరవళ్ళు తొక్కుతుంది. అనన్య సామాన్య ప్రతిభతో ప్రతి వాక్యానికీ కవితాస్థాయి కల్పిస్తాడు బుచ్చిబాబు. మన మనసు కాన్వాసుపై మనోహర దృశ్యాల్ని అద్దుతాడు.

"ఉండి వుండి పల్చటి తెల్ల మేఘం పౌర చంద్రుడిమీద పెండ్లికూతురు మొదటి రాత్రి సిగ్గు ముసుగులా కప్పి, కవ్వించి, తీసేసి తొలగిపోతుంది. గాలిలో చలి, పదును పెట్టిన కత్తిలా శరీరాన్ని మభ్య పెడుతోంది. చెట్లలో ఆకులు సంగీతం కోసం గొంతులు సవరించుకొంటున్నాయి. చలిని ధిక్కరించినట్లు ఎక్కడో పక్షులు బాధతో ఆనందాన్ని రెపరెప ప్రకటిస్తున్నాయి. తపోభంగ యత్నాన్ని జయించిన ఋషిలా ప్రకృతి పనిచేస్తోంది."

ఈ ప్రకృతి వర్ణన ఏ భావ కవిత్వానికి తీసిపోతుంది?

ఇక స్త్రీ గురించి, ఆమె కళ్ళ గురించి, కన్నీరు గురించి ఎంత సానుభూతితో, ఎంత భావోద్రేకంతో రాశాడో చూడండి.

'స్త్రీ ఒక చెట్టులాంటిది. చూస్తుండగానే ఎదిగిపోయి, మానులు చాచుకొని, ఆకులు, మొగ్గలు, ఫలాలు తెచ్చుకుంటుంది. ఆ నీడలో ఎవడో యాత్రికుడు నిలబడి, సేదదీర్చుకొని, దాని శ్వాస పీల్చి, ఆ ఫలాన్ని కొరికి వొక్కసారి కదిపిపోతాడు.'

స్త్రీని గురించిన యీ యథార్థం మన గుండెల్ని కుదుపుతుంది. అయితే యీ కుదుపు మామూలు బాధకాదు. తియ్యని కల విరిగిపోయినప్పటి బాధ. చూస్తుండగానే మన మనసుల్లో ఎదిగిపోయి ఫలపుష్పాలను సంతరించు కుంటుంది. ఆ నీడలో మనం తప్పక సేదదీర్చుకుంటాం.

స్త్రీ అందమైన కళ్ళతో పోటీ పడతాయి ఈ నవల లోని కళ్ళ వర్ణనలు. చూడండి.

ఎన్నో జ్ఞాపకాల కారుణ్యాన్ని భరించలేని నేత్రాలు కన్నీటిని వొదిలేశాయట!

కనురెప్పలు, దృష్టి, యితరుల కంటబడకుండా కాపలా కాసే జైలు కడ్డీల్లా వున్నాయట!

"ఆనాడు చీకట్లను భేదించిన యీ నేత్రాలు యీనాడు సఘం చీకట్లలో అంధత్వం పొందాయా? సౌందర్యం యవ్వనాన్ని శాశ్వతంగా వుంచుకుంటే నేను గొంతెత్తి పాడను. పచ్చమబ్బులో మసకగా మెదిలిన మెరుపు కాంతుల ఎట్టి నీడలు కదలిన యీ నేత్రద్వయం కన్నీటిని తేనె బిందువులుగా వర్షించి, మధురస్వప్నంలో శిలలుగా స్థిరత్వం పొందిననాడు ఎలుగెత్తి పాడలేను...."అంటాడు.

బుచ్చిబాబు భావుక హృదయ నేత్రం వర్షించే కవిత్వపు తేనె బిందువులు ఒక్కొక్కటి దిగజంతేమా మన మనసుల్లోకి ?

'కన్నీటి' కవితా ప్రవాహం చూడండి:

"భవిష్యత్తులేని భావి కాలం దాచలేక పోయిన కన్నీరు ప్రతి బిందువూ నల్లరాతి మీద పడి విడిపోతుంది. అమృతం హృదయం ఆ బిందువులతో భగ్నమైపోతోంది. మృత్యువు కూడా అంత మొందించలేని బాధ. ....."

"మానవుణ్ణి జీవితానికి కట్టిపడేసేది కన్నీరు. అది అంత్యాలున్నది కన్నీ రొక్కటే ... . మానవ జీవితాన్ని కన్నీటి బిందువుగా మార్చి అరచేతిలో వుంచుకొని, దాన్ని పరీక్షగా చూసి, కరగించివేసే సమయం అది. ఆ కన్నీటి బిందువులో కలిసిన వెన్నో ప్రేమ వాహినులు; ఎన్నో నవ్వులు: మనిషినీ మనిషినీ బంధించిన తుంపరల గొలుసు. యౌవ్వనంలో వేడెక్కి, వార్ధక్యంలో మంచుగడ్డయ్యి, మృత్యువులో పరమార్థం పొందిన కన్నీటి బిందువుకి అర్థమే లేదా ? లేదు. కన్నీటికి అర్థంలేదు అన్న తలంపుకి కన్నీరు తప్ప, కన్నీటికి వేరే అర్థం లేదు."

కన్నీటికి యింత విపులంగా భాష్యం చెప్పిన తెలుగు రచయిత మరొకరు లేరేమో ! జీవితానుభవాల్లోంచి పిండుకున్న సూక్ష్మమైన యీ విశ్లేషణ అనితరసాధ్య ప్రతిభకు మంచి నిదర్శనం ! రసార్ద్రమైన కవిత్వానికి యిది పరాకాష్ఠ !

కేవలం సౌందర్యారాధనలోనే గాక లోకవృత్త దర్శనంలో కూడా తన ప్రత్యేకత నిరూపించుకున్నాడు బుచ్చిబాబు.

రాక్షసీయను ఎంత గడుసుగా వర్ణించాడో చూడండి:

"ఆల్చిప్పల్ని విరుకుంటున్న కుర్రాళ్ళవలె డామ్మ సిలిసవ్వులు నవ్వుతారు. వాళ్ళ మొహాలలో సంతోషం, చైతన్యం, యవ్వనం, ఉత్సాహం ఏమీలేవు. క్షామదేవత సంతానం, ఆకలిదయ్యాలు, 'నన్ను చూడండి' అంటూ వారి స్వరూపాలు దాల్చి పుట్టి వస్తున్నాయి."

జాతీయోద్యమాన్ని అణచివేసేందుకు నాటి ప్రభుత్వం అవలంబించిన దమననీతిని పొడిపొడి మాటల్లో కాక, కళాత్మకంగా చిత్రీకరించిన విధం ప్రశంసనీయంగా వుంది.

"నిప్పులో కర్ర పెడితే కర్ర కాలిపోతుంది. మంట మరింత పెద్దదవుతుంది. ప్రభుత్వంవారు అడవులను కొట్టి, యీ మంటను పెద్దది చేసేందుకో అన్నట్లు కర్రని తిన ఉద్యోగుల కిచ్చి, వెళ్ళి యీ ప్రయోగాన్ని అమలుజెయ్యమని ఆజ్ఞాపించారు. మునిసిపల్ ఆవరణలో ఎక్కడ సభ జరిగినా సరే, యీ కర్రల వర్షం ఆ మంటని చల్లార్చేందుకు కురిపిస్తామని చాటించారు .... అగ్నినే కాల్చమంటున్నామన్న ఆశ్చర్యం వాళ్ళకి కలగకపోలేదు."

సభలో దయానిధి చేసిన ఉపన్యాసంలోని వ్యంగ్య వైభవం గమనించండి:

"డాక్టర్ల విషయం చూడండి - వైద్యశాఖలో విభేదాలు గమనించండి. తలకాయలు దొరలు. కాళ్ళు చేతులు వాళ్ళే. మనం ? వాళ్ళపాదాల కింద యిసుకరేణువులం. వొకరేణువు పెద్ద సైజుది: మరొకటి చిన్నది."

కవిత్వానికి వక్రోక్తికన్నా దగ్గర బంధువు లెవరున్నారు ?

బుచ్చిబాబు పట్టుకుందల్లా బంగారమే ! ప్రకృతి, పరిసరాలు, జీవిత రహస్యాలు, తత్త్వం... ఏ వన్నా కానీయండి. ఆయన చేతిలో మైనంముద్దలా ఒదిగిపోతాయి. కోరిన రూపాలు ధరిస్తాయి.

"దయానిధి వెళ్ళింది జీవితాన్ని స్పృశించడానికి. ఆ చీకట్లో, ఎక్కడో జీవితరహస్యం దాగి వుంటుంది. దాన్ని పట్టుకోవాలి. అతని గురించి అతనికి సందేహాలు లేవు. నేలమీద నడుస్తూ అనుకోకుండా నీళ్ళలో దిగినట్లుగావుంది. ఈత చేతనైతే కాని నీళ్ళలో దిగలేడు; దిగితేకాని ఈతరాదు. ... పోనీ జీవితం ఒక కుండ లాంటిది. కాలం, వ్యక్తులు అందరిచేతా, తలోచుక్కా పోయిస్తుంది, ఇంక ఒక చుక్క పడితే కుండ నిండుకుంటుంది. ఆ సాయంత్రం, ఆ వొక్క చుక్కా ఎవరో పోసినట్లుంది. నీళ్ళా ? కుండా ? ఏది యథార్థం ? చీకట్లో కాలికి కుండ పెంకు తగిలింది. అది శ్మశానమా ?"

క్రొంగొత్త ఉపమానాలతో జీవిత రహస్యాలను చర్చించడం నిరుపమానంగా వుంది. సముద్ర మంత లోతైన భావాలను కూడా అలవోకగా, నల్లేరుమీద బండిలా, సునాయాసంగా చెప్పడం ఒక్క బుచ్చిబాబుకు మాత్రమే సాధ్యమవుతుంది.

"ప్రపంచంలో అన్ని మూసుకునేతలుపులు అన్నితలుపులూ ఒకదానితర్వాతవొకటి మూసుకుపోతాయి. మనం బైటుండిపోతాం. అంతా చీకటి. దూరంగా యేదో కిటికీ తెరిచినట్టయింది. కాంతి మెరిసి నట్లయింది, అతడు జీవితాన్ని స్పృశించి పట్టుకున్నట్లుంది. విశ్వాన్ని అవులింతలో యిముడ్చుకున్న విష ఖత ....."

గంభీరమైన తాత్త్వికతను కూడా అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు సులభసాధ్యం చేస్తారు బుచ్చిబాబు.

ఆయా సందర్భాల్లో వెన్నెల సోనలా జాలువారి సహృదయాహ్లాదం గావించే కవితాత్మక వాక్యాలు చూడండి:

"అందమైన అవిడ భావకవిత్వం మీద వ్యాసాలు దంచేస్తున్నారీమధ్య ఆంధ్ర కవిపుంగవులు. కోమలి ఫోటోగ్రాఫ్ కింద వీళ్ళంతా సంతకాలు పెడితే సరిపోను."

"అనుభవం వల్ల మానవుడు జ్ఞానం పొందితే ఏ యూరులో రోడ్లన్నీ పేవుసలాగా అవును."

"శాంతి నివ్వని ఆలోచనలను - తన ప్రవర్తనని సమర్థించుకోవడం కోసం, తార్కిక జ్ఞానాన్ని, భాషనీ, భావాలనీ వ్యభిచరింపచెయ్యడంలా తోస్తుంది."

ఇలా ఈ నవలామైదానంలో భావ శబలత్వంతో ప్రేక్షురికే వాక్య శాబకాలు కోకొల్లలు !

బుచ్చిబాబు పాత్రలను మలచిన తీరుకూడా ఈ నవలను కావ్యానికి దగ్గరగా తీసుకొచ్చేదే ! ఈ నవలలో దయానిధి చుట్టూతిరిగే ముఖ్యమైనపాత్రలుకోమలి, అమృతం, సుశీల, ఇందిర. ఈ నలుగురి ద్వారా విభిన్నభావాలను ప్రతీకాత్మకంగా దర్శించగలిగాడు రచయిత.

కోమలి శరీరం అయస్కాంతం. సౌందర్యానికి ప్రతీక. అమృతహృదయ అమృతం. దయ, సానుభూతికి ఆమె ప్రతీక. సుశీల నాగరీకురాలు. విద్యకు, సౌకుమార్యానికి ప్రతీక. ఇందిర యిల్లాలు. వివాహ వ్యవస్థకు ప్రతీక. ప్రతీకాత్మక పాత్రలద్వారా తన భావాలను వ్యంజించడం కన్నా కావ్యోచిత రచన ఏముంటుంది ?

భావస్ఫోరకమైన అధ్యాయాలు, రసాత్మకమైన వాక్యాలు, ప్రతీకాత్మకపాత్రలతో యీనవల కావ్యమర్యాదలను సంతరించుకొని ఆధునిక వచనకావ్యంగా భాసిస్తున్నదనడం అతిశయోక్తి కానేకాదు.

" అణో రణీయాన్ మహతో మహీయాన్ "

ఆకాశాన్నంతా
తిలకించాలని
పులకరించిపోయే
పాలపిట్టను తండ్రీ !

బంగారుకాంతులతో సూర్యుడు పొడవగానే
ఆనందంగా విహరించే నేను,
అవే బంగారు కాంతులు పడమట కనిపించగానే
అర్థంకాని అసంతృప్తితో నిదురపోతాను !

ఆపై వచ్చే రాతిరిలో
ఎన్ని చుక్కలు పొడిచినా
నెలవంకల పాలవంకే పొంగిపొరలినా
విస్పష్టంకాని విహాయసాన్ని
మనసారా చూడలేకున్నాను !

భావగతి కందని మానసంలో
రెక్కలు విరచుకొంటున్నాను !

అలసిపోయేలోగా
ఆకాశాన్ని అధిగమించాలని
అనంతాభిరామాన్ని దరిసించాలని
తహతహ !

ఒక వేళ నేలను చేరి
మట్టిలో కలసి పోయినా
అంతెత్తునున్న నీకోసం
ఉవ్వెత్తున్న లేచివచ్చే సుడిగాలితోనైనా సరే....
కలసివస్తాను !

గోధూళినై
నీకో అందాన్ని యిస్తాను !

సరుగుడుల్లోంచి యూకలిప్టస్‌లోకి ....

సరుగుడు రాతని....
చీకట్లో ఎకసెక్కమాడకు !

యూకలిప్టస్‌లా ఎదిగి సూర్యుణ్ణి పట్టుకొచ్చిందంటే
మైలపడ్డ నీ బ్రతుకు బజారు కెక్కుతుంది !

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

డాక్టర్ బి. ఆర్. కె. రావు

ద్రవ్యోల్బణము

అర్థము-భావము

"ద్రవ్యోల్బణము" నకు వివిధ అర్థశాస్త్ర రచయితలు తమ తమ నిర్వచనాలు వ్రాసారు. కాని శాస్త్రీయమైనదని చెప్పదగి, అందరూ అంగీకరించినట్టి ఖచ్చితమైన నిర్వచనం యివ్వడం యిప్పటికీ కష్టంగానే ఉంది. ధరలస్థాయి పెరగడాన్ని అనగా ద్రవ్యంవిలువ పడిపోవడాన్ని ద్రవ్యోల్బణమని అందరూ అనుకుంటారు. 1. "జరుగుతున్న వ్యాపారరాశి విలువకంటె చాలా హెచ్చు ద్రవ్యము, చాలా హెచ్చుగా డిపాజిట్ చేయబడిన కరెన్సీ ఉండటము ద్రవ్యోల్బణము" (కెమ్మెరర్) 2. "చాలాకొద్దివస్తువుల్ని చాలా హెచ్చుద్రవ్యము తరమడము ద్రవ్యోల్బణము" (కోల్‌బర్న్) ద్రవ్యరాశి పెరగడంవల్ల దానివిలువ పడిపోయి ద్రవ్యయూనిట్ అంతకు ముందుకంటె తక్కువరాశి వస్తువుల్ని మాత్రమే కొనగల్గినప్పుడు, ధరల స్థాయి పెరుగుతుంది. ఈ సందర్భంగా ద్రవ్యోల్బణాన్ని "ద్రవ్యరాశి అసాధారణంగా పెరగడము" (టి. ఇ. గ్రిగరీ), "ద్రవ్యాన్ని అతి హెచ్చుగా వాడకానికి విడుదలచేయడము" (హాట్రే) అని చెప్పారు. సరఫరా చేయబడిన వస్తువుల విలువకంటె హెచ్చుగా ద్రవ్యరాశి ఉండటంవల్ల ధరలు పెరుగుతున్నాయని పై నిర్వచనాలనుబట్టి చెప్పవచ్చు. దీనినే ధరలస్థాయినితెల్పే రాశ్యాత్మక మార్గమని చెబుతున్నారు. అయితే వేతనాలు, లాభాలు పెరగడంవల్లకూడా ధరలు పెరుగుతున్నాయనే విషయాన్ని మర్చిపోకూడదు. అంతేగాక ధరలు పెరగకుండానే, ధరలమీద ద్రవ్యోల్బణపు వత్తిడి ఉండవచ్చు.

కీన్సు నిర్వచనము

రాశ్యాత్మకమార్గము, ద్రవ్యరాశి పెరుగుదల ధరల పెరుగుదలకు కారణమంటుంది. అయితే సంపూర్ణ ఔద్యోగిత ఏర్పడినపిదప ధరలస్థాయి పెరగడము ద్రవ్యోల్బణమని సర్ జాన్‌మేనార్డ్ కీన్సు వ్రాశారు. కీన్సు ప్రకారము రెండురకాల "ధరల పెరుగుదలలు" ఉన్నవి. 1) ఉత్పత్తి పెరుగుదల, ధరలపెరుగుదల ఒకేసారి కలసి రావడము, 2) ఉత్పత్తి పెరుగుదలలేకుండా ధరలు మాత్రమే పెరగడము.

ఆర్థికవ్యవస్థ తక్కువస్థాయిలో పనిచేస్తున్నప్పుడు, చాలామంది నిరుద్యోగులుగాఉండి, వనరులను ఉపయోగించడము అవసరమైనమేరకు జరగనపుడు, ద్రవ్యము, ఇతరకారకాలు పెరిగివస్తువులకు డిమాండ్ పెరిగితే ధరలస్థాయి పెరగటంతోపాటు, వస్తు, సేవల రాసులుకూడా ఆర్థికవ్యవస్థలో పెరగవచ్చు. అందువల్ల ధరల పెరుగుదలతోపాటు, ఉత్పత్తి, ఔద్యోగితలుకూడా పెరగవచ్చు. నిరుద్యోగులందరికి పని దొరికేవరకు, మూలధనం మొదలైన వనరులు ఇంకా హెచ్చుగా పూర్తిగా ఉపయోగింపబడేవరకు, అంటే పూర్ణఔద్యోగితా దశయేర్పడే వరకు పైచెప్పిన మూడు పెరుగుదలలు కలసి ముందజవెయ్యవచ్చు. కాని ఈ పూర్ణఔద్యోగిత దశ దాటిన పిదప ద్రవ్యరాశి పెరుగుదలవల్ల డిమాండ్ హెచ్చడమువల్ల ధరలు పెరుగుతాయేగాని, ఉత్పత్తి, ఔద్యోగిత పెరగవు.

మొదట్లో మంచిదే

పూర్ణఔద్యోగిత వరకు మొదట్లోధరలు పెరగడముమంచిదే. ఉత్పత్తి,ఔద్యోగిత పెరగడంవల్లనే దీనిని మంచిస్థితి అని అంటున్నాము. ఈ ప్రథమ ధరల పెరుగుదలస్థితిని "పునరుల్బణ" లేక పాక్షిక ద్రవ్యోల్బణ అని అంటున్నారు.

అయితే పూర్ణఔద్యోగిత పిదప ధరలు పెరగడము దేశానికి మంచిదికాదు. ధరలపెరుగుదలకు తగినట్లు ఉత్పత్తి, ఔద్యోగిత పెరగక పోవడంవల్ల ఈస్థితిచెడ్డదని చెప్పబడుతోంది. దీన్నేద్రవ్యోల్బణమని అంటున్నారు. కాబట్టి పూర్ణఔద్యోగిత ఏర్పడిన అనంతరం వచ్చే ధరల పెరుగుదలస్థితి ద్రవ్యోల్బణ స్థితిగా చెప్పబడుతోంది.

తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో

ఇండియావంటి తక్కువగా అభివృద్ధిచెందినదేశాల్లో నిరుద్యోగులైన మనుష్యులు, వనరులూ, ద్రవ్యరాశి పెరుగుదలవల్ల ధరలు పెరిగిన స్థితిలో కలసి వున్నట్లయితే ఆదేశాల్లో ద్రవ్యోల్బణం ఉన్నదని చెప్పవచ్చు. ఈ ద్రవ్యోల్బణస్థితికి మూలధనము, యంత్రాలు,రవాణా సౌకర్యాలు తక్కువగాఉండటము, సాంకేతిక పరిజ్ఞానము లేకపోవడము

కారణాలు. అనగా ఈకారణాలు ఆర్థికవ్యవస్థ పురోగమనానికి అవరోధాలని చెప్పాలి. ఈ అవరోధాలు, కొరతలుఉన్న కారణంగా ధరల స్థాయిలో పెరుగుదలవచ్చినా, దేశంపూర్తిఔద్యోగిత స్థితికి చేరనప్పటికి, ఒకదశను మించిన ఉత్పత్తి పెరుగుదలరాదు.

మూడురకాల ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణాన్ని ఏర్పరచే కారణాలననుసరించి, ద్రవ్యోల్బణాన్ని మూడురకాలుగా విభజించవచ్చు 1) డిమాండ్‌పుల్ 2) కాస్ట్‌పుష్ 3) సెక్టొరల్ ఇన్ఫ్లేషన్‌లు.

డిమాండ్ పుల్ ద్రవ్యోల్బణము

వస్తుసేవల సప్లయి చలనరహితంగాగాని, తక్కువ వేగంతోగాని ఉన్నపుడు ఆసప్లయిమీద ఆవస్తుసేవలకున్న డిమాండ్ హెచ్చుగా వత్తిడి నేర్పరచడము ద్రవ్యోల్బణము ఏర్పడడానికి పనిచేసేకారణాలలో చాలాసాధారణమైనదిగా కన్పిస్తోంది ప్రయివేటుపెట్టుబడి చాలా వేగంగా పెరగడంవల్లగాని, యుద్ధనిర్వహణకు, ఆర్థికాభివృద్ధి సాధనకు ప్రభుత్వం హెచ్చుగాఖర్చుచేయడంవల్లగాని వెరశి డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్ విస్తృతిచెందుతూ, ధరలపై వత్తిడిచేస్తున్నప్పుడు ఉత్పత్తిని పెంచేప్రయత్నాలు జరగవచ్చు. కాని ఉపయోగించబడని వనరులు లభ్యంకానందువల్ల రవాణా, విద్యుచ్ఛక్తి, మూలధన అవసరవస్తు సముదాయాదుల కొరతలు ఉండటంవల్ల పెరుగుతున్న డిమాండ్ అనుపాతంలో ఉత్పత్తి పెంచబడలేకపోవచ్చు. పెరుగుతున్న ద్రవ్యరాశి అనుపాతంలో కూడాఉత్పత్తి పెంపొందింప బడకపోవచ్చు. భారతదేశంవంటి వర్ధమానదేశాల్లో, స్వల్పకాలీన వ్యవధిలో ఆర్థికవృద్ధిని సాధించడానికి, స్థిరమైన ఆస్తుల్ని యేర్పర్చడానికి వినియోగవస్తువుల్ని ఉత్పత్తిచేయడానికి,వనరులు ఉపయోగింపబడుచున్న వి- పెద్దవ్యయము తప్పకుండా పెద్ద ఆదాయాలను, పెద్ది డిమాండును ఏర్పరుస్తుందిగాని, వాటికి తగిన సప్లయి గాని, వస్తూత్పత్తిని గాని చెయ్యలేక పోవచ్చు.

వర్ధమాన దేశాల్లో లోటుబడ్జెటు విధానం విడుదల చేస్తున్న ద్రవ్యం, ధరలను ప్రభావితం చేస్తోంది. ఇటువంటి దేశాల్లో ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు లోటుబడ్జెటు పద్ధతినుండి వచ్చే ద్రవ్యము బాగా ఖర్చు చేయబడుతోంద. కేంద్రబ్యాంకు నుండి, వాణిజ్య బ్యాంకులనుండి అప్పుగా తీసుకున్న ద్రవ్యాన్ని ప్రభుత్వం హెచ్చుగా ఖర్చుచేస్తోంది. ఇందువల్ల ఈ దేశాల్లో ద్రవ్యరాసులు పెరిగి ధరలమీద బాగా వత్తిడి ఏర్పడుతోంది.

ఒక దేశం ఎగుమతిచేసే వస్తువులకు విదేశ డిమాండ్ పెరిగితే ఎగుమతి చేసే దేశంలో వస్తువుల ధరలస్థాయి పెరగవచ్చు. విదేశ డిమాండ్ పెరిగి, ఎగుమతులు పెరగడంవల్ల ప్రజల ఆదాయాలు పెరుగుతాయి. ఇందువల్ల ఆ విధంగా ధరలు పెరిగిన దేశంలో వస్తు, సేవలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ అదనపు ఆదాయాలు దిగుమతి అయిన వస్తువుల్ని కొనడం జరిగినా, దాచిపెట్టబడినా దేశంలో ద్రవ్యోల్బణ ప్రభావం ఏర్పడదు. మొత్తం డిమాండ్, లభ్యమౌతున్న వనరుల్ని మించిపోయినట్లయితే ద్రవ్యోల్బణంవల్ల వత్తిడి ఏర్పడుతుంది. ప్రభుత్వఖర్చులు, ప్రయివేటు పెట్టుబడి, ప్రయివేటు వినియోగఖర్చులు, యుద్ధకాలంలో అణచి పెట్టబడిన వినియోగ డిమాండ్ యుద్ధానంతరం స్వేచ్ఛ పొందడము, ఎగుమతులు హెచ్చి అదనపు ఆదాయాలు లభ్యం కావడము, దేశంలో ద్రవ్యాన్ని పెంచి వెరశి డిమాండ్‌ను పెంచవచ్చు. లోటుబడ్జెటువల్ల వచ్చేడబ్బు, ద్రవ్య సరఫరా డిమాండ్‌ను మరింతగా పెంచి పరిస్థితి మరింతగా క్షీణించేటట్లు చేయవచ్చు. ఈ సందర్భాలన్నింటిలోను ద్రవ్యోల్బణము ''డిమాండ్ పుల్'' (డిమాండ్‌చేత లాగబడుతున్న) కారకాలవల్ల ఏర్పడుతోంది. అయితే ద్రవ్య సరఫరా పెరుగుతూవుంటే మినహా డిమాండ్ పుల్ ద్రవ్యోల్బణము మనజాలదు.

కాస్ట్ పుష్ ద్రవ్యోల్బణము

శ్రామిక నాయకులు సమ్మెలు చేస్తామని బెదిరించి వేతనాలు పెంచేటట్లు చేయడం వల్ల డిమాండ్ పెరిగి, కొన్ని సందర్భాలలో ధరలు పెరుగుతాయి. హెచ్చు లాభాలు తీసుకోవాలని పారిశ్రామిక యజమానులు నిర్ణయించడంవల్ల కూడా ఉత్పత్తి ఖర్చులు పెరిగి ధరలు పెరుగుతాయి, అధిక లాభాలు తీసేవారిని, స్పెక్యులేషన్ వ్యాపారం చేసేవారిని, వస్తువుల్ని దాచిపెట్టి వుంచేవారిని ఉత్పత్తి ఖర్చులు పెంచుతున్నారని, ధరలు పెంచుతున్నారని సామాన్య మానవుడు నిందిస్తూ వుంటాడు. కొత్త పన్నులు వేయడం ద్వారాను, వస్తువులపై యిదివరకే వున్న పన్నుల్ని పెంచడం ద్వారాను ప్రభుత్వం కూడా ఉత్పత్తి ఖర్చులు పెరిగేటట్లు చేస్తుంది. అమ్మకందార్లు తమ యిష్టమొచ్చినట్లు అమ్మడానికి వీలున్న పరిస్థితుల్లో వస్తువులపై విధించే పన్నులరేట్లు పెరిగినట్లయితే ఉత్పత్తిదార్లు ఆ పన్నులమొత్తం మేరకు ధరలను పెంచుతారు. ధరలు పెరుగుతూవున్నప్పుడు పారిశ్రామిక, వ్యాపార సంస్థలు అధిక వేతనాలభారం వల్ల పెరిగిన ధరలను తేలికగా వినియోగదార్ల మీదకు నెట్టివేస్తారు. అందుచేత వేతనాల పెరుగుదల, లాభపురేటు పెరుగుదల, పన్నుల పెరుగుదల ఉత్పత్తి ఖర్చుల్ని పెంచి ''కాస్ట్‌పుష్ ద్రవ్యోల్బణాన్ని'' ఏర్పరుస్తున్నవి.

వేతనాలు, ధరలు, వెరశి డిమాండ్ పెరుగుతూ, ద్రవ్యోల్బణాన్ని ఏర్పరుస్తున్నప్పుడు, ద్రవ్యోల్బణం ఏర్పర్చటానికి యిందులో ఏ కారకం క్రియాశీలంగా పనిచేసిందో, ఏ కారకం అప్రత్యక్షంగా తోడ్పడిందో చెప్పడం తేలికకాదు. చాలా సందర్భాలలో కేవలం డిమాండ్‌పుల్‌గాని, కాస్ట్‌పుష్‌గాని గాక రెండూ కలసి ద్రవ్యోల్బణాన్ని ఏర్పరుస్తాయి. అయితే ఈ రెంటిలో బలీయమైనదాన్ని విడదీసి చెప్పడము సంభవమే గాక లాభదాయకం కూడా. ద్రవ్యోల్బణ పరిస్థితికి వెరశి డిమాండ్ కారణమైనట్లయితే, అధిక డిమాండ్ వున్నంత కాలం ఆ ద్రవ్యోల్బణస్థితి మనుతుంది. అయితే కొన్ని విపరీత సందర్భాలలో కాస్ట్‌పుష్‌కారకాలు లేనప్పటికి ఆ ద్రవ్యోల్బణము హైపర్‌లేక అత్యధిక ద్రవ్యోల్బణంగా మారవచ్చు. అయితే వెరశి డిమాండ్ పెరుగుతూవుంటే మినహా కాస్ట్‌పుష్ ద్రవ్యోల్బణం చాలా కాలం మనలేదు. వెరశి డిమాండ్‌ను నియంత్రణ చేయడానికి ఉద్దేశించిన ద్రవ్య, కోశ విధానాలద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రణ చేసినట్లయితే, డిమాండ్‌పుల్ ద్రవ్యోల్బణము అమలులోవున్నదని చెప్పవచ్చు. డిమాండ్ పెరగడం ఆగిపోయిన పిదపకూడ, వేతనాల ధరలు పెరుగుతూనే వున్నట్లయితే, కాస్ట్‌పుష్ ద్రవ్యోల్బణము అమలులో వున్నదని చెప్పవచ్చు.

సెక్టరల్ డిమాండ్ షిఫ్ట్ ద్రవ్యోల్బణము

డిమాండ్‌పుల్ ఏర్పడినపుడు, వెరశి డిమాండ్ పెరిగి తదను పాతంలో వస్తుసేవలు పెరగనట్లయితే, ద్రవ్యోల్బణస్థితి ఎలా ఏర్పడు తుందో యింతకుముందు చూచాము. ద్రవ్యోల్బణ వత్తిడిని తేవడానికి, నిజానికి డిమాండ్ అన్నిరంగాల్లోను పెరగవలసిన అవసరం లేదు. కొన్ని సందర్భాలలో ఒక రంగంలోనే డిమాండ్ పెరుగుదల జరగ వచ్చు. ఈ డిమాండ్ పెరుగుదలవల్ల ఆ రంగం ఉత్పత్తిచేసే వస్తువుల ధర పెరిగి, ఆ ధరల పెరుగుదల యితర రంగాలకు విస్తరించవచ్చు. ఉదాహరణకు వ్యవసాయ రంగంలోని వస్తువుల సరఫరా తగినంతగా లేక వ్యవసాయ వస్తువుల ధరలు పెరిగినాయనుకోండి. ఇలా పెరిగిన వ్యవసాయ వస్తువుల ధర పారిశ్రామిక వస్తువుల ధరలు పెరిగేటట్లు చేయవచ్చు. ఆహారం ధర పెరిగితే, వేతనాలు పెంచబడి, పారిశ్రామిక ఉత్పత్తి ఖర్చులు పెరిగి పారిశ్రామిక వస్తువుల ధరలు పెరుగుతాయి. అందుచేత ముడిపదార్థాలు, ఆహారం ధరలు, వేతనాలు పెరిగి, ధరల పెరుగుదల అన్ని రంగాలకు వ్యాపిస్తుంది. కాబట్టి ఈ ద్రవ్యోల్బణము ఒక రంగంనుండి అన్ని రంగాలకు "షిఫ్టు" అయ్యిందని తెలుస్తోంది. అంటే యితర రంగాలకు వెళ్ళిందని అర్థము.

ధరలు పైకి పెరగడము సరళంగా జరుగుతుందని, ధరలు క్రిందికి దిగడము సాపేక్షికంగా సరళంగా జరగదని సెక్టరల్ డిమాండ్ పెరుగుదల సిద్ధాంతం నొక్కిపెట్టి చెబుతోంది. వ్యవసాయ వస్తు సరఫరా కొరత ఏర్పడితే వ్యవసాయ రంగంలో వస్తువుల ధర పెరగ వచ్చు. కాని పారిశ్రామిక రంగంలో వస్తువుల సరఫరా అధికంగా వున్నట్లయితే పారిశ్రామిక వస్తువుల ధరలు నిలకడగా వుండవచ్చు. కాని కాలక్రమేణ ఆర్థిక వ్యవస్థ అంతటా, అన్ని రంగాలలోను ధరలు పైకి పెరగవచ్చు.

ద్రవ్యోల్బణము, వ్యాపారపు వెనుకంజ ఒకేసారి వుండ వచ్చుననికూడ చెప్పడానికి సెక్టరల్ డిమాండ్ సిద్ధాంతము ఉపయోగపడుతుంది. అంటే కొన్ని రంగాల్లో ద్రవ్యోల్బణము, మరి కొన్ని రంగాల్లో వ్యాపారపు వెనుకంజ ఒకేసారి వుండచ్చునన్నమాట. ద్రవ్యోల్బణపు వత్తిడికి లోనయిన పరిశ్రమల్లో వస్తువుల ధరలు పెరుగుతాయి. అయితే వ్యాపారపు వెనుకంజకు గురి అయిన పరిశ్రమల్లో ధరలస్థాయి పడిపోకుండా వుండవచ్చు. ఇటువంటి పరిస్థితిని ఆధునిక ఆర్థిక శాస్త్రవేత్తలు "స్టాగ్‌ఫ్లేషన్" అనగా నిలకడ, ఉల్బణల మిశ్రమంగా వర్ణిస్తున్నారు. ఇటువంటి స్టాగ్‌ఫ్లేషన్ పరిస్థితిలో కొన్ని రంగాల్లో కదలిక లేకపోవడము, మరికొన్ని రంగాల్లో హెచ్చు ద్రవ్యోల్బణము రావడము జరుగుతుంది.

ద్రవ్యోల్బణం అన్యవర్గీకరణలు

ఏ అడ్డంకులులేకుండా ధరలు పెరుగుతూవుంటే ద్రవ్యోల్బణము "బహిరంగ ద్రవ్యోల్బణము" అని అనబడుతుంది. అట్టిద్రవ్యోల్బణము అత్యధిక ద్రవ్యోల్బణము లేక హైపర్ ద్రవ్యోల్బణముగా మారవచ్చు. ధరలస్థాయి పెరగడానికి అవకాశమున్నప్పటికి, ధరలనియంత్రణ, రేషనింగ్‌ద్వారా నియంత్రణ చేయబడే ద్రవ్యోల్బణము అణచి వేయబడిన (దమనిత) ద్రవ్యోల్బణమని చెప్పబడుతోంది. ఇటువంటి సందర్భాల్లో నియంత్రణలను తొలగించితే ధరలు పెరగవచ్చు. అణచి వేయబడిన ద్రవ్యోల్బణస్థితివల్ల 1) వర్తమాన డిమాండ్ భవిష్యత్తు కొరకు ఆగవచ్చు 2) ఒకరకం వస్తువుల డిమాండు మరొక రకం వస్తువుల డిమాండుగా మారవచ్చు. అంటే ధర నియంత్రణకు, రేషనింగ్‌కు గురి అయిన వస్తువుల డిమాండు, ధర నియంత్రణకు, రేషనింగ్‌కు గురికాని వస్తువుల డిమాండుగా మారవచ్చు.

అణచివేయబడిన ద్రవ్యోల్బణంవల్ల చాలా ప్రమాదాలున్నవి. 1) నియంత్రణ, రేషనింగ్ అమలుకు సంబంధించిన పరిపాలన సమస్యలు ఎదురౌతాయి. 2) ఇందువల్ల నియంత్రణోద్యోగులలో లంచగొండితనము, అవినీతి ప్రబలవచ్చు. చీకటి బజారు ఏర్పడవచ్చు. 3) వనరులు ధరనియంత్రణ, రేషనింగ్‌లకు గురి అయిన అవసర

వస్తువుల ఉత్పత్తిరంగం నుండి, ధర నియంత్రణ రేషనింగులకు గురి కాని అనవసర వస్తువుల ఉత్పత్తి రంగమునకు తరలిపోవచ్చు.

ధరలస్థాయి పెరుగుతున్న మొదటిదశలో, ధరలు నెమ్మదిగా పెరుగుతూ వుండవచ్చు. దీనినే క్రీపింగ్ (దొరబడుచున్న) ద్రవ్యోల్బణమని అంటున్నారు. కొంతకాలంలో ధరల పెరుగుదల బాగా కన్పిస్తుంది. తదుపరి బెదురు కల్గేటట్లుగా మారుతుంది. దీనినే రన్నింగ్ (పరుగుతీసే) ద్రవ్యోల్బణ మని అంటారు. ధరలస్థాయి పెరుగుదల భీతావహమై, అతి వేగంగా పెరిగినపుడు గాలపింగ్ (వేగంగా పరుగెత్తుట లేక దౌడు లేక స్వారీ చేయుట) ద్రవ్యోల్బణమని, హైపర్ ద్రవ్యోల్బణమని అంటారు. ప్రతి దేశంకూడా, ఏమైనా సరే, హైపర్ ద్రవ్యోల్బణం రాకుండా చెయ్యాలి.

ద్రవ్యోల్బణం ఫలితాలు

ఆర్థిక కార్యక్రమాల్లోని వివిధ భాగాలపై ద్రవ్యోల్బణానికి ప్రభావం ఉంటుంది.

ఉత్పత్తి - ఔద్యోగిత

ఆదాయం ఉత్పత్తి పంపిణీలను ద్రవ్యోల్బణం ప్రభావితం చేస్తుంది. ద్రవ్యోల్బణపు ధరల పెరుగుదల జాతీయాదాయం ఉత్పత్తిని అనుకూలంకాని రీతిలో నడుపదని వాదించవచ్చు. ద్రవ్యోల్బణ స్థితిలో మానవ, వస్తు వనరులన్నీ ఆర్థిక కార్యనిర్వహణలో అనువర్తింపచేయబడవచ్చు. మూలధనంగా ఉపయోగపడే భూమి, భవనాలు మొదలైన వాస్తవసంపద తగ్గదు. వివిధ వర్గాలమధ్య పంపిణీకి లభ్యమయ్యే వాస్తవ వెరశి ఆదాయము లేక మొత్తం ఉత్పత్తి తగ్గదు. అందువల్ల జాతీయాదాయంమీద ద్రవ్యోల్బణానికి వ్యతిరేక ప్రభావముండదు. అలాగేఔద్యోగితమీదకూడ వ్యతిరేకప్రభావముండదు. అయితే కాలప్రవాహంలో ద్రవ్యోల్బణం ఒకహద్దును దాటినతర్వాత, ఉత్పత్తిని తగ్గించవచ్చు. ఔద్యోగిత పెరుగుదలనుకూడా తగ్గించవచ్చు. ఈ క్రింది కారణాలవల్ల అలాజరుగుతుంది. 1) ఉత్పత్తిచేసిఅమ్మటం కంటె దాచిపెట్టుకోవడం లాభదాయకమని వ్యాపారసంస్థలు అనుకోవచ్చు. 2) ముందుకాలంలో హెచ్చుధరలు రాగలవని వ్యవసాయకులు తమ అదనపు పంటలను అమ్మడానికి నిరాకరించవచ్చు. 3) తీవ్రమైన శ్రామిక సమ్మెలవలన ఉత్పత్తిప్రవాహానికి అంతరాయాలు కలుగవచ్చు. అందువల్ల ఒకదశదాటిన తర్వాత, అదనపు ఉత్పత్తులనిల్వలు పేరుకుపోతాయి. లాభాలుతగ్గుతాయి. పెట్టుబడి, ఉత్పత్తి, ఆదాయము పతనం చెందుతాయి. నిరుద్యోగం నిజంగానే వచ్చితీరుతుంది.

ఆదాయ పంపిణీ

ధరల స్థాయంతా సాధారణమైన పెరుగుదలలో వున్నప్పుడు, వ్యవసాయధరలు, పారిశ్రామికధరలు, ఖనిజాలధరలు, వేతనాలు, భాటకాలు, లాభాలు ఒకేదశలో ఒకేమేరకు పెరుగుతూవుంటే, ధరల పెరుగుదల ప్రభావం ఏవర్గం ప్రజలమీదకూడా కన్పించదు. శ్రామికుడు కొనేవస్తువుల ధరలు 50 శాతంపెరిగి అతని వేతనంకూడా 50 శాతం పెరిగితే శ్రామికుని వాస్తవవేతనంలో మార్పురాదు. అతని జీవన ప్రమాణం యిదివరకులాగే ఉంటుంది. కాని, ఆచరణలో ధరలన్నీ ఒకేదిశలో, ఒకేమేరకు మార్పుచెందవు. అందువల్ల ద్రవ్యోల్బణం వల్ల సమాజంలోని ఒకవర్గంకంటె మరొకవర్గం హెచ్చుఅనుకూలంగా ప్రభావితంకావచ్చు.

ఉత్పత్తిపై స్వామ్యంగల వర్గాలు

ద్రవ్యోల్బణం వున్నప్పుడు సకలఉత్పత్తిదారులు, వ్యాపారులు, స్పెక్యులేషన్(చట్టా) వ్యాపారులు,అనుకొననివిపరీతలాభాలు రావడంవల్ల ప్రయోజనంపొందుతారు. ఉత్పత్తిఖర్చులకంటె వస్తువులధరలు వేగంగా పెరుగుతాయి. వేతనాలు, వడ్డీరేట్లు, ఇన్సూరెన్సుప్రీమియములు మొదలైనవి దాదాపునిశ్చలంగానే వుంటాయి. అంతేగాకఉత్పత్తిఖర్చు పెరుగుదలకు, వస్తువుల ధరలపెరుగుదలకుమధ్య మంచికాలవ్యవధి వుంటుంది. ద్రవ్యం విలువ పడిపోయినమేరకు నిలవవున్న వస్తువుల ధరలు ఖచ్చితంగా పెరుగుతాయి. అందువల్ల లభ్యమైన ఆధాయాలనుఉత్పత్తి స్వామ్యవర్గాలు వస్తువులు,భూములు, ఇండ్లుమొదలైన వాస్తవ ఆస్తులు, ఎస్టేట్లరూపంలో వుంచుకుంటారు. ఇతర వస్తువులన్నింటి ధరలకంటె యిటువంటి ఆస్తులధరలు హెచ్చుగా పెరుగుతాయి. అందువల్ల ఉత్పత్తి స్వాములు, వ్యాపారులు ద్రవ్యోల్బణ కాలంలో చాలాహెచ్చుగా ప్రయోజనం పొందుతారు.అయితే వారిఉత్పత్తి తరగకుండాఉన్నప్పుడు, పెరుగుతున్నప్పుడు మాత్రమే సేద్యంచేసే రైతులు బాగుపడవచ్చు.

స్థిర ఆదాయవర్గాలు

ద్రవ్యోల్బణంవల్ల మధ్యతరగతి వర్గాలని పిలువబడేవారికి-గత పొదుపులమీద ఆధారపడి బ్రతికేవారికి, స్థిరనిల్వలు మాత్రమేగలవారికి, భాటకాలు పొందేవారికి, పెన్షను తీసుకునేవారికి, యితరస్థిర ఆదాయ వర్గాలకు-బాగాదెబ్బతగుల్తుంది. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలలోపనిచేసే వారి ద్రవ్యఆదాయాలు దాదాపుస్థిరంగావుంటాయి. కానివారుకొనుగోలు చేసేవస్తు, సేవలధరలు చాలావేగంగా పెరుగుతాయి. భాటకం పొందే వర్గాలుగా చెప్పబడుతూ, నిర్ణీతవడ్డీ, భాటకాలను స్థిరమైనరాసులలో పొందేవర్గాల ద్రవ్యఆదాయాలు పెరుగుతున్న ధరలతాకిడికి నిలవలేక

పోతాయి. వారి గత పొదుపులు ప్రాధాన్యత లేనివిగా తయారవుతాయి. 1924లో జర్మనీలోవచ్చిన హైపర్ ద్రవ్యోల్బణ స్థితిలో కొంతమంది వ్యక్తుల గతకాలపు పొదుపులు ఒక కప్పు కాఫీని కొనలేకపోయినవి. నిలకడగల సమాజానికి వెన్నెముకగా చెప్పబడే మధ్యతరగతి వర్గాలు ద్రవ్యోల్బణ కాలంలో అందరికంటెహెచ్చుగా బాధలకుగురి అవుతారు. ఇటువంటిస్థితిలో వారిపై పన్నుల భారం పెరిగినా, తరగకపోయినా అసంతృప్తి ప్రబలి రాజకీయశాంతికి, ప్రజాస్వామ్యానికి ముప్పుకలుగుతుంది. అందువల్ల ప్రభుత్వాలు అహంభావత్వంతో కూడిన తెలివి తక్కువతనంవల్ల మధ్యతరగతులపై పన్నులభారం పెంచరాదు.

శ్రామికవర్గాలు

ద్రవోల్బణకాలంలో శ్రామికులు కొనుగోలుచేసే వస్తుసేవల ధరలు పెరిగినంత వేగంగా వారి వేతనాలు పెరగవు. అంతేగాక వస్తువుల ధరల పెరుగుదలకు, వేతనాల పెరుగుదలకు మధ్య చెప్పతగ్గ కాల వ్యవధితీసుకుంటుంది. అందువల్ల శ్రామికవర్గాలుకూడా బాధలకుగురి అవుతాయి. అయితే ఈరోజుల్లో అనేక శ్రామికవర్గాలు ట్రేడ్‌యూనియన్లుగా సంఘటిత మౌతున్నారు. ఆ సంఘటనవల్ల శ్రామికుల జీవన వ్యయం పెరుగుదలతోపాటు వారివేతనాలుకూడ పెరగవచ్చు. అందుచేత ద్రవోల్బణ కాలంలో సంఘటిత శ్రామికవర్గాలు హెచ్చుగాబాధలు పొందకపోవచ్చు. కాని యింకాచాలా శ్రామికవర్గాలు— వ్యవసాయ కార్మికులు మొదలైనవారు- సంఘటితం కాలేదు. వారుమాత్రం వారి పెరుగుతున్న జీవనవ్యయాన్ని, పెరుగుతున్నధరలను తట్టుకోగల్గేటట్లు తమ వేతనాలను పెంచేటట్లు చేసుకొలేకపోతున్నారు.

అందువల్ల ద్రవ్యోల్బణం వివిధ వర్గాలమధ్య ఆదాయ పంపిణీలలో మార్పుతెస్తున్నట్లు తెలుస్తుంది. ఉత్పత్తిస్వాములైన భూస్వాములు, ఫ్యాక్టరీ ఉత్పత్తి స్వాములూ, వ్యాపారులూ, వేతనాలు తీసుకునే మధ్య తరగతి మేధావి వర్గాలకు, శ్రామికులకు నష్టం జరుగుతూవుంటే వారు మాత్రం బాగా లాభాలు కొట్టేస్తూ వుంటారు. ఈ లాభాలుపొందేవర్గాలు ఎన్నికలు జరిగే సమయంలో రాజకీయపార్టీలకు ధనసహాయంచేసి తమ లాభాలకు అధికార పార్టీలు ముప్పు కల్గించకుండా చూసుకుంటారు. ఈపరిస్థితులలో ధనికులు మరింతధనికులుకాగా, బీదలు మరింతబీదరికం అనుభవిస్తారు. ఈ విధంగా ఆదాయం పేదలనుండి ధనికులచేతుల్లోకి స్థానాంతరీకరణ చెందుతుంది. కాబట్టి ద్రవ్యోల్బణస్థితి అన్యాయపూరితము. అంతేగాక తమను తాము రక్షించుకోలేని స్థితిలోవున్న పిన్నవయస్కులు, వృద్ధులు, ఏపనీచేయలేని శారీరక స్థితిలోవున్నవారు, వితంతువులు, చిన్న పొదుపుదార్లు చెప్పరానంతగా బాధలకు గురి అవుతారు. దయదలచి వారిని కాపాడేవారు లేకపోవడము దేశ రాజకీయ వ్యవస్థకు తప్పనిసరిగా సిగ్గుపడవలసిన పరిస్థితి అవుతుంది.

అయితే ధరలను నిలకడస్థితిలో వుంచవలసిన బాధ్యత తీసుకోవలసిన ద్రవ్య,కోశశాఖల అధికారులే తరచుగా ధరలు పెరిగేటట్లుచేసి, ద్రవ్యోల్బణస్థితిని ఏర్పర్చడము చాల దురదృష్టకరమైన విషయము. యుద్ధంచేసేదేశాలు యుద్ధనిర్వహణను సాగించడానికి కరెన్సీనోట్లను ముద్రించి వాడుకలోనికి తెస్తున్నవి. వర్ధమానదేశాల, ప్రభుత్వాలు తమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి ఖర్చుచేసేందుకు లోటుబడ్జెట్ విధానంద్వారా హెచ్చుద్రవ్యాన్ని చెలామణి ప్రవాహంలోకి వదులుతున్నాయి. ఇటువంటి సందర్భాలలో అధికసంపన్నులు ప్రభుత్వాలకు అదనపు ఆదాయాలను సమకూర్చుతున్నాయి. పన్నులవల్ల ఆర్థిక వ్యవస్థ నాశనంకాదు. ఏదో అసాధారణ సందర్భాలలో మినహా పన్నులవల్ల కొన్నివర్గాలు సర్వనాశనంకానేరవు- కాని ద్రవ్యోల్బణంమాత్రం స్థిర ఆదాయవర్గాలను నాశనం చేస్తుంది. మధ్యతరగతి వర్గప్రజలను పాపర్లుగా చేసేస్తుంది. ఆర్థికవ్యవస్థ పునాదుల్ని నాశనంచేస్తుంది. అందువల్ల ద్రవ్యోల్బణం ఒకరకపు పన్నులవిధింపుఅని, అన్నిభారాల్లోకి హెచ్చు క్రూరమైనదని, బహిరంగ దోపిడిదారని చెప్పబడింది.

ద్రవ్యోల్బణం ముఖ్యంగా జర్మనీలో వచ్చిన హైపర్ ద్రవ్యోల్బణం వంటిది అమలులోవున్న సాంఘిక రాజకీయవ్యవస్థలను నాశనం చేస్తుంది. ద్రవ్యోల్బణంవల్ల నిష్ఫలీకరణ భావంతోకూడిన నిరాశకల్గిన వ్యవస్థలో అపనమ్మకము, అసంతృప్తి కల్గి, అన్యాయాన్ని సహించలేమనే బాధ ఏర్పడుతుంది. ప్రజలలో ప్రభుత్వవ్యతిరేకత తీవ్రంగా ఏర్పడవచ్చు. అందువల్ల ద్రవ్యోల్బణము ఆర్థికంగా తగినది కాదని, రాజకీయంగా ప్రమాదకరమని, నైతికంగా సమర్థనీయంకాదని చెప్పక తప్పదు. వీలైతే ద్రవ్యోల్బణం రాకుండా చెయ్యాలి. ద్రవ్యోల్బణం వచ్చేస్తేమాత్రం దాన్ని ఏదోవిధంగా నియంత్రణ చెయ్యాలి.

ద్రవ్యోల్బణ నియంత్రణ

ప్రారంభ దశలోనే ద్రవ్యోల్బణాన్ని నియంత్రణ చేయడం అవసరం. అలా చెయ్యకపోతే అది హైపర్ ద్రవ్యోల్బణంగామారి దేశ ఆర్థిక వ్యవస్థను నాశనంచేస్తుంది. సాధారణంగా వస్తుసేవాసరఫరాలను ఎక్కువగా అధిగమించిన వస్తుసేవల డిమాండు ధరల పెరుగుదలకు కారణమని ఎంచి ప్రధానంగావస్తుసేవల వెరశి డిమాండ్‌ను తగ్గించడానికి ప్రయత్నాలు జరుపుతున్నారు. ఈ ప్రయత్నం ద్రవ్యోల్బణ నిరోధ చర్యలలో ప్రధానమైనది. ద్రవ్యోల్బణ నిరోధచర్యలు నాలుగురకాలు.

1) ద్రవ్యవిధానము 2) కోశవిధానము 3) ధరలనియంత్రణ, రేషనింగు 4) ఇతరచర్యలు.

(సశేషం)

శ్రీ జమ్మి కోనేటిరావు

డార్విన్ వాదం - ఆధునిక పరిశీలన

పరిణామవాదం భారతీయులకు, భారతీయ సంస్కృతికి పరిచయంలేనిదికాదు. దశావతారగాధలు పరిణామాన్ని తలపింప చేయడం అటుంచి, అంతకన్న విశేషమైనది సోపానాల మాదిరిగా అనేక జన్మలద్వారా జీవి(మానవుడు) భూమిమీద అవతరించడం. ఈభావంలో మానవజన్మ ఉత్తమమైనది, అంత్యమైనది. దానికి వెనుక ఎన్నోజాతుల జీవులద్వారానే ఈ చివరిలక్ష్యం సాధించబడింది. సాంస్కృతిక రీత్యా కాని, వైజ్ఞానిక రీత్యాకాని దీని లోతుపాతులకి పోకుండాపరిశీలిస్తే పరిణామవాద అనుకూలత దీనిలో గోచరిస్తుంది. ఇది ఒక జీవికి సంబంధించినదిగా మన సంస్కృతి భావిస్తే ఒక జాతికి సంబంధించినదిగా శాస్త్రీయవాదం ప్రతిపాదిస్తుంది.

శాస్త్రం _ మతం

నిజానికి, మతానికి శాస్త్రానికి ఎక్కువతేడాలేదు. ఆయా కాలాలలోని మేధావుల సమిష్టివైజ్ఞానిక సంపద అందరికి అందుబాటులో ఉండే మతంమాదిరిగా, ఆచారాలు మాదిరిగా రూపొందాయి. వ్యక్తిగత, స్వల్పసమూహాల అభిప్రాయాలకు, ఒత్తిడికి ఇది రూపుమాసిపోకుండా ఒకవిధమైన రక్షణ ఉంటుంది. కాని ఏ మతవాదమైనా కొంత కాలానికి మూఢనమ్మకాలు అనేభావంగా మారే అవకాశం ఉంది. సమాజంతోబాటు, కాలంతోబాటు మతంకూడా 'ఆరోగ్య కరంగా' స్పందన చూపాలి. ఆనాడు 4,5వేల సంవత్సరాలనాడే మన భారతీయ సంస్కృతి పరిణామభావాన్ని సూచనప్రాయంగా నైనా అంగీకరించిందని భావించుకోవాలి. అంతకంటె ఆనాటివిజ్ఞానం ఎక్కువ అవకాశం ఇచ్చిఉండదు.

ఒక దృక్పథంలోచూస్తే జీవశాస్త్రం చాలాక్లిష్టమైనది. భౌతిక, రసాయనిక శాస్త్రాల మాదిరిగా సరళమైనదికాదు. ఈ శాస్త్రాల సూత్రాలు కళ్ళకుకట్టినట్లుగా అగపడతాయి. జీవి నిర్మాణం, శరీరధర్మ క్రియలు క్లిష్టమవడమేకాకుండా భూమిమీద భిన్నపరిస్థితులకు అనుగుణ్యంగా అది అనుకూలత చెందడంచూస్తే ఏ పరిశీలకుడికైనా అచ్చెరువు కలుగుతుంది. సముద్రఅగాధాల్లోనిచేప, ఎడారిలోనితొండ, ఆకాశంలోని పక్షి, వాటిరూపం, నిర్మాణం ఎలా ఏర్పడి వుంటుంది? దీనిలో దేవుడిహస్తం లేదంటే ఎవరికీ సామాన్యంగా నమ్మకం కలగదు. కోట్లాది సంవత్సరాలకాలంలో కొన్నిభౌతికశక్తుల ప్రమేయం వల్లనే పరిస్థితులు "దేవుడిహస్తం" మాదిరిగా ప్రవర్తించి మనల్ని 'మాయ'లో పడవేసాయి అంటే ఎవరూనమ్మరు. దేవుడు తనసృష్టిలో ఒక 'అచ్చు' ఉపయోగించి ఒక్కొక్కనమూనాలో ఒక్కొక్క జీవజాతిని, వ్యక్తిని సృష్టించాడు అని ఆ కనబడని శక్తిని ఊహించుకొంటాం, ఆరాధించుకొంటాం.

పరిణామవాదం తనబలంఅంతా ఈ విషయంమీదనే కేంద్రీకరించింది. చారిత్రాత్మకంగా చూస్తే పూర్వంకన్నా ఈనాడే ఈ అవసరం ఎక్కువ అనిపిస్తోంది. భౌతిక రసాయనిక శక్తులుగుడ్డివే. అయినా కోట్లాది సంవత్సరాలకాలంలో వాటిప్రభావంవల్ల ఏర్పడిన ఫలితాలు ఒక అదృశ్యహస్తప్రమేయంలేందే ఏర్పడడం అసంభవం అనే రీతిలో రూపొందాయి. ఈ వైజ్ఞానిక సత్యాన్ని ప్రతిబింబించడమే డార్విన్ ప్రథమకర్తవ్యం, పరిణామవాదం పునాదినిర్మాణం అయింది.

భగవంతుడి అవసరం

మానవుడు (జీవి) మట్టితోయేర్పడ్డాడని, తిరిగిమట్టిలో కలసి పోతాడని మనవేదాంతం నొక్కిచెబుతుంది. ఇందులో ఎంతో భౌతిక సత్యంఉంది. శరీరంలోని పదార్థంఅంతా ప్రకృతిలో కనబడే మూలకాల ("మట్టి")తోనే ఏర్పడి,మూలకాలు ఎలా ప్రవర్తిస్తాయో, ఏ ప్రాథమిక రసాయనిక, భౌతికసూత్రాలకు అనుగుణ్యంగా ఉంటాయో మన(జీవి) శరీరం కూడా అలాగే ప్రవర్తిస్తుంది. శరీరం ప్లాస్టిక్ పద్ధతిలో మలచడానికి అనుగుణ్యంగా ఉండే కొద్ది కొద్ది మార్పులు తరతరానికి ఏర్పడడం, ఆ భిన్నలక్షణాలలో ఏవి, ప్రకృతికి అత్యంత అనుకూలంగా ఉన్నాయో, అవి విజయవంతం అయి సంతానోత్పత్తి చేసుకొని క్రమంగా నూతన జాతులు రూపొందుతాయి అని డార్విన్ చెప్పింది పరమ సత్యం. దీనికి అంగీకారం సర్వత్రా వినిపించింది, శాస్త్రప్రపంచంలో. ఈ పరిస్థితుల్లో భగవంతుడి ప్రమేయం, అవసరం ఎక్కడా కనబడకపోవడంవల్ల అనేకమంది మతవాదులలో కలవరం ఆనాడూ, ఈనాడూ కూడా కలిగింది. భగవంతుడి అవసరం, గుర్తింపు ఎప్పుడయితేలోపిస్తాయో నాస్తికత్వం, నీతిబాహ్యజీవనం ప్రజలకు అలవడతాయని, అరాచకం సంభవిస్తుందని చాలామంది ఆందోళన

చెందుతున్నారు.ఇందులో సత్యంఉన్నాలేకపోయినా, ఈకారణంగా శాస్త్ర విషయాలను మట్టుపెట్టుకోవాలనుకోవడం సమర్థనీయంకాదు. ఆనాడు ఈనాడుకూడా మన హైందవ సంస్కృతిలో వైజ్ఞానానికి, మతానికి ఒకవిధమైన సదవగాహన ఉందని, శాస్త్రానికి అనుగుణంగానే మతం తగినవిధంగా రూపొందించబడడం, ఇంకా అవసరమైతే మార్పులు చెందడం సాధ్యంఅనిపిస్తుంది. భగవంతుడు సర్వత్రా వ్యాపించిఉంటాడని భావిస్తాం. ఏ భౌతిక, రసాయనిక శక్తులయితే నిర్ణీత నియమాలకు లోబడి ఈవిధంగా జీవశాస్త్రసూత్రాలకు మూల కారకాలవుతున్నాయో వాటినే అదృశ్యభగవంతుని హస్తంజరిపించే చర్యలనుకోవాలి.

పరిణామవాదం ఈవిధంగా భారతసంస్కృతిలో భాగంగానే ఉందనే విషయంతోబాటు 2000 సం॥ క్రితం గ్రీకు శాస్త్రవేత్తల భావాలుకూడా కొన్ని ఈవాదాన్ని బలపరచాయి. కాని 18వశతాబ్దంలో లెమార్క్-వంటి శాస్త్రజ్ఞులుకొందరు తిరిగి పునరుజ్జీవనం కల్పించేవరకు దీనిలో కదలికరాలేదు.

పరిణామవాదానికి పరిగణన

లెమార్క్-వాదం రెండువిధాలుగా ఉంటుంది. పరిణామవాదాన్ని సమర్థించడం, దానితోబాటు పరిణామం జరిగేవిధానాన్ని నిర్ధారించడం. అర్థంచేసుకోడానికి అంగీకారం పొందడానికి ఇది ఎంతసులభమైన సిద్ధాంతమోకాని నిరూపణలదగ్గరకు వచ్చేసరికి దీనికి అన్నీ అవాంతరాలే ఎదురవుతాయి. పరిసరాల ప్రభావం జీవిమీదపడి దానిలోమార్పులు తీసికొనివస్తాయని, అధికంగా ఉపయోగించడంవల్ల అవయవ నిర్మాణాలు బలంపుంజుకోవడం, ఉపయోగించక పోవడంవల్ల అవి క్షీణదశపట్టడం సంభవం అని ఈసిద్ధాంతం భావిస్తుంది. ఇంతవరకు బాగానేఉంది. కాని ఈ విధంగా జీవిలో సంభవించిన మార్పులు సంతానానికి అందుతాయని అతడు అనుకొన్నాడుకాని ప్రయోగాలు దీనికి ఆధారంఇవ్వలేదు. నిత్యజీవితంలో ఇది అసంభవం అని తేలింది. ఆర్జితగుణ అనువంశికత అనే ఈ సిద్ధాంతం కొనఊపిరితోఉన్న జీవిలా అలాఉండిపోయింది.

19వ శతాబ్దంలో డార్విన్ వచ్చేవరకు పరిణామవాదానికి స్థిరమైనశాస్త్రీయ పరిగణన లభించలేదంటే పొరపాటుకాదు. అంతే కాదు సుమారు ఒకేకాలంలో పరిణామశాస్త్రానికి గొప్పమలుపు తీసికొనివచ్చిన ఇద్దరు ప్రఖ్యాతశాస్త్రజ్ఞులు తమసిద్ధాంతాలను ప్రతిపాదించడంజరిగింది. పైగా కుడిచెయ్యిచేసినపని ఎడమచెయ్యికి తెలియదన్నట్లు ఈ ఇద్దరు ఒకరి భావాలను ఒకరు గుర్తించుకోలేక పోయారు అనాలి. వారు కృషిచేసిన క్షేత్రం ఒకే గమ్యం చేరుకోబోతోందని గ్రహించుకోలేక పోయారు. మరొక 40 సంవత్సరాలుగడిచాక, అంటే 1900 లో ఈ రెండిటి సంలీనం జరగడం ఆధునిక పరిణామ సిద్ధాంతం - నవీన డార్వినిజమ్ - అవతరించడం సంభవించాయి.

శాస్త్ర ధృవతారలు

మెండెల్, డార్విన్ అనే ఈఇద్దరూ పందొమ్మిదవ శతాబ్దానికే తారలయినా, ఈ శాస్త్రజ్ఞులు ఇద్దరికీ తేడాఉంది. మెండెల్ నిజానికి "శాస్త్రజ్ఞుడు"కాదు. విద్యావంతుడయిన మతగురువుమాత్రమే. అతని సిద్ధాంతం, సూత్రాలు మౌలికంగా అత్యంత ప్రాధాన్యం ఉన్నవి. జన్యుశాస్త్రానికి ఒకరూపం తీసుకొనివచ్చి గొప్ప మలుపు తీసుకొనివచ్చాడు. కాని అతని గొప్పతనాన్ని అతడే గ్రహించుకోలేకపోయాడు. శాస్త్ర ప్రపంచం గుడ్డిగా అతనిసిద్ధాంతాన్ని తాత్కాలికంగా గుర్తించలేకపోయింది. డార్విన్ అలాకాక కాకలు తీరిన శాస్త్రజ్ఞుడు. శాస్త్ర ప్రపంచాన్ని, మేధావిలోకాన్ని ఒకఊపు ఊపాడు. శాస్త్రీయ లోకంలో ఒక చిన్నతుపాను, మత ప్రపంచంలో ఒకపెద్ద భూకంపంతీసికొనివచ్చాడు. ఆనాటి డార్విన్‌వాదంతో మొదట లెమార్క్-వాదం, తర్వాత డ్రివీస్ మొదలైనవారి ఉత్పరివర్తన సిద్ధాంతం ఘర్షణపడ్డాయి. కాని, ఫలితంగా అవివాటిలో లీనమయిపోవడంకాని హీనమయిపోవడంకాని జరిగింది. ఇక మతవాదులు రేపిన దుమారం మొదట్లో తీవ్రంగాఉన్నా విద్యావేత్తలు, శాస్త్రజ్ఞుల గుర్తింపుతో అదికూడా సమసిపోయింది. మొత్తానికి డార్విన్ ఈవిధంగా ప్రతివ్యక్తిని తనసిద్ధాంత ప్రభావానికి అటో, ఇటో లోనయినట్లుగాచేసి ఘనతపొందాడు. 125 సంవత్సరాల పాటు ఒక గొప్ప సిద్ధాంతంగా (1858-1983) మనగల్గడమేకాక, తిరుగులేని సూత్రంగా రూపొందే ఆధారాలు కనబడకపోలేదు. అయితే ఈఘనతకి ఇటీవల రెండుఅవరోధాలు మళ్ళీయేర్పడ్డాయి. వీటిలో ఒకటి శాస్త్రయుక్తమైనది, ఒకటి మతసంబంధమైనది.

హిందూమతానికి ఇది ఒక సవాల్‌లాంటిది. మనపురాణాలలో, శాస్త్రాలలో పరిణామవాదం విత్తనాలు ఉండనేఉన్నాయి అనిచూసాము. ధైర్యంగా పరిణామవాద మౌలికసిద్ధాంతాలను అంగీకరించడం కేవలం సూత్రప్రాయమైనదే. పరిణామసూత్ర అంగీకారానికి, భగవంతుడి ఉనికికి సంబంధంలేదు. జీవులలో క్రమబద్ధమైన మార్పులకు అవకాశం ఉందా, లేదా? ఈపద్ధతిలో క్రమంగా నూతనజాతులు ఏర్పడడానికి ఆస్కారం ఉందా, లేదా? అయితే ఈచర్యలో భగవంతుడిహస్తం ఉండవచ్చు లేదా లేకపోవచ్చు.

ఇందుగల డందులేడు అని సందేహం....

భగవంతుడు సర్వాంతర్యామి అని హిందూధర్మం బోధిస్తుంది. ప్రతిజీవిలోనూ భగవదాంశ ఉంటుంది. పునర్జన్మను మన సంస్కృతి అంగీకరిస్తుంది. పైగా కొన్ని "హీన" జంతు జాతులనించి ఉన్నత

జాతుల వరకు "ఆత్మ" ప్రయాణిస్తుందని అంటారు. ఒకానొక భావంలో ఇది "ఉన్నత" జాతుల మార్గంలో పరిణామం చెందడాన్ని తలపిస్తుందని ఎవరికైనా తడుతుంది. 6000 సం॥ కిందటి "శాస్త్ర" అభిప్రాయాలను, ఈ సత్యరూపంలో మనం గ్రహించగల్గాము అంటే మన సంస్కృతికి ఎంతో గౌరవం కల్పించే విషయం.

మతము, శాస్త్రము ఒకదాని కొకటి వ్యతిరేకంగా అనిపిస్తాయి. కాని అవి రెండూ ఒక నాణేనికి ఉండే ఇరుప్రక్కలే. మతం అంటే, అది ఏర్పడిన కాలంనాటి వైజ్ఞానిక సత్యాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పడిన జీవన విధానం. హిందూ సంస్కృతిలోని చాలా విషయాలు శాస్త్రయుక్తంగానే కనబడతాయి. ఉదాహరణకు భూమి వయస్సు 200 కోట్ల సంవత్సరాలుగా మన పురాణాలు వర్ణించాయి. ఇటీవలి వరకు శాస్త్రయుక్తంగా కట్టినలెక్కలు భూమివయసు 200కోట్లుసం.గా చెప్తున్నాయి. (ఇది 450 కో. సంవత్సరాలని ఆధునిక లెక్కలు నిరూపిస్తున్నాయి.) మొత్తానికి భూమి పురాతన వయసు గుర్తించ గల్గడం మన ఘనతగా చెప్పుకోవచ్చు. ఇక క్లోనింగ్ (కౌరవుల పుట్టుక) టెస్ట్ ట్యూబ్ బేబీస్ (ద్రోణుడు కుంభసంభవుడు) కృత్రిమ సంయోగము లేదా ఆర్టిఫిషియల్ ఇన్‌సమినేషన్ (ఆంజనేయుడి పుట్టుక, బహుశా కర్ణుడి పుట్టుక) ఇంకా డోనార్స్ ప్రస్తావన వంటివి మన సంస్కృతి ఎన్నో జీవశాస్త్ర విశేషాలను ఊహించగల్గడము లేదా ఆనాటి నాగరికత వాటిని ఏదో రూపంలో సాధించగల్గడము జరిగిందనే చెప్పుకోవచ్చు "శాస్త్రోక్తంగా" మనం పాటించే మత అలవాట్లు చాలా వైజ్ఞానిక ఆధారం కలిగిఉండడం గమనించవలసినది.

డార్విన్ పరిణామ వాదానికి శత్రువులు "బయటి" నుంచి "లోపలి" నుంచి కూడా ఉన్నారు. ఇటీవలి వరకు పరిణామ వాదం బోధించే టప్పుడు **5%** ప్రత్యేక సృష్టివాదం మీద, 95% పరిణామ వాదం మీద మొగ్గు ఉండేది. ఇందులో 80 శాతం డార్విన్‌కి వినియోగిస్తే, 10 శాతం లెమార్క్, 5 శాతం డ్రివీస్‌కి ఉండేది. కాని ఇటీవలి కాలంలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. ప్రత్యేక సృష్టివాదం అమెరికాలో 40% ప్రాముఖ్యతను కలిగిఉంది. 30 శాతం డార్వినిజమ్‌కు 30 శాతం పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ అనే నూతన భావానికి వినియోగిస్తున్నారు.

అయితే యూరప్‌లో, మిగతా ప్రపంచదేశాల్లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. మతవాదులనుంచి కాని, పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ నుంచి కాని డార్వినిజమ్‌కు అంతగా పోటీలేదు.

డార్విన్ (పరిణామ) వాదానికి బాహ్యశత్రువు అమెరికాలోని ప్రత్యేక సృష్టివాదం. నిజానికి ఇది శాస్త్రీయవాదం కాదు. అయినా అమెరికా రాజ్యాంగరీత్యా శాస్త్రవిజ్ఞాన విశేషాలలోకి చర్చితలదూర్చటం నేరం కాబట్టి, వారు ప్లేటుమార్చి తమదీ శాస్త్రమేనని, దానికి అనేక హంగులు, వన్నెలు చిన్నెలు చేర్చి పరిణామవాదంలో శాస్త్రీయరీత్యా ఉండే లోపాలను తమకు అనుగుణంగా "అనువదించుకొని" తమ సిద్ధాంతం బలపర్చుకొన్నామని తృప్తిపడుతున్నారు. కాని ఒకవ్యక్తి A కాదు, అతను B అనేవాదంలో మధ్య అతను C అయిపోతాడని సంతోషపడుతున్నారు.

శాస్త్రం - మతం ఘర్షణ

అమెరికాలో నూతనంగా పుంజుకొన్న ప్రత్యేక సృష్టివాదులు బైబిల్లో చెప్పిన సృష్టిగాథను యథాతథంగా అంగీకరిస్తారు. ఈ భూమి వయసు కేవలం 6000 సంవత్సరాలు మాత్రమే అని నమ్ముతారు. అన్ని జాతులు విడివిడిగా సృష్టించబడ్డాయని మానవుడు కూడా ప్రత్యేకంగా రూపొందించ బడ్డాడుకాని ఏజాతి నుంచి మార్పుచెంది పరిణమించలేదని వాదిస్తారు.

అమెరికా బళ్ళలో పరిణామవాదం ఎత్తేయాలని లేదా కనీసం దానితోబాటు సరిసమాన కాలంలో ఈ సిద్ధాంతం కూడా బోధించాలని అంటారు. ఇందుకు కోర్టులకు వెళ్ళడం కొంత విజయం సాధించడం, సెనెటర్లను లొంగదీసుకోవడం జరిగింది. ఓట్లు అవసరం కాబట్టి ఈ క్రియలో వాళ్ళు పాలుపంచుకొంటున్నారు. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ ఈ పరిస్థితిని అతికష్టంతో ఎదుర్కొంటోంది. మొత్తానికి ఇది ఒక సామాజిక విప్లవం లేదా ఘర్షణగా తయారయింది. శాస్త్రజ్ఞులకి ఇది ఒక పీడకల అయింది. అయినా క్రైస్తవ మతస్థులందరూ ఈ ప్రత్యేక సృష్టివాదంలో నమ్ముతున్నారు అని మనం భావించ కూడదు. బైబిల్ బెల్ట్‌గా వ్యవహరింపబడే ప్రాంతంలోని రాష్ట్రాల జనాభాలో ఫండమెంటలిస్ట్‌లు అనేవారిచే ఎక్కువగా ఈ నమ్మిక. బైబిల్ ఒక ఉన్నత మత గ్రంథంగా భావించుకొనే అనేక లక్షల కాథలిక్కులు, ప్రొటస్టెంట్‌లు, యూదులు దీనిని మతగ్రంథంగానే భావిస్తారు కాని శాస్త్రగ్రంథంగా పరిగణించరు. పరిణామబోధన వీరికి అభ్యంతరంకాదు. ఇక ప్రత్యేక సృష్టివాదుల భావాలు చిత్రంగా ఉన్నాయి.

నిర్మాణ హస్తము

ఇంతక్లిష్టమైన మానవ శరీరం ఎలా భౌతిక రసాయనిక శక్తులవల్ల రూపొందగల్గుతుంది? ఇది సంభవమేనా? ఒక రిస్ట్‌వాచ్, ఒక కాలిక్యులేటర్ లేదా ఒక చక్కని మానవ శిలావిగ్రహం ఏదో ఒకటి ఒక ఎడారిలో ఎక్కడో విసిరేసినట్లు కనబడితే ఆ వస్తువు అక్కడ యథాతథంగా అవతరించినట్లు చెప్పగలమా? మానవ

ప్రమేయం లేందే ఆ వస్తువు ఎలా రూపొందగలదు? అలాగే ఇంత క్లిష్టమయిన మానవ రూపానికి కూడా భగవంతుని హస్తప్రమేయం ఉండితీరాలి అని వారు భావిస్తారు. అయితే కోటానుకోట్ల సంవత్సరాల కాలంలో క్రమక్రమంగా సరళ నిర్మాణాల నుంచి క్లిష్టనిర్మాణాలు రూపొందాయని, భౌతిక, రసాయనిక శక్తులే ఈ చర్యల్లో "భగవంతుని" పాత్ర వహించాయని గ్రహించడానికి వీరు అంగీకరించరు.

మతపరంగా అయినా ప్రపంచవ్యాప్తంగా అంగీకారం ఉందా అంటే అదీలేదు. ఒక్కొక్కమతం ఒక్కొక్క విధంగా ఈ అవతరణ గాథను వర్ణిస్తుంది. ఒక కథలో ముందుమానవుడు, తరువాత అన్ని జీవరాసులు అయితే, మరొక కథలోముందు అన్ని జీవరాసులు తరవాత మానవుడు అవతరించినట్లు ఉంది. అయితే నమ్మకాలదేముంది? ఎన్ని నమ్మకాలయినా ఒక్క చిన్న సత్యాన్ని కాదనగలవా ? భూమిచుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడు అన్నా, భూమి చదరంగాఉంది కాని గోళంగాలేదుఅన్నా, చంద్రుడిని, సూర్యుడిని రాహుకేతువులు ఖింగివేస్తాయిఅన్నా, అవి ఎంతబలమయిన నమ్మకాలయినా సత్యాలుగా చలామణిఅవుతాయా.

అన్నిటికన్న విశేషమయినది, ప్రత్యేక సృష్టివాదులు తమ భావాలన్నీ శాస్త్రయుక్తమని వాదించడం. భూగర్భశాస్త్రం, పురాజీవ శాస్త్రం తమ సిద్ధాంతాలను బలపరస్తున్నాయని కొన్ని పాఠ్యగ్రంథాలు కూడా రూపొందించారు. పరిణామ వాదానికి ఆధారభూతమయిన రేడియోధార్మిక కాలనిర్ణయపద్ధతులు సరియైనవి కావంటారు. పరిణామ వాదం సరియైనదే అయితే మధ్యేమార్గంగా ఉండేజీవరాసులు-సమన్వయ జీవులు లేదా మిస్సింగ్ లింక్‌లు, ఆశించిన రూపంలో కనబడటం లేదేమని నిలదీసి అడుగుతారు. డాక్టరేట్‌లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లు ఉన్న ఈ ఉద్యమం, వాదనాపటిమ ఉన్నవారిని కలిగివుంది. రిసర్చి, వైజ్ఞానిక పత్రికలు కూడా సామాన్యమయ్యాయి.

పరిణామ వాదులు అందరూ ఒక త్రాటిమీద నడవడం లేదుకదా, వారిలోకూడా శాస్త్రయుక్తమైన అనంగీకారం కనబడుతోందికదా, అందువల్ల పరిణామ వాదం సరియైనది కాదు అంటారు. శాస్త్రజ్ఞులలో అనంగీకారం మౌలికమైనదికాదు. విధానానికి సంబంధించినది. ఇద్దరు ఒక స్కూటరుమీద పోతున్నప్పుడు అది ఒకచోట ఆగిపోయింది అనుకోండి. అది ఎందుకు ఆగిపోయిందో దాని యంత్రాంగం మీద అంతగా పరిచయంలేని ఇద్దరు రెండు భిన్న అభిప్రాయాలు వెల్లడిస్తే, స్కూటర్‌కి యంత్రాంగం మొత్తంలేదని కాని, తప్పుడు యంత్రాంగం అనికాని అనగలమా?

ధర్మోడయనమిక్స్‌లోని రెండవసూత్రం పరిణామ వాదానికి వ్యతిరేకం అని ఒకభావముంది. దీనిప్రకారం మార్పుఅనేది విచ్ఛిన్నకరమార్గంలో జరుగుతుందికాని క్లిష్టనిర్మాణదశలో జరగదు. జీవపదార్థ అవతరణలో సరళమైన స్థితినుంచి, క్లిష్టమైనపదార్థం యాదృచ్ఛికంగా నిర్మించబడటం దీనిప్రకారం అసంభవంకాదా అంటారు. శక్తిప్రవాహం బయటినుంచి లేనపుడు బంధీకృత అవరణలో ఈ సిద్ధాంతం సరియైనదేకాని జీవపదార్థం రూపొందడంలో శక్తి బయటినుంచి ఎంతో లభించింది. ఈ పరిస్థితులవేరు.

ప్రత్యేకసృష్టివాదులు బైబిల్‌లోని కథనే ఆధారంగా తీసుకొంటారు. భగవంతుడు ప్రపంచాన్ని, సజీవనిర్జీవ రాసులన్నిటిని 6 రోజులలో తయారుచేసాడంటారు. దీనినేవారు ఆధారంగా చేసుకొన్నా 'భగవంతుడు' అనేపదాన్ని ఉపయోగించరు. ఎందుకంటే అది పాఠశాలల్లో మతాన్ని బోధించినట్లవుతుంది. సృష్టికర్త అనే పదాన్ని వాడతారు. అనేకమంది శాస్త్రజ్ఞులుకూడా ఈ సిద్ధాంతంమీద మొగ్గు చూపుతున్నారు. ఇదొక ఉద్యమంలా అమెరికాలో కొనసాగుతోంది. అయినా శాస్త్రీయముసుగు తగిలించుకొన్న అశాస్త్రీయ మతభావం అయిన ఈ ఉద్యమం వందసంవత్సరాల పైబడేఉంది. అయినా క్రమంగా ఈ భావం శాస్త్రీయంగా నయినా సమసిపోవడం ఖాయం.

మరణించినా పోరాడుతున్న డార్విన్

డార్విన్ వాదానికి శాస్త్రీయపరంగా అంటే అంతర్లీనంగానేసాగిన మరొకవ్యతిరేక ఉద్యమం ఉత్పరివర్తన సిద్ధాంతంమీద ఆధారపడింది. మొదటినుంచి డార్విన్‌వాదానికి రెండు శాస్త్రీయపరమైన అవరోధాలు ఉన్నాయి. అతడు ఊహించినట్లు అతిక్రమంగా చిన్న చిన్న మార్పులు కారణంగా పరిణామం సంభవించేపక్షంలో ఆ వరసక్రమంలో జీవరాసుల జాతులు బ్రతికికాని, శిలాజరూపంలో కాని కనబడవద్దా ? సరీసృపాలు పక్షులుగా రూపొందాయి అంటే, ఆ మధ్యేమార్గంలో మనకు కనబడే 'ఏకైక' ఉదాహరణ ఆర్కియాపెరిక్స్ అనే శిలాజపక్షి. ఇది చాలావరకు పక్షి. కొన్ని పురాతన సరీసృపలక్షణాలు కనబడ్డా అవిచాలవు. ఇంకా అనేక మధ్యేమార్గలక్షణాలున్న జీవజాతులు కావాలి. ఇలాటి గ్యాప్‌లు ఉన్నసందర్భాలు చాలాఉన్నాయి. డార్విన్ సిద్ధాంతం వీటి దృష్ట్యా ఎలాసమర్థించుకోగలదు ? ఇక ముఖ్యపరిణామఘట్టాలు 60-70కోట్ల సంవత్సరాలలో జరిగాయిఅంటే ఆ కాలం ఈపరిణామానికి సరిపోతుందా అనేది మరొకమీమాంస.


శాస్త్రమా, రాజకీయమా

వీటిని అధిగమించడానికి ఉత్పరివర్తన సిద్ధాంతం 1900సం॥లో ప్రతిపాదించబడింది. దానికి ఇప్పుడు వేరేరూపంలో పునరుజ్జీవనం జరిగింది. దానిని పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ అంటున్నారు.


సూక్ష్మంగా చెప్పాలంటే ఈ సిద్ధాంతం ప్రకారం పరిణామంలో కొన్ని లక్షల సంవత్సరాలకాలం (సుమారుఒకకోటివరకుకూడా) జీవిలో చెప్పుకోదగిన మార్పుఉండదు- (ఏ కొద్దిమార్పో ఉండవచ్చు). కాని "అకస్మాత్"గా అంటే ఒకలక్షసంవత్సరాలలోపు వ్యవధిలో ఒకనూతన జాతిఅవతరించడం అంటే కొన్ని ప్రాథమిక మౌలికమైన మార్పులు సంభవించడం జరుగుతుంది. జాతులు ఆవిధంగా అకస్మాత్తుగా ఉద్భవించి కొన్నికాలాలపాటు స్థిరంగాఉంటాయని ఈ సిద్ధాంతంచెబుతుంది. ఇతర పద్ధతుల్లో (ఉదాహరణకుడార్విన్ పద్ధతిలో) పరిణామం జరిగినా అది చాలా తక్కువ సందర్భాల్లో జరుగుతుందని, పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ చాలాఎక్కువ సందర్భాలలో జరుగుతుందని ఈవాదాన్ని బలపరచేవారంటారు. కాని నిజానికి ఈవాదంలో సత్యం ఉన్నట్లు అంగీకరించినా సామాన్యపరిణామం డార్విన్‌పద్ధతిలోనే జరిగి, కొన్ని అనివార్య, అవాంతర పరిస్థితుల్లో నూతన జీవజాతులు లేదా వర్గాలు అకస్మాత్‌గా అవతరిస్తాయని భావించుకోవచ్చు.

స్టీఫెన్‌జేగౌల్డ్, నైల్స్‌ఎల్‌డ్రిడ్జ్ కొంతవరకు **ఈ సిద్ధాంతానికి** ఆధారవ్యక్తులు. సుమారు పదిసంవత్సరాలనుంచి (1972-83) దీనికి కొంతవ్యాప్తి జరిగింది, ప్రస్తుత పరిస్థితుల్లో జీవశాస్త్రజ్ఞులు రెండుభిన్న వర్గాలుగా చీలిపోయారు. డార్విన్‌ను సమర్థించే వారు. రైటిస్ట్‌లు అని ఈ కొత్తశాస్త్రజ్ఞులు అంటారు. వీరు పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్‌ను సమర్థిస్తున్నారు. డార్వినిస్ట్‌లు వీరిని మార్క్సిస్ట్‌లుగా పేరు పెట్టి పిలుస్తున్నారు.మొత్తానికి ఒకరినొకరు దుయ్యబట్టుకోవడం జరుగుతోంది. ఒకనాటి డార్విన్ మతవాదుల కలహాన్ని తలపింపచేస్తోంది. ఈనాటి నవీన మతవాదులకు (సృష్టివాదులు) ఇది వినోదాన్ని కల్గించినా ఆశ్చర్యంలేదు.

ఇంతకీ కొత్తగా ఆధారాలు దొరికాయా అంటే ఏమీలేదు. పూర్వకాలంనించి ఉన్న శిలాజ ఆధారాలే. అయితే ఇపుడు నూతనంగా కొన్ని గణాంక సూత్రాల మీద నిర్ణయాలకు రావడం జరిగింది పురాజీవశాస్త్రంలో ఒక అర్ధ శతాబ్దం తరవాత ఒక నూతన విప్లవం సంభవించినట్లయింది.



అంచలు వారీగా ఏర్పడే సమస్థితి



క్రమ పరిణామ వాదం

పరిణామ వృక్షాలకి వేళ్ళు లేవు

నైల్స్ ఎల్‌డ్రిడ్జ్ పాఠ్యగ్రంథాలలోని పరిణామ వృక్షాలను పూర్తిగా పెకిలించి వేయాలంటాడు. అవి తప్పుడు భావం అంటాడు. వర్గం వేరొక వర్గానికి సరియైన మాతృక కాదని కేవలం చిట్లిపోయి లేదా చీలికవల్ల పాత జంతువులోంచి కొత్త జాతి అవతరిస్తుందని, మాతృకకు దీనికి పోలిక ఉండదని అంటాడు. ఇది 40, 50 వేల సంవత్సరాల స్వల్పకాలంలో జరిగి, అనేక లక్షల సంవత్సరాలకాలం మరేమార్పు చెందకుండా ఉంటుందని ఇతనిసిద్ధాంతం.ఇక ఈ పరిస్థితుల్లో డార్విన్ భావాలయిన అత్యుత్పత్తి, మనుగడకోసం పోరాటం, స్వల్ప మార్పులు, సవ్యజీవుల సార్థక జీవనం మొదలైనవి వాటి అర్థాన్ని కోల్పోవడమేకాక అసందర్భం అయిపోతాయి.

డార్విన్ వాదం, పరిణామవాదం ఒకటే అని చాలామంది పొరపాటుగా అభిప్రాయపడతారు. పరిణామవాదాన్ని నమ్ముతూనే లెమార్క్ ప్రతిపాదించిన ఆర్జిత గుణ అనువంశిక సిద్ధాంతం, ఈనాడు డార్విన్‌ను ధిక్కరిస్తున్న పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ వాదన, ఈ పరిస్థితిని సరియైన దృక్పథంలో ఉంచుతాయి. డార్విన్ వాదం తప్పు అన్నా, పరిణామవాదానికి ముప్పులేదని గ్రహించాలి.

భూమి పొరల్లో శిలాజ చరిత్రను గమనిస్తే పరిణామవాదం తిరుగులేనిది అనిపిస్తుంది. అనేక ఆధునిక పద్ధతుల్లో ఈ పొరల వయసు తెలుసుకోవడం సాధ్యం అయింది. ఆయా పొరల్లోని జీవరాసులు వాటి నిర్మాణ విశేషాలు, ఆయా కాలపరిస్థితులు అద్భుతంగా పరిణామవాదానికి ఆధారాలనిస్తాయి. సరళమైన జీవరాసులు పురాతన కాలాల్లో ఉన్నట్లు క్రమక్రమంగా ఒక మహావృక్షంగా అభివృద్ధిచెందినట్లు శాఖోపశాఖలుగా వర్ధిల్లినట్లు మనకు గోచరమవుతుంది. (విశేషమేమంటే ప్రత్యేక సృష్టివాదులు ఈ పరిస్థితులని తమకు అనుగుణంగా తిప్పుకొంటారు. బైబిల్‌లో వర్ణించిన ఒకనాటి గొప్ప వరద కారణంగా జీవరాసులు రక్షిత ప్రాంతాలకు పారిపోయినట్లు, శక్తివంతమైనవి, ఉన్నతవర్గాలకు చెందినవి ఎత్తైన ప్రాంతాలకు పోయినట్లు, హీనదశలకు చెందిన జాతులు క్రిందిప్రాంతాలలో ఉండిపోయినట్లు, మరణించి శిలాజాలుగా మారినప్పుడు ఆ హెచ్చు తగ్గులు ఏర్పడినట్లు చెప్తారు. గత 3, 4 వేల సంవత్సరాల కాలంలోనే ఈ పొరలన్నీ ఒకేసారి ఏర్పడ్డాయి అని వీరి అభిప్రాయం).

డార్విన్ మొదట్లో ఈ పరిస్థితికి ఎంతో సంతోషించినా కొంత లొసుగు కనిపెట్టకపోలేదు. మార్పులు క్రమంగా జరిగినట్లయితే థర్మామీటర్‌లో కొలతలున్నట్లుగా దగ్గిర దగ్గర మార్పులున్న జీవరాసులు ఎందుకు కనబడవు ? మొత్తానికి కాలం దీనికి సమాధానం చెప్తుందని తృప్తి పడ్డాడు అతను. ఇంకా విపులంగా పరిశీలనలు జరిపితే అలాటివి కనబడతాయి అనుకొన్నాడు. ఆ ఆశ నిరాశ అయింది. ఇంకా కనబడతాయి అని ఎంత డార్విన్ వాది అయినా ఆశించడంలేదు.

శాస్త్రజ్ఞుల గుడ్డితనం

మరి దీనికి శరణ్యంఏమిటి ? పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ దీనికి సమాధానం అవుతోంది. గ్రాడ్యువలిజమ్‌కు స్థానం లేకుండా పోతోంది. అసలు ఇంత సుదీర్ఘ కాలం డార్విన్ వాదాన్ని ఎలా గుడ్డిగా ఆమోదించామో అర్థంకావడంలేదు అని వీరు విస్తుపోతున్నారు. ఈ సందర్భంగా చూడండి.

ప్రస్తుతం భూమిమీద 15,లక్షల జాతులున్నాయి. దీనికి రెండున్నర లక్షల శిలాజాలు కలుపుకుంటే 20 లక్షలలోపే జీవజాతులున్నట్లు తెలుస్తుంది. కాని గ్రాడ్యువలిజమ్ నిజమని అంగీకరిస్తే గణాంకరీత్యా కనీసం ఒకటిన్నర కోట్ల జాతులు భూమి మీద జీవించి ఉండాలి. ఇంతేకాదు శిలాజ చరిత్రలో సరిగా మనకి ఎక్కడైతే మధ్యస్థ జీవులు కావాలనుకొంటామో అక్కడ అవి మృగ్యమైపోయి ఉన్నాయి. అసలు అవి సృష్టిలో లేవని అనుకోవలసివస్తోంది. అనూహ్య సంఖ్యలో పురాతన అకశేరుకాలు (జాతులు) ఉన్నాయి. పురాతన సకశేరుకాలయిన చేపల జాతులున్నాయి. కాని 10 కోట్ల సంవత్సరాల కాలంలో ఈ రెండిటికి మధ్య మనకు ఎన్నో మధ్యస్థజీవరాసులు లభ్యమయి ఉండాలి. కాని మచ్చుకు ఒకటి కూడా లేదు. నిజానికి మధ్యస్థస్థాయిల్లో ఇవి అకశేరుకాలా, సకశేరుకాలా అనే తెగని మీమాంస కల్గించే రీతిలో జాతులు ఎన్నయినా ఉండాలి. ఆకాశంమీంచి ఊడిపడ్డట్టు అకస్మాత్‌గా పూర్తిగా చేపలు అనదగినవే మనకు కనబడుతున్నాయి శిలాజాల రూపంలో. కాని వాటి పూర్వలక్షణాలున్న జీవరాసులు లేవు.

చాలాజాతులు అకస్మాత్తుగా అవతరించడం, దీర్ఘకాలంపాటు ఏమార్పూలేకుండా జీవించడం, తిరిగి అకస్మాత్‌గా అంతరించిపోవడం చాలవాటి సందర్భంగా కనబడుతోంది. జీవుల్లోను, వర్గాలమధ్య సంభవించే మార్పు కేవలం నిర్మాణాత్మకమేకాదు. శరీరధర్మరీత్యా ఎంతో అవసరమయిన మార్పులుకూడా ఉంటాయి. ఉదాహరణకు చేప ఉభయచరం కావాలిఅంటే, వాజాలు అంగాలుగా రూపొంది వాటికి ఆధారంగా శ్రోణీవలయం బలం పుంజుకోవాలి. ఊపిరితిత్తులు ఏర్పడాలి. రక్త ప్రసరణ విధానం నూతనంగా రూపొందాలి. మడగాస్కర్‌తీరాన సముద్రలోతుల్లో కనబడ్డ సీలకాంత్ చేప మొదట్లో మధ్యస్థ జీవిగా వర్ణించ బడిందికాని ఇప్పుడు అది అనుమానాస్పదం అనిపిస్తోంది. అదేవిధంగా సరీసృపాలనుంచి క్షీరదాలు, పక్షులు రూపొందడంలో సమస్యలున్నాయి.

ఇటీవల వ్యాప్తిచెందినది,డార్వినిస్టుల ఆమోదంపొందినది పాప్యులేషన్ జెనెటిక్స్. డి.ఎన్.ఎ. నిర్మాణ విశేషాలు, ద్విగుణీకరణ లక్షణాలు తెలిసాక వైవిధ్యాలకి కారణంకూడా తెలిసింది. సుమారు ఒకకోటి కణవిభజనల్లో ఒక పొరపాటు అంటే ఒకఉత్పరివర్తన జరుగుతుంది. వీటిలో చాలావరకు ప్రమాదకరమైనవి, నిరుపయోగకరమైనవి. అవి ప్రకృతివరణంలో నిర్మూలించబడతాయి. కాని అత్యల్ప సంఖ్యలో కొన్ని ఉత్పరివర్తనలుమాత్రం ఉపయోగకరమైనవిగా ఉండి క్రమంగా జనాభాలో కలిసి జంతుసంతానంలోకి వ్యాపిస్తాయి. ఇదే పరిణామానికి మూలం అని అతిసరళంగా కొట్టిపారేస్తారు డార్వినిస్టులు. అర్ధశతాబ్దం నుంచి ప్రపంచవ్యాప్తంగా పాఠశాలల్లో ఈభావం బోధించడమవుతోంది. కాని ప్రకృతిలో పరిశీలిస్తే ఇదంతా జాతినిస్థిరంగా ఉంచడానికి ఉపయోగపడేదిగాఉందికాని మార్పులు తీసుకొనివచ్చేదిగాలేదు. ఏకొద్ది మార్పులకు కారణమయినా బృహత్ పరిణామానికి కావలసిన ఆధారాలు ఇవికావు అని విశదమవుతోంది.

(ఈ అవకాశంతీసుకొని సృష్టివాదులు తమబలాన్ని పుంజుకొంటారు. జంతుస్వరూపాన్ని నిర్ణయించేశక్తి ఒక్క భగవంతుడికే ఉందని, ఆతడే ఇవన్నీ జరిపిస్తున్నాడు అని వారు అంటారు).

కన్ను భగవత్ సృష్టా ?

డార్విన్ ఒక సందర్భంలో ఒప్పుకొన్నాడు "క్లిష్టనిర్మాణంకల ఏ అవయవం అయినాసరే కొద్దికొద్ది మార్పులతో అవతరించడానికి అవకాశంలేదు అని నిరూపించగల్గితే నాసిద్ధాంతం పేకమేడలాగా కూలిపోతుంది" అని. ఇదే సరిగ్గా జరిగిందా ఇప్పుడు అనిపిస్తోంది!

ఏదైనా ఒక అవయవం పూర్తిగా ఏర్పడినపుడే ఉపయోగకరమైనపుడు, పరిణామంలో అది అనేక ప్రాథమిక మధ్యస్థదశల్లో ఎలా ఉపయోగపడుతుంది? ప్రకృతివరణం దానిమీద ఎలాపనిచేస్తుంది. దీనికి మానవనేత్రం మంచి ఉదాహరణ. ఇలాంటివి చాలా సృష్టిలో కనబడతాయి. కన్నులోని ఒక్కొక్కభాగము సంపూర్ణ స్థాయిలో అభివృద్ధి చెందితేతప్ప అది ఉపయోగపడదు. అందులోని ముఖ్యభాగాలు ఒకేస్థాయిలో, క్రమంలో పరిణామం చెందడం సాధ్యమా ? శాస్త్రజ్ఞులని ఇలా తికమకపెట్టేవి చాలానిర్మాణాలు కనబడతాయి.

తిమింగిలం మరొకమంచి ఉదాహరణ, డార్విన్‌వాదానికి దెబ్బతియ్యడానికి. ఇవి గిట్టలున్న జంతువులనించి పరిణామం చెందాయని అంటారు. అన్ని క్షీరదాల మాదిరిగానే గాలినిపీల్చే, ఉష్ణరక్తంకలిగిన పాలిచ్చేజంతువులు ఇవి. ఆరున్నరకోట్ల సంవత్సరాల క్రితం డైనోసార్‌లు విలుప్తంచెందాక, మరొక 60,70లక్షలసంవత్సరాలలోనే ఆర్కియోసిటి అనే పురాతన తిమింగిలాలు అవతరించాయి. ఆ తరవాత అధునాతన తిమింగిలాలు కనబడ్డాయి. ఇంత తక్కువ కాలంలో భూమిమీదసంచరించే క్షీరదాలు, అనేక అతిముఖ్య మార్పులతో తిమింగిలాలుగా ఎలామార్పుచెందగలిగాయి? పోలికకి, ఇదేకాలవ్యవధిలో వాలిడులనుంచి మానవుడు ఇటీవల అవతరించాడు. దానితోపోలిస్తే మనలోని ఈమార్పుచాల అల్పం.

వికృతరూపాలే పరిణామానికి ఆధారాలా?

ఆధునిక డార్వినిజమ్‌కు ప్రత్యామ్నాయంగా రూపొందుతున్న ఈసిద్ధాంతానికి కొన్ని పాత అభిప్రాయాలు తిరగదోడవలసివచ్చింది.

ఇందులోఒకటి "వికృతరూపాలు".సామాన్యరూపానికి భిన్నంగా ఉత్పన్నమయేదానిని వికృతరూపం లేదా మాన్‌స్టర్ అంటాం. సంతానంలో ఇలాంటివి అప్పుడప్పుడు వస్తాయి. ఇవి ప్రకృతిలోఇమడవు. కాని అతిఅరుదుగా అయినా ఇలాటివి ప్రకృతికి అనుగుణంగా ఉన్నవి అవతరిస్తాయని గోల్డ్‌స్మిడ్ ప్రతిపాదించాడు. చెట్టుముందా,విత్తుముందా అని పాతవాదం ఒకటి ఉంది. పూర్వం శాస్త్రీయంగా దీనికి విత్తుఅనాలి అనేవారు. కాని ఇప్పుడు దీనికి నిస్సందేహంగా చెట్టు అనే చెప్పవలసివస్తోంది. బల్లిగుడ్డులోంచి పక్షి అవతరించడం జరిగింది. అంటే ఆశ్చర్యంగా ఉంటుందికాని సరిగ్గా ఇదేభావాన్ని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తోంది. పక్షిసంతానానికి అదేనాంది, ఈ సిద్ధాంతం ప్రకారం. మరి దీనికికావలసిన క్రోమోసోమ్ నిర్మాణం ఎలా సాధ్యం అవుతుందో ఇంకా అవగాహన కాలేదు అంటారు.

ఇక రెండవభావం ప్రళయకాలం. ఏనాడో క్యువియర్ వంటి శాస్త్రజ్ఞులు ప్రళయసిద్ధాంతం ప్రవేశపెట్టారు. మొదట్లో దీనిభావాలు ఎలాఉన్నా (నోవాప్రళయాన్ని బైబిలుపర్ణిస్తుంది) ఆధునిక అంతరిక్ష విజ్ఞానంవల్ల భూమి గతచరిత్రలో ఎన్నో ఖగోళ అవాంతరాలను ఎదుర్కొని ఉండిఉంటుందని గ్రహింపుకు వచ్చింది. చంద్రుడిమీద, కుజుడుమీద ఉన్నట్లు భూమిమీదకూడా అఖాతాలు, క్రేటర్‌లు కనబడుతున్నాయి. ఇవి భూచరిత్రలో కొన్నిక్లిష్టకాలాలకు నిదర్శనలు. ఇలాటి "ప్రళయాలు" కేంబ్రియన్, డివోనియన్ పర్మియన్, ట్రియాసిక్

కాలాలలో వాటి అంత్యభాగాలలో జరిగినట్లురూఢిగా ఆధారాలున్నాయి. వీటి ఆధారంగానే ఒక దశాబ్దం వెనకనించి ఈ ప్రళయసిద్ధాంత అభిప్రాయం పుంజుకొంది. గతపరిణామచరిత్ర క్రమబద్ధంగా సాగిన సజావుమార్పుల గాథకాదు. అక్కడక్కడ, అప్పుడప్పుడు సంభవించిన పరిస్థితులవల్ల అకస్మాత్‌గా జీవజాతులు నూతనంగా అభివృద్ధిచెందడం, ఆ తరవాత పరిస్థితులు క్రమస్థాయికి చేరుకోవడం జరిగింది.

ఇలాటి ప్రళయాలు క్షణాలు, గంటలు లేదా కొన్ని రోజులు పట్టవచ్చు. లేదా వేలాది సంవత్సరాలు 40, 50 వేలవరకు పట్టవచ్చు. ఈ కాలవ్యవధి ఆ ప్రళయపద్ధతినిబట్టి ఉంటుంది. (మన పురాణాల్లో కూడా ఈ ప్రళయ ప్రస్తావన ప్రముఖంగా ఉండడం గమనార్హం). ఏదైనా గ్రహం లేదా ఉల్క వంటిది భూమిని తాకి దాని స్థితిని మార్చిన సందర్భంలో క్షణాల్లో జీవరాసి రూపుమాసిపోవచ్చును. లేదా క్రమంగా ఆహారపద్ధతులు, వాతావరణ పరిస్థితులుమారి వేలాది సంవత్సరాలు జీవరాసికి గడ్డుపరిస్థితిగా మారి విలుప్తం కావచ్చు. 15 కోట్ల సంవత్సరాలపాటు భూమిని ఏలిన డైనోసార్‌లు "అకస్మాత్"గా విలుప్తం కావడం మంచి ఉదాహరణ.

డార్విన్‌వాదం ఫెనిక్స్‌లాటిది

ఈవిధంగా అవతరించిన అభిప్రాయాలలో రెండు ముఖ్య విషయాలు ప్రస్ఫుటంగా నిలుస్తాయి.

1. పరిసరాలలో కొన్ని అవాంతర పరిస్థితులు ఏర్పడి జీవరాశి మనుగడకు అత్యంత గడ్డుకాలం సంభవిస్తుంది. దానిని ప్రళయంగా వర్ణించవచ్చు. బహుశా ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉండవచ్చు లేదా చాలా విశాలమైన ప్రాంతాల వ్యాప్తిచెందవచ్చు.

2. జన్మించబోయే సంతానంమీద జన్యురీత్యా ఒక చిత్రమైన వత్తిడి సంభవిస్తుంది. అత్యంత నూతన లక్షణాలు, పూర్వంఉన్న జాతికి భిన్నంగా మొదటిదానితో పోలికేలేనట్లుగా అవతరించకపోతే అది మనలేకపోతుంది. నిజానికి ఈ నూతన "వికృత" రూపాలుకూడా చాలావరకు నశించిపోతాయి. కాని ఏకొద్ది మాత్రమే అక్కడక్కడ నిల్రదొక్కుకొని సంతానం అభివృద్ధి చేసుకొంటాయి.

డార్విన్ వాదంతో ఇది ఎంత భిన్నమో చూడండి.

1. మార్పు అనేది ఒక నాటకీయంగా జరిగే సంభవం. బహుశా ఇది ఒకే జీవిలో సంభవించవచ్చు. చిన్నదిగాకాక ఈ మార్పు విపరీతంగా ఉంటుంది.

2. పోటీ అనేది వీటిమధ్య సంభవించదు. నిజానికి దానికి వ్యతిరేక పరిస్థితి ఇది. పరిసరాలు ఖాళీగా ఉండవచ్చు. ఆయా భిన్న పరిసరాలను ఆక్రమించుకోడానికి ఇవి ప్రయత్నిస్తాయి.

3. పరిసరాలకు అనుగుణంగా జీవరాసుల ఎన్నిక జరగడం డార్విన్ భావం. అలాకాక ఇక్కడ పరిసరాలకు అనుగుణంగా జీవరాసులు మార్పు చెందడం, సద్దుబాటు చేసుకోవడం జరుగుతుంది. నిజానికి పరిసరాలకు అనుగుణంగా సంతానం వృద్ధిచేసుకోడం జరుగుతుంది. డార్విన్ సిద్ధాంతం ప్రకారం పరిసరాలు పూర్తిఅధికారం కలిగి జీవరాసుల మనుగడను శాసిస్తాయి. ఈ సిద్ధాంతం ప్రకారం జీవరాసులదే పైచేయి. పరిసరాలనుబట్టి అవి సంతానాభివృద్ధి చేసుకొంటాయి.

డార్విన్ వాదం మీద ఇంకా తుదినిర్ణయం జరిగినట్లుగా భావించ లేము. డార్విన్ వాదంలో కొన్నయినా తిరుగులేని సత్యాలున్నాయి. ఇంతకుముందు వచ్చిన అడ్డంకులను అధిగమించినట్లుగానే ఈ రెండు అడ్డంకులను ఇది దాటివేయగల్గుతుంది. పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ సిద్ధాంతానికి, దాని ఆదరణకు పరిస్థితులు అంతగా అనుకూలంగాలేవు. మొత్తానికి సృష్టి అంత సులభంగా అర్థం అయ్యేదికాదు అని దీనివల్ల విశదమవుతుంది.

రెండు విషయాలు చెప్పి ఈ వ్యాసం ముగిస్తాను.

ప్రస్తుతానికి శాస్త్రజ్ఞులు ఈరెండు భావాలు — గ్రాడ్యువలిజమ్, పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ - ఒకదాని కొకటి పరస్పర వ్యతిరేకం అని భావింప పనిలేదంటారు. ఈ రెండురకాల శక్తులు ప్రకృతిలో పని చేస్తూ ఉండవచ్చునేమో. రెండూ పరిణామశక్తులకు ప్రోత్సాహ కారకాలే. ఈవాదన అంతా ఒక విషయంమీదనే కేంద్రీకరించబడి ఉందని 1983 ఎన్‌సైక్లోపిడియా బ్రిటానికా వార్షిక సంపుటం భావిస్తోంది. పురాజీవశాస్త్రం నూతనజాతి ఉద్భవించడానికి కనీసం 50వేల సంవత్సరాలు పడుతుందని భావిస్తుంది (ఆ వ్యవధి ఒక ఘట్టం). ఇది గ్రాడ్యువలిజమ్ భావన. పంక్చుయేటెడ్ ఈక్విలిబ్రియమ్ భావంలో నూతన జాతి అవతరణకు అతితక్కువ హ్రస్వకాలం సరిపోతుంది. రోజులు, నెలలలోపలే నూతనజాతి ఉద్భవించవచ్చు. ఈ వివాదం చాలా ఆరోగ్యవంతమైనదే.

రెండో విషయం ఈ వాదనలకి సంబంధించి ఆలోచనలు రేకెత్తించేది. ఇప్పటివరకు ఈ విశ్వంలో ఏ గ్రహంలోకాని జీవరాశి ఉన్నట్లు ఆధారాలు దొరకలేదు - మన భూమి మినహా. కాని ఇటీవల కొన్ని ఉల్కల పరీక్షలో డి.ఎన్.ఎ. పదార్థానికి సంబంధించిన క్షారాలు వాటిలో ఉన్నట్లు బాగా నిర్ధారణ అయింది. డా॥ సిరిల్ పొన్న పెరుమా (మేరీలాండ్ విశ్వవిద్యాలయం అమెరికా) ఈ విషయంలో కృషిచేస్తున్న ప్రసిద్ధ శాస్త్రకారుడు. ఏవో కొన్ని గ్రహాలలో జీవరాశి ముఖ్యంగా మన భూమి మీదనున్న ప్రాథమిక పద్ధతిలోనే నిర్మితమైనవి ఉండడానికి అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి.

శ్రీ ఏ. విజయ్‌కుమార్ శ్రీ ఇ. ప్రభుదాసు

ఆంధ్రప్రదేశ్‌లో విధానసభకు జరిగిన 1983 సాధారణ ఎన్నికలు

ప్రజాస్వామ్యములో ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపే పాలకులను ప్రజలు ఎన్నుకొనవలయును. ఇటువంటి ఎన్నికలను ఒక నిర్దిష్ట కాలానికి అనగా ప్రతి 5 సం॥లకు జరుగుతాయి. గత 35 సం॥ల నుండి ఆంధ్రప్రదేశ్ ప్రజలు 7 అసెంబ్లీ ఎన్నికల అనుభవాన్ని గడించారు. ఈ సంవత్సరము అనగా జనవరి 5, 1983 న రాష్ట్ర వ్యాపితముగా 7వ విధాన సభకు సాధారణ ఎన్నికలు నిర్వహింపబడినాయి. గతంలో విధాన సభకు జరిగిన ఎన్నికలకు, ఈసారి విధాన సభకు జరిగిన ఎన్నికలకు చాలా తేడాలు మనకు కనిపిస్తాయి. ఈ ఎన్నికలలో ప్రజలు తమ రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించి క్రొత్త తరహాలో ఫలితాలను అందించారు. 9 మాసాల క్రితమే నందమూరి తారక రామారావుగారి నేతృత్వములో ఆవిర్భవించిన ప్రాంతీయ పార్టీ 'తెలుగు దేశాని'కి పట్టం కట్టారు.

7వ సాధారణ ఎన్నికల తీరుతెన్నులు పరిశీలించే ముందు గతంలో విధానసభకు జరిగిన ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకొని తులనాత్మక అధ్యయనం చేస్తే ఆసక్తిదాయకంగా ఉంటుంది. 1962 నుండి 1983 వరకు జరిగిన ఎన్నికల్లో పోలైన ఓటింగ్ సరళిని పరిశీలిస్తే 1962లో 59.13 శాతము, 1967లో 69.10 శాతము, 1972లో 63.53 శాతము, 1978లో 72 శాతం ఓట్లు పోలుకాగా, 1983లో 62 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ వివరణలను పరిశీలిస్తే 1962 ఎన్నికలలో కంటే 1967 ఎన్నికలలో 9.97 శాతం ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. 1972 ఎన్నికల్లో 1967 కంటే 5.57 శాతం తక్కువ ఓట్లు పోలయ్యాయి. 1978 ఎన్నికల్లో 1972 ఎన్నికల కంటే 8.47 శాతం ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. 1983 ఎన్నికల్లో 1978 ఎన్నికలకంటే 10 శాతం తక్కువ మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీని ద్వారా ఓటింగ్ సరళిలో నిర్దుష్టత ఏమి లేదని తెలుస్తుంది. అధిక సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోక పోవడానికి గల కారణాలు పరిశోధించవలసిన విషయము.

1967 ఎన్నికల నుండి 1978 వరకు జరిగిన ఎన్నికలలో ఏయే పార్టీ ఎంతమంది అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెట్టినదో పార్టీల వారిగా పరిశీలించి చూస్తే ఆయా పార్టీల బలాబలాలు అర్థమవుతాయి.

పట్టిక - 1

క్రమ సంఖ్య	పార్టీ పేరు	పోటీ చేసిన స్థానాలు		
		1967	1972	1978
1.	కాంగ్రెసు	285	287	257
2.	సి. పి. ఐ.	103	59	31
3.	ఎస్. టి. పి. యస్.	—	41	—
4.	సి. పి. యం.	83	32	22
5.	జనసంఘ్	80	56	—
6.	స్వతంత్ర	90	20	—
7.	ఇండిపెండెంట్లు	402	460	641
8.	ఇతరులు	16	47	28
9.	ఇందిరా కాంగ్రెసు*	—	—	290
10.	జనతాపార్టీ**	—	—	269

* 1978 సాధారణ ఎన్నికల వరకు జాతీయ కాంగ్రెసు చీలి ఇందిరా కాంగ్రెసుగా ఆవిర్భవించింది.

** 1978 సాధారణ ఎన్నికల్లో ప్రతిపక్షాల కలయికతో ఆవిర్భవించి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ పోటీచేసింది.

పట్టిక-1 పరిశీలించి చూస్తే 1967, 1972 ఎన్నికలలో కేవలం కాంగ్రెసు పార్టీ మాత్రమే ప్రభుత్వ స్థాపనకు అవసరమైన సీట్లు సంపాదించడానికి అభ్యర్థులను నిలబెట్టింది. దీని ద్వారా కాంగ్రెసు మాత్రమే ప్రభుత్వాన్ని స్థాపిస్తుందని ముందే అర్థమవుతుంది. 1978 సాధారణ ఎన్నికల వరకు భారత జాతీయ కాంగ్రెసు చీలిపోయి ఇందిరాగాంధీ నాయకత్వంలో ఇందిరా కాంగ్రెసుగా ఆవిర్భవించి, అధికారం కైవసం చేసుకోవడానికి అవసరమైనన్ని సీట్ల కోసం అభ్యర్థుల నిలబెట్టింది. ఈ ఎన్నికలనాటికి ఆవిర్భవించి కేంద్రంలో పాలన కొనసాగిస్తున్న జనతాపార్టీ, రాష్ట్రంలో ఎన్నికల సమయంలో అధికారంలో ఉన్న భారత జాతీయ కాంగ్రెసు అధికారంలోకి రావడానికి అవసరమైన సీట్లకు అభ్యర్థుల నిలబెట్టాయి. 1967, 1972 ఎన్నికలలో కేవలం ఏక పార్టీ ఆధిపత్యం కొనసాగగా, 1978 ఎన్నికల్లో పోటీ ప్రధానంగా మూడు పక్షాలమధ్య ఏర్పడింది.

ఉభయ కమ్యూనిస్టు పార్టీల పరిస్థితి పరిశీలిస్తే వీరు 1967నుండి 1978 వరకు ఎన్నికల్లో పోటీకి నిలబెట్టిన అభ్యర్థుల సంఖ్య క్రమేణా తగ్గుతూ వచ్చింది. వివిధ పక్షాల తరపున మరియు స్వతంత్రులుగా పోటీ చేసినవారి సంఖ్య 1967లో 1059 కాగా, 1972లో ఇది 1013కు పడిపోయింది. 1978 ఎన్నికల వరకు ఇది 1538కి పెరిగింది. 1967, 1972 ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అధికారములోకి రాగా, 1978 ఎన్నికల్లో అధికారపక్షానికి పోటీగా నిలచిన ఇందిరా కాంగ్రెసు అధికారానికి వచ్చింది. రాష్ట్రచరిత్రలో ప్రతిపక్షం మొదటిసారి అధికారం లోకి వచ్చినా దీన్ని ప్రజలు ఎక్కువగా పరిగణించలేదు. జనతాపార్టీ కేంద్రంలో అధికారంలో ఉండగా ఈ ఎన్నికలు జరిగినా జనతాపార్టీ రాష్ట్రంలో ఓడిపోవడం ఇందులో గమనించవలసిన విషయం.

1983 ఎన్నికల ముందు 6వ విధాన సభలో ఆయా పార్టీలకు గల బలాబలాలు మరియు 7వ విధాన సభకు జరిగిన ఎన్నికలలో ఆయా పార్టీల తరపున పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు ఈ క్రింది విధముగా కలవు.

పట్టిక - 2

క్రమ సంఖ్య	పార్టీ పేరు	1983 ఎన్నికల ముందు విధానసభలో పార్టీల బలాలు	1983 ఎన్నికల్లో నిలబెట్టిన అభ్యర్థుల వివరాలు పార్టీల వారీగా
1.	తెలుగు దేశం	—	289
2.	సంజయ్ విచార్ మంచ్	—	5
3.	ఇందిరా కాంగ్రెసు	246	294
4.	సి. పి. ఐ.	6	48
5.	సి. పి. యం.	8	28
6.	బి. జె. పి.	3	80
7.	మజ్లీస్	3	22
8.	ఇండిపెండెంట్లు	10	809
9.	జనతా	5	45
10.	లోక్‌దళ్	6	33
11.	కాంగ్రెస్ (జె)	—	80
12.	కాంగ్రెస్ (యస్)	—	9
13.	ఆర్. పి. ఐ. (కె)	—	3

పై పట్టిక పరిశీలించి చూస్తే విధానసభ రద్దు అయ్యేనాటికి రెండింట మూడొంతు మెజారిటీ కలిగియున్నపార్టీ ఇందిరా కాంగ్రెసు ఉండగా, ప్రతిపక్షాల పరిస్థితి దిగజారిపోయి ఉన్నట్లు తెలుస్తుంది. 1983 ఎన్నికల్లో అధికార కైవసానికి అవసరమైన సీట్ల సంపాదనకు అభ్యర్థులను నిలబెట్టిన పార్టీలు రెండు మాత్రమే. అవి ఒకటి, ఎన్నికల నాటికి అధికారంలో ఉన్న ఇందిరా కాంగ్రెసు, ఎన్నికలముందు అనగా 9 నెలల క్రితం ఆవిర్భవించిన ప్రాంతీయ పార్టీ తెలుగు దేశం. 1978 ఎన్నికల్లో పోటీ చేసిన జనతా విచ్ఛిన్నం కావడంతో 1983లో రాష్ట్ర ఎన్నికలలో ఏ పార్టీకి ఆ పార్టీ విడిగా పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల సర్దుబాట్లు జరుపుకొని ఉమ్మడి అభ్యర్థుల నిలబెట్టినాయి. ఇండిపెండెంట్ల సంఖ్య గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో 809 కి పెరిగింది. ఈ ఎన్నికల్లో చెప్పుకోదగిన విషయం మేనకా గాంధీ స్థాపించిన "సంజయ్ విచార్ మంచ్" పార్టీ తెలుగు దేశంతో ఎన్నికల సర్దుబాటు చేసుకోవడం. మొత్తంపైన 9 నెలల క్రితం ఆవిర్భవించిన 'తెలుగు దేశం' ప్రాంతీయ పార్టీ 1983 ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా కాంగ్రెసేతర పార్టీ అధికారంలోకి వచ్చింది.

1962 ఎన్నికల నుండి 1983 ఎన్నికల వరకు గెలిచిన, ఓడిన పక్షాలు గెలుచుకున్న స్థానాలు ఈ క్రింది విధంగా కలవు.

పట్టిక - 3

క్రమ సంఖ్య	పార్టీపేరు	1962	1967	1972	1978	1983
1.	కాంగ్రెసు	178	165	219	30	—
2.	కాంగ్రెసు 'ఐ'	—	—	—	175	60
3.	జనతా	—	—	—	60	1
4.	సి.పి.యం. & సి.పి.ఐ.	51	19	8	14	9
5.	స్వతంత్ర	19	29	2	—	—
6.	జనసంఘ్	—	3	—	—	—
7.	పి. యస్. పి.	—	—	—	—	—
8.	సోషలిస్టులు	2	1	—	—	—
9.	రిపబ్లికన్స్	—	2	—	—	—
10.	ఎస్.టి.పి.యస్.	—	—	2	—	—
11.	ఇండిపెండెంట్లు & ఇతరులు	50	68	56	15	12
12.	తెలుగు దేశం	—	—	—	—	198
13.	కాంగ్రెసు 'జె'	—	—	—	—	1
14.	సంజయ్ విచార్ మంచ్	—	—	—	—	4
15	బి.జె.పి.	—	—	—	—	3
16.	మజ్లీస్	—	—	—	3	5
17.	లోక్‌దళ్	—	—	—	—	—
18.	కాంగ్రెసు 'ఎస్'	—	—	—	—	—

పై పట్టిక పరిశీలించిచూస్తే వరుసగా 1962, 1967, 1972 ఎన్నికలలో జాతీయ కాంగ్రెసు పార్టీ విజయం సాధించగా, 1978, 1983 విధాన సభ ఎన్నికలలో క్రమంగా ఇందిరా కాంగ్రెసు, తెలుగు దేశం పార్టీలు అధికారములోకి వచ్చాయి. 1975 ఎన్నికలలో ఇందిరా కాంగ్రెసు అధికారంలోకి వచ్చినా ప్రజలు దీనిని నాయకత్వ మార్పుగా గుర్తించినారే తప్ప ప్రభుత్వ మార్పుగా, పార్టీ మార్పుగా గుర్తించలేదు. ఇదే ఇందిరా కాంగ్రెసు పార్టీ 1980లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో విజయం పొంది కేంద్రంలో అధికారములోకి వచ్చింది. ఇదే పార్టీని జాతీయ కాంగ్రెసుగా ఎన్నికల కమీషన్ చే గుర్తించబడింది, ఈనాటికి ఇది జాతీయ కాంగ్రెసు (ఇందిరా) గా వ్యవహరింపబడుతుంది.

1983 ఎన్నికలలో 'తెలుగు దేశం' పార్టీ విజయం పొందిన ఫలితంగా వచ్చిన మార్పును ప్రజలు నాయకత్వము, పార్టీ, కాంగ్రెసేతర ప్రభుత్వం రాష్ట్రంలో అధికారానికి వచ్చిన మార్పుగా పరిగణిస్తున్నారు.

మొదటినుండి ప్రతిపక్షాల పరిస్థితి పరిశీలిస్తే 1962 ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మొత్తం కలిసి 122 స్థానాలు రాగా, 1967లో 120 స్థానాలు, 1972లో 68 స్థానాలు రాగా 1978 ఎన్నికల్లో జాతీయ కాంగ్రెసు చీలి ఇందిరా కాంగ్రెసుగా ఆవిర్భవించి పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో మిగతా పక్షాలకు 122 స్థానాలు వచ్చాయి. 1983 ఎన్నికలలో 'తెలుగు దేశం' అధికారంలోకి రాగా ఇందిరా కాంగ్రెసు మిగతా ప్రతిపక్షాలకు కలిసి 90 స్థానాలు లభించాయి ఈ ఎన్నికల్లో కేంద్రంలో ఇందిరా కాంగ్రెసు పాలన కొనసాగుతున్నా రాష్ట్రంలో ఓడిపోవడం గమనించ దగిన విషయము.

1983 సాధారణ ఎన్నికల అనంతరము వివిధ కారణాల వలన తిరుపతి, ఎమ్మిగనూరు, మదనపల్లి, హిమాయత్ నగర్ నియోజక వర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహింపబడినాయి. ఉప ఎన్నికల అనంతరము, ఉప ఎన్నికల ముందు విధాన సభలో పార్టీల బలా బలాలు పరిశీలించి చూస్తే ఈ క్రింది విధముగా కలదు.

పట్టిక-4 ద్వారా ఉపఎన్నికలలో ఇందిరా కాంగ్రెసు బలం 60 నుండి 59 కి పడిపోయినట్లు, భారతీయ జనతా పార్టీకి ఒక స్థానం వచ్చి దాని బలం 4కు పెరిగినట్లు, తెలుగు దేశం బలం కూడా సాధారణ ఎన్నికల కంటే ఉప ఎన్నికల్లో పెరిగినట్లు తెలుస్తుంది.

పట్టిక - 4

క్రమ సంఖ్య	పార్టీ పేరు	8-1-83 ఎన్నికల అనంతరం బలా బలాలు	20-5-83 ఉపఎన్నికల అనంతరం. బలాబలాలు
1.	కాంగ్రెసు 'ఐ'	60	59
2.	తెలుగు దేశం	198	199
3.	కాంగ్రెసు 'జె'	1	1
4.	బి. జె. పి.	3	4
5.	సి. పి. ఐ.	4	4
6.	జనతా	1	1
7.	సి. పి. యం.	5	5
8.	మజ్లీస్	5	5
9.	సంజయ్ విచార్ మంచ్	4	4
10.	ఇండిపెండెంట్లు & ఇతరులు	12	12
	మొత్తం	293*	294**

* మదనపల్లి నియోజక వర్గంలో అభ్యర్థి మృతి కారణంగా ఎన్నిక జరగలేదు. జరిగినవి 293 స్థానాలకే.

** తాడేపల్లి గూడెం నియోజక వర్గం నుండి అభ్యర్థి మృతి కారణంగా ఒక సీటు ఖాళీ అయి 293 కు వచ్చింది.

పట్టిక - 5

ప్రాంతాలవారీగా ఆయా పార్టీల బలాబలాలు తెలుపు పట్టిక

క్రమ సంఖ్య	ప్రాంతం పేరు	కాంగ్రెసు (జె)	కాంగ్రెసు (ఐ)	తెలుగుదేశము	బి. జె. పి.	జనతా	ఇండిపెండెంట్లు & ఇతరులు	సి. పి. ఐ.	సి. పి. యం.	సంజయ్ విచార్ మంచ్	మజ్లిస్	మొత్తం సీట్లు
1	కోస్తా ఆంధ్ర	—	9	120	1	—	4	—	—	—	—	134
2	రాయలసీమ	1	7	41	—	—	4	—	—	—	—	53
3	తెలంగాణ	—	43	38	3	1	3	4	5	5	5	107
	మొత్తం	1	59	199	4	1	11	4	5	5	5	294

నోటు : ఉప ఎన్నికల అనంతరం వివరాలు.

ప్రాంతాల వారీగా 1983 ఎన్నికల ఫలితాల వివరాలు ఆయా పార్టీల వారిగా పరిశీలించి చూస్తే ఏ ప్రాంతం వారు ఏ పార్టీని ఎక్కువగా ఆదరించారో, ఎవరు తిరస్కరించారో అర్థం అవుతుంది. ఆ వివరాలు పట్టిక-5 ద్వారా తెలుసుకోవచ్చు.

ఆ పట్టిక పరిశీలించి చూస్తే ఆంధ్ర ప్రాంతములోని మొత్తం 134 స్థానాలలో తెలుగు దేశానికి 120 రాగా, ఇందిరా కాంగ్రెసుకు 9 స్థానాలు, బి.జె.పి. కి 1 స్థానము, ఇండిపెండెంట్లకు 4 స్థానాలు లభించాయి. రాయలసీమ ప్రాంతములో మొత్తం 53 స్థానాలలో 47 తెలుగు దేశానికి, 7 ఇందిరా కాంగ్రెసుకు, 1 కాంగ్రెసు 'జె' కు, 4 ఇండిపెండెంట్లకు లభించాయి. తెలంగాణా ప్రాంతములో మొత్తం 107 లో 43 ఇందిరా కాంగ్రెసు గెలుచుకోగా, 38 స్థానాలు తెలుగు దేశం గెలుచుకుంది. మిగతా స్థానాలు ప్రతి పక్షాలన్నీ పంచుకున్నాయి.

తీవ్రముగా పోటీపడిన రెండు పార్టీలకు ఈ ప్రాంతాలలో పోలైన ఓట్లశాతం రాయలసీమలో తెలుగు దేశానికి 53.15% ఉండగా కాంగ్రెసు 'ఐ'కి 41.81% లభించాయి. ఆంధ్ర ప్రాంతములో తెలుగు దేశానికి 55.99% ఓట్లు రాగా ఇందిరా కాంగ్రెసుకు 30.72% ఓట్లు వచ్చాయి. తెలంగాణా ప్రాంతములో తెలుగు దేశానికి 31.85% ఓట్లు రాగా కాంగ్రెసు 'ఐ' కి 35.85% ఓట్లు వచ్చాయి.

ఈ వివరాలను బట్టి 'తెలుగు దేశం' పార్టీని కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రజలు ఎక్కువగా ఆదరించి ఎక్కువ సీట్లు ఇచ్చినట్లు, తెలంగాణా ప్రజలు మాత్రం కాంగ్రెసు 'ఐ' నే ఆదరించి ఎక్కువ సీట్లు దానికే ఇచ్చినట్లు అర్థమవుతుంది. రాయలసీమలో ఒక స్థానం, ఆంధ్రలో ఒక స్థానం మినహా ప్రతిపక్షాలకు స్థానాలన్నీ తెలంగాణా నుండే లభించాయి. ప్రతి పక్షాలను తెలంగాణా వారే ఆదరించినట్లు తెలుస్తుంది. ఇందిరా కాంగ్రెసుకు తెలంగాణా నుండి ఎక్కువ స్థానాలు లభించినా తెలుగు దేశానికన్నా 4 శాతం ఎక్కువ ఓట్లతో మాత్రమే ఈ స్థానాలు పొందడం ఇందులో గమనించదగిన విషయం.

పట్టిక - 6 ద్వారా జిల్లాల వారీగా ఆయా పార్టీలు పొందిన స్థానాల వివరాలను పరిశీలిస్తే మొత్తం 6 జిల్లాలలో కాంగ్రెస్ (ఐ) ఒక్కస్థానం కూడా గెలుచుకోలేదు. దీని ద్వారా కోస్తా జిల్లాలైన తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, నెల్లూరు, రాయలసీమలోని చిత్తూరు, తెలంగాణాలోని హైదరాబాదు సిటీ ప్రజలు కాంగ్రెస్ 'ఐ'ని ఆదరించలేదని తెలుస్తుంది. బద్వేల్‌లో కాంగ్రెస్ 'జె', ఉదయగిరిలో బి. జె పి. మినహా ప్రతిపక్షాలన్నింటికి తెలంగాణా జిల్లాల నుండి స్థానాలు లభించాయి. తెలంగాణాలోని రంగారెడ్డి జిల్లా ప్రజలు 'తెలుగు దేశాన్ని' ఆదరించకపోవడం ఇందులో గమనించదగిన అంశము.

ఏయే పార్టీకి ఎన్ని స్థానాలొచ్చాయో జిల్లాలవారీగా తెలుసుకోవడమే కాకుండా ఆయా పార్టీలకు ఎన్ని శాతం ఓట్లు వచ్చాయో కూడా పరిశీలించవలసిన అవసరం ఎంతైనా కలదు. ఈ వివరాలను 1962 ఎన్నికల నుండి పరిశీలిస్తే ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఈ వివరాలను పట్టిక-7 ద్వారా తెలుసుకోవచ్చు.

ఆ పట్టిక పరిశీలిస్తే ఒక 1972 ఎన్నికలలో మినహా 1983 వరకు జరిగిన ఏ ఎన్నికలలో కూడా అధికారాన్ని చేపట్టిన ఏ పార్టీకి 50 శాతానికి పైగా ఓట్లు రాలేదు. ప్రతిపక్షాలకు విడిగా తక్కువ స్థానాలు వచ్చినప్పటికినీ ఎక్కువ శాతం ఓట్లు వాటికే పడినాయి. 1978 ఎన్నికల్లో జాతీయ కాంగ్రెసు నుండి చీలి ఇందిరా కాంగ్రెసుగా ఆవిర్భవించిన వెంటనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీకి 1983 ఎన్నికలో అప్పుడే ఆవిర్భవించి కాంగ్రెసేతర పక్షంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశానికి ఓట్ల విషయంలో పోలిస్తే 'తెలుగుదేశమే' మెరుగనిపిస్తుంది.

1983లో జరిగిన సాధారణ ఎన్నికల్లో మొత్తం ౨౯౪ స్థానాలకు ఎన్నికలు జరిపింపబడినాయి.* మొత్తంలో 39 స్థానాలు షెడ్యూల్డు కులముల వారికి, 15 షెడ్యూల్డు తెగలవారికి రిజర్వు చేయబడినాయి. రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓటర్ల సంఖ్య 3, 12, 61, 879 ఉండగా ఇందులో స్త్రీలు 1, 57, 97, 767- పురుషులు 1, 54, 63, 912మంది కలరు. ఈ ఎన్నికల్లో 70 మంది స్త్రీలు పోటీచేయగా 10 మంది గెలుపొందారు. ఉపఎన్నికలలో ఒకరు గెలుపొంది మొత్తం 11 కు ఈ సంఖ్య పెరిగింది. స్త్రీలలో 9 మంది తెలుగుదేశానికి, 1 సి. పి.'యం. నుండి, 1 కాంగ్రెస్ ఐ. నుండి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో 9మంది ముస్లిం మతస్థులు ఎన్నికయ్యారు.వీరిలో 2 తెలుగుదేశానికి, 1సి.పి.ఐ.కి, 5 మజ్లిస్ కు చెందినవారు. ఈ ఎన్నికల్లో 240 మంది విధాన సభకు కొత్తగా ఎన్నిక కావడం ఇందులో చెప్పుకోదగిన విషయం. విధాన సభకు నామినేట్ చేయబడే ఆంగ్లో ఇండియన్ అభ్యర్థిగా శ్రీమతి మార్జరీ గాడ్స్‌పెను గవర్నర్ ఇటీవల నియామకం చేశారు.

మొత్తంమీద 'తెలుగు దేశం' పార్టీ 1983 సాధారణ ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించింది. గత కొద్ది మాసాల క్రితం ఆవిర్భవించి

* మదనపల్లి నియోజకవర్గం ఎన్నిక అభ్యర్థి మృతి కారణంగా వాయిదా పడింది. ఉపఎన్నికలతో నిర్వహించబడింది.

పట్టిక - 6 (జిల్లా వారీ వివరాలు)

క్రమసంఖ్య	జిల్లా పేరు	కాంగ్రెసు (ఐ)	తెలుగు దేశము	బి. జె. పి	జనతా	సి. పి. ఐ	సి. పి. యం	కాంగ్రెసు జె	సంజయ్ విచార్ మంచ్	మజ్లీస్	ఇతరులు	ఇండిపెండెంట్లు	మొత్తం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	శ్రీకాకుళం	1	11	—	—	—	—	—	—	—	—	—	12
2	విజయనగరము	2	10	—	—	—	—	—	—	—	—	—	12
3	విశాఖపట్టణము	1	12	—	—	—	—	—	—	—	—	—	13
4	తూర్పుగోదావరి	—	21	—	—	—	—	—	—	—	—	—	21
5	పశ్చిమగోదావరి	—	15	—	—	—	—	—	—	—	—	1	16
6	కృష్ణా	4	12	—	—	—	—	—	—	—	—	1	17
7	గుంటూరు	—	18	—	—	—	—	—	—	—	—	1	19
8	ప్రకాశం	1	11	—	—	—	—	—	—	—	—	1	13
9	నెల్లూరు	—	10	1	—	—	—	—	—	—	—	—	11
10	చిత్తూరు	—	14	—	—	—	—	—	—	—	—	1	15
11	కడప	3	6	—	—	—	—	1	—	—	—	1	11
12	అనంతపురం	1	12	—	—	—	—	—	—	—	—	1	14
13	కర్నూలు	3	9	—	—	—	—	—	—	—	—	1	13
14	మహబూబ్‌నగర్	6	6	—	1	—	—	—	—	—	—	—	13
15	రంగారెడ్డి	6	—	—	—	—	—	—	—	—	—	—	6
16	హైదరాబాద్	—	6	2	—	—	—	—	—	5	—	—	13
17	మెదక్	6	3	—	—	—	—	—	—	—	—	1	10
18	నిజామాబాద్	3	6	—	—	—	—	—	1	—	—	—	10
19	ఆదిలాబాద్	2	3	—	—	1	—	—	1	—	—	1	8
20	కరీంనగర్	6	5	—	—	—	—	—	2	—	—	—	13
21	వరంగల్	7	4	1	—	—	1	—	—	—	—	—	13
22	ఖమ్మం	2	1	—	—	3	2	—	—	—	1	—	9
23	నల్గొండ	5	4	—	—	—	2	—	—	—	—	1	12
	మొత్తం	59	199	4	1	4	5	1	4	5	1	11	294

ఆంధ్రప్రదేశ్‌లో విధానసభకు జరిగిన 1983 సాధారణ ఎన్నికలు

పట్టిక - 7

పోలైన ఓట్ల శాతం

క్రమ సంఖ్య	పార్టీ పేరు	1962	1967	1972	1978	1983
1.	కాంగ్రెస్	47.25	44.67	52.00	17.23	
2.	కాంగ్రెస్ (ఓ)	—	—	0.20	—	—
3.	కాంగ్రెసు (ఐ)	—	—	—	39.34	33.49
4.	జనతా	—	—	—	28.72	0.94
5.	సి. పి. ఐ.	19 53	7.73	6.10	2.32	2.79
6.	సి. పి. యం.	—	7.91	3.10	2.74	2.01
7.	స్వతంత్ర	10.40	10.79	2.10	—	—
8.	జనసంఘ్	1.04	2.26	2.40	—	—
9.	పి. ఎస్. పి.	0.30	0.20	—	—	—
10.	సోషలిస్టులు	0.61	0.36	1.70	—	—
11.	ఎస్. టి. పి. ఎస్.	—	—	1.80	—	—
12.	ఇండిపెండెంట్లు & ఇతరులు	20.47	25.73	36.60	9.65	10.04
13.	బి. జె. పి.	—	—	—	—	2.79
14.	లోక్‌దళ్	—	—	—	—	0.91
15.	సంజయ్ విచార్ మంచ్	—	—	—	—	0.74
16.	మజ్లీస్	—	—	—	—	0.96
17.	తెలుగు దేశం	—	—	—	—	45.33

అధికారాన్ని కైవసం చేసుకున్న 'తెలుగు దేశం' ప్రాంతీయ పార్టీ విజయాలను పరిశీలించాల్సిన విషయం. కారణాలను ఈ క్రిందివిధంగా వర్గీకరించ వచ్చును.

1. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు 'ఐ' ప్రభుత్వం తీవ్రమైన అవినీతి ఆరోపణలతో అపఖ్యాతిపాలైంది. మంత్రుల కుంభకోణాలు రచ్చకెక్కి ప్రజల దృష్టికి వచ్చాయి. దీనితో విసుగెత్తిన ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూసారు. ఇది తెలుగుదేశ విజయానికి కారణమైంది.

2. చిన్ననాయకుడు మొదలు పెద్దనాయకుని వరకు ప్రతి చిన్న విషయానికి ఢిల్లీకి పరుగులుతీయడం 'నిర్ణయకరణ' మొత్తం ఢిల్లీలో కేంద్రీకృతం కావడం రాష్ట్రనాయకుల నిర్వీర్య పరచింది. రాష్ట్ర ప్రజల నిరుత్సాహ పరచింది. దీన్ని 'తెలుగు దేశం' నేతలు ఆసరాగా తీసుకొని 'ఆత్మగౌరవం' అన్న నినాదంతో ఎన్నికల రంగంలోకి దిగి విజయం సాధించారు.

3. మేనకాగాంధి రాజకీయరంగ ప్రవేశం ఆంధ్రప్రదేశ్‌పై పెద్దగా ప్రచారం లేకపోయినప్పటికి, ఇది ఇందిరాగాంధికిగల సమ్మోహన శక్తిని, వ్యక్తిగతాభిమానాన్ని స్త్రీలలో కొంతదెబ్బతీసి, తెలుగుదేశ విజయానికి సహకరించింది.

4. ప్రతిపక్షపార్టీలు వ్యక్తిగత, సిద్ధాంతపర విభేదాలతో ప్రభుత్వ స్థాపనకు అవసరమైన సీట్లకోసం ఏపార్టీ అవసరమైన అభ్యర్థుల నిలబెట్టక పోవడం "తెలుగు దేశం" నిలబెట్టడం తెలుగుదేశ విజయానికి కారణం అయ్యింది.

5. రాష్ట్రంలో 'రెడ్డి' వారి పాలన దీర్ఘకాలం నుండి కొనసాగడం కొద్దికాలం హరిజన, వెలమ, బ్రాహ్మణ ముఖ్యమంత్రులు ముగ్గురు పదవులలో కొనసాగినా రెడ్డివారే ప్రాధాన్యత వహించడం ఇతర కులాలలో అసంతృప్తికి దారితీసింది. రాష్ట్రంలో ఆర్థిక ప్రాముఖ్యం వహించిన రెండవ కులంగా వున్న 'కమ్మ' వారిలో తీవ్ర అసంతృప్తి కలిగి గత ఎన్నికలలో బాగా పనిచేసింది.

6. కాంగ్రెసు(ఐ) నాయకులలో అధికార వ్యామోహం పెచ్చుపెరిగి పోయింది. ప్రజల్లో పలుకుబడి లేనివారికి, అవినీతికి అలవడిన వారికి, అధికార వ్యామోహపరులకే శ్రీమతి ఇందిరాగాంధి అధికారం కట్టపెట్టటం ప్రజలకు నచ్చలేదు. దానితోఆమెపట్ల అభిమానం సడలింది. మధ్యవర్గం వారు, ఉద్యోగులు, మేధావులు, కాంగ్రెసు 'ఐ'ని దెబ్బతీయాలనుకున్న ఫలితమే తెలుగుదేశ విజయం.

7. కాంగ్రెసు 'ఐ' లో ముఠా తగాదాలు చిలికి చిలికి గాలివానగా మారాయి. ఒకరిని మరొకరు వెన్నుపోటుపొడవాలని ప్రయత్నించారు. టిక్కెట్టు దొరకనివారు తిరుగుబాటుజెండా లేపారు. ఈ ముఠా తగాదాలే ప్రత్యామ్నాయానికి విజయం చేకూర్చింది.

8. వృద్ధనాయకులే కలకాలం అధికారభోగాన్ని అనుభవించడాన్ని యువతరం నిరసించింది. వృద్ధ తరాన్ని గద్దె దించాలన్న యువతర తీవ్రప్రయత్నమే తెలుగుదేశానికి విజయం చేకూర్చింది.

9. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. ఇది వారిలో నిరసనకు దారి తీసింది. దీనికితోడు తెలుగు దేశనాయకులు మహిళలకు అనేక వాగ్దానాలు చేయడం, మహిళల సహకారం వారికి లభించింది.

10. ఈ కారణాలతో పాటు వ్యక్తిగతంగా యన్. టి. ఆర్.కు ఉన్న సినీ గ్లామర్, అతని ఆదర్శవాదము, అకుంఠిత దీక్ష ఆయన విజయానికి కారణాలయ్యాయి. వీటికి తోడు అత్యధికంగా అమ్ముడయ్యే, దినపత్రిక ప్రత్యక్షంగా తెలుగు దేశాన్ని సమర్థించి విజయానికి కారణమైందనుటలో అతిశయోక్తి లేదు.

ముగింపు

1983 జనవరిలో జరిగిన ఎన్నికలకు, గతంలో జరిగిన ఎన్నికలకు చాలా తేడాలు కన్పించాయి. గతంలో ఎప్పుడూ ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాన్ని పరిపాలించలేదు. 1983 ఎన్నికల్లో మాత్రం ఎన్నికల ముందు 9 మాసాల క్రితం నందమూరి తారక రామారావు నేతృత్వంలో ఆవిర్భవించిన ప్రాంతీయ పార్టీ 'తెలుగు దేశం' మొదటి సారిగా పోటీ చేసి అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చింది.

అనగా రాష్ట్రంలో తొలిసారిగా కాంగ్రెసేతర పక్షం అధికారాన్ని కైవసం చేసుకుంది. దీర్ఘకాలంగా రాష్ట్రంలో పాలన చేస్తున్న కాంగ్రెసు, దీని నుండే చీలిన ఇందిరా కాంగ్రెసు వారి పాలన రాష్ట్రంలో అంతమైపోయింది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో నున్న ఇందిరా కాంగ్రెసు రాష్ట్రంలో ప్రప్రథమంగా ప్రతిపక్ష స్థానములోకి వచ్చింది. శ్రీమతి ఇందిరా గాంధికి అండగా నిలిచిన, కంచుకోటగా భావించిన ఆంధ్రప్రదేశ్‌లో ఆమె 'సమ్మోహన' శక్తి బీటలువారిపోయింది. మొత్తానికి ఇందిరా కాంగ్రెసు ఉనికి మాత్రం 59 స్థానాలతో కొనసాగుతుంది.

1964 లో చీలిపోయి తిరిగి 1983 ఎన్నికలలో ఉమ్మడిగా పోటీ చేసిన ఉభయ కమ్యూనిస్టులు మరింత దిగజారిపోయి కేవలం 9 స్థానాలతోనే కొనసాగుతున్నాయి. ఇవైనా తెలంగాణా ప్రాంతం నుండి రావడం గమనించదగిన విషయం. మిగిలిన పక్షాలు వ్యక్తిగత, సిద్ధాంత పర విభేదాలతో తమలో తాము పోటీ పడుతూ తమ గోయిని తామే త్రవ్వుకుంటున్నట్లు గతంలో జరిగిన ఎన్నికలు ఈ సారి జరిగిన ఎన్నికలు రుజువు చేస్తున్నాయి.

ఏది ఏమైనప్పటికి రాష్ట్రములో కాంగ్రెసు వారిపాలన స్థానంలో కాంగ్రెసేతర పార్టీ పాలన, జాతీయ పార్టీ పాలన స్థానములో ప్రాంతీయ పార్టీ పాలన, 'అమ్మ' పాలన స్థానములో 'అన్న' పాలన ప్రారంభమైంది. ఈ అన్న పాలన ఏ విధంగా ఉంటుందో ఎదురుచూద్దాం.

[శ్రీ విజయ్‌కుమార్ వరంగల్‌లో కాకతీయ విశ్వ విద్యాలయంలో ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి; శ్రీ ప్రభుదాసు ఆ నగరంలోని లా కాలేజిలో విద్యార్థి.]

కలగూరగంప

'అసనపురం' రాజమహేంద్రవరం కాదా ?

శ్రీ కొల్లూరు సూర్యనారాయణగారు ప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు. వారి సునిశిత మేధాసంపత్తి, పరిశోధనాపటిమ అనన్యసామాన్యమైనది. ఈ విషయము వారు ప్రచురించుచున్న పరిశోధన వ్యాసముల పరిశీలించినచో స్పష్టమగును. ఆంధ్రప్రదేశ్ హిస్టరీకాంగ్రెసు సమావేశములలో వారు "అసనపురం" ఉనికినిగురించి వ్రాసిచదివిన వ్యాసమును నేను విమర్శింపుచు 1982 వ సంవత్సరం మే నెల "భారతి" లో ప్రచురించిన వ్యాసమును సమీక్షింపుచు, వారికివారే తమ తొలి వ్యాసములోని సంగతులను పూర్వపక్ష మొనర్చుకొని 1979 జూలై నెల "నవభారతి"లో సవరణ వ్యాసమును ప్రచురించితిమని, ఆవిషయమును నేను గమనింపలేదని ఉట్టంకించినారు. నిజమే! నేనావ్యాసమును చూచియుండలేదు! నా వ్యాసమునుగూర్చి వారికి గల సందేహముల వెలుపరింపుచు, ఇప్పటికిగూడ "అసనపురం" ఉనికిని స్పష్టముగా నిర్వచించు సాక్ష్యాధారములులేవని, ఇప్పటివరకు చారిత్రక పరిశోధకులు వెలువరించిన అభిప్రాయములన్నియు అధార రహితములని హేలగ కొట్టివేయుచు, క్రొత్తసాక్ష్యాధారములు బయల్వడిననే గాని ప్రస్తుతాధారములతో అసనపురాన్ని గుర్తించుట అసాధ్యమని తీర్పు యిచ్చినారు.

ఆ తీర్పులో నేను వ్రాసినవ్యాసములోని విషయము లన్నియు ఆధారరహితములను భావన గర్భీకృతమైయున్నది. ఉండుటయేగాదు! వారానిర్ణయమునకు వచ్చుటకుగల కారణములనుగూడ వివరించిరి. ఆ వివరణలలో వారువెలిబుచ్చిన సందేహములనుదీర్ప యత్నింతును.

" రాజమహేంద్రవరనగర " నిర్మాత " రాజమహేంద్ర " బిరుదాంకితుడగు మొదటి అమ్మరాజని యొకవాదము, కాదు! రాజరాజ నరేంద్రుడే అని మరియొక వాదము యున్నదని, కాని-నేను దానికి మరింత ప్రాచీనతకల్పించి, ఒక్కసారిగా "అసనపురం" అనేపేరు "రాజమహేంద్రవరం"గా మార్చివేసితినని, అట్లు మారిపోవుట సాధ్యమా? అని, ఆమార్పును తెలియజేసే ఆధారం లభ్యంగానిదే, అసలు నిజానికి మారినా, మనం నమ్మవలసిన హేతువుగలదా? అని ప్రశ్నించినారు.

ఈ ప్రశ్నలో వారికి " అసనపురం " ఒక్కసారిగా "రాజమహేంద్రవరం"గా నామ పరివర్తనం చెందుట అసంభవమనే నమ్మకం తొంగిచూస్తున్నది!

సాధారణంగా ఒకగ్రామంకానీ, పట్టణంకానీ, పల్లెగాని నిర్మాణం అయిన తర్వాత దానికి పేరుపెట్టే సందర్భాలలో అనేక సమస్యలు వుత్పన్నమై తుదకు ప్రజాభీష్టముమేరకు నామకరణం స్థిరమవుతుంది. ఆ గ్రామనిర్మాణానికి మూలకారకుడైన యేపెద్దపేరునో, లేకగ్రామము నొసంగిన దాతపేరునో లేక ప్రతిష్ఠింపబడిన యేదేవునిపేరునో ఉంచుట సాంప్రదాయమై నెగడినది. అట్లువెలసిన గ్రామములు కారణాంతరముల వలన రూపఱిపోయి మరల క్రొత్త గ్రామముగ వెలసిన, దాని పూర్వ నామముపోయి, క్రొత్తపేరున నిల్చుట ఆచారముగా వచ్చుచున్నది. అట్లుగాక మొదట నొకపేరుతో పిలువబడుచున్న గ్రామమును ఆ సీమ నేలు ప్రభువు అగ్రహారముగనో. దానగ్రామముగనో చేసినపుడు ఆ గ్రామ తొలినామముమారి క్రొత్తపేరు సంతరించుకొనుట అనూచానముగ జరుగుచున్నదే! అట్టివాటికి కొన్ని ఉదాహరణలుగా నీక్రింది వానిని చెప్పవచ్చు.

(i) తొలుత "పులుపర్తి" నామమున బరగుచున్న గ్రామమును కాటయవేముని ధర్మపత్ని అన్యమాంబ బ్రాహ్మణ పండితులకు దానమిచ్చి దాని పూర్వనామమునుమార్చి " అన్యమాపరము " అను పేరున నిలుపుట.

(ii) కాకతీయ ప్రతాపరుద్రుని కాలము వరకు "ఉత్తరేశ్వరపుర" మను పేరుననిల్చిన గ్రామము, పిదపకాలాన "ఖండవల్లి" గ్రామ నామమున ప్రసిద్ధికెక్కుట.

(iii) కొండవీటి అనవేమారెడ్డిచే అగ్రహారముగా నొసంగబడి "అనవేముపరం" అనుపేరును సంతరించుకొన్న గ్రామము అనంతరకాలాన "పిట్టలవేమవర" గ్రామనామమును ధరించి, వ్యవహరింప బడుట.

మొదటి అమ్మరాజు కాలముననగాని, రాజరాజనరేంద్రునికాలమున గాని "రాజమహేంద్రవరనగరము"నిర్మాణము గావింపబడి యుండలేదు! రాజరాజుపాలనాతుది దినములలోనా నగరనిర్మాణయత్నము గావింపబడి ఆతర్వాతికాలమున పూర్తిగావింప బడినదను విషయము నిరూపించుచు,

శ్రీ సారంగు లక్ష్మీనరసింహారావుగారు తమ "నన్నయ" గ్రంథములో సోపపత్తికముగ నిరూపించియున్నారు. వారి వాదనాసరళి ఈ క్రింది విధముగ నున్నది.

"రాజమహేంద్రవరమును నిర్మించినదెవరు ? ఆంధ్ర భారత రచనాకాలమునాటి రాజమహేంద్రవరము వేంగీ మండలమునకు రాజధానియై విలసిల్లెనా?" అను ప్రశ్నలకు వారు సమాధానముగ "ఆంధ్రమహాభారతావతారికయందు రాజరాజు, రాజమహేంద్రపురమందు, సకలభువన లక్ష్మీవిలాస నివాసంబైన రమ్యహర్మ్యతలంబున పేరోలగముండి, ఆ విద్వత్సభయందేయున్న నన్నపార్యుని జూచి, వ్యాసప్రోక్తమైన మహాభారతమును తెనుగున రచింపుమని కోరినట్లు స్పష్టముగనున్నది. కాని- ఈ అవతారికాభాగము నన్నయకృతమన్నది సందేహమే ! ఈ అవతారిక ప్రక్షిప్తమనువాదమును మొట్టమొదట లేవదీసినది స్వర్గీయ డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు. వారు రాజే ఆంధ్రభారత కర్తయని గూడ వాదించుటచే నీరెండు వ్రాతలును వితండ వాదములని విమర్శకులంతగా పట్టించుకొనలేదు. కాని పరిశీలనాయుత దృష్టితోజూచినప్పుడు భారతకర్తృత్వ మెట్లున్నను అవతారికలో చాలా భాగము నన్నయరచన కాదేమో! ననితోచును.

ముఖ్యముగ గ్రంథప్రారంభమున "సకల భువన రక్షణ ప్రభువులైన హరిహరహిరణ్యగర్భ పద్మోమావాణీసతులను నుతియించి" అని వ్రాసి, ముఖ్యగ్రంథము మొదలిడుటకు పూర్వము ఉపోద్ఘాతరూపమున నున్న "పాయకపాకశాసను"న కన్న పద్యములకు ముందు మరల "హరిహరాజ గజాననార్క షడాస్యమాతృ సరస్వతి గిరిసుతాదికదేవతా తతికిన్నమస్కృతులు"అని ప్రార్థన పద్యముండుటను జూడగ, ఈరెండు ప్రార్థనా వాక్యములమధ్యనున్న గ్రంథము అన్ని పద్యములు గాకున్న కొన్నియయిన ప్రక్షిప్తములుగ కన్పట్టును. అవతారికయందు రవి తనను గురించి అన్నివిషయములు చెప్పుకొను సాంప్రదాయమును నన్నయ పాటించినట్లున్నను, వారి తల్లిదండ్రుల మాటగాని, వారి గురువులను గురించిగాని యిందేమియులేదు. "తనకుల బ్రాహ్మణు"అను సీసపద్యము వారి వినయ గాంభీర్యములను ప్రకటించుచున్నను, చివరను "కవివరుడు"అని చెప్పికొనుటగూడ సందేహమునకు తావిచ్చుచున్నది.

ఈ సందర్భములలో "అఖిలజలధి వేలావలయితే" త్యాదివచనము నన్నయ రచనకాదని కన్పట్టును. నన్నయ, రాజరాజుల తర్వాతి వారెవ్వరో అప్పటి భారతప్రతి "హరిహరాజ" అను ప్రార్థనా పద్యములతో ప్రారంభమై యుండుటజూచి, నన్నయగారు రాజరాజును గురించి చెప్పిన పద్యములను ఏర్చి, అవతారికకూర్చి యుందురా ? అన్న సందేహము కల్గుచున్నది. కల్గుటయేగాదు "కావచ్చు" ననిగూడ అనిపించుచున్నది. ఏలనన- రాజమహేంద్రవరము, రాజరాజుకాలమునకు గాని రాజధానిగా వెలసియున్నట్లు గాన్పించదు !

రాజమహేంద్రవరమును నిర్మించి, రాజధానిగ చేసికొన్నది "రాజమహేంద్ర" యను బిరుదనామముగల మొదటి అమ్మ రాజు విష్ణువర్ధనుడని రాజమహేంద్రవర పట్టణ చరిత్రవ్రాసినవారినిర్ణయము. వారు పేరెన్నికగన్న చారిత్రక పరిశోధకులు. కాని- ఇది కేవలము ఊహామాత్రమే! అంతవరకు కృష్ణానదికుత్తర తటిమున స్వరాజధానియై యున్న "బెజవాడ" రాష్ట్రకూటుల దాడులకు తిరిగి తిరిగి గురియగుచుండుటవలన, సురక్షితమగుప్రదేశమైన గోదావరి కుత్తరతటమున క్రొత్తగ తనపేర "రాజమహేంద్రమ"ను పట్టణమును గట్టుకొని, మొదటి అమ్మరాజు అక్కడకు తన రాజధానిని మార్చెనని వారనుచున్నారు. ఇట్టి దాడులనుండి తప్పించుకొనుటకే రెండవ అమ్మరాజ విష్ణువర్ధన రాజమహేంద్రుడు ఈ పట్టణమునుకట్టి, వేంగినుండి తన రాజధానిని ఇక్కడకు మార్చెనని కొందరు చారిత్రకులు అభిప్రాయపడుచున్నారు. కాని- ఈ రెండును నిరాధారములే! రాజరాజు ప్రకటించిన శాసనములలో నాతడెక్కడ పట్టాభిషిక్తుడైనది చెప్పకపోయినను, భారతావతారిక యందు "అఖిలజలధి వేలావలయిత వసుమతీ వనితాభూషణంబైనవేంగీ దేశమునకు నాయకరత్నంబునుబోలు రాజమహేంద్రపురమునందు రాజరాజు మహేంద్ర విభవమున పేరోలగంబున్నట్లు వ్రాయబడి" యుండుట చేతను, రాజరాజనరేంద్రుడే పట్టణమును నిర్మించి, యందు పట్టాభిషిక్తుడై, తన ఇద్దరి రాణులతోను ఇక్కడ నివసించియున్నాడను జనవాక్యము ననుసరించియు, రాజరాజిక్కడనే పట్టాభిషిక్తుడయ్యెనని భావించి, అప్పటికది పెద్దనగరమై యుండవలెనను యూహతో, పట్టణ నిర్మాణమునకును, వికాసమునకును తగినంత వ్యవధి యుండవలెనను భావమే మొదటి అమ్మరాజుగాని, రెండవ అమ్మరాజుగాని, ఈ పట్టణ నిర్మాతలై యుందురను సిద్ధాంతమునకు మూలమైనది. దీనికాధార మా ఇద్దరు రాజులకును "రాజమహేంద్ర" యను బిరుదుండుటయే!

రాజమహేంద్రవరమునకు రాజధానిని మార్చుట అది సురక్షితమగు ప్రదేశమనియు, శత్రువులకు దుష్ప్రాప్యమనియుగదా ! కాని- అక్కడ రాజరాజు అనంతరము ఒకటి, రెండు వందలేండ్ల వరకును రాజమహేంద్ర దుర్గము నిర్మింప బడినట్లే గన్పింపదు. రెడ్డిరాజుల కాలమువరకు ఇదియొక సామాన్యనగరముగనే యున్నట్లు గన్పడును. తూర్పుచాళుక్యుల పాలనలో, విశేషించి రాజరాజునకు పూర్వమునను, తర్వాతనుగూడ వేంగీ మండలమును, ఆ రాజ్యమున కంతర్భాగమైన కళింగదేశమును అనగా గోదావరి కుత్తరమునన్న దేశము అనేక దండయాత్రలకులోనై, చేతులుమారినవి. ఈయుద్ధములలో నెప్పుడును రాజమహేంద్రదుర్గమువద్ద యెట్టిపోరాటమును జరిగినట్లు చెప్పబడలేదు.

అనగా- శత్రువుల నడ్డగించుట కక్కడ దుర్గమేదియు లేదనియేగదా! ఏ యుద్దేశముతో రాజధాని మొదటిఅమ్మరాజు రాజమహేంద్ర వరమునకు మార్చినాడనిచెప్పిరో అదినెరవేరనేలేదని స్పష్టమగుచున్నది గదా! కారణము- బలమైన కోటకట్టుటకు అన్ని వనరులుండియు, నిర్మాణము పూర్తియగుట కవకాశము లేకపోవుటయే! రాజరాజుచివరి రోజులలోనే ఈ పట్టణము కొంతవరకైన పూర్తియగుట సంభవించి తదుపరికాలమున సమగ్రస్వరూపమును సంతరించుకొన్నదని ఊహించు కొనవలసి వచ్చుచున్నది. అట్టియెడ నీనూతననగర ప్రాదుర్భావము నకు ముందాచోట నున్న పట్టణమేదియో యొకటుండవలెనుగదా! అదియేది ?

పూర్వచాళుక్యుల వేంగిరాజ్య పాలనలో సంభవించిన యుద్ధములలో నెందునుగూడ నీరాజమహేంద్రవరదుర్గ ప్రసక్తి గాన రాదు! పశ్చిమచాళుక్యులు, రాష్ట్రకూటులు వేంగీరాజ్యముపై నెత్తివచ్చి, విజయపరంపరలు గొన్నప్పుడుగూడ తమతమ శాసనములలో నీ పట్టణ ప్రసక్తిని దెచ్చియుండలేదు! బెజవాడ, వేంగీనగరము, నిరవద్యపురము, జననాథపురము మొదలగువాని ప్రసక్తులే గానుపించుచునుగాని రాజమహేంద్రవర ప్రశంసలు గానరావు! కాబట్టి మొదటి అమ్మరాజ విష్ణువర్థనుని కాలమున అనగా క్రీ॥ శ॥ 922-29 లోగాని, రెండవ అమ్మరాజ విష్ణువర్థనుని కాలమున అనగా క్రీ॥ శ॥ 945-70లో గాని రాజమహేంద్రవరము పట్టణముగ రూపొందింపబడి యుండలేదన్నది స్పష్టము. అయితే దానిపూర్వనామ మేదై యుండును ?

ప్రభుత్వమువారు ప్రకటించిన దక్షిణదేశపు శాసనములు 6 వ వాల్యూం నెం. 669 శాసనములో

సోమాన్వయే రాజనరేంద్రః భూపో
భూత్వా మహేంద్రసమో బభూవః
తస్మాదభూత్ రాజమహేంద్రనామా
గోదాతటే అకారిపురం స్వనామ్నా॥

అను 14 వ శతాబ్దమునాటి శాసన మొకటి రాజరాజే ఈ పట్టణనిర్మాత యని చెప్పుచున్నది. దీనిననుసరించి యేమైయుండును విన్నకోట పెద్దన తన "కావ్యాలంకార చూడామణి"లో రాజమహేంద్రవర పట్టణ శోభను వర్ణించుచు, సీసపద్యము వ్రాసి, చివరియెత్తుగీతలో "ఎప్పుడును నొప్పు రాజమహేంద్రవరము, ధరణిగల్పించె నేరాజు తనదుపేర, నట్టి రాజమహేంద్రుని యనుగుమనుమడెసగు, జాళుక్యవిశ్వనరేశ్వరుండ"ని తన ప్రభువు నగ్గించినాడు.

ఈ రెండు వ్రాతలును పూర్వ చాళుక్యరాజ్యమంతరించిన రెండు, మూడు వందల సంవత్సరముల పిదప నుద్భవించినవి. ఈ మధ్యకాలమున రాజమహేంద్రవరము దుర్గమై, యనేక రాజుల దాడులకగ్గమై, చివరకు మహమ్మదీయుల దురాగతములకు రూపుచెడి పూర్వ శోభను గోల్పోయినది. ఏదియేమైనను రాజమహేంద్రవర పట్టణప్రశంస రాజరాజ నరేంద్రుని రాజ్యకాలచివరిదశలో వినిపించినదగాని అంతకు ముందెన్నడునుగాదని నిస్సందేహముగా చెప్పనగుచున్నది. అట్లయిన-రాజరాజునకు పూర్వమాపట్టణ మేనామమున బరగుచుండెనో ? రాజరాజుకాలము నాటికిగాని రూపుగొనని ఆగ్రామమో, నగరమో అంతకుముందేదియో ఒక పేరున వెలసియుండవలెనుగదా! నామనిర్దేశము లేకుండ గ్రామావతరణ మూహింపనైన నూహింపని విషయము గద! కావున రాజమహేంద్రవర నామమును సంతరించుకొనుటకు ముందు ఆ నగరమునకో, గ్రామమునకో యేదియో యొకపేరుండవలెనుగదా? అది యేదనియే ప్రస్తుతసమస్య. ఆ సమస్యకు తగు సమాధానము ను శ్రీ కొల్లూరు వారిచ్చినచో, ఆ గ్రామనామము యెన్ని పరివర్తనములు బొంది తుదకు రాజమహేంద్రవరనామము ధరించెనో చెప్ప యత్నింప వచ్చును. "ఆసనపుర" నామమెక్కసారిగ "రాజమహేంద్రవరము" క్రింద యెట్లుమారెనో వివరింప వచ్చును. రాజమహేంద్రవరమను పేరా పట్టణమున కనాదిగా యుండియున్నదో లేక తొలుతనొక పేరున వెలిసి, పిదప నామ పరివర్తన మందినదో తెలుప వచ్చును అనాది నుండి రాజమహేంద్రవరమను పేరాపట్టణమునకున్నదని శ్రీ సూర్యనారాయణ గారు నిరూపింపగలరా ?

రాజధానిని క్రొత్తగ నిర్మించుటయన్న ఈ వరకు జనావాసము లేని ప్రదేశమున, పరిపాలనా కేంద్రమున కనువైనచోట నొక నిర్ణీత విధానమున, రాజప్రాసాదములు, వివిధ గృహశ్రేణులుగట్టించి నగర మేర్పరచుట కావచ్చును. రాయల విజయనగరమిట్లే రూపొందింప బడినది. లేక ఈ వరలోనున్న యొకపట్టణమును దానిస్థితి ప్రాధాన్యతనుబట్టి రాజధానిగ జేసికొనుట గావచ్చును. ఇట్టిది సంభవించినపుడు సాధారణముగ నాపట్టణమున కదివరలో నున్న పేరుమార్చి క్రొత్త పాలకులు వేరుపేరుతోపిల్చుట సాగవచ్చును. లేక ఒక రాజ్యముపై నింకొకరాజ్యము దండెత్తివచ్చి దేశమును బలవంతముగ నాక్రమించు కొన్నప్పుడు ఆ సైన్యము విడిసియున్న స్కంధావారమే స్థిరమైననగర ముగనేర్పడి, నామనిర్దేశ మందవచ్చును. కాని-ఇట్టి పరిస్థితులలోనే యొక్కకారణమును పురస్కరించుకొని రాజమహేంద్రవర మేర్పడి యుండలేదని తెల్లమగుచున్నది.

ఈ మూడుపద్ధతులలోనే గాకుండ నింకొకపద్ధతినిగూడ నొక గ్రామము తన పూర్వనామమును విడచి నూత్ననామమును సంతరించు కొనవచ్చును. ఉదాహరణకు యితఃపూర్వమే చెప్పిన పులుపర్తి గ్రామము, ఉత్తరేశ్వరపురము, అనవేమవరముల నామపరివర్తనముల

చరిత్ర స్మరింపవచ్చును. రాజరాజనరేంద్రుని కాలమున “కలిదిండి” యను నామమున ప్రసిద్ధికెక్కిన గ్రామమున ప్రవర్తిల్లిన దారుణరణసంరంభము పిదప నాగ్రామమునకు రాజరాజు “మధురాంతకనల్లూరు” అనునూత్న నామకరణ మొసగిపాలించిన వృత్తాంతముదాహరణగా పేర్కొనవచ్చును. రాజరాజనరేంద్రుని ప్రాభవమాప్రాంతముల సన్నగిల్లుటతోడనే, ఈ క్రొత్త పేరు విస్మృతిపథమునబడి, పూర్వ నామముతోడనే తిరిగి వ్యవహారమునకెక్కి స్థిరతను సంపాదించుకొన్నది. ప్రథమ చాళుక్య భీముడు తొలుత బౌద్ధసంఘారామమైవెలసిన “డాకరేమి”లో తన పేరున “భీమేశ్వరుని” ప్రతిష్ఠించినపుడు దానికి “దక్షారామ”మని పేరిడి వ్యాప్తిలోనికి దెచ్చుట చరిత్ర ప్రసిద్ధమే! ‘కుమారారామము”, “చాళుక్య భీమవరము”గా “శ్యామలకోట”గా “సామర్లకోట”గా నామ పరివర్తన మొందుట అనుభవైకవేద్యమే! ఇట్టి పరిస్థితులేమియు రాజమహేంద్రవర విషయమున నున్నట్లు కానరావు! ఈ విషయముల బట్టి రాజమహేంద్ర వరమునకాపేరు వచ్చుటకు ముందొక పేరుండి అదిరాజరాజు కాలమునాటికే పేరుప్రఖ్యాతులుకల్గి, అత్యున్నత స్థితినందున్నట్లు కొండొక కారణమున నామపరివర్తనకులోనై “రాజమహేంద్రవర” మను నూత్ననామము ధరించినట్లు తేలుచున్నది. అయిన ఆ పూర్వ నామమేది ? అన్నహంశము పరిశీలింతము.

తూర్పుచాళుక్యులీ ప్రాంతమును పాలించుటకు పూర్వమిచట జైనము బహుళప్రచారములో నుండెను. లౌకిక విద్యలన్నియు వారి పర్యవేక్షణలోనే గరపబడుచుండెను. వైదికవిద్యలకంత ప్రచారము లేకుండెను. బాలుర ప్రాథమిక విద్య, అక్షరములు, గణితము, యెక్కములు మొదలగునవి అన్నియు జైనుల గ్రంథముల ననుసరించియే బోధింపబడుచు వచ్చుచుండెను. వైదికవిద్యలను ప్రోత్సహించుటకు చాళుక్యులకు పూర్వమీదేశమునకు రాజులై యున్న విష్ణుగుండిన వంశస్థులు మిక్కిలి పాటుపడిరి. అందు రెండవ విక్రమేంద్రవర్మ ఘటికాస్థానములను విద్యాకేంద్రముల స్థాపించి, వేద విద్య విస్తరించుటకొక ఆస్కారము కల్పించెను. ఇతడు తన “చిక్కుళ్ళ” శాసనములో “యదావిధి నిర్వాసిత ఘటికావాప్త పుణ్యసంచయః” అని వ్రాయించుకొన్నాడు. సామవేదములో ఘటికా నిర్వహణమునుగూర్చి విపులముగనున్నదనియు, ఆ ప్రకారము దీనిని (ఘటికాస్థానమును) స్థాపించితి ననియు చెప్పికొనెను. ఆ ఘటికాస్థాన మెచ్చటనో వివరింపలేదు ! కాని- ఆతని వంశీకు లిచ్చిన తరువాతి శాసనములో “అసనపుర ఘటికాస్థాన” ప్రసక్తులుండుటచే నది “అసనపుర ఘటికాస్థాన” మైయుండి యుండవలెనని ఊహింపబడినది. ఈ అసనపుర ఘటికాస్థాన సభ్యుడైన శివశర్మకు, విక్రమేంద్రవర్మ కుమారుడు “ఇంద్రభట్టారకవర్మ” “పొలంబూరు” గ్రామమును దానముచేసెను. కాలక్రమమున నాదానమాతనికి చెల్లకపోవుటచే విష్ణుకుండినులు వెన్క వేంగిని పాలింపవచ్చిన చాళుక్యప్రభువులలో మొదటి జయసింహుడు, శివశర్మకుమారుడు రుద్రశర్మకా గ్రామమును పునర్దత్తమొనరించి శాసనము వ్రాయించెను. ఈతడే అసనపుర ఘటికాస్థాన సభ్యులగు మరికొందరు వేదవిదులకుగూడ భూములనిచ్చి ప్రోత్సహించినట్లు తెలియుచున్నది. “కాటిశర్మ”కు “గండేరు” వాటి విషయములోని “నిడుంబరు” గ్రామము అసనపుర బ్రాహ్మణులు కొందరకు, “కొంబరు” అను గ్రామమును మరికొందరకు “పెణకపరు” లోని కొంతభూమిని దానముచేసి యుండెను. ఈ గ్రామములన్నియు నేటి తూర్పుగోదావరి జిల్లాలోనున్నట్లు కన్పట్టును. ఈ జయసింహునితమ్ముని కుమారుడు రెండవ విష్ణువర్ధనుడు “అసనపుర” వాస్తవ్యుడగు “ధ్రువశర్మ”కు “గుద్రహార” విషయములోని” “పట్టివాడలో” కొంతభూమిని దానమొసంగెను. ఈ ధ్రువశర్మ “అధీతవేదద్వయుడు”. గుద్రహార విషయమునేడు రామచంద్రపురం తాలూకాలోని భాగముగా గుర్తింపబడినది. “పొలంబూరు”కూడ నాతాలూకాలోని గ్రామమే! అందువలన “అసనపుర ఘటికాస్థానము” రామచంద్రపురమున కనతిదూరములో నుండి యుండవలెనని యూహసేత కెడమిచ్చుచున్నది. అందువలననే శ్రీ చాగంటి శేషయ్య గారిది దాక్షారామ సమీపమున నుండియున్నట్లు తమకు తోచుచున్నదన, శ్రీ రాళ్ళబండి సుబ్బారావుగారు “ది విలేజ్ ఆఫ్ ‘అసనపుర’ ఈజ్ స్టిల్ ఫవుండ్ ఎ ఫ్యూ మయిల్స్ ఆఫ్ దాక్షారామ...” అని వ్రాసినారు.

“ఘటికాస్థాన మనునది ఇప్పటి విశ్వవిద్యాలయము వంటిది. వేద వేదాంగములతోబాటు శాస్త్రవిద్యలను ఉపదేశించుస్థానము. ఇట్టివి దక్షిణదేశమున మొన్న మొన్నటి వరకున్నట్లు కనపడును. మన ఆంధ్ర ప్రాంతములలో నీ ‘అసనపురము’ గాక మరియొకటి యున్నట్లు గానరాదు. అసనపుర మెక్కడనుండెనో చారిత్రకుల దృష్టికందలేదు” అని శ్రీ సారంగువారు వ్రాయుచు ఆంధ్రదేశములోని ఘటికాస్థానములే కవి సమాజములుగ వర్థిల్లెను. ఈ విషయమును ‘ఆంధ్రులసాంఘిక చరిత్రము’ న శ్రీ సురవరపు ప్రతాపరెడ్డిగారుకూడా ధృవపరచిరి. ఈ సమాజములలో పలుతావులనుండి వచ్చిన పండితులు తమవిద్యను ప్రదర్శించియు, కవులు తమకావ్యములను వినిపించియు, అవధానాది కవితా ధోరణులలో నితరకవులతో పోటీలుపెట్టుకొనియు, సన్మానింపబడుచు వచ్చిరి. ఆ కాలములో కన్నడదేశమున నున్న కవిసమాజములు చక్రవర్తి సభాంతరములై యున్నట్లు ‘గదాయుద్ధ’ అవతారికలోని ‘రన్న’ కవి వాక్యమువలన తెలియుచున్నదని” కూడ వ్రాసియున్నారు.

కన్నడ దేశముననున్న కవిసమాజములో రాజులధ్యక్షత వహింతురు. సభాస్తారులుగా కవులు, విద్వాంసులు, పండితులేగాక వైయ్యాకరణులు, పౌరాణికులు, తర్కశాస్త్ర పారంగతులు, వారవిలాసినులు, సామంతులు, సైన్యాధికారులు, మొదలగువారందఱు నుందురు. “అసనపుర ఘటికాస్థాన” మట్టిదిగాదు. ఘటికాస్థాన కులపతియే సభాధ్యక్షుడు. రాజుకొలువుగా నున్న సభ అందరకును ప్రవేశసాధ్యము కానిది. ఘటికాస్థానమందున్న సభలకు విద్వాంసులు, కవులు, పండితులతోబాటు ఇతరులుగూడ ప్రవేశింపవచ్చును. విద్యానైపుణ్యమును ప్రదర్శింపవచ్చును. ఇతరుల సవాలుచేయవచ్చును. అట్టిది అసనపుర ఘటికాస్థానమున కంగమైన కవిసమాజము. దీనినే నన్నయ దృష్టియందుంచుకొని

పరమ వివేక సౌరభవిభాసిత సద్గుణపుంజ వారిజో
త్కర రుచిరంబులై, సకలగమ్య సుతీర్థములై మహా మనో
హర సుచరిత్రపావన పయః పరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ముదంబున కొనియాడి... ...

నాడు. ఇట్టి సభలందు వారితోషికములు కవిపండితుల నిర్వయాను సారముండును. నన్నయ కొనియాడినసభ "అసనపుర ఘటికాంతర్గ తమైనసభ" ఈ నా యూహను శ్రీ కొల్లూరువారు అవహేళనచేసి, చరిత్రను పెడత్రోవ పట్టించుచుంటినని అభియోగము దెచ్చినారు !

ఈ సందర్భమున శ్రీ సారంగువారి అభిప్రాయమునుట్టం కింతును.

రాజులుకొలువుగానున్న సభలలోని యిబ్బందులులేని, సామంత మండలిగాని, రాజాధికారులుగాని, పాలవిగ్రాసినులుగాని లేని సభనే నన్నయ కొనియాడినది. అప్పటి ఆంధ్రదేశములో ఇట్టిది అసనపుర ములోగాక యెందులేదు. కావ్యగితి ప్రియుడగు రాజనరేంద్రుడు ఈ సభకుపోషకుడుగనేయుండెను. "రాజమహేంద్రకవి సమాజసురక్ష్మాజ" అని నన్నయగారు రాజును సంబోధించినప్పుడు "రాజమహేంద్రుడైన రాజరాజుయొక్క కవుల సమాజమునకు కల్పవృక్షము వంటివాడ"ని అర్థము స్ఫురించును. కాని- రాజమహేంద్ర వరమునందలి కవి సమాజ మునకు కల్పవృక్షమువంటివాడ"ని అర్థము అన్వయముగాదు! బహుశః నన్నయయే రాజనరేంద్రుని ఈ సభనలంకరింపజేసి, ఆపేరే కవి సమాజ మునకు పెట్టియుండును. ఈ " రాజమహేంద్ర " యన్న బిరుదు నన్నయ యిచ్చినదే రాజరాజునకు. భారతములోగాక వేరొండుచో నాతనికీపేరు కానరాదు. మొదటి అమ్మరాజ విష్ణువర్ధనునకే "రాజ మహేంద్ర" అన్న బిరుదమాతని " ఈడేరు " శాసనములో నున్నది. రెండవ అమ్మరాజునకును ఈ బిరుదమున్నట్లు ఆతని "మలియంపూడి" శాసనములో నున్నది. కాని- రాజరాజనరేంద్రునకాబిరుదమున్నట్లు ఆతని శాసనములలో నెక్కడను గానరాదు. నన్నయ రచించిన "నందంపూడి" "మండ" శాసనములలో లేదు మొదటి సారిగా ఈ బిరుదు భారతములోని "రాజకులైకభూషణు"డన్న పద్యములో "రాజ మహేంద్రుడున్నతిని" అన్న ప్రయోగములో కానుపించును.

ఈ మాటలు మావారాలు ప్రశస్తిమాటలే యయ్యును, రాజనరేం ద్రుని మహేంద్రవైభవమును స్ఫురింప జేయుటకే నన్నయగారాతనిని ఆపేరున బిలచి "అసనపుర కవి సమాజము" నకు "ఘటికకు" గూడ నాయకునిగా జేసెను. ఆనాటి నుండియే "అసనపురము", "రాజ మహేంద్రవర"మాయెను.

ఈ రాజమహేంద్రకవి సమాజమునకు నన్నయ, రాజరాజనరేం ద్రులు తరచుగా పోవుచుండుటచేతను, మహాభారతమక్కడ నన్నయ గారు చదివి పండితులకు వినిపించుచుండుటచేతను, రాజమహేంద్రకవి సమాజమన్న పేరును రాజమహేంద్ర ఘటికాస్థానమన్న పేరును మొదట విద్యాధికులలోను, రానురానుజనసామాన్యమునందును రూఢియయ్యెను. ఇట్లు నన్నయ రాజనరేంద్రునకు తానుగా "రాజమహేంద్ర" బిరుద మిచ్చి ఆ పేరున కొత్తనగరమును వెలయింప జేసెను.

ఈ విధిని "రాజమహేంద్రవరము" తొలినామము "అసన పురము" కాగా, అందుండు విద్వద్బృందము "రాజమహేంద్రకవి సమాజము" అను అన్వర్థనామధేయమును సంతరించుకొని, కవిసమాజా ధ్యక్షుడగు రాజమహేంద్రునిపేర అసనపుర నామమును పరివర్తన గావించి " రాజమహేంద్రవర " నామముంచి, తమ నాయకునకు చిరకీర్తిని సంపాదించి పెట్టినారు. తన కావ్యరచనద్వారా నన్నయ రాజరాజనరేంద్రుని కీర్తిని చిరస్థాయిగ జేసిపెట్టి ధన్యుడైనాడు.

శ్రీ సూర్యనారాయణగారు నేనువేరొకచో "రాజమందిరం" అను పదము "రాజమహేంద్రవరము"న కన్వయించునని పేర్కొనుట నాక్షే పించి నన్ను విమర్శించినారు. రాజరాజు కాలంలో అనగా 10, 11 శతాబ్ది కాలంలో "రాజమహేంద్ర" పురముగా నామపరివర్తనమును బొందిన "రాజమహేంద్రవరపురము" 14, 15 శతాబ్దుల కాలమువచ్చు నాటికి ఉచ్చారణాక్రమ పరిణామ సూత్రా ను సా రం " రాజమహేంద్రం " " రాజమహేందరం " " రాజమహేందిరం " "రాజమందిరం"గా మారుట సహజముగా జరుగును గాన శ్రీ కొల్లూరు వారి ఆక్షేపణ మంతభావ్యముగా కాన్పింపదు. అదియుగాక కవితా లోకమున కవులు నిరంకుశముగా వర్తించుచు, కొన్నికొన్ని పదములను వారిష్టమువచ్చినట్లు వాడుచు, వింత ప్రయోగముల గావించుచు కావ్య రచన సాగించుచుండుట మనము సర్వసాధారణముగా గాంచుచున్నదే! "మాలిక్ ఇబ్రాహీం" అను తురుష్క నామమును "మల్కిభరాము"గా మార్చి కావ్యరచన సాగించినవైనం శ్రీ కొల్లూరువా రెరుంగనిదికాదు. అటులనే "వ్యాడేవు" అను పదమును "వాడరేవు"గాచేసి కావ్యరచన గావించిన మహాకవులున్నారు. "ఆగ్రా" నగరనామము కుమారధూర్జటి చేతబడి "అగర" అను నామధేయము సంతరించుకొనుట కొత్తలుగాదు!

ఇట్లు కవులు స్వేచ్ఛా ప్రవృత్తి నవలంభించి, పదప్రయోగ ములలో క్రొత్తపుంతల ద్రొక్కి నామ పరివర్తనల జేయుట పలుచోట్ల గానుపించును. ముఖ్యముగా క్రావడి యున్నచోట్ల కవులు రేఫకారము నుపయోగించి పదపరివర్తన చేయుచు ఛందోభంగములేకుండ కవితలు చెప్పుట పరిపాటి అట్లుగా యేర్పడినదే "వ్యాడేవు" పదము "వాడరేవు" పదరూపమునందుట. ఆ సూత్రము ననుసరించి "రాజమహేంద్రము" "రాజమహేందరము" గామారి, ఉచ్చారణా క్రమమున శ్రవణ సుభ గత్వమాపాదింప "రాజమహేందిరము" "రాజమందిరము" 'రాజ మందిరం" అను రూపభేదముల సంతరించుకొని, ప్రధాననామము నందలి "హ"కారము లుప్తమైపోవ "రాజమందిర" నామమున స్థిరమై నిలచినది. ఈ రూపమే మనకు "పంచబ్రహ్మోదయకావ్యము" న సాక్షా త్కరించినది. ఈ విషయమును శ్రీ కొల్లూరువారు సహృదయతతో వీక్షించి, ఆమోదింతురని కాంక్షించుచున్నాను.

"చరిత్ర విద్యాధర" తురగా కృష్ణమూర్తి

గ్రంథ విమర్శలు

భారతానుక్రమణిక

[రచన : శ్రీ పురాణపండ శ్రీచిత్ర. క్రౌన్‌సైజు మొదటి భాగము 104 పేజీలు. వెల రు. 6 లు. రెండవభాగము 114 పేజీలు, వెల. రు. 6 లు. ప్రకాశకులు- అధ్యాత్మ ప్రచారక్ సంఘం, ఆలమూరు. ప్రతులకు - శ్రీమతి పురాణపండ కమలాదేవి, అధ్యాత్మ ప్రచారక సంఘం, ఆలమూరు, తూర్పుగోదావరి జిల్లా.]

మన పురాణేతిహాసాలలో ఎన్నో ఉపాఖ్యానాలు ఉన్నవి. ఎందరో రాజులపేర్లు, మునులపేర్లు, భక్తులపేర్లు, స్థలాలపేర్లు- ఈ విధంగా చాలాపేర్లు వాటిలో వస్తాయి. పురాణాలు విన్నప్పుడూ, లేక చదివినప్పుడూ ఆ యా వృత్తాంతాలు తెలుస్తాయి. కాని కొద్దికాలంలోనే మరపునకు వస్తాయి. ఇది మానవసహజం. ఆ యా వ్యక్తులచరిత్రా, స్థలాదుల విషయం మళ్ళీ తెలుసుకోవాలంటే, ఆ విషయం ఎక్కడ వున్నదో అని పుస్తకం తిరగవెయ్య వలసిందే! దానికి ఎంతోకాలం వ్యర్థమవుతుంది. మనస్సుకు చికాకు కలుగుతుంది అందువల్ల ఆ యా నామాలను గురించిన విషయం సంగ్రహంగా ఒకచోటవుంటే శ్రమ, కాలహరణ తప్పిపోతాయి. దీనిని గ్రహించే శ్రీ శ్రీనివాసరావుగారు కొన్ని దశాబ్దాల క్రిందట "పూర్వగాధాలహరి" అనే పురాణనామ కోశ గ్రంథాన్ని ప్రకటించారు. అది చాలా పెద్దగ్రంథం. పురాణాలన్నిటిలోని విషయాలూ అందులో ఉన్నాయి. అది కొన్నిముద్రణలను పొందనది. ప్రస్తుతం దాని ప్రతి లభ్యంకావడం మిక్కిలికష్టం.

పరిశీలన ఎక్కువ అయినకొద్దీ అనేక విషయాలు తెలుస్తాయి. ఇప్పుడా గ్రంథాన్ని పరిష్కరించి ప్రకటించాలంటే ఎంతో పెద్దగ్రంథం తయారవుతుంది. ఎందరో పురాణవేత్తలగు విద్వాంసులు దానికోసం పనిచెయ్యవలసి వుంటుంది. అది అంత సులభంగా జరిగేపనికాదు.

శ్రీ శ్రీచిత్రగారు ఈవిషయాన్ని తెలుసుకొని, ఒక్కభారతాన్నే లక్ష్యంగా పెట్టుకొని, సమగ్రంగా పరిశీలించి అందులోవచ్చే నామాలను గురించిన విషయాన్ని సంగ్రహ రూపంగా ఆంధ్రులకు అందించుటకు సంకల్పించారు. ఆయన ఆ విషయాలను నిఘంటు పద్ధతిలో అకారాది వర్ణక్రమంగా కొన్నిసంపుటాలలో ప్రకటించదలచుకున్నారు. ఇందులో మొదటిభాగంలో అ మొదలు ఔ వరకు అజాది పదాల విషయంఉన్నది. రెండవ భాగంలో 'క నుండి ఘ' వరకు- అంటే కవర్గాక్షరాలు మొదట వచ్చేపదాలు ఇయ్యబడినవి. అవసరమైనచోట్ల కొంత విపులంగాను, తక్కినచోట్ల సంగ్రహంగాను విషయం ఇవ్వబడింది. విద్వత్కుటుంబానికి చెందినరచయిత తమ సోదరులవలెనే అధ్యాత్మప్రచారానికి పాటుబడుతూగ్రంథరచన సాగిస్తున్నారు. సరళమైన తెలుగులో కూర్చబడిన ఈకోశంఎంతో ఉపయోగకరమైనది. వీరిసంకల్పం ప్రశంసించదగినది. తిరుమల తిరుపతి దేవస్థానాలవారి యొక్కయు, వదాన్యులయొక్కయు ఆర్థిక సహాయంతో ఇది ప్రకటించబడుతున్నది. అయితే ఈకోశం సమగ్రంగా ముద్రించబడుటకు ఎన్నోసంపుటాలు కావాలి. 2 సంపుటాలలో ఘ వరకుమాత్రమే ఉన్నది. ఎంత సంగ్రహించినా, ఇ అయిదారుసంపుటాలయినా అవసరం. ఇలాంటివి నిఘంటువు మాది ఒక్కసంపుటంలోనే ఉంటే పాఠకులకు ఉపయోగం. వీరుచిన్నఅచ్చు కొంతపెద్దసైజులో ఈ భారత నామావళిని అచ్చువేయిస్తే బాగుం అలాచేస్తే ముద్రణవ్యయం, కాగితపు ఖర్చుతగ్గి, కొనేవారికి అ బాటులో ఉండేది. వేర్వేరు సంపుటాలుంటే విషయజిజ్ఞాసువులకు క కూడాను.

ఈ కోశం ఎంతో ఉపయోగకరమనిమాత్రం చెప్పవలసివున్న

మహా భాగవతం

[వచనం. రచయిత శ్రీ నాయని కృష్ణమూర్తి. క్రౌన్‌సై మొదటి భాగం 328 పేజీలు. వెల రు. 15 లు. రెండవ భాగం 21 పేజీలు. వెల రు. 10 లు. మూడవ భాగం 208 పుటలు. వె రు. 10 లు. ప్రకాశకులు- విజయవాణి పబ్లిషర్సు చౌడేపల్లి, పి నెం. 517207. చిత్తూరుజిల్లా].

ఇప్పుడు భారత, భాగవత రామాయణాలకు వచనాలు విరివి వస్తున్నవి. భాగవతవచనరచన ఈశతాబ్దపు తొలిరోజుల్లోనే ప్రచారాని వచ్చింది. ఆనందప్రెస్‌వారు కేతవరపువారి రచననూ, వావిళ్ళవా శతఘంటంవారి రచననూ ప్రకటించినట్లు వినికి. ఈనడుమ కొన్నిదశ బ్దాలు పురాణవచన రచన చాలావెనకపడినా, ఇప్పుడు బాగాముందడుగ వేసింది. భాగవత వచనాలు ఈ మధ్యచాలా వచ్చాయి. కొన్నిగ్రాం కంలోనూ, కొన్నివ్యావహారికంగానూ ఉంటున్నవి. వేర్వేరు రచయిత విభిన్న దృక్పదాలలో రచించడంవల్ల ప్రతిరచనకూ ఒక ప్రత్యేక ఉన్నదని చెప్పవచ్చును. వ్యావహారిక భాషలో వ్రాయబడిన భాగవ లలో ఈ మహాభాగవతం ఒకటి.

రచయిత భాగవతాన్నీ, దానికి సంబంధించిన గ్రంథాంతరాల క్షుణ్ణంగా పరిశీలించి, ఎంతో ఓపికతో ఈ గ్రంథాన్ని తయారు చేశా వీరిరచనను చదివితే ఒక పెద్దకథనుచదివినట్లు ఉంటుందేగాని పాఠకు విసుగు కలిగించదు. శైలివాలాసులభంగా, అందరికీ అర్థమయ్యే రీతి ఉంటుంది. మూడు సంపుటాలకూ, ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ బాపు చిత్రిం చిన ముఖచిత్రాలు అందరినీ ఆకర్షిస్తాయి.

దీనికి పీఠికకాని, విషయసూచికకాని లేదు. ఆ యా ఉపా ఖ్యానాలను తెలిసికొనుటకు గ్రంథంలో శీర్షికలులేవు. ఏదైనా ప్రత్యే విషయాన్ని తెలుసుకోడానికి ఏపుటలో చూడాలో, ఎక్కడ ప్రారంభ మవుతుందో తెలియదు. శీర్షికలు ఉంటే పాఠకులకు సులభంగాఉండేది పునర్ముద్రణ జరిగేటప్పుడు ఈ విషయాన్ని కృష్ణమూర్తిగారు గమని స్తారని అనుకుంటాను.

భాగవత కథను సులభంగా తెలుసుకొనుటకు ఈ పుస్తకం మిక్కిలి ఉపయోగిస్తుంది.

"ఆంగీరస"

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 61247.